అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
శనివారం 22-03-2025
సంపుటి : 11 | సంచిక : 80 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50

గాజాపై అమానవీయం



ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా జంతర్ మంతర్ వద్ద నిరసనలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు సుభాషిణి అలీ

కేంద్ర ప్రభుత్వ మౌనాన్ని ప్రశ్నించిన వక్తలు

వివరాలు 7లో

అంతా మీరే చేశారు

లేని ఆదాయం చూపెట్టి మోసగించారు..

మీ అప్పులు, తప్పులకు నిద్రలేక చస్తున్నాం

పదేండ్లలో రూ.16 లక్షల కోట్లు ఖర్చుపెట్టి ప్రజలకేం చేశారు?

ప్రతి బడ్జెట్‌కు, వ్యయానికి మధ్య సగటున 18 శాతం వ్యత్యాసం

దాని ఫలితంగానే బీఆర్‌ఎస్ హామీలన్నీ బుట్టదాఖలు

మేం మీలాగే 15-20 శాతం పెంచితే బడ్జెట్ నాలుగు లక్షల కోట్లు దాటేది

పారదర్శకతో ముందుకెళ్తాం..వందశాతం హామీలు నెరవేర్చుతాం :


శాసనసభలో బీఆర్‌ఎస్‌పై డిప్యూటీ సీఎం భట్టి ఫైర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులను సరిదిద్దేందుకు తాము నిద్రలేక చస్తున్నామని డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. పదేండ్లలో రూ.16,70,711 లక్షల కోట్లు ఖర్చుపెట్టి ప్రజలకేం చేశారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రతిబడ్జెట్‌లోనూ ప్రతిపాదనలకు, చేసిన వ్యయానికి 18 శాతం వ్యత్యాసం ఉన్న విషయాన్ని ఎత్తిచూపారు. బడ్జెట్‌పై సభ్యులు హరీశ్‌రావు, బాలునాయక్, మహేశ్వర్‌రెడ్డి, అక్బరుద్దీన్ ఓవైసీ, కూనంనేని సాంబశివరావు, విజయరామారావు, పర్ణికారెడ్డి, పద్మావతిరెడ్డి, తదితరులు లేవనెత్తిన సందేహాలు, సూచనలపై మల్లు భట్టి విక్రమార్క సమాధానాలిచ్చారు. బడ్జెట్ వాస్తవానికి దూరంగా ఉందని హరీశ్‌రావు చెప్పడం సబబు కాదన్నారు. పదేండ్లుగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లు ఎప్పుడూ వాస్తవానికి దగ్గరగా లేవన్నారు. దీనివల్ల కొన్ని వర్గాలు పెద్ద ఎత్తున నష్టపోయాయని చెప్పారు. తమ క్యాబినెట్ కూర్చొని ప్రజలను ఊహల్లోకి, భ్రమల్లోకి, ఆశలపల్లకిలో తీసుకెళ్లకుండా వాస్తవాలకు దగ్గరగా బడ్జెట్ ఉండాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. పదేండ్లుగా రాష్ట్ర ప్రజలను భ్రమల్లో ముంచెత్తి, లేనిది ఉన్నట్టు చూపి అందరి దగ్గర ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడానికి బీఆర్‌ఎస్ పాలకులు ప్రయత్నించారని విమర్శించారు. పదేండ్లుగా రాష్ట్రంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 2014-15లో 38.9 శాతం, 15-16లో 15.4 శాతం, 16-17లో 6.6 శాతం, 17-18లో 19.62 శాతం, 18-19లో 20.42 శాతం, 19-20లో 2.84 శాతం, 21-22లో 20.69 శాతం, 22-23లో 20.55 శాతం, 23-24లో 20 శాతం నిధులు తక్కువ ఖర్చుచేశారని గణాంకాలతో సహా వివరించారు. 23-24లో ఓఆర్‌ఆర్‌ను 7,322 కోట్లుకు లీజుకివ్వకుంటే...24-25కు సంబంధించిన ఎక్సైజ్ టెండర్ల ఆదాయాన్ని ముందే రాబట్టకుంటే రూ.72 వేల కోట్ల గ్యాప్ ఉండేదని గుర్తుచేశారు. పదేండ్లుగా చూసుకుంటే యావరేజీగా ప్రవేశపెడుతున్న బడ్జెట్, ఖర్చుపెడుతున్న దాన్ని మధ్య గ్యాప్ యావరేజ్‌గా 18 శాతం ఉంటూ వస్తున్నదనీ, ఏటా ఆదాయం రాకున్నా 15 నుంచి 20 శాతం పెంచుకుంటూ పోయారని విమర్శించారు. ఫలితంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, మూడెకరాల భూమి, నియోజకవర్గానికి లక్ష ఎకరాల సాగునీటి వసతి, కేజీ టూ పీజీ విద్య ...16లో

మాజీ వర్సెస్ తాజా



బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు, డిప్యూటీ సీఎం భట్టి మధ్య వాగ్వాదం

ఉద్దేశపూర్వకంగా విమర్శించటం లేదు : హరీశ్

ఆ పదాలను వెనక్కి తీసుకోండి : భట్టి

పరిధి దాటకండి : మంత్రి శ్రీధర్‌బాబు..బడ్జెట్‌పై వాడీవేడిగా చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బడ్జెట్‌పై చర్చ సందర్భంగా శుక్రవారం అసెంబ్లీలో మాజీ, తాజా ఆర్థిక మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, భట్టి విక్రమార్క మధ్య వాగ్వాదం కొనసాగింది. పరస్పర వాగ్బాణాలతో సభ హీటెక్కింది. సభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు మరో మంత్రి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా హరీశ్‌రావుపై ఎదురుదాడికి ...16లో

జనాభా లెక్కలపై కేంద్రం తాత్సారం

రాజ్యసభలో లేవనెత్తిన ప్రతిపక్ష ఎంపీలు

ఉత్తరాది రాష్ట్రాల్లో దక్షిణాది భాషలను అమలు చేస్తారా?

దేశ ఐక్యతకు ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం, లౌకికవాదం మూలస్తంభాలు :

సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

జనాభా లెక్కలు నిర్వహించకుండా కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేయడంపై ప్రతిపక్షాలు నిలదీశాయి. వీటిని నిర్వహించలేని స్థితిలో ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటని ధ్వజమెత్తాయి. జనాభా లెక్కలు దేశ ప్రజల స్థితిగతులకు ఒక ప్రామాణికమైన డేటా అని, అలాంటి డేటా నిర్వహణలో కేంద్రం విఫలమైందని విమర్శించాయి. శుక్రవారం రాజ్యసభలో హోం మంత్రిత్వ శాఖ పనితీరుపై చర్చ సందర్భంగా జనాభా లెక్కలు లేకపోవడంపై వివిధ ప్రతిపక్షాల ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. "సమాజంలోని అనేక బలహీన వర్గాలు తమ ప్రయోజనాల కోసం జనాభా లెక్కలపై ఆధారపడతాయి" అని పేర్కొన్నారు.

నియోజకవర్గాల పునర్విభజనపై సమాధానమివ్వని హోం మంత్రి

"నియోజకవర్గాన్ని తిరిగి విభజించినా, దక్షిణ భారతదేశం ఒక్క సీటు కూడా కోల్పోదని మీరు చెప్పారు. కానీ డీలిమిటేషన్ తరువాత, దక్షిణ భారతదేశానికి ప్రస్తుతం ...6లో

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో నోట్లకట్టలు

అగ్ని ప్రమాదంతో వెలుగులోకి

ఆంతరంగిక విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు



కఠిన చర్యలకు కొలీజియం సిఫారసు

వివరాలు 15లో



రెండేండ్లు.. 38 విదేశీ పర్యటనలు..

రూ.258 కోట్లు ఖర్చు

ఇది ప్రధాని మోడీ ఫారిన్ టూర్ వ్యయం : కేంద్రం

వివరాలు 15లో

అంకెల గారడీతో మోసం

హామీల అమలుకు సరిపడని బడ్జెట్లు



పేదలను విస్మరించటమే పాలకుల లక్ష్యం

కార్పొరేట్ల మీద ప్రేమే ఇందుకు కారణం : సీపీఐ(ఎం)కార్యదర్శి జాన్‌వెస్లీ

కేటాయింపులు బారెడు.. ఖర్చు చారెడు : కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లపై రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల సమయంలో ప్రజలకు అలవిగాని హామీలిచ్చి, బడ్జెట్లో మాత్రం ఆ వాగ్దానాల అమలుకు తగిన నిధులు కేటాయించకుండా అంకెల గారడీతో జనాన్ని మోసం చేయటం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రివాజుగా మారిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు ప్రజలకిచ్చిన వాగ్దానాలు' అనే అంశంపై సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్ష నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ ...7లో



అకాల వర్షం..

వడగండ్లు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వాన రాలిన మామిడి పూత, కాత

నేలవాలిన వరి, మొక్కజొన్న 6లో

ఉమ్మడి నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల్లో నష్టం

ఉక్కపోతతో తల్లడిల్లుతున్న వారికి ఊరట

సహకార సొసైటీలను బలోపేతం చేయండి

నాబార్డ్ ఛైర్మెన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సహకార సొసైటీలను బలోపేతం చేయాలని నాబార్డ్ ఛైర్మెన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చే శారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నాబార్డ్ ఛైర్మెన్ షాజీ కేవీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐడీఎఫ్ కింద తక్కువ వడ్డీకి రుణాలందించాలని సీఎం ఛైర్మెన్‌ను కోరారు. మైక్రో ఇరిగేషన్‌కు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కో-ఆపరేటివ్ సొసైటీలను బలోపేతం చేయాలనీ, కొత్తగా మరిన్ని కో-ఆపరేటివ్ సొసైటీలను ఏర్పాటు చేయాలని కోరారు. స్వయంసహాయక సంఘాల మహిళా గ్రూపులకు ప్రత్యేక పథకాన్ని రూపొందించాలన్నారు. ఐకేపీ, గోడౌన్లు, రైస్ మిల్లులను నాబార్డుకు అనుసంధానం చేసి, రాష్ట్రంలో మిల్లింగ్ కెపాసిటీ పెంచేందుకు సహకరించాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నాబార్డు స్కీమ్‌ల నిధులు ఈనెల 31లోగా ఉపయోగించుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. దాని పరిధిలోని స్కీములన్నింటినీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీలైనంత ఎక్కువ ఉపయోగించుకోవాలని కోరారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు అందించే సోలార్ ప్లాంట్ల నిర్వహణను నాబార్డుకు అనుసంధానం చేయాలని సూచించారు. కొత్త గ్రామపంచాయతీలకు రూరల్ కనెక్టివిటీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కొత్త జిల్లాల్లో కొన్ని డీసీసీబీలు ఏర్పాటు చేయాలని నాబార్డ్ ఛైర్మెన్, ముఖ్యమంత్రికి ప్రతిపాదించారు. సమావేశంలో నాబార్డు ప్రతినిధులతో పాటు తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.



టెన్త్ పరీక్షలు ప్రారంభం

99.67 శాతం మంది విద్యార్థుల హాజరు

మంచిర్యాల, వరంగల్ సీఎస్, డీవోల సస్పెన్షన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటిరోజు ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షను 2,650 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 4,96,549 మంది రెగ్యులర్ విద్యార్థులు దరఖాస్తు చేశారనీ, 4,94,887 (99.67 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 1,662 (0.33 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రయివేటు విద్యార్థులు 1,353 మంది దరఖాస్తు చేశారనీ, 1,024 మంది పరీక్ష రాశారని తెలిపారు. 329 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒక విద్యార్థిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదైందని వివరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన మంచిర్యాల, వరంగల్ జిల్లాల చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో)లను సస్పెండ్ చేశామని తెలిపారు. నల్లగొండ జిల్లాలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను విధుల నుంచి తొలగించామనీ, ఒక ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశామని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలకు సంబంధించి కొందరు వాట్సాప్ ద్వారా పంపించి గందరగోళం సృష్టిస్తున్నారని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాస్తున్న సమయంలో ఇలాంటి వాటి వల్ల కొంత ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు. ఇలాంటి పుకార్లను ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష జరగనుంది.

ప్రతీకార సుంకాలతో... ఫార్మా పరిశ్రమకు దెబ్బే

మన సరఫరాలలో అధిక భాగం జనరిక్ మందులే

సుంకాలతో వాటి తయారీదారులకు మరింత నష్టం

దిగుమతి సుంకాలు రద్దు చేయాలని కోరుతున్న ఔషధ కంపెనీలు

అమెరికా ఆరోగ్య వ్యవస్థకూ ఇబ్బందేనంటున్న నిపుణులు



న్యూఢిల్లీ : భారతీయ ఔషధాలపై ప్రతీకార సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికల నేపథ్యంలో దేశంలోని మందుల తయారీదారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రస్తుతం మన దేశం నుండి అమెరికాకు ఏటా తొమ్మిది బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఔషధాలు, వ్యాక్సిన్లు ఎగుమతి అవుతున్నాయి. అమెరికా ప్రతీకార సుంకాలు విధిస్తే తమపై పడే ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యాపార వ్యూహాలపై ఔషధ తయారీ సంస్థలు సమీక్షలు జరుపుతున్నాయి. అమెరికాకు మందులు ఎగుమతి చేయడం ద్వారా తమ ఆదాయాలకు భారీగా గండి పడుతుందని దేశీయ ఫార్మా సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా నుండి దిగుమతి అవుతున్న మందులపై సుంకాలను పూర్తిగా ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. తద్వారా ప్రతీకార చర్యల నుండి తప్పించుకోవచ్చునని భావిస్తున్నాయి.

వచ్చే ఆదాయం స్వల్పమే

భారత్ నుండి దిగుమతి అవుతున్న ఔషధాలపై ప్రస్తుతం అమెరికా ఎలాంటి సుంకాలు విధించడం లేదు. అయితే అక్కడి నుండి దిగుమతి అవుతున్న అనేక మందులపై కేంద్రం 10 శాతం సుంకం వేస్తోంది. ఉదాహరణకు కొన్ని బ్లడ్ క్యాన్సర్ల చికిత్సకు వాడే టెస్లిస్టామాబ్ ఇంజక్షన్ వంటివి. అమెరికా నుండి ఏటా 800 మిలియన్ డాలర్ల విలువ కలిగిన ఫార్మా ఉత్పత్తులను భారత్ దిగుమతి చేసుకుంటోందని అంచనా. ఈ ఔషధాలపై సుంకాల రూపంలో ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం యాభై మిలియన్ డాలర్ల లోపే ఉంటోంది. దీనికి భిన్నంగా 2023-24లో అమెరికాకు మన దేశం నుండి 9.7 బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఔషధాలు, ఫార్మాస్యూటికల్ ఎగుమతులు జరిగాయి.

జనరిక్ ఎగుమతులే అధికం

అమెరికాకు ఎగుమతి అవుతున్న ఔషధాలలో ఎక్కువ భాగం జనరిక్ మందులే. ఇవి చౌకగా లభిస్తాయి. జనరిక్ మందుల కోసమే అమెరికా ఎక్కువగా మన దేశంపై ఆధారపడుతోంది. ఒకవేళ అమెరికా కనుక ప్రతీకార సుంకాలు విధిస్తే చౌకగా మందులు తయారు చేస్తున్న భారతీయ ఫార్మా కంపెనీలు తీవ్రంగా నష్టపోతాయి. అంతేకాదు... అమెరికా ఆరోగ్య వ్యవస్థపై కూడా బాగా ప్రభావం పడుతుంది. ఖర్చులు పెరిగి ద్రవ్యోల్బణానికి దారితీయవచ్చు. అమెరికా నుండి దిగుమతి అవుతున్న మందులపై భారత్ సుంకాన్ని రద్దు చేస్తే తమకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందని, ఒత్తిడి తగ్గుతుందని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ (ఐపీఏ) సెక్రటరీ జనరల్ సుదర్శన్ ...7లో

మూలిగే నక్కపై తాటికాయ ?

సుమారు 300 కంపెనీలు అమెరికాకు మందులు ఎగుమతి చేస్తున్నాయి. అమెరికా ప్రతీకార చర్యలకు దిగితే ఈ కంపెనీల ఆర్థిక పరిస్థితి తలకిందులవుతుంది. జనరిక్ మందుల విక్రయం వల్ల 10-15 శాతం మార్జిన్ మాత్రమే ఉంటుందని, అదనపు సుంకాలు విధిస్తే మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు అది మరింత తగ్గుతుందని ఉత్పత్తిదారులు ఆందోళన చెందుతున్నారు. లాభాలు తెచ్చే మందులు తయారు చేస్తున్న సన్ ఫార్మా, లుపిన్, సిప్లా వంటి కంపెనీలు కొంత మేర తట్టుకోగలుగుతాయి. ఎందుకంటే వాటి లాభాల మార్జిన్ 30-35 శాతం వరకూ ఉంటుంది.

యూఎస్ విద్యా శాఖ రద్దు

ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు

వివరాలు 15లో



సర్కారు బడులను బలోపేతం చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి
- హైదరాబాద్‌లో అప్పారి వెంకటస్వామి వర్ధంతిసభ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో ప్రజలందరికీ విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలంటే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి పిలుపునిచ్చారు. యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి (ఏవీఎస్) 24వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అభ్యుదయ ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించడానికి 16 ఏండ్ల సర్వీసును త్యాగం చేసిన మహనీయుడు వెంకటస్వామి అని అన్నారు. పాతికేండ్లపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసి సంఘాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దారని వివరించారు. ఆయన నమ్మిన ఆదర్శాలను జీవితంలో ఆచరించిన గొప్ప దార్శనికుడు ఏవీఎస్ అని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయడమే ఏవీఎస్‌కు అర్పించే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ సమావేశంలో ఎస్టీఎఫ్ఐ ఉపాధ్యక్షులు ఎం సంయుక్త, రాష్ట్ర కార్యదర్శులు సింహాచలం, వెంకటప్ప, పి మాణిక్ రెడ్డి, కొండలరావు, సీనియర్ నాయకులు కష్ణమూర్తి, నరహరి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బడా కార్పొరేట్ కాంట్రాక్టర్ల చేతుల్లో

ఇసుక పాలసీ..?

లోపాయికారి ఒప్పందాలు

- సాండ్ బజార్ వాహనాల్లో వర్ లోడ్ దందా
- రోడ్డున పడనున్న లక్షలాది ఇసుక లారీ యజమానులు

నవతెలంగాణ-ఉప్పల్

ఆన్‌లైన్ ఇసుక విధానం బడా కార్పొరేట్ కాంట్రాక్టర్ల చేతుల్లోకి పోతున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్న ధోరణి కారణమన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. తాము తీసుకొచ్చిన ఇసుక పాలసీ గతం కంటే బాగుందని, ఆదాయం పెరిగిందని ప్రభుత్వం తెలిపింది. కొంత మంది ఇసుక లారీ యజమానులకు, బడా కాంట్రాక్టర్ల లారీ యజమానులకు వేర్వేరుగా ఇసుకను అందిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన సబ్ స్టాక్ యార్డులు పూర్తిగా విఫలమయ్యాయన్న ఆరోపణలతో కాంగ్రెస్ ప్రభుత్వం దాని పేరును సాండ్ బజార్ అని పెట్టింది. అబ్దుల్లాపూర్‌మెట్, బోరంపేట, వట్టినాగులపల్లిలో సాండ్ బజార్లు ఏర్పాటు చేసింది. ఆ సాండ్ బజార్లలో మూసీ పరివాహక ప్రాంతమైన వంగమర్తి మూసీ వాగు ఇసుకను తీసుకొచ్చి రూ.1600కు టన్ను ఇసుకను విక్రయిస్తామని, దానికి రవాణా చార్జీలు అదనంగా చెల్లించాలని ప్రభుత్వం ప్రకటించింది. ఫైన్ సాండ్ (సన్న ఇసుక)కు రూ.1800, రవాణా చార్జీలు అదనంగా చెల్లించాలని నిర్ణయించింది. ఈ ఇసుకను వినియోగదారుడికి ట్రాన్స్‌పోర్ట్ చార్జీలతో, జీఎస్టీ చార్జీలతో కలిపి సుమారు టన్ను దొడ్డు ఇసుక రూ.1800కు, సన్న ఇసుక సుమారు రూ.2000కు ప్రభుత్వం అందిస్తున్నది. కానీ సామాన్య ఇసుక లారీ యజమానులు కాళేశ్వరం, భద్రాచలం, ములుగు జిల్లాల క్వారీల నుంచి ఇసుకను తీసుకొచ్చి నగరంలోని పలు అడ్డాలలో టన్ను దొడ్డు ఇసుక రూ.1600, సన్న ఇసుక రూ.1800కు ఎలాంటి రవాణా చార్జీలూ లేకుండా అందిస్తున్నారు. టీజీఎండీసీ అధికారుల నిర్లక్ష్యంతో కాళేశ్వరం, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, కరీంనగర్ క్వారీలలో లోడింగ్ వేగవంతం చేయకపోవడంతో నగరంలో ఇసుక ధరలు అమాంతం పెరుగుతున్నాయి. ప్రభుత్వం లోడింగ్ వేగవంతం చేస్తే నగరంలో దొడ్డు ఇసుక రూ.1500కు, సన్న ఇసుక రూ.1700కు వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది.

సాండ్ బజార్ వాహనాలలో ఓవర్ లోడ్ దందా

ఈ విధానంలో సామాన్య ఇసుక లారీ యజమానులకు ఒక న్యాయం, బడా కాంట్రాక్టర్స్ ఆధీనంలో ఉన్న ఇసుక లారీ యజమానులకు మరో న్యాయం అన్నట్టుగా ఉందని విమర్శలు వస్తున్నాయి. ఇసుక లారీ యజమానులు 16 టైర్ల లారీకి ప్రభుత్వానికి 35 టన్నులకు రూ.14,300 చెల్లిస్తున్నారు. 14 టైర్ల లారీకి 33 టన్నులకు రూ.13,300 చెల్లిస్తున్నారు. అయితే, ప్రభుత్వం మాత్రం 16 టైర్ల లారీకి 33 టన్నుల ఇసుకను, 14టైర్ల లారీకి 29 టన్నుల ఇసుకను మాత్రమే అనుమతిస్తున్నది. కానీ సాండ్ బజార్ పేరుతో బడా కాంట్రాక్టర్స్ ఆధీనంలో ఉన్న లారీలకు మాత్రం ఎలాంటి ఆంక్షలూ లేకుండా 16 టైర్ల లారీకి 35 టన్నులు, 14 టైర్ల లారీకి 33 టన్నుల ఓవర్ లోడ్ ఇసుకను అందిస్తున్నారని లారీ యజమానులు అంటున్నారు. కాంట్రాక్టర్ ఆధీనంలో ఉన్న లారీలకు ఓవర్ లోడ్‌ను ఎలా అనుమతిస్తారంటూ సామాన్య ఇసుక లారీ యజమానులు టీజీఎండీసీ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

ఉద్యమాలను ఉధృతం చేస్తాం



సీఎం స్వయంగా మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో రోజుకు కోటి రూపాయల ఆదాయం మాత్రమే వచ్చేది.. పాసింగ్ విధానం అమలు చేయడంతో రోజుకు రూ.3 కోట్ల ఆదాయం పెరిగిందని చెప్పారు. అంత ఆదాయం వస్తున్నా అధికారులు కార్పొరేట్ కంపెనీలతో లోపాయికారి ఒప్పందం చేసుకొని ఆన్‌లైన్ విధానానికి స్వస్తి పలికే చర్యలు తీసుకోవడం సరికాదు. ప్రభుత్వం దశల వారీగా, ఆన్‌లైన్‌కు స్వస్తి పలుకుతూ బడా కార్పొరేట్ కాంట్రాక్టర్‌లకు అప్పగిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తాం. దొడ్డు ఇసుకకు రూ.1600, సన్న ఇసుకకు రూ.1800 ధరలను ప్రభుత్వం నిర్ణయించింది. దీని కంటే తక్కువ ధరలకే తెలంగాణ ఇసుక లారీ యజమానులు నగరంలోని వినియోగదారులకు అందిస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుత విధానాలను ఉప సంహరించుకోకుంటే ఉద్యమిస్తాం.

– సూర్వి రాజ్ గౌడ్
తెలంగాణ ఇసుక లారీ యజమానుల సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకులు

ఒకే వేదికపైకి రేవంత్, కేటీఆర్

- నేడు చెన్నైలో డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల సదస్సు
- స్టాలిన్ అధ్యక్షతన జరిగే సదస్సులో పాల్గొననున్న ఇద్దరు నేతలు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు ఒకే వేదికను పంచుకోనున్నారు. కేంద్రంలోని మోడీ సర్కార్ త్వరలో చేపట్టనున్న డీ లిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై చర్చించేందుకు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన శనివారం చెన్నైలో సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు రాష్ట్రం నుంచి అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్‌ను ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రేవంత్, కేటీఆర్ వేర్వేరుగా చెన్నై బయలుదేరి వెళ్లారు. డీలిమిటేషన్ విధానం దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని బలహీనపరుస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. జనాభా నియంత్రణను ఖచ్చితంగా పాటించి దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న తమకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆయా రాష్ట్రాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో చెన్నైలో నిర్వహించనున్న సదస్సులో దక్షిణాది రాష్ట్రాలకు జరగబోయే అన్యాయాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉంది. ఈ సదస్సులో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ నుంచి పలువురు నాయకులు పాల్గొననున్నారు.

సమావేశ వివరాలు ఇలా...

శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చెన్నై గిండిలోని ఐటీసీ కాకతీయ చోళ హోటల్లో డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల సదస్సు జరగనుంది. అనంతరం తమిళనాడు, పంజాబ్, కేరళ ముఖ్య మంత్రులు ఎంకే. స్టాలిన్, పినరయ్ విజయన్, భగవంత్ మాన్‌లతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడనున్నారు. అదే రోజు సాయంత్రం సీఎం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

- ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి
- ఈ-కుబేర్‌లో పెండింగ్ బకాయిలు చెల్లించాలి
- ఉద్యోగులకు డీఏలను విడుదల చేయాలి : మండలిలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ పురోగామిగా కనిపిస్తున్నదని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ గురుకులాలకు ఏ శాఖ నుంచి ఎన్ని నిధులు కేటాయించారో చెప్పాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయాలనీ, వాటిలో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించాలని కోరారు. లేదంటే ఆర్థిక, సామాజిక సమానత్వం సాధ్యం కాదన్నారు. నూతన ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగంపై పాలకులు శీతకన్ను ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో మూడు నుంచి ఐదేండ్ల పిల్లలు అంగన్‌వాడీల్లో ఎంత మంది, ప్రయివేటు పాఠశాలల్లో ఎంత మంది చదువుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నూటికి 80 శాతం మంది ప్రయివేటు బడుల్లోనే చదువుతున్నారని వివరించారు. ప్రభుత్వ స్కూళ్లలో కేజీ తరగతుల్లేవని అన్నారు. అందుకే మూడేండ్లు ఉన్న పిల్లలను ప్రయివేటు బడుల్లో వారి తల్లిదండ్రులు చేర్పిస్తున్నారని చెప్పారు. వారు ఒకటో తరగతిలో ప్రయివేటులోనే కొనసాగుతున్నారనీ, ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ పాఠశాలలుగా భావించడం లేదన్నారు. తరగతికి ఒక గది, టీచర్ ఉండేలా ప్రభుత్వ పాఠశాలలను రీఆర్గనైజ్ చేయాలని సూచించారు. కేరళలో 11 వేల ప్రభుత్వ పాఠశాలల్లోనే 80 శాతం మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. తెలంగాణలో 30 వేల ప్రభుత్వ స్కూళ్లున్నా ఎక్కువ మంది ప్రయివేటు బడుల్లోనే చదువుతున్నారని చెప్పారు. హైదరాబాద్‌తోపాటు వివిధ పట్టణాలకు ప్రజలు వలస వస్తున్నారనీ, కొత్త కాలనీలు ఏర్పడుతున్నాయని అన్నారు. కానీ అక్కడ ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు కావడం లేదన్నారు. విద్యారంగంలో సమూల మార్పులు రావాలని కోరారు. రాష్ట్రంలో ఒకటో తరగతిలో 5,55,978 మంది విద్యార్థులుంటే, ప్రభుత్వ పాఠశాలల్లో 1,49,674 మంది ఉన్నారనీ, ప్రయివేటు స్కూళ్లలో 4,06,304 మంది చదువుతున్నారని వివరించారు. అదే పదో తరగతిలో 5,41,874 మంది విద్యార్థులుంటే వారిలో ప్రభుత్వ పాఠశాలల్లో 2,63,560 మంది, ప్రయివేటు స్కూళ్లలో 2,78,314 మంది చదువుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కొత్త జిల్లాలకు జిల్లా విద్యాధికారి (డీఈవో), జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి (డీఐఈవో) పోస్టులను, కొత్త మండలాలకు మండల విద్యాధికారి (ఎంఈవో) పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

పేద రైతులకు ఆత్మీయ భరోసా ఇవ్వాలి

వ్యవసాయం చేసే వారికే రైతు భరోసా ఇస్తామనడం సంతోషకరమని నర్సిరెడ్డి అన్నారు. కౌలురైతులకూ ఇస్తామని హామీ ఇచ్చారనీ, వెంటనే ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు ఇస్తామన్నారని గుర్తు చేశారు. కానీ పేద రైతులకు వర్తింపజేయడం లేదన్నారు. అర ఎకరం ఉన్న రైతుకు రైతు భరోసా కింద ఏడాదికి రూ.ఆరు వేలు వస్తాయని వివరించారు. కానీ వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు వస్తాయని చెప్పారు. రైతు భరోసా కింద రూ.12 వేల కంటే తక్కువ డబ్బులు తీసుకునే పేద రైతులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న వారి గుడిసెలను తొలగిస్తున్నారని అన్నారు.

గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలివ్వాలనీ, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని సూచించారు. రాష్ట్రంలో డబుల్ బెడ్రూం ఇండ్లు చాలా ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్నాయని వివరించారు. వాటిని పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ రకాల బిల్లులు ఈ-కుబేర్‌లో పెండింగ్ ఉన్నాయని చెప్పారు. టోకెన్ నెంబర్ల వారీగా ఆ బకాయిలను చెల్లించాలని సూచించారు. ఉద్యోగులకు నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



ప్రగతిశీల బడ్జెట్

- గత పాలనలో నెరవేరని ప్రజల ఆశలు.. మార్పుకోరి కాంగ్రెస్‌కు పట్టం
- విద్య, వైద్య సేవలు మరింతగా విస్తరించాలి: టి.జీవన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యమపార్టీగా బీఆర్ఎస్‌కు ప్రజలు రెండు సార్లు అవకాశమిచ్చారనీ, అయితే ప్రజలు ఆశించిన మేరకు పాలన చేయలేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్పు కోరి ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారనీ, ఆ మార్పును చూపించాలని ఆకాంక్షించారు. ప్రస్తుత బడ్జెట్ ప్రగతిశీల భావాలతో కూడుకుని ఉన్నదని తెలిపారు. ఉద్యమ సమయంలో తెలంగాణ కోసం జరిగిన ప్రాణత్యాగాలకు సోనియాగాంధీ చలించిపోయారనీ, ఆంధ్రాలో రాజకీయంగా కాంగ్రెస్ నష్టపోతుందని తెలిసి కూడా తెలంగాణ ఇచ్చారనీ, కేసీఆర్ కూడా కాంగ్రెస్‌తోనే తెలంగాణ సాధ్యమైందని చెప్పారని గుర్తుచేశారు. 58 ఏళ్లలో రూ.64 వేల కోట్లు అప్పులు చేస్తే, బీఆర్ఎస్ పదేళ్లలో రూ.6 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిందని విమర్శించారు. రైతుబంధు పేరుతో సాగుయోగ్యం కాని భూములనుకు ఇచ్చి పెట్టుబడీదారుల కొమ్ముకాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీని ఏకకాలంలో కాకుండా విడతల వారీగా ఇచ్చి దాన్ని వడ్డీ మాఫీగా మార్చారని ఎద్దేవా చేశారు. గొర్రెల పంపిణీని బీఆర్ఎస్ సర్కారే నిలిపేసిందని తెలిపారు. కేంద్రంలో బీజేపీ రుణమాఫీని పూర్తిగా వదిలేసిందనీ, అదే బాటలో బీఆర్ఎస్ 2023 ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆ ప్రస్తావనే పెట్టలేదని చెప్పారు. బీఆర్ఎస్ సభ్యుల మాదిరిగా తనకు సభను వక్రీకరించడం రాదనీ, కాంగ్రెస్ 2 హామీలు తప్ప మిగిలిన హామీలు అమల్లోకి వచ్చాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతున్నదని తెలిపారు.

వైద్యరంగంలో గత ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు, దానికి అనుగుణంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం కాగితాలకే పరిమితమైందని విమర్శించారు. విద్య, వైద్య సేవలు మరింత విస్తరించాల్సిన అవసరముందని సూచించారు. కోవిడ్ సమయంలో గ్రామాల్లో ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లు విశిష్ట సేవలందించారని గుర్తుచేశారు. వారికి శిక్షణ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు. గవర్నర్ ఆమోదం తర్వాత ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వస్తుందన్నారు. బీసీల రిజర్వేషన్ల పెంపుకు ఇందిరా సహానీ కేసు విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అడ్డంకి కాదని తెలిపారు. ఆ తీర్పులో 50 శాతం రిజర్వేషన్ పరిమితి విధించలేదనీ, సహేతుక కారణాలంటే పెంచుకునే వెసులుబాటునిచ్చిందని వివరించారు.

ఒక్క ప్రత్యేక ప్రాజెక్టునైనా తెచ్చారా?

కాంగ్రెస్ సభ్యులు విజయరమణారావు ప్రశ్న



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉండి కూడా రాష్ట్రానికి ఒక్కటైనా ప్రత్యేక ప్రాజెక్టు తెచ్చారా? అంటూ పెద్దపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయరమణారావు బీజేపీ సభ్యులను ప్రశ్నించారు. రాష్ట్రానికి హక్కుగా రావాల్సినవి వస్తున్నాయి తప్ప ప్రత్యేకంగా ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికలకు ముందు సెంటిమెంట్ రెచ్చగొట్టి గెలిచారని ఎద్దేవా చేశారు. ఎల్లకాలం సెంటిమెంట్ పని చేయదనీ, ప్రజలతో మమేకమైతేనే మనుగడ ఉంటుందని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని శాసనసభలో బడ్జెట్‌పై చర్చలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కూడా ప్రాంతీయ సెంటిమెంట్‌ను వాడుకుని అనేక సార్లు గెలిచారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి నుంచి కేసీఆర్‌ను చిత్తు చిత్తుగా ఓడించారని తెలిపారు. ప్రాంతీయవాదం, మతతత్వం ఎంతో కాలం నిలబడదని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం కట్టింది నిజమే...అది కూలింది కూడా వాస్తవమేనన్నారు. రూ. 60వేల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని అప్పగిస్తే...ఏడున్నర లక్షల కోట్లు అప్పులు అప్పగించి కేసీఆర్ దిగిపోయారని తెలిపారు. ఆ అప్పులను తీర్చేందుకు కొత్త అప్పులు చేయాల్సి వస్తోందని చెప్పారు.ఉప ఎన్నికల్లో గెలిచేందుకు బీఆర్ఎస్ కొత్త కొత్త పథకాలను, ప్రాజెక్టులను ప్రకటించిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ అభివృద్ధి కాకుండా ఉండటమే బీఆర్ఎస్ అజెండా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి స్పందిస్తూ...కేంద్రం ఏమీ ఇవ్వలేదంటూ విమర్శలు చేయడం సరైందికాదన్నారు. రాష్ట్రానికి కేంద్రం రూ.10 లక్షల కోట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. కాళేశ్వరంలో ఒక పిల్లర్ మాత్రమే కుంగిందంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ తిప్పికొట్టారు. భవనంలో ఒక పిల్లర్ పని కూలిపోతే ఆ భవనం నిలబడబోదని చెప్పారు. మైనార్టీలకు రుణాలు ఇస్తామంటూ బీఆర్ఎస్ చీటింగ్ చేసిందని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు.

అప్పులు ఘనం అభివృద్ధి శూన్యం..

బడ్జెట్‌పై మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు శాసనమండలి ఆవరణలో శుక్రవారం న నిరసన తెలిపారు. అప్పులు ఘనం అభివృద్ధి శూన్యం అంటూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అప్పులు ఆకాశంలో, అభివృద్ధి పాతాళంలో అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. రూ లక్షా 58 వేల కోట్ల అప్పు చేసి ఎంత మంది మహిళలకు రూ.2500, ఎంతమంది వద్ధులకు రూ.4 వేల పెన్షన్, ఎంత మంది ఆడపిల్లలకు స్కూటీలు, తులం బంగారం ఇచ్చారని ప్రశ్నించారు. 15 నెలల్లో రూ.1.58 లక్షల కోట్లు అప్పుచేసినా అభివృద్ధి సున్నా అని విమర్శించారు. అనంతరం మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ శాసనమండలిలో ప్రశ్నోత్తరాలు రద్దు చేయడాన్ని ఖండించారు. సభలో ప్రజల సమస్యలు చర్చించడం లేదనీ, కేవలం బిల్లులు ప్రవేశపెట్టడం పాస్ చేయించుకోవడమే జరుగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో చర్చించే అవకాశం లేకున్నా ప్రజా క్షేత్రంలో పోరాడుతామని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ గత బీఆర్ఎస్ సర్కారు 9 ఏళ్లలో రూ.4.17 లక్షల కోట్ల అప్పు చేస్తే, రేవంత్ సర్కారు 15 నెలల్లో రూ.1.58 లక్షల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ సర్కారు చేసిన ప్రతి అప్పుకు సరైన లెక్కలున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు, ఖర్చులపై శ్వేతపత్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అంకెల గారడీ

- ఆరు గ్యారంటీలు, 420 హామీల ప్రస్తావన లేదు
- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ : బీజేపీ శాసనసభ పక్ష నేత మహేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ అంకెల గారడని శాసనసభలో బీజేపీ పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలపై బడ్జెట్లో ప్రస్తావనలేదని దుయ్యబట్టారు. అయితే అప్పులు చేయడంలో మాత్రం బీఆర్ఎస్ బాటలోనే రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని ఎద్దేవా చేశారు. 'నిమిషానికి రూ. కోటి చొప్పున నెలకు రూ.1,750 సగటున అప్పు చేస్తోంది. గత 15 నెలల కాలంలో రూ.1,50,000 కోట్ల అప్పు చేసింది. రాష్ట్రంలో ఒక్కో వ్యక్తిపై రుణభారం రూ.2.27 లక్షలుగా ఉంది. పెద్ద ఎత్తున రుణాలుంటే తెలంగాణ ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పాలి. బిల్లులు చెల్లించడానికి కూడా తిరిగి అప్పులు చేస్తున్నారు. ఇటీవల కాంట్రాక్టర్లు తమ పెండింగ్ బిల్లుల కోసం ఏకంగా సచివాలయం ముందు ధర్నా చేశారు. పరిస్థితి ఇలాగే ఉంటే సంక్షేమ కార్యక్రమాలు ఎలా అమలు చేస్తారో చెప్పాలి' అని ఆయన డిమాండ్ చేశారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించకుండా ఇష్టా రాజ్యంగా పథకాలను ప్రవేశపెట్టి కేంద్రం డబ్బులివ్వడం లేదని వాటిని ఎత్తేసే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. 'యూపీఏ కంటే ఎన్డీఏ హయాంలో ఆర్థిక సంఘం నిధులు పెరిగాయి. యూపీఏ హయాంలో రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో 32 శాతం వాటా ఉండేది. అప్పుడు కేంద్ర పన్నుల్లో వాటా 2-3 శాతం కూడా పెంచలేదు. మోడీ ప్రభుత్వం వచ్చాక కేంద్ర పన్నుల్లో వాటా 10 శాతం పెంచి 42 శాతం చేశారు. పన్నుల్లో వాటా పెంచాక కూడా కేంద్రాన్ని విమర్శించడం సరికాదు' అని ఏలేటి అన్నారు. హైకమాండ్‌కు కప్పం కట్టేందుకు ఇష్టారాజ్యంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఆవరణలో సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారని ఈ సందర్భంగా ఏలేటి పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. ఈ దశలో కల్పించుకున్న శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు సమాధాన మిస్తూ... గేట్ నెంబర్ 3 బయట జరిగిన సంఘటనను అసెంబ్లీకి ఆపాదించడం సరికాదన్నారు.

అప్పులు తీర్చేందుకు మళ్లీ అప్పులా?

మరి అభివృద్ధి ఎప్పుడు?: ఏ.వీ.ఎన్.రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ సర్కారు చేసిన అప్పులు తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అప్పులు చేస్తే అభివృద్ధి ఎలా చేస్తారని? శాసనమండలిలో బీజేపీ పక్షనేత ఏ.వీ.ఎన్.రెడ్డి తెలిపారు. శుక్రవారం శాసనమండలిలో బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు.

రాష్ట్రానికి కేంద్రం ఇచ్చే జీఎస్టీ వాటా, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ల కన్నా మద్యం నుంచి వచ్చే ఆదాయం ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యకు కేటాయించిన నిధులు జీతభత్యాలకే సరిపోతాయని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ మన ఊరు-మన బడికి రూ.3,000 కోట్లు కేటాయించి రూ.900 కోట్లు మాత్రమే విడుదల చేసిందనీ, అదే బాటులో కాంగ్రెస్ సర్కార్ వెళితే ఎలా? అని ప్రశ్నించారు. విద్యకు నిధుల్లేకుంటే అసమానతలు పోవని తెలిపారు. ఉచితాలతో ఏం లాభమని ప్రశ్నించారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ రూ.20 వేల కోట్లు బకాయిలున్నాయని తెలిపారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు తెలంగాణను అప్పుల్లో కూరుకుపోయేలా చేశాయని విమర్శించారు. ఆర్థిక సంక్షోభం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

కేంద్రం నుంచి నిధులు తేవాలి

బీజేపీకి పొన్నం చురకలు

- పేదలను బడ్జెట్‌కు లింక్ చేయాలి : కూనంనేని
- అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుకుందామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు వెనుక సదుద్దేశమే ఉందని వ్యాఖ్యానించారు. శుక్రవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎంగా మారినట్టుగానే, మూసీ పునర్జీవం ప్రాజెక్టును కాంగ్రెస్ ఏటీఎంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్న దన్నారు. మూసీని ప్రక్షాళన చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నదనీ, ఇంతవరకు డీపీఆర్ సిద్ధం కాలేదని అన్నారు. గతంలో బీఆర్ఎస్ సర్కారు డీపీఆర్ అంచనాలు రూ. 50 వేల కోట్లు అని చెబితే, కాంగ్రెస్ రాగానే రూ. 71 వేల కోట్లు అంటున్నదన్నారు. ఇటీవల కుత్బుల్లాపూర్‌లో జరిగిన ఒక సమావేశంలో రూ.1.50 లక్షల కోట్లుగా మంత్రి చెప్పారని అన్నారు. డీపీఆర్ సిద్ధం కాకుండానే అంచనాలు పెంచడాన్ని తప్పుబట్టారు. ఈ సందర్భంగా చర్చలోకి వచ్చిన మంత్రి పొన్నం ప్రబాకర్ మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనా ప్రాజెక్టు కొత్తదేమీ కాదన్నారు. గుజరాత్‌లోని సబర్మతీ, గంగా పునర్జీవం ప్రాజెక్టు తరహాలోనే చేపడుతున్నామన్నారు. పునరావాస సమస్యలు కూడా లేవన్నారు. అధ్యయనం కోసం మున్సిపల్ శాఖ దక్షిణ కొరియా తీసుకెళ్లిందన్నారు. మలక్‌పేటలో 300 కుటుంబాలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇచ్చి తరలించే ప్రక్రియ చేపట్టామని వివరించారు. వాళ్లకు షిఫ్టింగ్ చార్జీలు రూ. 25 వేల చొప్పున ఇచ్చి ఆదుకున్నామని అన్నారు. చర్చలో మంత్రి జూపల్లి కృష్ణారావు జోక్యం చేసుకుని మాట్లాడుతూ తాను కూడా మూసీ బాధితుడినేనని అన్నారు. ఎంత ఖర్చవుతుందనే సంగతిని ఇప్పుడే చెప్పలేమన్నారు. పెట్టుబడులు ఆకర్షించడానికి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి, రాష్ట్ర ఆదాయాన్ని పెంచడానికి, టూరిజాన్ని అభివృద్ధి చేయడానికి మూసీ ప్రక్షాళన చేస్తున్నామన్నారు. 1.20 కోట్ల జనాభా ఉన్న హైదరాబాద్‌లో మూసీ దోమలు, వాసనతో వాతావరణం చెడిపోతున్నదన్నారు. రాష్ట్రం నుంచి నిధులు కేంద్రానికి పోవడమే తప్పితే, రాష్ట్రానికి రావడం లేదని అన్నారు. తుది డీపీఆర్ వచ్చే వరకు ఎంత ఖర్చవుతుందనేది చెప్పలేమన్నారు. రూ. 50 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి, మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుకు కేటాయింపులు లేవని తెలిపారు.

నేనూ మూసీ బాధితుడినే: మంత్రి జూపల్లి



బడ్జెట్‌కు పేదలను లింక్ చేయండి కూనంనేని సాంబశివరావు

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌తో పేదలను లింక్ చేయాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రతి ఒక్కరినీ బడ్జెట్‌తో భాగస్వాములను చేస్తే ప్రయోజనాలు ఉంటాయన్నారు. ప్రభుత్వం ఖర్చు పెడుతున్న ప్రతిపైసాలో పేదలకు దక్కుతుందా ? లేదా ? అనేది పరిశీలించు కోవాలని సూచించారు. రాష్ట్రం ఏర్పడి నప్పుడు ఉన్న అప్పులు రూ. 70 వేల కోట్లు అనీ, ఇప్పుడవి రూ. 8 లక్షల కోట్లపై మాటేనని చెప్పారు. తాజా బడ్జెట్ రూ. 3 లక్షల కోట్లని చెప్పారు. ఏ అభివృద్ధికి ఇది సంకేతమని ప్రశ్నించారు. అప్పు చేయకుండా రాష్ట్రాన్ని నడిపే పరిస్థితి లేదన్నారు. అప్పుల ఊబీ నుంచి ఎలా బయటపడతారని అడిగారు. ఆదాయాన్ని సమకూర్చే మార్గాలను అన్వేషించాలని సూచించారు. భూముల అమ్మకానికి తాము వ్యతిరేకమన్నారు. మాఫీయా చేతిలో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. కేంద్రం నుంచి రావాల్సిన పన్నుల వాటా కోసం పోరాడాలని కోరారు. దేశం సమాఖ్య వ్యవస్థ అనీ, కేంద్రం సాయం చేయాలని కోరారు. రాజ్యాంగంలో కేంద్ర అనేది లేదనీ, రాష్ట్రాల సమహారంగా చెప్పారని చెప్పారు.

అప్పుల ఊబిలో నుంచి బయటపడితేనే రేవంత్ హీరో అవుతారని అన్నారు. బడ్జెట్ రూపకల్పనా పద్ధతే మారాలని అభిప్రాయపడ్డారు. ఆకలిసూచిలో దేశం 107వ స్థానంలో ఉందన్నారు. ఒక శాతం మంది దగ్గర 40 శాతం సంపద ఉంటే, 10 శాతం మంది దగ్గర 50 శాతం పోగయ్యిందన్నారు. అదే 50 శాతం మంది వద్ద కేవలం మూడు శాతం మాత్రమే ఉందన్నారు. పుష్ప సినిమా విషయంలో ఎంత కఠినంగా వ్యవహరించారో, బెట్టింగ్‌ల విషయంలోనూ అంతే కఠినంగా ఉండాలని చెప్పారు. మావోయిస్టులను మళ్లీ చంపేశారని వ్యాఖ్యానించారు. ఇది తాము చేసిన ఘనకార్యంగా చెప్పుకోవడాన్ని తప్పుబట్టారు. మనం జాగ్రత్తగా ఉండాలని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీ సర్క్యులర్ ప్రభుత్వానికి తెలియకుండా వచ్చిందా అని ప్రశ్నించారు.

ప్రజా రంజక బడ్జెట్

ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం : కాంగ్రెస్ సభ్యులు బాలు నాయక్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ ప్రజారంజక బడ్జెటని కాంగ్రెస్ సభ్యులు బాలు నాయక్ కితాబునిచ్చారు. శుక్రవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి బడ్జెట్ పెద్దపీట వెసిందని కొనియాడారు. ఎన్నికల ముందిచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మహిళల గురించి మాట్లాడే అర్హత ఆ పార్టీకి లేదని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా సర్కార్ ముందుకెళుతోందని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్‌ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు ఈ పథకానికి విద్యుత్ శాఖకు రూ.1,575 కోట్లు చెల్లించినట్టు పేర్కొన్నారు. 'రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఏటా 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు కట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాం, ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాం.

బీఆర్ఎస్ హయాంలో చేసిన రైతు రుణమాఫీ వారి వడ్డీలకే సరిపోయింది. కాని మా ప్రభుత్వం ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపించింది. 25లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్లను మాఫీ చేశాం. గత సర్కార్ ధరణి పేరుతో వేలాది ఎకరాల భూమిని అమ్ముకుంది. కాని కాంగ్రెస్ సర్కార్ భూ భారతి తీసుకొచ్చి భూములను కాపాడే ప్రయత్నం చేసోంది. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలను ప్రవేశపెట్టింది. తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్ఎస్ వాటి బాగోగులు పట్టించుకోలేదు. పదేండ్లలో ఏనాడు డైట్ చార్జీలు పెంచలేదు. కాంగ్రెస్ సర్కార్ అధికారం చేపట్టిన తర్వాతే 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచింది. బీఆర్ఎస్ సర్కార్ నిర్వాకం వల్ల నిర్వీర్యం అయిన అన్ని రంగాలను ప్రగతి పథకంలో నడిపించేందుకు చర్యలు చేపట్టాం' అని బాలు నాయక్ అన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి బాషపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదని స్పష్టం చేశారు.

రాష్ట్రానికి రావాల్సిన వాటా ఇవ్వలేదు

పెండింగ్ నిధుల కోసం సీఎం ప్రయత్నం భేష్ : బడ్జెట్ చర్చలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన వాటా ఇవ్వడం లేదని ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ విమర్శించారు. కేంద్రం ఇవ్వాల్సిన పెండింగ్ నిధుల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నం భేష్ అని కొనియాడారు. శుక్రవారం హైదరాబాద్‌లోని శాసనసభలో బడ్జెట్‌పై చర్చలో ఆయన మాట్లాడారు. పెండింగ్ నిధులను తెచ్చేందుకు సీఎం అనేక సార్లు ఢిల్లీకి వెళ్లారని తెలిపారు. దీనిపై బీజేపీ సభ్యులు కూడా దృష్టి సారించాలని కోరారు. రాష్ట్రంలో విస్తరిస్తున్న క్యాన్సర్ వ్యాధిని ఆరోగ్య శ్రీలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా మహిళలను ఆ వ్యాధి వెంటాడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చర్చించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని విమర్శించారు. మైనార్టీ రుణాల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడంతో ఎంతో మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అందులో అర్హులను గుర్తించి చెక్‌లు కూడా ఇచ్చిందనీ, అవి ఇప్పటివరకు క్లియర్ కాలేదన్నారు. అలాంటి వారు రాజీవ్ వికాస పథకానికి అర్హులు కావడం లేదని సభ దృష్టికి తీసుకెళ్లారు. రూ. 60 కోట్ల ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయనీ, వెంటనే డబ్బు విడుదల చేయాలని కోరారు.

రాష్ట్ర హజ్‌హౌస్‌లో కనీస వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. వైఎస్ఆర్ హయాంలో హజ్‌హౌస్ ఆవరణంలో కొత్త భవనాన్ని ప్రారంభించారనీ, బీఆర్ఎస్ ప్రభుత్వం దాన్ని పూర్తి చేయలేదని గుర్తు చేశారు. ఆలేరు ఎన్‌కౌంటర్‌పై విచారణ పూర్తయినప్పటికీ ఆ నివేదికను ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని కోరారు. వక్ఫ్‌బోర్డు అప్పులపై వేసిన సీబీసీఐడీ నివేదికను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సంపాదకీయం

'ఉస్మానియా'పై ఉక్కుపాదం!

ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం చేస్తుండగానే మరోవైపు ప్రగతిభవన్ చుట్టూ ఉన్న బారికేడ్లు, ముండ్లకంచెల్ని అధికారులు బద్దలు కొట్టిన దృశ్యాల్ని టీవీల్లో, మాధ్యమాల్లో వీక్షించిన ప్రజలు ఎంతో సంతోషపడ్డారు, కేరింతలు కొట్టారు. పదేండ్ల నిర్బంధం తొలగిపోయిందని ఊపిరి పీల్చుకున్నారు. అదే వేదికపై రేవంత్‌రెడ్డి 'ఆరు గ్యారంటీల' ఫైలుపై తొలి సంతకం చేసి మాట్లాడారు. 'గత ప్రభుత్వం ఇందిరాపార్కు వద్ద ధర్నాచౌక్‌ను ఎత్తేసింది. కార్మిక ఉద్యమాల్ని అణిచేసింది. రైతులకు బేడీలు వేసింది. విద్యార్థుల గొంతు నొక్కేసింది. అందుకే అధికారంలోకి రాకముందు మేమిచ్చిన 'ఆరు గ్యారంటీల'తో పాటు ఇప్పుడు నేను 'ఏడో గ్యారంటీ'కి కూడా హామీ నిస్తున్నాను. అదే ప్రజాస్వామ్య పునరుద్ధరణ' అన్నారు. కానీ, ఆయన చెప్పిన మాటలకు, చేతలకు పొంతన లేదని ఓయూలో జారీ అయిన సర్క్యులర్‌ను చూస్తే అర్థమవు తున్నది. వర్సిటీలో ఎలాంటి ఆందోళనలు చేయ కూడదని అందులో ఉంది. భిన్నభిప్రాయాలకు, మేధోపరమైన చర్చలకు వేదికగా నిలిచే విశ్వ విద్యాలయాల్లో ఇలాంటి ఆంక్షలు దేనికి సంకేతం? ఇది 'ప్రజాపాలన' అనిపించుకుంటుందా?

భావ ప్రకటన అనేది సంభాషణకు వీలు కల్పిస్తుంది. చర్చలకు ఆస్కారమిస్తుంది. లోతైన అంశాలపై అవగాహన పెంచుకునేందుకు తోడ్పడుతుంది. ఇది విద్యార్థుల ఉన్నత విద్యకు చాలా అవసరమైనది. అది మన ఆలోచనలు, మన సమాచారం స్వేచ్ఛగా మార్పు చేసుకోగలిగినప్పుడు మాత్రమే సాధ్యం. ఇది సమాజాన్ని శాస్త్రీయ దృక్పథంతో సాగే నవీనశకానికి దారిచూపుతుంది. అలాంటి భావాలను పంచుకోగలిగే, మాట్లాడు కోగలిగే, ప్రశ్నించగలిగే సమాజాన్ని అందించాలి. అంతేకానీ ప్రగతిభవన్ గేట్లు బద్దలు కొట్టిన చేతులతోనే ఉస్మానియాకు కంచెలు వేయడం సహేతుకం కాదు.

దేశంలోనే ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో ఉస్మానియా యూనివర్సిటీ ఒకటి. ఎంతోమంది మేధావులకు, విద్యావంతులకు, విధాన రూపకర్తలకు పురుడుపోసింది. వందేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గతేడాది ఉత్సవాలు కూడా నిర్వహించుకుంది. అనేక ఆందోళనలు, ధర్నాలు, పోరాటాలతో విద్యార్థుల గళాన్ని దేశం నలుదిక్కులకూ వినిపించింది. ప్రాణత్యాగాలకు కూడా వెరవలేదు. గత సర్కార్ పాలనలో ఎన్నో నిర్బంధాల్ని చవిచూసిన విద్యార్థులు కొత్త సర్కార్ ప్రజాస్వామ్య పునరుద్ధరణకు హామీనివ్వడం హర్షించారు. కానీ విద్యార్థుల హక్కులకు ఒక గొంతుకగా నిలిచిన ఉస్మానియాలో నేడు ఎలాంటి ఆందోళనలు చేపట్టవద్దని రిజిస్ట్రార్‌చే సర్క్యులర్ జారీచేయడాన్ని ఏమనుకోవాలి? 'ఇది అన్యాయం' అంటూ విద్యార్థులు, సంఘాలు వారం రోజులుగా ఆందోళనలు చేస్తుంటే పోలీసులు వారిని ఎక్కడికక్కడే అడ్డుకుంటూ, కిందపడితే ఈడ్చు కుంటూ తీసుకెళ్లి వ్యాన్‌ల్లో కుక్కుతుంటే? ఈచర్యల్ని ఎలా చూడాలి? ఇది భావ ప్రకటన స్వేచ్ఛను హరించడం కాదా!



అసలు ఆసర్క్యులర్‌లో ఏమున్నదో చూస్తే ఆశ్చర్యపోతారు. ప్రధానంగా బయటి వ్యక్తులు వర్సిటీకీ రావడం వల్ల విద్యాసం వత్సరం దెబ్బతింటున్నదనీ, ఆడపిల్లలు, హాస్టల్స్ ఉన్నందున వారికి రక్షణ ఉండదనీ, అలాగే ధర్నాలు, ప్రదర్శనలు చేయకూడదని, నినాదాలు ఇవ్వకూడదని, వీసీతో పాటు అధికారులు, సిబ్బందిని డౌన్‌డౌన్ అనకూడదని వీటిపై నిషేధం విధిస్తున్నట్టు సర్క్యులర్ జారీచేశారు. ఇది హాస్యాస్పదం, అనైతికం. విశ్వవిద్యాలయమంటేనే భావాత్మక చర్చలకు కేంద్రం. అలాంటి చోట ఇలాంటి నిర్ణయం అసంబద్ధం. ఓయూలో అన్ని విభాగాల్లో కలిపి 252 పోస్టులు ఖాళీలున్నాయని, తమ చదువుల కోసం వాటిని భర్తీ చేయాలని విద్యార్థులు అడుగుతున్నారు. ఇది న్యాయమైన డిమాండే కదా. ఈ విషయాలు అడగకూడదా? అధికారగణం పట్టించుకోకపోతే నిరసనలు తెలపకూడదా? పైకి ఇలాంటి వాటిని కారణాలుగా చూపుతున్నా ప్రజల్లో సర్కార్ మీద వస్తున్న వ్యతిరేకత పట్ల యూనివర్సిటీల్లో జరుగుతున్న రాజకీయ సభలు, సమావేశాలు, చర్చాగోష్టులు తమకు నష్టం చేస్తున్నాయనే అక్కసుతోనే ఈ నిషేధం విధించినట్టు తెలుస్తోంది.

భిన్నభిప్రాయాలు కలిగినదే ప్రజాస్వామ్యం. రాజ్యాంగం పొందుపరిచిన ఆర్టికల్ 19 భావ ప్రకటనా స్వేచ్ఛ అన్ని చోట్లా, అన్నివర్గాల ప్రజలు తమను తాము స్వేచ్ఛగా వ్యక్తీకరించుకోగల ప్రపంచం కోసం నినదించే హక్కును కల్పించింది. ఇది మాట్లాడే, వినపడే, రాజకీయ, కళాత్మక, సామాజిక జీవితంలో పాల్గొనే హక్కు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన వారు దానికే తిలోదకా లిచ్చే విధంగా వ్యవహరించం శోచనీయం. ఎందు కంటే, నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ కూడా ధర్నాచౌక్ విషయంలో గగ్గోలు పెట్టింది. కేసీఆర్ నిరంకుశత్వానికి ఇది ప్రతీక అని నిందించింది. మరి ఇప్పుడు రేవంత్ సర్కార్ చేస్తున్న దేమిటి?పార్టీలు వేరైనా స్వభావం ఒక్కటేనని నిరూపిస్తున్నది.

భావ ప్రకటన అనేది సంభాషణకు వీలు కల్పిస్తుంది, చర్చలకు ఆస్కారమిస్తుంది. లోతైన అంశాలపై అవగాహన పెంచుకునేందుకు తోడ్పడుతుంది. ఇది విద్యార్థుల ఉన్నత విద్యకు చాలా అవసరమైనది. అది మన ఆలోచనలు, మన సమాచారం స్వేచ్ఛగా మార్పు చేసుకోగలిగినప్పుడు మాత్రమే సాధ్యం. ఇది సమాజాన్ని శాస్త్రీయ దృక్పథంతో సాగే నవీన శకానికి దారిచూపుతుంది. అలాంటి భావాలను పంచుకోగలిగే, మాట్లాడు కోగలిగే, ప్రశ్నించగలిగే సమాజాన్ని అందించాలి. అంతేకానీ ప్రగతిభవన్ గేట్లు బద్దలు కొట్టిన చేతులతోనే ఉస్మానియాకు కంచెలు వేయడం సహేతుకం కాదు.

జలమే జీవనాధారం

నీరు లేనిదే సమస్త జీవ కోటికి మనుగడ లేదు. అసలు జీవ పరిణామం ప్రారంభమైందే సముద్రగర్భంలో అన్న విషయం తెలిసిందే. ఒకప్పుడు పుష్కలంగా లభించే మంచి నీటిని అభివృద్ధి పేరిట కలుషితం చేస్తున్నారు. అవసరానికి మించి వాడుతూ వాటిని వృథా చేస్తున్నారు. దీంతో సమీప భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు జరిగే రోజులు కూడా రానున్నాయనడంలో ఆశ్చర్యమేమీ లేదంటే అతిశయోక్తి కాదేమో. ఈ పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే ఐక్యరాజ్య సమితి 'ప్రపంచ జల దినోత్సవం' (వరల్డ్ వాటర్ డే) ను చేపట్టింది. ప్రతియేటా మార్చి 22న దీన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నది. ప్రపంచ జల దినోత్సవం వరల్డ్ వాటర్ డే 2025 థీమ్ -'గ్లేసియర్ ప్రిజర్వేషన్' హిమాని నదాల సంరక్షణ. ఇది మంచినీటి ప్రాముఖ్యతను, స్థిరమైన నిర్వహణను తెలియజేయడానికి ఈ రోజును జరుపుతారు. 1992లో బ్రెజిల్ లోని రియో డి జెనీరో లో పర్యావరణం, అభివృద్ధిపై ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన సమావేశం ఎజెండా 21లో ఈ దినోత్సవాన్ని మొదట ప్రతిపాదించారు. హిమాని నదాలు



జీవితానికి, నీటి చక్రానికి చాలా ముఖ్యం, తాగునీరు వ్యవసాయం పరిశ్రమలు స్వచ్ఛమైన శక్తి ఉత్పత్తి, ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలకు వాటి కరిగే నీరు అవసరం

ప్రపంచంలో నేడు ప్రతి ముగ్గురిలో ఒకరికి శుద్ధమైన తాగునీరు దొరకడం లేదు. 2050 నాటికి భూమి మీద నివసిస్తున్న వారిలో సుమారు 5.7 బిలియన్ల (500 కోట్ల పైమాటే) మంది ఏడాదికి ఒక నెల పాటు నీటి కొరత ఎదుర్కోనున్నారని అంచనా. మంచి నీటి సరఫరా, పారిశుధ్యం సక్రమంగా ఉంటే ప్రతి యేటా మూడు లక్షల అరవై వేల మంది శిశువుల ప్రాణాలను కాపాడుకోవచ్చు. గ్లోబల్ వార్మింగ్‌ను పూర్వస్థాయి కంటే 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేస్తే వాతావరణ ప్రేరిత నీటి ఒత్తిడిని యాభై శాతం వరకు తగ్గించవచ్చు. గత దశాబ్దంలో తొంభై శాతానికి పైగా విపత్తులు తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగానే తలెత్తాయి.2040 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఇంధన డిమాండ్ 25 శాతానికి, నీటి డిమాండ్ 50 శాతానికి పైగా పెరగనుందని అంచనా. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా అందరికీ నీరు, పారిశుధ్యం కల్పించాలని ఐరాస లక్ష్యంగా పెట్టుకుంది. 2018-28 దశాబ్దాన్ని 'వాటర్ ఫర్ సస్టెనెబుల్ డెవలప్‌మెంట్'గా ఐరాస జనరల్ అసెంబ్లీ ప్రకటించింది.ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠశాలలో సగానికంటే ఎక్కువ స్కూళ్లలో విద్యార్థులకు హ్యాండ్ వాషింగ్ సౌకర్యాలు లేవు. కనీసం చేతులు కడుక్కోవడానికి నీరు, సబ్బు కూడా అందుబాటులో లేని స్కూళ్లు కూడా చాలా ఉన్నాయి. అపరిశుభ్రమైన నీరు తాగి ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా రెండు లక్షల 97వేల మంది (సుమారు రోజుకు 800) పిల్లలు అతిసారం బారిన పడి చనిపోతున్నారు. పై విపత్కర పరిస్థితులను ఎదుర్కోవాలంటే ఒక వ్యక్తిగా, సమూహంగా, సమాజంగా, దేశంగా ప్రపంచంగా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మనమేం చేయాలని ఆలోచించి ఆచరణలోకి ముందుకు సాగాలి.

(నేడు ప్రపంచ జల దినోత్సవం)

- డాక్టర్ పరికిపండ్ల అశోక్, 9989310141

తెలంగాణ బడ్జెట్: సామాన్యులే సమిధలు



ఎస్ వీరయ్య

రాష్ట్ర బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలతో సహా, మొత్తం సంక్షేమ పథకాలకు కలిపి రూ.1,04,329 కోట్లు కేటాయించామని ప్రభుత్వం చెప్పుకుం టున్నది. బడ్జెట్‌కు వ్యతిరేకంగా హడావుడి చేసిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ఇంతలోనే లోతుపాతులను ప్రశ్నించలేని స్థితిలో పడ్డారు. సాధారణ ప్రజల తిండి, బట్ట, ఇల్లు, విద్య, వైద్యం మీద ప్రభుత్వం దృష్టి పెట్టిందా లేదా అన్నదే అసలు సమస్య. తిండి, బట్ట లాంటి సమస్యలు ప్రత్యక్షంగా ప్రభుత్వం ఇచ్చేవి కావు. అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా విధానాలు రూపొందించాలి. తగిన కనీస వేతనాలు ప్రభుత్వం నిర్ణయించాలి. అమలు చేయాలి. రైతుల పంటకు తగిన ధర అందేవిధంగా మార్కెట్‌ను నియంత్రించాలి. నిత్య జీవితా వసర సరుకుల ధరలనూ నియంత్రించాలి. ఇవి చేయలేని పరిస్థితుల్లోనే సంక్షేమ పథకాల ఆవశ్యకత ముందుకొస్తుంది. ప్రభుత్వాలు విషయాలను విస్మరించి సంక్షేమ పథకాల చుట్టూ చర్చ నడుపుతున్నాయి. దయతలచి పేదలకు వారు బిక్ష వేస్తున్నట్టు, అదే వారి గొప్పతనం అన్నట్టు జబ్బలు చరుచుకుంటారు. పాలకుల మద్దతుదారులైన మేధావులు కొందరు వీటిని 'ఉచితాలు'గా హేళన చేస్తుంటారు.

పాలకులు 'తెలంగాణ రైజింగ్-2050' నినాదంతో ముందుకు సాగుతామన్నారు. ఏ నినాదం వెనక ఏ వర్గ ప్రయోజనాలు దాగున్నాయో గమనించాలి అంటాడు లెనిన్. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన 'విజన్-2020' నినాదం వెనుకు ప్రపంచబ్యాంకు ప్రత్యక్షమైంది. ఆర్థిక అసమానతల సమాజం మనది. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం ఫోకస్ పారిశ్రామికవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఫామ్‌హౌజ్ యజమానులవైపా లేక మెజారిటీ ప్రజల వైపా?

గత ఆర్థిక సంవత్సరం ఆశించినమేరకు ఆదాయం రాలేదు. అయినా రానున్న ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని చూపించారు. ఆదాయం తగ్గితే ఏ ఖర్చుకు కోత పెడతారు? గత బడ్జెట్‌లన్నీ పరిశీలిస్తే ఈ ప్రశ్నకు సమాధానం కష్టమేమీ కాదు. ఈ బడ్జెట్‌లో కూడా రాని ఆదాయం రానున్నట్టుగా పెంచి చూపించారు. గత ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదించిన బడ్జెట్ సవరించిన అంచనాల్లో రూ.25వేల కోట్లు తగ్గించారు. ఇప్పుడు మళ్లీ రూ.3,04,965 కోట్లు బడ్జెట్ ప్రతిపాదించారు. కేంద్ర బడ్జెట్‌కు ముందురోజు పార్లమెంటు ముందుంచిన ఆర్థిక సర్వే రిపోర్టులో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందనీ, సరుకుల అమ్మకాలు తగ్గిపోయాయనీ, పెరుగుతున్న ధరలు కూడా ప్రజల మీద భారం మోపుతున్నాయనీ సమీప భవిష్యత్తులో కూడా సమస్యలే రానున్నాయనీ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఈ దేశంలో భాగమే కదా. ఆదాయం పెరుగుతుందని ఏ లెక్క ప్రకారం అంచనా వేశారు. సరుకుల అమ్మకాలు పెరిగితే కదా ఈ ఆదాయం వచ్చేది. పన్నేతర ఆదాయం కానీ, గ్రాంట్ల రూపంలో వచ్చేవి కానీ ఎప్పుడూ అంచనాలకంటే తక్కువే ఉంటాయి. కానీ ఇప్పుడు ఈ రెండూ పెంచి చూపించారు. లేని ఆదాయం వస్తుందని చూపటం ద్వారా జరిగే పర్యవసానాలే ఆందోళనకరం. ఆదాయం తగ్గిందనే పేరుతో దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతులు, మహిళలు, మైనారిటీల సంక్షేమం కోసం కేటాయించిన నిధులకే కోత పెడతారు. బడ్జెట్‌లో కేటాయింపులు చూపడం, తర్వాత ఖర్చు పెట్టకపోవటం ఆనవాయితీగా వస్తున్నది. నష్టపోయేది బడుగు బలహీన వర్గాలే. ప్రకటించుకోడానికి అనేక పథకాలు ఉంటాయి. ఫలితాలు మాత్రం శూన్యం.

మద్యం అమ్మకాలను ఆదాయపు వనరుగా చూడటం ఈ బడ్జెట్‌లో కూడా వ్యక్తమైంది. ఇది పెరగాలంటే ప్రజలు మరింతగా తాగుబోతులుగా మారాలి. దీంతోపాటు ప్రభుత్వం భూముల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు, ఎల్‌ఆర్‌ఎస్‌ల ద్వారా వచ్చే ఆదాయం మీదనే ఆశలు పెట్టుకున్నది. ఇప్పటికే రియల్ ఎస్టేట్ పడిపోయింది. ఇండ్లు, ఇండ్ల స్థలాల అమ్మకాలు తగ్గిపోయాయి. అందువల్ల రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరిగే అవకాశం ప్రశ్నార్థకమే. అయినా ఆదాయం పెరగాలంటే రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచి ప్రజల మీద భారం మోపే అవకాశం ఉన్నది. ఇక ప్రభుత్వానికి మిగిలింది భూములు వేలం వేయటం. కేంద్రంలో మోడీ సర్కారు నగదీకరణ పేరుతో చేస్తున్న ఆస్తుల అమ్మకం పనినే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అనుసరిస్తున్నది.

కుటుంబ ఆదాయంలో నాలుగింట మూడొంతులు విద్య, వైద్యం, ఇంటి కిరాయిలకే పోతున్నది. మిగిలిన అవసరాలన్నీ పావు భాగం ఆదాయం నుంచే తీర్చుకోవాలి. అందుకే సరుకుల అమ్మకాలు పడిపోతున్నాయి. విద్యా, వైద్య సౌకర్యాలు ఉచితంగా ఇచ్చేందుకు తగిన కేటా యింపులు చేయాలి. ఇండ్లు లేని పేద, దిగువ మధ్యతరగతి ప్రజలందరికీ ఇంటి సౌకర్యం కల్పించాలి. దీనివల్ల కుటుంబ ఆదాయంలో నాలుగింట మూడొంతుల డబ్బు సరుకుల కొనుగోళ్లకు, అదనపు సౌకర్యాలు పొందడానికి అందుబాటులోకి వస్తుంది. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ వేగం పుంజుకుంటుంది. ప్రభుత్వానికి పన్ను ఆదాయం కూడా పెరుగుతుంది. ఇందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. విద్యా, వైద్యం, గృహ నిర్మా ణం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖలకు నిధులు కూడా నామమాత్రంగానే పెంచారు. మరోవైపు బడ్జెట్‌లో తలసరి ఆదాయం గురించి గొప్పలు చెప్పుకున్నారు. కానీ తలసరి ఆదాయం ఒక మాయ. ఇది ప్రజలందరి ఆదాయం కాదు. 'రాజుగారివి నావి కలిపి వంద బర్రెలు' అన్నట్టు ఉంటుంది. మరి బడ్జెట్ ప్రసంగంలో ఆకర్షణీయమైన మాటలతో ఎందుకు ప్రజలను మభ్యపెడుతున్నారు? ఇక్కడే అసలు కథ మొదలవుతుంది.



బడ్జెట్ తప్పుడు దిశలో ఉన్నది. దీనికి తోడు నిధులు కీలకం. వనరులన్నీ కేంద్రం చేతుల్లో ఉన్నాయి. రాష్ట్రాలకు పన్నుల వాటా యాభై శాతానికి పెంచాలనీ, ఆర్థిక సంఘం కేటాయింపుల సమయంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తికి యాభై శాతం వెయిటేజి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరటం సమంజసమే. కోరితే సరిపోదు. కొట్లాడాలి. మోడీ విధానాలతో ఒకవైపు ఏకీభవిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కొట్లాడటానికి సిద్ధపడుతుందా? ఉపాధి అవకాశాలు పెంచటం, మార్కెట్ నియంత్రణ, ధరలు తగ్గించడం కూడా కేంద్ర ప్రభుత్వం చేయవలసిన పనే. కేంద్రంలో బీజేపీ సర్కారు అనుసరిస్తున్న మౌలిక విధానాలను ప్రశ్నించడానికి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేదు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఆర్థిక విధానాలకు మధ్య తేడా లేకపోవడమే అసలు సమస్య. అందుకే బడ్జెట్ విషయంలో రాజకీయ విమర్శలు చేసిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు కూడా మౌలిక విషయాలను ప్రశ్నించలేకపోతున్నారు.

హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా మార్చబోతున్నామన్నారు. మురికివాడల అభివృద్ధికి, లోతట్టు ప్రాంతాల సమస్యల పరిష్కారానికి, నిజాం కాలం నాటి డ్రెయినేజి వ్యవస్థ అభివృద్ధి చేయడానికి తగిన నిధుల గురించి మాత్రం ప్రస్తావించలేదు. రహదారుల నిర్మాణానికి పబ్లిక్- ప్రయివేటు భాగస్వామ్యమే మార్గంగా ప్రతిపాదించారు. ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ పేరుతో పేదలు, రైతుల భూములు సేకరించే పనిలో ఉన్నారు. మూసీ పునరుద్ధరణ పేరుతో రియలెస్టేట్ ప్రాజెక్టు ఇప్పటికే ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీ పేరుతో పబ్లిక్-ప్రయివేటు భాగస్వామ్యం ప్రతిపాదించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోగల నిపుణులు అవసరమే. కానీ ఇప్పటికే ఉన్న విశ్వవిద్యాలయాలకు తగిన నిధులు కేటాయించకుండా బలహీనపరుస్తూ, ఒక స్కిల్ యూనివర్సిటీ గురించి గొప్పలు చెపుతున్నారు. విద్యారంగానికి కేటాయింపులు కూడా తగ్గించారు. మరోవైపు నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ పాఠశాల గురించి చెప్పారు. అంటే విద్యార్థులలో కొద్దిమందిని ఎంపిక చేసి ఈ పాఠశాలలకు పంపుతారు. మిగిలిన విద్యాలయాలన్నీ గాలికి వదిలేస్తారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో ప్రారంభించిన ప్రయివేటీకరణ విధానాలు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా బాగా నచ్చాయి. ఈ విధానాలు దేశ గమనంలో మైలురాయిగా నిలుస్తాయనీ, 21వ శతాబ్దపు అవసరాలను తీర్చేవిధంగా దేశాన్ని తీర్చిదిద్దుతాయని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా నమ్మిస్తున్నది. దీనితోనే రాష్ట్రంలో విద్యా విధానాన్ని కూడా అనుసంధానం చేస్తారట!

ఇప్పటికే రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకంటే ప్రయివేటు సంస్థల్లో చదివే విద్యార్థుల సంఖ్య రెట్టింపయింది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో తగిన సౌకర్యాలు లేక తల తాకట్టు పెట్టయినా తమ పిల్లలను ప్రయివేటు సంస్థల్లో చేర్పిస్తున్నారు. అక్షరాస్యత 66.54శాతం మాత్రమే. మహిళల్లో ఇది 57.99శాతం మాత్రమే ఉన్నది. కార్మికుల కనీస వేతనాలు నిర్ణయించకుండా పెట్టుబడిదారులను, కాంట్రాక్టర్లను సంతృప్తిపరచడంలో మోడీ సర్కారుతో పోటీ పడుతున్నారు. పెట్టుబడిదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఫాంహౌస్ యజమానుల ప్రయోజనాలు కాపాడటమే ఈ బడ్జెట్ లక్ష్యంగా ఉన్నది. ఫలితంగా 1,63,41,942 మంది శ్రామికుల ప్రయోజనాలను ఈ బడ్జెట్ విస్మరించింది. రాష్ట్రంలో ఆహార భద్రత పేరుతో పేదలకు 91,19,268 తెల్ల రేషన్‌కార్డులు ఇచ్చామని గొప్పలు చెప్పుతున్నారు. 42,51,341మందికి ఒంటరి మహిళ, వికలాంగులు, బీడీ కార్మికులు తదితర పేర్లతో పెన్షన్లు, ఆర్థిక సహాయాలు చేస్తున్నామని కూడా చెప్పుకొచ్చారు. అంతపెద్ద సంఖ్యలో తెల్ల రేషన్‌కార్డుల అవసరం ఉన్నదంటేనే, వెయ్యి రెండువేల రూపాయల సహాయం కోసం కూడా ఎదురు చూస్తున్నారంటేనే పేదరికం, ఆర్థిక అసమానతలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతున్నది. ఈ సమస్యలను పరిష్కరించే దిశలో బడ్జెట్ ఉండాలన్న సోయి పాలకులకు లేదు. వ్యవ సాయానికి కూడా కేటాయింపులు తగ్గించారు. ఉత్పాదకత మీద దృష్టి లేదు. సాగునీటికి కేటాయింపులు నామమాత్రంగానే పెంచారు. హైదరా బాద్ నగరాన్ని ఆకాశానికి ఎత్తుతూ తెలంగాణ సమతుల్యాభివృద్ధిని పక్కనపెట్టారు. జిల్లాకు ఒక పారిశ్రామిక క్లస్టర్ అని ఆశలు చూపించడమే తప్ప కేటాయింపులు లేవు.

బడ్జెట్ తప్పుడు దిశలో ఉన్నది. దీనికి తోడు నిధులు కీలకం. వనరులన్నీ కేంద్రం చేతుల్లో ఉన్నాయి. రాష్ట్రాలకు పన్నుల వాటా యాభై శాతానికి పెంచాలనీ, ఆర్థిక సంఘం కేటాయింపుల సమయంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తికి యాభై శాతం వెయిటేజి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరటం సమంజసమే. కోరితే సరిపోదు. కొట్లాడాలి. మోడీ విధానాలతో ఒకవైపు ఏకీభవిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కొట్లాడటానికి సిద్ధపడుతుందా? ఉపాధి అవకాశాలు పెంచటం, మార్కెట్ నియంత్రణ, ధరలు తగ్గించడం కూడా కేంద్ర ప్రభుత్వం చేయవలసిన పనే. కేంద్రంలో బీజేపీ సర్కారు అనుసరిస్తున్న మౌలిక విధానాలను ప్రశ్నించడానికి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేదు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఆర్థిక విధానాలకు మధ్య తేడా లేకపోవడమే అసలు సమస్య. అందుకే బడ్జెట్ విషయంలో రాజకీయ విమర్శలు చేసిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు కూడా మౌలిక విషయాలను ప్రశ్నించలేకపోతున్నారు. ఒకవైపు జీఎస్టీ పేరుతో నిధులన్నీ కేంద్రం చేతుల్లో బిగబట్టి ప్రజల కొనుగోలు శక్తి పడిపోయే విధానాలు అనుసరించింది కేంద్ర ప్రభుత్వం. మరోవైపు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాత్రం రాష్ట్రంలో పన్ను వసూళ్లు 8.5శాతం తగ్గడానికి కారణమేమిటో చెప్పాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదం. ఎప్పుడూలేని స్థాయిలో అప్పులు చేసి మోనిటైజేషన్ పేరుతో ఆస్తులు అమ్మి నగదు సమకూర్చుకునే పథకం ప్రకటించిన మోడీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న బండి సంజయ్, అప్పులు చేయడం, ఆస్తులు అమ్మడమే తెలంగాణ ప్రభుత్వ పాలనగా విమర్శించడం అర్థరహితం. అంతటితో ఆగక బడ్జెట్‌లో కూడా మత విద్వేషాలు చొప్పించే ప్రయత్నం చేశారు. మౌలిక విషయాల ఊసెత్తకుండా ఢిల్లీకి మూటల బడ్జెట్ అని మాటల దాడితో కేటీఆర్ సరిపెట్టుకున్నారు. ఇంకోవైపు ఏడు లక్షల కోట్లకు పైగా అప్పుచేసిన బీఆర్‌ఎస్ మంత్రివర్గంలో భాగమైన హరీష్‌రావు కూడా మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మారుస్తున్నారని ఆరోపించారు. శ్రామికుల, అణగారిన తరగతుల ప్రయోజనాలు మరిచినపుడు మిగిలేవి అర్థరహిత విమర్శలే కదా! ఇప్పుడు ఆలోచించవలసింది ప్రజలే. ■

నియోజకవర్గాల పునర్విభజన హెచ్చరిక




రాధాకుమార్

శాసనసభ నియోజకవర్గాల పునర్విభజనపై వాడివేడి చర్చ జరుగుతున్న కొద్దీ వాటికి సంబంధించిన పరిష్కారాల తోపాటు అనేక ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. వాటిలో జనాభా పెరిగిన రాష్ట్రాల్లో శాసనసభ స్థానాల సంఖ్యను పెంచి, పార్లమెంట్ స్థానాల్ని తగ్గించే చాలా సున్నితమైన ప్రతిపాదన కూడా ఉంది. శాసనసభ్యులు వారి ఓటర్లకు అందుబాటులో ఉండే ప్రథమ వ్యక్తులు కాబట్టి అది చాలా ప్రజాస్వామ్యయుతమైన సూత్రం, కానీ పార్లమెంట్ సభ్యులు జాతీయవిధానం పై ఆధారపడి వారి ఓటర్లకు ప్రాతినిధ్యం వహిస్తారు. కొత్త నియోజకవర్గాల పునర్విభజన సృష్టించే అధికార అసమతుల్యత గురించి దక్షిణాది రాష్ట్రాల భయాల్ని తొలగించే ఇతర మార్గాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు, రాజ్యసభ స్థానాలను ఉత్తర,మధ్య, తూర్పు, పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాలకు సమానంగా పునఃపంపిణీ చేయవచ్చు.వీటిని ఇప్పటికే ఐదు భౌగోళిక జోన్లుగా విభజించారు. ప్రతి జోన్‌కు స్వంత జోనల్ కౌన్సిల్ ఉంది. వీటిలో ఫిబ్రవరి 2025లో సమావేశమైన పశ్చిమ జోన్ మినహా చాలా జోన్లలో 2023 నుండి సమావేశాలు జరగడం లేదు. జనవరి 2025లో చెన్నైలో సమావేశం జరగాలనే ప్రణాళిక ఉన్నప్పటికీ, దక్షిణాది జోన్ కౌన్సిల్ సమావేశం 2022 నుండి జరగడం లేదు. రాష్ట్రాల మధ్య వివాదాల్ని పరిష్కరించడానికే జోనల్ కౌన్సిళ్లు ఏర్పడ్డాయి,అంతర్రాష్ట్ర మండలి రాష్ట్రాల మధ్య, రాష్ట్రాలు-కేంద్రం మధ్య సంబంధాల్ని రెంటినీ కూడా పరిష్కరించగలదని విమర్శకులు వాదిస్తారు. కానీ ఆచరణలో కౌన్సిళ్లు మాత్రం ఆధార్ నుండి సుపరిపాలనకు సంబంధించిన ఉన్న అనేక అంశాల్ని చేపడుతున్నాయి. వాటి పరిధి మేరకు వాటిని బహుశా హోం మంత్రిత్వ శాఖ పరిధి నుండి విముక్తి చేయాల్సిన అవసరం ఉంది. జోనల్ కౌన్సిళ్లు ఇప్పుడు స్తబ్దతగా ఉన్న అంతర్రాష్ట్ర కౌన్సిల్ ద్వారా కేంద్ర కార్యనిర్వాహకవర్గంతో సమన్వయం చేసుకోవచ్చు. (దాని వెబ్‌సైట్ సమాచారం ప్రకారం అది 2016లో చివరిసారిగా సమావేశమైంది). అంతర్రాష్ట్ర కౌన్సిల్‌కు ఎక్కువ అధికారంతో పాటు శాశ్వతత్వం అవసరం.

జమ్మూ-కాశ్మీర్‌లో

పైన పేర్కొన్న రెండు ప్రతిపాదనలను కలిపితే,ఎన్నికల ప్రాతినిధ్యం, సమాఖ్యతత్వం (ఫెడరలిజం) రెండూ మరింత బలోపేతం అవుతాయి.కానీ 2026లో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనలో సంభవించబోయే చిక్కుల పట్ల కూడా జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉంది. ఇటీవలి కాలంలో రెండు రాష్ట్ర స్థాయి నియోజకవర్గాల పునర్విభజన జరిగింది: మొదటిది 2022లో జమ్మూ, కాశ్మీర్‌లో, రెండోది 2023లో అస్సాంలో జరిగింది. జమ్మూ కాశ్మీర్ లో జరిగిన పునర్విభజనను భారతీయ జనతా పార్టీ మినహా, అంతకు పూర్వం రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు చాలా తీవ్రంగా విమర్శించాయి. సంఖ్య రీత్యా జమ్మూకు 6 స్థానాలు, లోయకు ఒక స్థానాన్ని కల పడం వల్ల జమ్మూ ఓటర్ల ఓటు 1.2 కాగా, లోయ ఓటర్ల ఓటు ఒకటిగా ఉంది. ఎలాంటి పాలనా పరమైన, భౌగోళిక సంబంధం లేకుండానే కొత్త నియోజకవర్గాల్ని సృష్టించారు. వాస్తవానికి, జమ్మూకు చెందిన పూంచ్, రాజౌరీలను లోయలోని అనంతనాగ్ లోక్‌సభ స్థానానికి కలపడం వల్ల పాలనా పరమైన, భౌగోళిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎందుకంటే మొదటిది పిర్ పంజాల్ కు చెందినది కాగా రెండవది జీలం లోయలో ఉంది.

ఇంకా దారుణమైన విషయం ఏంటంటే, సరిహద్దును నిర్ణయించడానికి పునర్విభజన కమిషన్ మతపరమైన ప్రమాణాలను ఉపయోగించిందని శాసనసభ నియోజకవర్గాల్లో చేసిన మార్పులు సూచించాయి. ఆరు కొత్త నియోజకవర్గాలుగా ఉన్న జస్రోతా, రామ్ గర్, రామ్ నగర్, వైష్ణోదేవి, పాడార్-నాగ్సేని, దోడా వెస్ట్ లు హిందువులు అధిక సంఖ్యాకులుగా ఉన్న నియోజకవర్గాలు. ఆ తర్వాత, ఇంతకు పూర్వం ఇందర్వాల్ నియోజకవర్గంలోని ప్రాంతాలను చేర్చడం ద్వారా ముస్లింలు అధిక సంఖ్యాకులుగా ఉన్న కిష్త్వార్ నియోజకవర్గాన్ని హిందువులు అధిక సంఖ్యాకులుగా ఉన్న నియోజకవర్గంగా మార్చారు. ముస్లింలు అధిక సంఖ్యాకులుగా ఉన్న దూరు (1.92లక్షలు), సురాన్కోట్ (1.77లక్షలు) నియోజక వర్గాలతో పోలిస్తే వైష్ణోదేవి, పాడార్, దోడా వెస్ట్ నియోజకవర్గాల్లో అతి తక్కువ మంది ఓటర్లు (50000) మాత్రమే ఉన్నారు. ఈ మూడింటిలో ఏ ఒక్క నియోజకవర్గం కూడా దాని జిల్లాలోని ఇతర ప్రాంతాలకు భౌగోళికంగా భిన్నంగా లేదు.



అస్సాంలో

అస్సాంలో కూడా నియోజకవర్గాల పునర్విభజన కొంచెం భిన్నమైన నమూనాను అనుసరించి అలాంటి ఫలితాల్నే రాబట్టింది. శాసనసభ స్థానాల సంఖ్యను స్తంభింపజేశారు. అయితే అస్సాం మంత్రివర్గం ముందుగానే నాలుగు జిల్లాలను, అవి అంతకు ముందు వేరు చేయబడిన జిల్లాలుగా మార్చి జిల్లాల సంఖ్యను 35 నుండి 31 కి తగ్గించారు. ఈ విలీనం, పది ముస్లిం అధిక సంఖ్యాక నియోజకవర్గాలైన దక్షిణ సల్మార, బార్ పేట (2స్థానాలు), దారంగ్, నాగావ్, దిబ్రుగర్, శిబ్ సాగర్, జోర్హాత్, హైలాకండి, కరీంగంజ్‌లను కోల్పేయేందుకు దారి తీయగా, హిందూ, గిరిజన స్థానాల సంఖ్య పెరిగింది. జమ్మూ, కాశ్మీర్‌లో వలే అస్సాం పునర్విభజన కూడా చాలా భిన్నమైన జనాభా పరిమాణం గల నియోజక వర్గాలను సృష్టించింది.

ఇంకో మాటలో చెప్పాలంటే, 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజన కసరత్తును వ్యతిరేకించేవారు పక్షపాతంతో కూడిన జనాభా ప్రమాదం గురించి భయపడకూడదు. ఇటీవల కాలంలో పునర్విభజన కమీషన్లు ఎక్కువ జనాభా గల నియోజక వర్గాలతో పాటు తక్కువ జనాభా గల నియోజకవర్గాలను ఏర్పాటు చేయాడానికి ఏ మాత్రం సంకోచించడం లేదని జమ్మూ, కాశ్మీర్, అస్సాం ఉదాహరణలు సూచిస్తున్నాయి. ఈ చర్యలు మైనార్టీలను అణగదొక్కి మతపరంగా ప్రయోజనాలు పొందడానికి ఉపయోగ పడుతున్నాయి. 2026 పునర్విభజన సమయంలో కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించరని విశ్వసించడానికి ఏదైనా కారణం ఉందా?

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ప్రతిపక్షం ఇంకా ఈ ప్రమాదం పై దృష్టిని కేంద్రీకరించనే లేదు.కచ్చితంగా ప్రతిపక్షం ఆ పని చెయ్యాలి. అన్ని ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాలు అధిక మైనార్టీ జనాభా ముఖ్యంగా ముస్లిం జనాభాను కలిగి ఉన్నాయి. వాస్తవం, చాలా రాష్ట్రాల్లో ప్రాంతీయ గుర్తింపు, మత గుర్తింపును అధిగమిస్తుంది. ఉదాహరణకు, గతంలో జరిగిన శాసనసభ, పార్లమెంట్ ఎన్ని కల్లో మెజారిటీ బెంగాలీ, తమిళ హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు వారి ప్రాంతాలకు చెందిన లౌకిక ప్రాంతీయ పార్టీలైన తృణమూల్ కాంగ్రెస్, ద్రావిడ మున్నేట్ర కజగంకు ఓట్లు వేశారు. కానీ ఈ మతతత్వేర ఓటింగ్ నమూనా కొనసాగుతుందన్న గ్యారెంటీ కూడా ఏమీ లేదు. దీనికి భిన్నంగా నియోజకవర్గాల మతతత్వ విభజన దక్షిణాది రాష్ట్రాల్లో కూడా జరిగే అవకాశం ఉంది. జమ్మూ కాశ్మీర్, అస్సాంలలో ఇది అలాంటి ప్రభావాన్ని కచ్చితంగా చూపింది. అక్కడ దాదాపు అన్ని నియోజకవర్గాల్లో బీజేపీకి ఓట్లు వేశారు.

సరిహద్దు రాష్ట్రాల్లోని కేంద్ర పరిపాలనా విధానాలు కేంద్ర భూభాగంలో పునరావృతంకావని మనం విశ్వసిస్తాం. అది ఒకప్పుడు వాస్తవం కానీ ఇప్పుడు ఆ విధంగా లేదు. ఘర్షణలు జరిగే ప్రాంతాల్లో ముఖ్యంగా సరిహద్దుల్లో అసమ్మతి ప్రకటించిన వారికి వ్యతిరేకంగా అనాగరిక చట్టాల్ని ప్రయోగించడం ఒకప్పుడు చాలా సర్వసాధారణం, ఇప్పుడు అది దేశ వ్యాప్తంగా వ్యాపించింది. అదే విధంగా మైనార్టీలను అవమానించే చర్యలు బాగా పెరిగాయి. జనాభా ప్రాతిపదికన ఏర్పడే పునర్విభజన ఫలితంగా పెద్ద ఉత్తరాది రాష్ట్రాలకు, మిగిలిన రాష్ట్రాలకు మధ్య సంభవించే అధికార అసమతుల్యత ప్రస్తుతం నిస్సందేహంగా ఒక కచ్చితమైన ప్రమాదం. కానీ దాన్ని, మరొక కచ్చితమైన, ప్రస్తుత ప్రమాదం- మతపరంగా నియోజకవర్గాల పునర్విభజనను కప్పి వేయడానికి అనుమతించకూడదు. ప్రతీది ఈ దేశ ఐక్యతను ఒక భిన్నమైన మార్గంలో బెదిరిస్తుంది. మొదటి అడుగు, యూనియన్‌లో మెరుగైన అభివృద్ధిని సాధించిన రాష్ట్రాల ప్రభావాన్ని తగ్గించడం ద్వారా మెరుగైన అభివృద్ధిని సాధించిన రాష్ట్రాలను తక్కువ అభివృద్ధిని సాధించిన రాష్ట్రాల నుండి విభజిస్తుంది.రెండో అడుగు మత ప్రాతిపదికన ప్రజల్ని విభజిస్తుంది.ఈ రెండు అడుగులు కలిసి మన బహుళత్వ సమాఖ్య పునాదులపై భయంకరమైన దాడి చేస్తాయి. వాటిని నిలువరించాలి.

("ది హిందూ" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451 ■

యువతకు రాజీవ్ స్ఫూర్తి

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- ఉప్పల్ స్టేడియంలో మాజీ ప్రధాని విగ్రహావిష్కరణ



హైదరాబాద్ : యువతకు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ స్ఫూర్తి ప్రదాత అని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఉప్పల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..'వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో స్టేడియానికి రాజీవ్‌గాంధీ పేరు పెట్టారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా స్టేడియంలో ఆయన విగ్రహం ఆవిష్కరించటం సంతోషంగా ఉంది. ప్రధానమంత్రిగా యువతకు దశ, దిశ చూపించిన వ్యక్తి రాజీవ్‌గాంధీ. జాతీయ జట్టు తరఫున ఆడుతున్న మహ్మద్ సిరాజ్, తిలక్ వర్మ సహా గొంగడి త్రిషలను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. క్రికెట్ సహా ఇతర క్రీడలకు ప్రజా ప్రభుత్వంలో ప్రాధాన్యత ఇస్తున్నామని' శ్రీధర్ బాబు అన్నారు. శాట్ చైర్మెన్ కే. శివసేనారెడ్డి, హెచ్‌సీఏ అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు, హెచ్‌సీఏ ఆఫీస్‌బేరర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రీడాభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమ్మె వాయిదా

- యూఎఫ్‌బీయూ వెల్లడి



నవతెలంగాణ.. హైదరాబాద్

బ్యాంకింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఇచ్చిన సమ్మె పిలుపు తాత్కాలికంగా వాయిదా పడింది. శుక్రవారం సెంట్రల్ లేబర్ కమిషనర్‌తో జరిగిన సమావేశం అనంతరం మార్చి 24, 25 తేదీలలో రెండు రోజుల దేశవ్యాప్త బ్యాంకుల సమ్మెను విరమించుకున్నట్టు యూఎఫ్‌బీయూ ప్రకటించింది. ప్రధానంగా ఐదు రోజుల పని దినాలు, కొత్త నియామకాలు, పనితీరు ఆధారంగా ప్రోత్సాహక ఆందోళన అంశాలపై లేబర్ కమిషనర్, ఫైనాన్సియల్ సర్వీసెస్ శాఖ (డీఎఫ్ఎస్) అధికారులతో చర్చించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అధికారులు తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించారని పేర్కొన్నాయి. "ఐదు రోజుల పని విధానంపై తాను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని సెంట్రల్ లేబర్ కమిషనర్ హామీ ఇచ్చారు. నూతన నియామకాలు, ఇతర ఆందోళనలపై తదుపరి చర్చలు జరుపుతామని ఇండియన్ బ్యాంకర్స్ అసోసియేషన్ (ఐబీఏ) అంగీకరించింది. ఈ సానుకూల పరిణామాల దృష్ట్యా తాము సమ్మెను ఒకటి లేదా రెండు నెలలు వాయిదా వేయాలని నిర్ణయించుకున్నాము." అని యూఎఫ్‌బీయూ తెలిపింది. తదుపరి దశ చర్చలు ఏప్రిల్ మూడో వారంలో ఉంటాయని వెల్లడించింది. యూఎఫ్‌బీయూ మార్చి 24, 25న సమ్మెకు పిలుపునిచ్చినప్పటికీ.. మార్చి 22, 23 కూడా సాధారణ సెలవులు కావడంతో నాలుగు రోజులు బ్యాంకింగ్ సేవలు నిలిచిపోయేవి.

రహ్మత్‌నగర్‌లో ఇఫ్తార్ విందు



నవతెలంగాణ- హైదరాబాద్

అంబర్‌పేట నియోజకవర్గం రహ్మత్‌నగర్‌లో శుక్రవారం హబీబ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ పద్మావతి రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ లీడర్ దుర్గాప్రసాద్ రెడ్డి హాజరై జయప్రదం చేశారు. ఈ విందులో జమీల్ , అబ్దుల్, సోహైల్, రషీద్, జలీల్, మున్నా వాసీం, సద్దాం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

వడగండ్లతో అప్రమత్తంగా ఉండండి

- సీఎం ఆదేశాలతో సీఎస్ టెలీకాన్ఫరెన్స్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ , కరీంనగర్ జిల్లాలలో శుక్రవారం కురిసిన వడగండ్ల వాన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లో పరిస్థితులను సమీక్షించారు. వడగండ్ల వాన వల్ల నెలకొన్న పరిస్థితులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అడిగి తెలుసుకున్నారు. ఆయా జిల్లాల యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న 48 గంటల్లో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు, సూచనల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సీఎస్ ఆదేశించారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అకాల వర్షాలతో ఉత్పన్నమయ్యే నష్టాల అంచనాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికల రూపంలో పంపాలని సీఎస్ ఆదేశించారు.

ఐపీఎల్ పండుగొచ్చె!

- నేటి నుంచి ఐపీఎల్18 ఆరంభం
- తొలి మ్యాచ్‌లో కోల్‌కత, బెంగళూర్ ఢీ

రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..





17 వసంతాలుగా అభిమానులకు వేసవి వినోదం అందిస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్‌కు ముస్తాబైంది. ప్రపంచ క్రికెట్‌ను ఫ్రాంచైజీ ఫార్ములాకు విజయవంతంగా పట్టాలెక్కించిన ఐపీఎల్.. లీగ్ బ్రాండ్‌తో పాటు ఆటగాళ్ల పాపులారిటిని సైతం గణనీయంగా ప్రభావితం చేసింది. అభిమానులు, మార్కెట్ వర్గాలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఐపీఎల్ పండుగ వచ్చేసింది. 2008 అరంగేట్ర ఐపీఎల్ సీజన్ తొలి మ్యాచ్‌లో తలపడిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, కోల్‌కత నైట్‌రైడర్స్.. మళ్లీ ఐపీఎల్‌లో ఓ సీజన్ తొలి మ్యాచ్‌లో సమరానికి సై అంటున్నారు. ఈడెన్‌లో నేడు ఆర్సీబీ, కెకెఆర్ పోరుతో ఐపీఎల్18 షురూ కానుంది.

నవతెలంగాణ-కోల్‌కత

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పండుగొచ్చింది. ఐసీసీ ఈవెంట్లలో వరుస టైటిల్స్‌తో భారత అభిమానులను మంత్రముగ్ధులు చేసిన మన క్రికెటర్లు... ఇప్పుడు ఐపీఎల్ హంగామాతో ఆ జోష్‌ను రెట్టింపు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఐపీఎల్ 18వ సీజన్ నేడు ఈడెన్ గార్డెన్స్‌లో షురూ కానుంది. ఆరంభ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, కోల్‌కత నైట్‌రైడర్స్ తలపడనున్నాయి. ఆటగాళ్ల మెగా వేలంతో అన్ని జట్లు సరికొత్తగా కనిపిస్తుండగా.. డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కత నైట్‌రైడర్స్ నాల్గో టైటిల్‌పై కన్నేసి బరిలోకి దిగుతుండగా.. తొలి టైటిల్ కోసం రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ పోరాటానికి సై అంటోంది.

స్పిన్ సవాల్!

ఐపీఎల్18 సీజన్‌లో నేడు తొలి మ్యాచ్. ఆటగాళ్ల మెగా వేలం, జట్టు సమీకరణాల్లో మార్పులు.. సారథ్య బాధ్యతల్లో కొత్త రక్తం వెరసి నేడు నైట్‌రైడర్స్, రాయల్ చాలెంజర్స్ పోరు మరింత ఆసక్తికరంగా మారింది. అజింక్య రహానె కోల్‌కతకు కెప్టెన్‌గా వ్యవహరించనుడగా.. రజత్ పాటిదార్ బెంగళూర్‌కు సారథ్యం వహిస్తున్నాడు. ఓపెనింగ్, మిడిల్ ఆర్డర్ సహా బౌలర్ల కూర్పుపై ఆసక్తి కనిపిస్తోంది. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ మరోసారి థ్రిల్లింగ్ ముగింపులను అందించేందుకు ఎదురుచూస్తోంది.

కోల్‌కత నైట్‌రైడర్స్ అనగానే ఆండ్రీ రసెల్ ధనాధన్ బ్యాటింగ్‌తో పాటు సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తి స్పిన్ మాయజాలం గుర్తుకొస్తాయి. మరోవైపు బెంగళూర్ స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి స్పిన్ బలహీనతను ఎదుర్కొంటున్నాడు. ఈడెన్‌లో కోహ్లి క్రీజులోకి రాగానే రహానె వెంటనే నరైన్, వరుణ్‌కు చేతికి బంతి అందిస్తాడనటంలో సందేహం లేదు. తొలి మ్యాచ్‌లో ఇరు జట్ల విదేశీ ఆటగాళ్ల ఎంపికపై ఫోకస్ కనిపిస్తోంది.

ఆరంభ వేడుకకు ఏర్పాట్లు

ఐపీఎల్ ఆరంభ వేడుకలకు ప్రత్యేకత ఉంది. ప్రతి సీజన్‌కు నిర్వాహకులు అభిమానులను మరింతగా అలరించే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది బాలీవుడ్ నటీ దిశా పటాని నృత్య ప్రదర్శన హైలైట్‌గా నిలువనుంది. శ్రేయ ఘోషల్, కరణ్ అహుజా ఆట పాటలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 35 నిమిషాల పాటు ఓపెనింగ్ సెర్మానీ వేడుక సాగనుంది. మ్యాచ్ టాస్ 7 గంటలకు పడనుండగా.. ఓ 60 నిమిషాల ముందే ఆరంభ వేడుకలు ఆరంభం కానున్నాయి.

వర్షం ముప్పు

ఐపీఎల్ సీజన్ ఆరంభ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. వాతావరణ శాఖ 'ఆరెంజ్' హెచ్చరిక జారీ చేయగా.. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం మెండుగా ఉంది. కోల్‌కతలో బుధవారం, గురువారం సైతం వర్షం కురిసినా.. ఇరు జట్లు ప్రాక్టీస్ చేశాయి. శుక్రవారం రాత్రి సైతం ఈడెన్‌గార్డెన్స్‌లో వర్షం కురిసింది. మైదాన సిబ్బంది పిచ్‌పై కవర్లు కప్పి ఉంచారు. వర్షం కారణంగా మ్యాచ్‌కు ఆటంకం కలిగితే.. ఆఖరుకు ఐదు ఓవర్ల మ్యాచ్ సాధ్యపడేందుకు వీలుగా నిబంధనలు ఉన్నాయి. వర్షంతో మ్యాచ్ రద్దు అయితే ఇరు జట్లు చెరో పాయింట్ పంచుకోనున్నాయి.

డీలిమిటేషన్ విషయం కొలిక్కి రాలేదు

ఎమ్మెల్యే పాయల్ శంకర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

డీలిమిటేషన్ విషయం ఇంకా కొలిక్కి రాలేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. తమిళనాడు సీఎం స్టాలిన్ నేతృత్వంలో ఆదివారం చెన్నయ్‌లో జరగనున్న అఖిలపక్ష సమావేశానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోతున్నాయని, ఈ రెండు పార్టీలు ఒక్కటేనని విమర్శించారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వైఖరిపై తమకు అనుమానాలు ఉన్నాయని, బీసీ జనాభాను కులగణనలో తగ్గించి చూపించారని అన్నారు. 56శాతం ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడాన్ని ఆహ్వానిస్తున్నామని, దానిలో ముస్లిం మైనార్టీలకు 10శాతం మతపరమైన రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నా మని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రను బీసీలు గమనిస్తున్నారన్నారు. ముస్లిం మైనార్టీలకు 10శాతం ఇస్తే బీసీలను మోసం చేసినట్టేనన్నారు. ముస్లిం మైనార్టీలకు మతపరమైన రిజర్వేషన్లు కల్పించబోమని ప్రభుత్వం ప్రతిపాదించాలని, అందుకు ప్రభుత్వానికి సమయం ఇస్తున్నామని, ఆలోపు నిర్ణయం తీసుకోకపోతే సోమవారం చర్చలో అసెంబ్లీలో లేవనెత్తుతామని అన్నారు.

ఓయూలో ఆంక్షలు ఎత్తేయాలి


- డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ)లో ఆంక్షలను ఎత్తేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో విద్యార్థి ఉద్యమాలకు, ప్రజా పోరాటాలకు కేంద్ర బిందువైన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిర్బంధ ఆంక్షలు ఎత్తేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ఇచ్చిందనీ, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఏడో గ్యారంటీ అని ప్రకటించిందని గుర్తు చేశారు. నియంతృత్వ పోకడలు ఇక్కడ చెల్లవంటూ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రగతి భవన్ ముందు ఉన్న ముళ్ల కంచెలు తీసేసిందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్తూ ఇప్పుడు ఓయూలో నినాదాలు, పోరాటాలు, ధర్నాలు ఉండకూడదంటూ అప్రజాస్వామిక, నియంతృత్వ సర్క్యులర్‌ను జారీ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సర్క్యులర్ అప్రజాస్వామ్యం, అనైతికం, తక్షణమే దాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గత వారం రోజులుగా నిరసనలు తెలుపుతున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులపై నిర్బంధాన్ని ప్రయోగించి అరెస్టులు చేయడాన్ని వారు ఖండించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కారించాలే తప్ప విద్యార్థుల గొంతు నొక్కే ప్రయత్నం చేయొద్దని కోరారు. ప్రజాపాలన పేరుతో నియంతృత్వం అమలు చేసే సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తెలుగు రాష్ట్రాల్లో రూ.1,000 కోట్ల వ్యాపారం లక్ష్యం

గోద్రేజ్ జెర్సీ సీఈఓ భుపేంద్ర సూరి



హైదరాబాద్ : వచ్చే రెండేండ్లలో తెలుగు రాష్ట్రాల్లో రూ.1,000 కోట్ల వ్యాపారం లక్ష్యంగా పెట్టుకున్నామని గోద్రేజ్ అగ్రోవెట్ లిమిటెడ్‌కు చెందిన గోద్రేజ్ జెర్సీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భూపేంద్ర సూరీ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ పలు ఉత్పత్తులను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏపీ, తెలంగాణలో రూ.650 ఆదాయాన్ని కలిగి ఉన్నామన్నారు. ఇక్కడి మార్కెట్‌లో విస్తరణకు 3ఎక్స్3 ఎత్తుగడలను అవలభించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా బాదం మిల్క్, పనీర్, పెరుగు వాల్యూయేడెడ్ ఉత్పత్తులపై దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. రెండేళ్లలో బాదం మిల్క్ విభాగం నుంచి రూ.100 కోట్ల రెవెన్యూ అంచనా వేస్తున్నామన్నారు. తమ సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, నాగ్‌పూర్, మహారాష్ట్రలో కార్యకలాపాలను కలిగి ఉండగా.. ఎనిమిది డైరీ ప్లాంట్లు సహా ఒంగోల్‌లో ఒక్క పాల పౌడర్ ప్లాంట్‌ను కలిగి ఉన్నామన్నారు. ఆంధ్ర, తెలంగాణలో వచ్చే 12 నెలల్లో మా పంపిణీ నెట్‌వర్క్‌ను 20,000 అవుట్‌లెట్‌లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని గోద్రేజ్ జెర్సీ మార్కెటింగ్ హెడ్ శంతను రాజ్ తెలిపారు.

పంట దిగుబడి రాక మనస్తాపంతో
గిరిజన రైతు ఆత్మహత్య



నవతెలంగాణ-వెంకటాపురం

మొక్కజొన్న సాగు చేసిన గిరిజన రైతుకు పంట దిగుబడి రాకపోవడంతో మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో చోటుచేసుకుంది. బర్లగూడెం గ్రామానికి చెందిన మధు కృష్ణ(33) తనకున్న రెండు ఎకరాల పొలంలో మొక్కజొన్న బాండ్ వ్యవసాయం చేశాడు. అధిక దిగుబడి వస్తుందనుకున్న రైతుకు నిరాశ ఎదురైంది. సుమారు రూ.లక్షకు పైగా అప్పవ్వడంతో కొంతకాలం నుంచి మనోవేదనతో ఉన్నాడు. అప్పు తీర్చే మార్గం తెలియక గురువారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. రైతుకు న్యాయం చేయాలని వాజేడు- వెంకటాపురం ప్రధాన రహదారిపై చిరుతపల్లి వద్ద మృతదేహంతో గ్రామస్తులు రాస్తారోకో చేపట్టారు. సీపీఐ(ఎం), గిరిజన సంఘ నాయకులు సంఘీభావం ప్రకటించి బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి జ్ఞానం వాసు, కుమ్మరి శ్రీను, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్టెం ఆదినారాయణ, ఆదివాసీ సంఘం నాయకులు కొరస నరసింహమూర్తి, ఉయిక శంకర్, పూణెం సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

- ఒకరు మృతి.. మరో నలుగురి పరిస్థితి విషమం

కూలీలతో వెళ్తుండగా మహబూబాబాద్ జిల్లా చర్లపాలెంలో ఘటన



నవతెలంగాణ - మరిపెడ(నర్సింహులపేట)

రెక్కాడితే గాని డొక్కాడని వ్యవసాయ కూలీ కుటుంబాలు.. ప్రతిరోజు పనుల నిమిత్తం ఏదో ఒక గ్రామానికి వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుని సాయంత్రానికి ఇంటికి చేరుకునేవారు. రోజులాగానే మహిళా కూలీలు మిర్చి ఏరటానికి ఆటోలో బయలుదేరారు. ఎదురుగా అజాగ్రత్తతో వస్తున్న లారీని తప్పించుకునే క్రమంలో లారీ వెనుక భాగం తగిలి ఆటో బోల్తాపడింది. చికిత్సపొందుతూ ఒకరు మృతిచెందగా, మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నరసింహులపేట మండలం పెదనాగారం స్టేజీ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు మండలం చర్లపాలెం గ్రామానికి చెందిన 17 మంది మహిళా కూలీలు, ఆటో డ్రైవర్‌తో కలిపి మొత్తం 18 మంది మిర్చి తోట ఏరటానికి మరిపెడ వైపునకు ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో ఆటో నరసింహులపేట మండలంలోని పెదనాగారం స్టేజీ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలినవారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వటంతో మరిపెడ, దంతాలపల్లి, నరసింహుల పేటలో అందుబాటులో ఉన్న 108 అంబులెన్సుల ద్వారా క్షతగాత్రులను మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చర్లపాలెం గ్రామానికి చెందిన గూడెల్లి అరుణ (38) మృతి చెందారు. మిగతా క్షతగాత్రులు చికిత్స పొందుతున్నట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఆటోను ఢీ కొట్టిన వాహనం కోసం గాలిస్తున్నట్టు ఎస్ఐ వెల్లడించారు.

డీ-1, డీ-2 ప్రదేశాల్లో
కొనసాగుతున్న సహాయక చర్యలు
నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోని డీ-1, డీ-2 ప్రదేశాల్లో సహాయక చర్యలు వేగంగా సాగుతు న్నాయని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిం చారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని గుర్తించేం దుకు కొనసాగుతున్న సహాయక చర్యల పురోగతి పై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. టన్నెల్ బోరింగ్ మెషీన్ భాగాలను కత్తిరించడం, అవి తొలగించడం, నీటిని బయటకు పంపించే విధానంపై కేంద్రీకృతమై ఉన్నట్టు తెలిపారు. టీబీఎంలోని కీలకభాగాలను ప్రత్యేకంగా కత్తి రించి, వాటిని తొలగించేందుకు ఆధునాతన యంత్రాలు ఉపయోగిస్తున్నామన్నారు. టన్నెల్‌లో నీటిని, బురదను వాటర్ జెట్ ద్వారా తొలగించే ప్రక్రియ, ఎస్కవేటర్ల ద్వారా మట్టిని కన్వేయర్ బెల్ట్ పై తరలించే ప్రక్రియపై వివరంగా చర్చించారు. సహాయక బృందాలకు అవసరమైన ఆక్సిజన్ సిలిండర్లను నిరంతరాయంగా సరఫరా చేస్తున్న ట్టు చెప్పారు. అల్ట్రా థర్మల్‌కట్టర్లతో టన్నెల్ బో రింగ్ మెషీన్ భాగాలను తొలగిస్తున్నట్టు తెలి పారు. ఈ సమావేశంలో ఆర్మీ అధికారులు కల్నల్ పరీక్షిత్ మెహర, వికాస్‌సింగ్, ఎన్‌డిఆర్ఎఫ్, అధికారులు డాక్టర్ హరీష్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎస్‌డి ఆర్ఎఫ్, హైడ్రా, దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ర్యాట్ హోల్ మైనర్స్, అన్వి రోబోటిక్స్, కేరళ రెస్క్యూ బృందం, జేపి కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ రద్దు చేయాలని ప్రజా బ్యాలెట్

- ప్రభుత్వ నిర్ణయానికి పూర్తి వ్యతిరేకత
- 45 రోజులుగా పోరాడుతున్న 13 గ్రామాల ప్రజలు
- అసెంబ్లీ సమావేశాల్లోనే డంపింగ్ యార్డ్‌ను రద్దు చేస్తూ ప్రకటన చేయాలి
- రాజకీయాలకతీతంగా ఓటింగ్‌లో పాల్గొన్న నాయకులు, ప్రజలు

10 పోలింగ్ కేంద్రాల్లో ఓటేసిన స్థానికులు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాభిప్రాయమే శిరోధార్యమైనందున ప్రజా బ్యాలెట్ రూపంలో ప్రజలు తమ నిరసనను తెలియజేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్, నల్లవల్లిలో జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం గుమ్మడిదల మండలంలోని 13 గ్రామాల్లో ప్రజా బ్యాలెట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను ప్రభుత్వానికి తెలియజేసేందుకు ప్రజలు బ్యాలెట్ పోరాటాన్ని ఎంచుకున్నారు. 10 గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ ప్రక్రియలో 13 గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. ప్రజా సంఘాల పోరాట వేదిక ముద్రించిన బ్యాలెట్ పత్రంలో ప్రజలు ఓటు వేశారు. స్థానిక జేఏసీ, ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు పోలింగ్ అధికారులుగా వ్యవహరించారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి డంపింగ్ యార్డ్ రద్దు కోసం ఓటింగ్‌లో పాల్గొన్నారు.

బారులు తీరిన జనం

గుమ్మడిదల మండలంలో నిర్వహించిన ప్రజా బ్యాలెట్‌లో ప్రజలు బారులు తీరి ఓట్లేశారు. సాధారణంగా అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఎంతో ఆసక్తితో ఓట్లేస్తారు. అక్కడ తమ సమస్యలపై రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఐక్యత పాటించి ప్రజా బ్యాలెట్‌లో పాల్గొన్నారు. పత్రంలో 1.డంపింగ్ యార్డును రద్దు చేయాలి 2, డంపింగ్ యార్డు ఉండాలి.. ఈ రెండు బాక్సుల్లో ఓటేసేలా ప్రత్యేకంగా బ్యాలెట్‌ను ముద్రించారు. ప్రతి ఊర్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద తమ ఆధార్‌కార్డును చూపిస్తూ పేర్లు నమోదు చేసుకుని బ్యాలెట్ పత్రంలో ఓటేసి పోలింగ్ బాక్సులో వేశారు. గుమ్మడిదలలో జేఏసీ చైర్మెన్ జైపాల్‌రెడ్డి, రైతు జేఏసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచులు మంద బలరాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సీహెచ్ కుమార్‌గౌడ్ ఇతర నాయకులు ఓట్లేశారు. నల్లవల్లిలో జేఏసీ నాయకులు అంజనేయులు, హరి, కొత్తపల్లిలో మల్లేశ్‌గౌడ్ జేఏసీ నాయకులు ఓట్లేశారు. మంబాపూర్, బొంతపల్లి, దోమడుగు, కానుకుంట, అనంతారం, వీరన్నగూడెం, అన్నారంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లోఉదయం 8 గంటల మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన పోలింగ్‌లో ప్రజలు పెద్ద ఎత్తున బారులు తీరి ఓట్లేశారు.



డంపింగ్ యార్డు వద్దంటూ వంద శాతం ఓట్లేసిన జనం

ప్రజా బ్యాలెట్‌లో పోలైన ఓట్లను మధ్యాహ్నం లెక్కించారు. గ్రామాల వారీగా పోలైన ఓట్లను 25 ఓట్ల చొప్పున కట్టలు కట్టి వేరు చేసి లెక్కించారు. అత్యధికంగా గుమ్మడిదలలో 1594 మంది, నల్లవల్లిలో 1250 మంది, మంబాపూర్‌లో 936 మంది, కొత్తపల్లిలో 737 మంది, బొంతపల్లిలో 667 మంది, దోమడుగులో 518 మంది, కానుకుంటలో 297 మంది, అనంతారంలో 134 మంది, వీరన్నగూడెంలో 316 మంది ఓట్లేశారు. అందులో 18 ఓట్లు మాత్రమే చెల్లుబాటు కాలేదు. మిగతా 6431 మంది ప్రజలు తమ ప్రాంతంలో డంపింగ్ యార్డును రద్దు చేయాలని కోరుతూ ఓట్లేశారు. జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం, అటవీ శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు ఓటు రూపంలో నిరసన వ్యక్తం చేశారు. 45 రోజులుగా సాగుతున్న ప్రజా పోరాటం వినూత్న రీతిలో ప్రజా బ్యాలెట్ ద్వారా నిరసన వ్యక్తం చేయడంతో చర్చనీయాంశంగా మారింది.

అసెంబ్లీలోనే డంపింగ్ యార్డును రద్దు చేస్తూ ప్రకటన చేయాలి: కె.రాజయ్య, జైపాల్‌రెడ్డి

ప్యారానగర్, నల్లవల్లి డంపింగ్ యార్డును రద్దు చేస్తూ అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటన చేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ కె.రాజయ్య, జేఏసీ చైర్మెన్ జైపాల్‌రెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. ప్రజా బ్యాలెట్ కార్యక్రమం ముగింపు అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజల జీవితాల్ని నాశనం చేసే డంపింగ్ యార్డును రద్దు చేసే వరకు పోరాటం 50 గ్రామాల్లో కొనసాగుతుందన్నారు. జవహర్‌నగర్‌లో రాంకీ సంస్థ నిర్వాకం వల్ల అక్కడి గాలి, నీరు, భూమి, పరసరాలన్నీ కలుషితమయ్యాయన్నారు. ప్యారానగర్‌లో చెత్తపోసి ఇక్కడి ప్రాంతాన్ని కూడా దెబ్బతీయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు అతిమేల మాణిక్, జి.సాయిలు, ఎం.నర్సింహులు, నాగేశ్వర్‌రావు, పాండురంగారెడ్డి, రాజయ్య, అశోక్, మల్లేశం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం..

- వడగండ్లు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వాన
- రాలిన మామిడి పూత, కాత
- నేల వాలిన వరి, మొక్కజొన్న
- ఉమ్మడి నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల్లో నష్టం
- ఉక్కపోతతో తల్లడిల్లుతున్న వారికి ఊరట

నవతెలంగాణ-విలేకరులు



ఒకవైపు ఎండలు ముదిరి భూగర్భ జలాలు ఎండిపోతుండటంతో పంటలను కాపాడుకునేందుకు నానాతంటాలు పడుతున్న రైతులను శుక్రవారం కురిసిన అకాల వర్షం దెబ్బతీసింది. అకస్మాత్తుగా వడగండ్లు, ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం రావడంతో చాలా చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. వరి పంట ధాన్యం నేలరాలింది. ఈదురుగాలులకు మొక్కజొన్న, పసుపు పంటను ఆరబెట్టిన రైతులు ఇబ్బందులు పడ్డారు. మామిడి పూత, కాత రాలింది. రాష్ట్రంలోని ఉమ్మడి నిజామాబాద్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఉన్నట్టుండి వర్షం కురవడంతో ఉక్కపోతతో తల్లడిల్లుతున్న వారికి ఊరటనిచ్చింది. కానీ పంటలకు నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని మద్దుల్‌తండా, వాడి, సీతాయిపేట్, హొన్నాజిపేట్ గ్రామాల్లో గాలిదుమారం వడ్లగండ్ల వాన పడటంతో మరో పదిరోజుల్లో కోత కోసే సమయంలో వరి గొలకలు రాలిపోవడం, కొంతమేర పంట నేలవాలింది. మెండోరా మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి మొక్కజొన్న, పసుపు పంట తడిసి ముద్దయింది. రోడ్లపై ఆరబోసిన రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డిపేట్, లింగంపేట్, రామారెడ్డి మండలంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మండలంలోని లింగంపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం పిడుగు పడి రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన సాకలి సాయిలు, గాలెం నారాయణకు చెందిన గేదెలు రోజువారీగా గ్రామ సమీపంలోని చెరువు వద్ద మేపుతుండగా.. మేత మేస్తున్న రెండు గేదెలపై పిడుగు పడటంతో గేదెలు మృత్యువాతపడ్డాయి.

మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని గ్రామాల్లో కురిసిన గాలివాన భీభత్సం సృష్టించింది. గాంధారి పల్లిలో మామిడి తోటలో కాయలు నేలరాలాయి. చింత చెట్లకు చింత పండు తడిసి ముద్దయింది. మరికొన్ని చోట్ల ఈదురుగాలులకు చెట్లు నెలకొరిగాయి. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడి, కొన్ని గ్రామాల్లో అంధకారం నెలకొంది. వరి రైతులకు మాత్రం ఎండిపోయే దశలో ఉన్న పొలాలకు ఈ వర్షం ఎంతగానో మేలు చేసిందని రైతుల్లో ఆనందం కనిపించింది. సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, న్యాల్‌కల్ మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వట్‌పల్లి మండలంలో అకాల వర్షానికి మొక్కజొన్న పంట నేలకొరిగింది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం భారీ నుంచి మోస్తారు వర్షపాతం నమోదైంది. కరీంనగర్‌లోని చొప్పదండి మార్కెట్‌లో మొక్కజొన్న తడిసింది. జగిత్యాల జిల్లాలోని ఎండపల్లి, పెగడపల్లి, వెల్గటూర్, గొల్లపల్లి, ధర్మపురి మండలాల్లోని పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలమట్టమయింది. కోరుట్ల నియోజకవర్గం పరిధిలోని మల్లాపూర్, కోరుట్ల, ఇబ్రహీంటపట్నం, మేట్‌పల్లి మండలాల్లో ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు కురిసాయి. పెద్దపల్లి జిల్లాలోని జూలపల్లి మండలంలో రాళ్ల వర్షం కురిసింది. పిడుగుపాటుతో గేదె మృత్యువాత పడింది. పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలమట్టం అయి రైతుల్లో ఆందోళన నెలకొంది. మంథని, గోదావరిఖని పట్టణాల్లో కురిసిన భారీ వర్షానికి కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడతో పాటు పలు ప్రాంతాల్లో మోస్తారు వర్షపాతం నమోదైంది. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్‌లో భారీగా వడగండ్ల వాన కురిసింది.



సాగునీరందక.. మూగజీవాలకు మేతగా..!

పది రోజుల నుంచి ఎండల తీవ్రత ఎక్కువవడంతో భూగర్భ జలాలు తగ్గి వ్యవసాయ బావుల్లో నీరు అడుగంటి పోతోంది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంకు చెందిన రైతు తోకల విజయపాల్‌రెడ్డి 8 ఎకరాల్లో రూ.5లక్షల పెట్టుబడి పెట్టి వరి సాగు చేస్తే సరిపడా సాగునీరందక పంట ఎండిపోయింది. దాంతో తీవ్ర మనస్థాపానికి గురై గొర్లమందకు మేతగా పంటను వదిలేసిన దృశ్యం నవతెలంగాణ కెమెరాకు చిక్కింది. స్థానికంగా ఏ చోక్కరావు దేవాదుల ఎత్తిపోతల పథకం కింద ధర్మసాగర్ రిజర్వాయర్ ఉన్నా ఆయకట్టు రైతులకు చుక్క నీరు అందక వరి పొలాలు నెర్రెలు బారుతుండటం గమనార్హం.

నవతెలంగాణ-ధర్మసాగర్(ఇస్సంపల్లి రమేష్)

జనాభా లెక్కలపై కేంద్రం తాత్సారం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న 24 శాతం ప్రాతినిధ్యంలో ఎటువంటి తగ్గింపు ఉండదని మీరు హామీ ఇవ్వగలరా?" అని సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ప్రశ్నించారు. రాజ్యసభలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన ఈ ప్రశ్నను లేవనెత్తారు. దీనికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమాధానం ఇవ్వలేదు. రెండు గంటల పాటు జరిగిన సమాధాన ప్రసంగంలో బ్రిట్టాస్ లేవనెత్తిన అనేక ప్రశ్నలకు అమిత్ షా సమాధానం చెప్పలేదు.

మూడు సూత్రాలపై దేశ ఐక్యత : సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్

ప్రజాస్వామ్య, సమాఖ్యవాదం, లౌకికవాదం వంటి మూడు సూత్రాలపై దేశ ఐక్యత ఆధారపడి ఉంటుందని సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ అన్నారు. రాజ్యసభలో హోం మంత్రిత్వ శాఖ పనితీరుపై జరిగిన చర్చలో సీపీఐ(ఎం) తరపున ఆయన మాట్లాడారు. దేశానికి చాలా బెదిరింపులు ఉన్నాయని, కానీ మనం చరిత్రలో జీవిస్తున్నామని పేర్కొన్నారు. నాగ్‌పూర్‌లో ఇటీవల జరిగిన అశాంతిని ప్రస్తావిస్తూ "ఈ దేశానికి అతిపెద్ద శత్రువు 300 ఏండ్ల క్రితం మరణించిన వ్యక్తి ఔరంగజేబ్" అని ఎద్దేవా చేశారు. రాష్ట్రాల హక్కులను హరించడం, ఢిల్లీలో ప్రతిదీ కేంద్రీకరించడం అనే పరిస్థితి ప్రజాస్వామ్యం, సమాఖ్య వాదం, లౌకికవాదానికి హానికరమని బ్రిట్టాస్ ఎత్తి చూపారు. కేరళ నుంచి ఎనిమిది బిల్లులను, తమిళనాడు నుంచి 11 బిల్లులను గవర్నర్లు అడ్డుకున్నారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆదేశాల అమలులో లేకపోవడం వల్ల కేరళకు రావాల్సిన రూ.849 కోట్లు, తమిళనాడుకు రావాల్సిన రూ.2,152 కోట్లు పంపిణీ కాలేదని పేర్కొన్నారు. త్రిభాషా విధానాన్ని అమలు చేయాలని పట్టుబడుతున్న కేంద్ర ప్రభుత్వం, ఉత్తర భారత రాష్ట్రాల్లో దక్షిణ భారత భాషలను బోధించడానికి సిద్ధంగా ఉందా? అని బ్రిట్టాస్ ప్రశ్నించారు. 300 సంవత్సరాల క్రితం మరణించి ఖననం చేయబడిన ఔరంగజేబును పునరుత్థానం చేయడంతో సమస్యలు సృష్టించాలనే చర్య వెనుక ఉన్న రాజకీయాలను కూడా ఆయన మర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి సన్నిహితుడు, ప్రధానమంత్రి ఎలన్ మస్క్ ఏఐ సహాయకుడు 'గ్రోక్' కూడా ఈ చర్య రాజకీయ లబ్ది కోసమే అని చెబుతున్నారని బ్రిట్టాస్ పేర్కొన్నారు. ఈ సమయంలో అమిత్ షా జోక్యం చేసుకుని బ్రిట్టాస్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. కానీ ఆ వ్యూహం ఫలించలేదు. బ్రిట్టాస్ తన ప్రసంగాన్ని కొనసాగించి, ప్రభుత్వంపై పదునైన విమర్శలు చేశారు.

నేరాలను ఎందుకు ఆపలేకపోతున్నారు..ఆప్ ఎంపీ

నేరాలను ఆపడం రాష్ట్రానికి సంబంధించిన అంశం, కానీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రెండూ బీజేపీకి చెందినవని, కానీ నేరాలను ఎందుకు ఆపలేకపోతున్నారని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ప్రశ్నించారు. తాను ఉటంకిస్తున్న డేటా అంతా ఎన్‌సీఆర్‌బీ నుంచి వచ్చింది, దాని ప్రామాణికతపై ప్రశ్నలు లేవనెత్తవద్దని అధికార పార్టీ ఎంపీలకు హితవు పలికారు. "మీ డబుల్ ఇంజిన్ విఫలమైంది. అది పనిచేయడం ఆగిపోయింది" అని సింగ్ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నేరాలు ఎక్కువగా ఉన్నాయని చూపించే డేటాను ఉటంకిస్తూ అన్నారు. దీంతో అధికార పార్టీ ఎంపీలు ఆందోళనకు దిగాయి. కానీ సంజయ్ సింగ్ వెనక్కి తగ్గకుండా మత హింసను కూడా ప్రస్తావించారు. బీజేపీ ఎంపీలు ద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారని ఆరోపించారు. "ప్రపంచం అంతరిక్షానికి చేరుకుంది. దాని సాంకేతిక పురోగతిని మెరుగుపరుస్తోంది. కానీ మీరు సమాధులు తవ్వడంలో బిజీగా ఉన్నారు" అని ఆయన ఎద్దేవా చేశారు.

ఔరంగజేబ్ గురించి మాట్లాడితే దేశ ఐక్యతకు భంగం

ఇది హోం మంత్రిత్వ శాఖ గురించి చర్చ అని, కానీ చాలా మంది అధికార పార్టీ ఎంపీలు ఔరంగజేబ్ గురించి మాట్లాడారని, దీనికి బాధ్యత వహించేది హోం మంత్రిత్వ శాఖ అనిశివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. ఔరంగజేబ్ గురించి ప్రస్తావించడం అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న అంశాలనీ, ఉన్నత పదవుల్లో ఉన్న మంత్రులు కూడా ఉంటే, వారిని నిరోధించకపోతే, దేశం ఐక్యంగా ఉండదని ఆయన అన్నారు. ఇది హోం మంత్రిత్వ శాఖ పని అని ఆయన నొక్కి చెప్పారు. కానీ "ఇది పోలీసు రాజ్యంగా మారితే, హోం మంత్రిత్వ శాఖ అసమ్మతివాదులను బలహీనపరుస్తూ, రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేస్తూ, ప్రత్యర్థులను కొనుగోలు చేయడానికి పోలీసుల సహాయం తీసుకుంటుంటే, నిజమైన పని, అంటే శాంతి భద్రతలు, ఐక్యత వంటివి ఎవరు చేస్తారు?. మణిపూర్ మండుతూనే ఉంది. కానీ ఇప్పుడు మహారాష్ట్ర కూడా మండుతోంది" అని ఆయన అన్నారు.

"నాగ్‌పూర్ చరిత్రలో 300 సంవత్సరాలలో ఎప్పుడూ అల్లర్లు జరగలేదు. కానీ ఇప్పుడు నాగ్‌పూర్ వంటి నగరంలో అది కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీ నియోజకవర్గంలో అల్లర్లు జరుగుతున్నాయి. "మీరు ఔరంగజేబు సమాధిని బద్దలు కొట్టాలనుకుంటే, దానిని బద్దలు కొట్టండి, మిమ్మల్ని ఆపిందెవరు? కేంద్రంలోనూ మహారాష్ట్రలోనూ మీ ప్రభుత్వమే" అని ఆయన అన్నారు.

అవినీతిని కప్పిపుచ్చడానికి భాషా సమస్య : హోంమంత్రి అమిత్ షా

డిసెంబర్ తరువాత వివిధ రాష్ట్రాల ప్రజలతో వారి .మాతృభాషలలో మాత్రమే లేఖలు మార్పిడి చేసుకుంటానని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. కొంతమంది తమ అవినీతిని దాచడానికి భాషా సమస్యను లేవనెత్తుతున్నారని తెలిపారు. మేము భాషల కోసం పని చేశామని, వారు భారతీయ భాషలలో వైద్య, ఇంజనీరింగ్ విద్యను నిర్ధారించారని ఆయన అన్నారు. తమిళనాడులో ఎన్‌డీఏ అధికారంలోకి వస్తే తాము తమిళంలో వైద్య, ఇంజనీరింగ్ విద్యను నిర్ధారిస్తామని ఆయన చెప్పారు. దేశం ముందుకు సాగిందని, పురోగతి గురించి మాట్లాడుతుందని అన్నారు. హిందీ అన్ని భారతీయ భాషలకు స్నేహితుడు, ఇతర భారతీయ భాషలను బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు. అంతర్గత భద్రత పటిష్టతకు కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని, 2026 మార్చి 21 నాటికి దేశంలో పూర్తిగా నక్సలిజాన్ని నిర్మూలిస్తామని ఆయన తెలిపారు. మావోయిస్టుల సమస్య నుంచి దేశానికి విముక్తి లభించనుందని చెప్పారు. జమ్మూకాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణను కేంద్రం రద్దు చేసిన తరువాత ఉగ్రవాదంతో యువకుల ప్రమేయం దాదాపు కనుమరుగైందని చెప్పారు. ఉగ్రవాదం వల్ల మరణాలు 70 శాతానికి పైగా తగ్గాయని చెప్పారు.

దాని కోసం "మీ పిల్లలను పంపండి, మా పిల్లలను కాదు. కానీ మీ పిల్లలు విదేశాలలో చదువుతున్నారు. పనిచేస్తున్నారు. మీరు పేద పిల్లల మనస్సులను ఎందుకు ప్రభావితం చేస్తున్నారు" అని ఆయన నొక్కి చెప్పారు.



కోల్డ్ స్టోరేజీలో
పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ నివేదిక

- రైతుల సమస్యల పట్టని మోడీ సర్కార్
- వారి ఆత్మహత్యల నివారణకు ఎంఎస్పీ ఇవ్వాలి
- కార్పొరేట్లకు లక్షల కోట్ల రుణమాఫీ
- దేశానికి అన్నంపెట్టే రైతన్నలకు రూపాయి రుణమాఫీ లేదు : పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆగ్రహం
- రైతులకు ఉపయోగం లేని డిమాండ్స్ అండ్ గ్రాంట్స్ : సీపీఐ(ఎం) ఎంపీ కె. రాధాకృష్ణన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రైతులపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ నివేదికలను మోడీ ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలో పడేసిందని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. రైతు సమస్యలను మోడీ సర్కార్ పట్టించుకోవటంలేదని, రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తారు. రైతుల ఆత్మహత్యలు ఆపడానికి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. శుక్రవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు మాట్లాడారు. సీపీఐ(ఎం) ఎంపీ కె.రాధాకృష్ణన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించిన డిమాండ్స్ అండ్ గ్రాంట్స్‌ను తాను వ్యతిరేకిస్తున్నానని అన్నారు. రైతులు చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారని, కానీ వారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల కష్టాలు, సమస్యలకు సంబంధించి పరిష్కార మార్గాన్ని చూపించలేని విధంగా డిమాండ్స్ అండ్ గ్రాంట్స్ ఉన్నాయని అన్నారు. అవి కేవలం అంకెల్లోనే ఉన్నాయని, రైతులకు మేలుకు ఉపయోగపడవని అన్నారు. రైతుల ఆత్మహత్యలు, ఎంఎస్‌పీ, రుణమాఫీ వంటి సమస్యలపై ఒక్క అక్షరం కూడా లేదని పేర్కొన్నారు.

పదేండ్లలో 1.7 లక్షలకు పైగా రైతుల ఆత్మహత్యలు

రైతుల ఆత్మహత్యలను ఆపడానికి ఎంఎస్‌పీ ఇవ్వాలని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ నివేదిక స్పష్టం చేసిందని, కానీ గ్రామీణ ఓటర్లు ఈ పాలనకు ఓటు వేయకపోవడంతో ప్రభుత్వం అన్ని నివేదికలను కోల్డ్ స్టోరేజీలలో పెడుతున్నదని సేలంకు చెందిన డీఎంకే ఎంపీ టి.ఎస్. సెల్వగణపతి అన్నారు. చర్చలో ఆయన మాట్లాడుతూ పెద్ద ఎత్తున కార్పొరేట్లకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం, దేశానికి అన్నం పెట్టే రైతులకు ఒక్క రూపాయి కూడా రుణమాఫీ చేయలేదని ధ్వజమెత్తారు. వ్యవసాయ మంత్రిత్వ శాఖ డిమాండ్లను వ్యతిరేకించారు. ఇందులో అన్ని పంటలకు 50 శాతం ఎంఎస్‌పీ, 80 కోట్ల మంది రైతులకు రుణమాఫీ, విత్తనాల ఖర్చును కవర్ చేసే పంట బీమా పథకం చేర్చలేదని అన్నారు. "ట్రెజరీ బెంచ్‌ల నేతృత్వంలోని వ్యవసాయంపై స్టాండింగ్ కమిటీ రైతు ఆత్మహత్యలను అంతం చేయడానికి రుణమాఫీ ఇవ్వాల్సి ఉందని పేర్కొంది. గత పదేండ్లలో1.7లక్షలకుపైగా రైతులు ఆత్మ హత్యలు చేసుకున్నారని, అయినా మోడీ ప్రభుత్వం పట్టించుకోవటం లేదు" అని ఆయన అన్నారు.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో 23 శాతం నిధుల కోతపై ఎన్‌సీపీ (శరద్ పవర్) ఎంపీ అమోల్ రామ్సింగ్ కోల్హే ప్రశ్నించారు. "సోయాబీన్‌కు క్వింటాకు రూ.6,000 ధర ఇస్తానని ప్రధాన మంత్రి హామీ ఇచ్చారు. కానీ రైతులకు రూ.4,800 మాత్రమే ఇచ్చారు. అది కూడా 20 శాతం మంది రైతులకు మాత్రమే ఎంఎస్‌పీ లభించింది. మిగిలిన రైతులు తక్కువ ధరకు పంటను అమ్మాల్సి వచ్చింది" అని ఆయన అన్నారు.

బీజేపీకి రైతుల పట్ల ద్వేషం

బీజేపీకి రైతుల పట్ల ద్వేషం ఉందని, రైతులకు నిధుల కోతలో ఇది ప్రతిబింబిస్తుందని ఎస్‌పీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు వ్యవసాయ చట్టాల రద్దుకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన చేసిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించలేదని అన్నారు. పురుగు మందులు, ట్రాక్టర్లపై జీఎస్టీతో ప్రభుత్వం రైతులను దోపిడీ చేస్తోందని విమర్శించారు. ఆర్జేడీ ఎంపీ సుధ్కర్ సింగ్ మాట్లాడుతూ "బీహార్‌కు మండీలు అవసరం. మండీలు లేకుండా రైతుల ఆదాయం పెరగదు"అని ఆయనన్నారు. బీహార్‌లో జనుము, కొబ్బరికోసం నిర్మించిన బోర్డులు ఎక్కడున్నాయని ప్రశ్నించారు.

రైతుల ఆందోళనపై ప్రభుత్వాల అణచివేతను జలంధర్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ ఖండించారు. రైతులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తుంటే, ప్రభుత్వం అణచివేస్తోందని విమర్శించారు. పంటలకు ఎంఎస్‌పీ ధరలను నిర్ణయించడంపై కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ ఎటువంటి పురోగతి జరగలేదన్నారు. రైతులు రోడ్లను దిగ్బంధించలేదని, ప్రభుత్వం అలాగే చేసిందని పేర్కొ న్నారు. "ఈ దేశంలోని రైతులను నాశనం చేయాలని బీజేపీ నిర్ణయించుకుంది" అని ఆయన విమర్శించారు.



ఖాతాల్లో పడని రూ.219 కోట్ల ట్రైకార్ రుణాలు

- ఏప్రిల్ 5వ తేదీలోపు విడుదల చేయాలి : గిరిజన సంఘాల జేఏసీ డిమాండ్
- ఏప్రిల్ 7న చలో గిరిజన సంక్షేమ భవన్‌కు పిలుపు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ట్రైకార్‌లో 2019-21 సంవత్సరాల్లో మంజూరై చెక్కులు సిద్ధమైనా లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో పడని రూ.219 కోట్ల రుణాలను వెంటనే ఇవ్వాలని గిరిజన సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఏప్రిల్ ఐదు లోపు ప్రభుత్వం విడుదల చేయకపోతే లబ్దిదారులు ఏప్రిల్ 7న తలపెట్టిన చలో గిరిజన సంక్షేమ భవన్‌కు తరలిరావాలని పిలుపునిచ్చింది. తెలంగాణ గిరిజన సమాఖ్య, తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఎం.ధర్మానాయక్, అజ్మీర రామ్మూర్తి నాయక్ అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పేరుతో నూతన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా ప్రారంభించడం పట్ల అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం ట్రైకార్ సంస్థ ద్వారా 2019-2021 సంవత్సరాల్లో 30 వేల మంది గిరిజన యువతి, యువకులను లబ్దిదారులుగా గుర్తించి రుణాలు మంజూరుకు సిద్ధమైందని చెప్పారు. వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడానికి రూ.219 కోట్ల చెక్కులను రెడీ చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్తామని హామీ ఇవ్వడంతో లబ్దిదారులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం లబ్దిదారుల ఖాతాల్లో ఆ డబ్బులు జమ చేయకుండానే హడావిడిగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టడంపై తీవ్ర ఆందోళన కలుగుతోందన్నారు. వీరందరూ రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాల కోసం కొత్తగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి వెళితే ఇప్పటికే రుణాలు తీసుకున్నట్టు చూపిస్తూ.. దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాలు పొందకుండా 30 వేల మంది అనర్హులుగా మారుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు.

ట్రైకార్ సంస్థలో యూనిట్ కాస్ట్ రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉండగా, ఈ పథకంలో నాలుగు లక్షల వరకే రుణ సౌకర్యాలు కల్పించడం అన్యాయమన్నారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రకటించిన పథకమని, దరఖాస్తుల గడువుకు తక్కువ సమయం ఇచ్చిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ట్రైకార్ సంస్థలో పెండింగ్‌లో ఉన్న రూ.219 కోట్ల రుణాలను ఏప్రిల్ 5వ తేదీలోపు విడుదల చేయాలన్నారు. సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాం నాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు వడ్యా దాస్ రాంనాయక్, రాష్ట్ర అధ్యక్షులు ముడావత్ రాంబాల్ నాయక్, సేవాలాల్ సేన అధ్యక్షులు భూక్యా సంజీవ్ నాయక్, ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ అధ్యక్షులు రవీందర్ నాయక్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకుల హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రఘు ఎరుకల, ఆదివాసీ ఎరుకుల హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు ఎరుకల, సేవాలాల్ సేన జాతీయ నాయకులు రాజేష్ నాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి జువారి రమేష్, శంకర్ నాయక్, శివ నాయక్, నారాయణ నాయక్, శ్రీను నాయక్, గిరిజన సంఘం నాయకులు ఆర్.శేఖర్ నాయక్, రామ్ కుమార్ నాయక్, కిషన్ నాయక్ తదితరులు మాట్లాడారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పులు.. యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-మైటింక్లయిన్‌కాలనీ

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసగా మారిన ఓ యువకుడు అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా విలోచవరంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విలోచవరం గ్రామానికి చెందిన కోరవేన సాయి తేజ(27) గోదావరిఖనిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో ఉద్యోగిగా పని చేసేవాడు. బోయిన్‌పేట గ్రామానికి చెందిన దీపికతో ఆరేండ్ల కిందట ప్రేమ వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు సంతానం. అయితే, సాయితేజ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి ఆర్థికంగా నష్టపోయాడు. అప్పుల పాలయ్యాడు. దీంతో ఈ నెల 18న సింగిరెడ్డిపల్లి దగ్గర పురుగుల మందు తాగాడు. గమనించిన మిత్రులు గోదావరిఖని మమత ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడం తో కరీంనగర్ మెడికోవర్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య దీపిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ప్రసాదరావు తెలిపారు.

మేం ఓటేయకపోతే 'మోడీ' అసంఘటిత కార్మికుడే..

హమాలీ, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి : సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

అరెస్టులతో ఉద్యమాలు, ధర్నాలను ఆపలేరు : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ధర్నాచౌక్ వద్ద పోలీసుల అనుమతి నిరాకరణ

ఇందిరాపార్కులో అసంఘటితరంగ కార్మికుల మహాధర్నా

జిల్లాల్లో పలుచోట్ల అరెస్టులు..

నేడు రాష్ట్ర వ్యాప్త నిరసనలకు సీఐటీయూ పిలుపు



నవతెలంగాణ-సిటీబ్యూరో

కార్మికులు ఓటేయకపోతే ప్రధాని మోడీ కూడా చాయ్ అమ్ముకుంటూ అసంఘటితరంగ కార్మికుడిగానే ఉండిపోయే వారని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు అన్నారు. అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత, వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కులో ధర్నా చేపట్టారు. రాష్ట్ర నలుమూలల నుంచి హైదరాబాద్‌కు అసంఘటితరంగ కార్మికులు పెద్దఎత్తున తరలిరాగా, పలుచోట్ల జిల్లాల్లో పోలీసులు అడ్డుకుని అరెస్టులు చేశారు. ధర్నాచౌక్‌లో ధర్నాకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. చివరికి ఇందిరాపార్కులోని పార్కు స్థలంలో రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు అధ్యక్షతన మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కరాములు మాట్లాడుతూ.. రోజు కూలి రూ.178 సరిపోతుందని మోడీ చెబుతున్నారని, ఆ డబ్బులతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. అంబానీ, అదానీల ఆదాయాలు పెరుగుతుంటే.. కార్మికులు మాత్రం రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రభుత్వానికి కార్మికుల శ్రమ నుంచే 65 శాతం ఆదాయం వస్తున్నా.. బడ్జెట్‌లో మాత్రం వారికి తక్కువ కేటాయింపులు చేశారని, వెంటనే బడ్జెట్‌ను పున:సమీక్షించి 65శాతం అంటే దాదాపు రూ.లక్షా 80వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఎర్రజెండా అంటే రేవంత్‌కు భయం..

పోలీసులు, ప్రభుత్వం తమ ధర్నాకు అనుమతి ఇవ్వలేదని, ఎర్రజెండా అంటే రేవంత్‌రెడ్డికి భయం అని అన్నారు. మీదేమైనా మిలటరీ ప్రభుత్వమా..? రాష్ట్రంలో ఎమర్జెన్సీ విధించారా..? ఏం తప్పు చేశారని కార్మికులను అర్ధరాత్రి 2 గంటల సమయంలో అరెస్టులు చేశారని ప్రశ్నించారు. ఈ అరెస్టులను సీఐటీయూ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని, పోలీసుల తీరు, ప్రభుత్వ నిర్బంధం, అక్రమ అరెస్టులను నిరసిస్తూ నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిస్తున్నట్టు ప్రకటించారు. భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డులో ఉన్న నిధులు వృథా అవుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వానికి జవాబుదారీ తనం లేదని విమర్శించారు. మోడీలాగే సీఎం రేవంత్‌రెడ్డి కూడా కార్మికులను కాల్చుకు తింటే సహించేది లేదని హెచ్చరించారు.

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల గురించి అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. కొందరు బ్రోకర్లు, అధికారులు నకిలీ కార్డులను సృష్టించి భవన నిర్మాణ సంక్షేమ బోర్డులోని నిధులను మెక్కేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను కూడా ఇవ్వకపోవడంతో కార్మికులకు ఏ దిక్కూ లేకుండా పోయిందన్నారు. ఎన్నికలకు ముందు ధర్నాచౌక్‌లో ధర్నాలు చేసుకునేందుకు అనుమతులిస్తామని చెప్పి ఇప్పుడు అడ్డుకోవడం చూస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాల ముఖ్యమంత్రిగా మారారన్నారు. దాదాపు 1100 మంది కార్మికులను అరెస్టు చేశారనీ, కేసీఆర్‌కు, రేవంత్‌రెడ్డికి పెద్ద తేడా ఏమీ లేదని అన్నారు. కార్మికుల జోలికొస్తే కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌రెడ్డికి పడుతుందని హెచ్చరించారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యే వరకు కార్మికుల సమస్యల పై ధర్నా చౌక్‌లో ధర్నాలు కొనసాగిస్తామని చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు మాట్లాడుతూ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనీ, ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ కార్పొరేషన్లలో పని చేసే కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో షరతుల్లేకుండా కార్మికుల కార్డులను రెన్యువల్ చేయాలని తెలిపారు.

నాలుగు లేబర్ కోడ్లను ఎదుర్కొనేందుకు కార్మికులు ముందుకు రావాలి

బీసీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కోటం రాజు మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్లను ఎదుర్కోవడానికి కార్మికులు ముందుకు రావాలన్నారు. 18 రాష్ట్రాల్లో కార్మికుల పిల్లలు చదువుకోవడానికి స్కాలర్‌షిప్స్ ఇస్తుంటే.. తెలంగాణలో అమలు కావడం లేదని, వెంటనే ఇవ్వాలని అన్నారు. బీడీ అండ్ సిగార్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ.రమ మాట్లాడుతూ.. బడ్జెట్‌ను పున:పరిశీలించి కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు నిధులు కేటాయించాలన్నారు. బీడీ కార్మికులకు ఎన్నికల సమయంలో రూ.4,016 జీవన భృతి ఇస్తామని విస్మరించారని తెలిపారు. కనీస వేతన జీవోను అమలు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు జీతాలు తగ్గించుకుని లేదా రద్దు చేసుకుని కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. రవాణా రంగంలో ఉన్న 25 లక్షల మంది కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు డ్రైవర్లకు శిక్షణ ఇవ్వాలనీ, గ్రామీణ స్థాయి నుంచి పట్నం వరకు రోడ్లను బాగు చేయాలని అన్నారు. ఈ ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు పద్మశ్రీ, భూపాల్, మల్లికార్జున్, జయలక్ష్మి, నాయకులు కుమారస్వామి, అజయ్‌బాబు, పాల్గొన్నారు.

ప్రతీకార సుంకాలతో ఫార్మా పరిశ్రమకు దెబ్బే

(మొదటిపేజీ తరువాయి)

జైన్ తెలిపారు. దేశంలోని 23 ప్రముఖ ఫార్మా కంపెనీలు ఐపీఏలో సభ్యులుగా ఉన్నాయి. ప్రపంచంలో జనరిక్ మందులు సరఫరా చేసే దేశాలలో భారత్‌దే అగ్రస్థానం. ప్రపంచ సరఫరాలలో మన వాటా 20 శాతంగా ఉంది. ప్రభుత్వ సమాచారం ప్రకారం 2023-24లో దేశం నుండి 27.85 బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఫార్మా ఎగుమతులు జరిగాయి. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రపంచంలోని సుమారు 200 దేశాలకు మందులు ఎగుమతి అవుతున్నాయి. కొన్ని భారతీయ ఫార్మా కంపెనీలు తమ ఔషధ ఉత్పత్తులలో యాభై శాతం వరకూ అమెరికాకే ఎగుమతి చేస్తున్నాయి. అంటే ఆ కంపెనీలకు అమెరికా ముఖ్యమైన మార్కెట్‌గా నిలుస్తోందన్న మాట. బెల్జియం, దక్షిణాఫ్రికా, బ్రిటన్, బ్రెజిల్ దేశాలు కూడా భారత్ నుండి గణనీయ పరిమాణంలోనే మందులను దిగుమతి చేసుకుంటున్నాయి. మన దేశం నుండి అమెరికాకు సరఫరా అవుతున్న మందులలో 70-80 శాతం తక్కువ విలువ కలిగిన జనరిక్ మందులే. హైదరాబాద్‌కు చెందిన గ్రాన్యూల్స్ ఇండియా కంపెనీ తక్కువ ధరకు లభించే పారాసిటమాల్, ఇబుప్రోఫెన్, మెట్‌ఫార్మిన్ వంటి మందులను సరఫరా చేస్తుంది. దీని వార్షిక సరఫరాలలో 65 శాతానికి పైగా అమెరికాకే జరుగుతుంటాయి. గ్లాండ్ ఫార్మా (54 శాతం), అరబిందో (48 శాతం), జైడస్ (47 శాతం), డాక్టర్ రెడ్డీస్ (47 శాతం), సన్ ఫార్మా (32 శాతం) కూడా అధిక పరిమాణంలోనే అమెరికాకు మందులు ఎగుమతి చేస్తున్నాయి.

అగ్రరాజ్యానికీ నష్టమే

ట్రంప్ ప్రతీకార చర్యలకు దిగితే మన దేశమే కాదు...అమెరికా కూడా నష్టపోతుంది. ఎందుకంటే మన ఔషధ కంపెనీలు తక్కువ ధరకు, నాణ్యమైన మందులను అమెరికాకు ఎగుమతి చేస్తున్నాయి. అమెరికా రోగులు వాడుతున్న జనరిక్ మందులలో మన కంపెనీల వాటా 47 శాతం. అంటే మన జనరిక్ మందుల వినియోగంతో అమెరికాలో వైద్య ఖర్చులు బాగా తగ్గిపోతున్నాయి. 2022లో భారతీయ కంపెనీలు సరఫరా చేసిన మందుల కారణంగా అమెరికా ఆరోగ్య వ్యవస్థకు 219 బిలియన్ డాలర్లు ఆదా అయ్యాయి. 2013-22 మధ్యకాలంలో అమెరికాకు ఒనగూడిన ఆర్థిక ప్రయోజనం 1.3 ట్రిలియన్ డాలర్లు. ముఖ్యంగా హైపర్‌టెన్షన్, డయాబెటిస్, మానసిక సమస్యలు, కాలేయం, నరాలు, అల్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న అమెరికన్లకు భారతీయ కంపెనీల మందులే దిక్కవుతున్నాయి.

విద్యుత్ ఛార్జీలు పెంచే ప్రతిపాదన లేదు

ఎస్పీడీసీఎల్ ఆదాయం, రిటైల్ సరఫరాపై విచారణలో ఫరూఖి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్పీడీసీఎల్ ఆదాయం, రిటైల్ సరఫరా ప్రతిపాదనలపై ఈఆర్సీ ఛైర్మెన్ డాక్టర్ జస్టిస్ డి.నాగార్జున అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్ విద్యుత్ నియంత్రణ భవన్‌లో బహిరంగ విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖి, సి.శ్రీనివాస రావు, పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టారిఫ్ ప్రతిపాదనలను కమిషన్ ముందు ఫరూఖి పెట్టారు. ఈ ఏడాది విద్యుత్ చార్జీల పెంపును ప్రతిపాదించడం లేదని స్పష్టం చేశారు. ఈ ఏడాది రెవిన్యూ గ్యాప్ రూ.9,758 కోట్లు ఉన్నట్టు తెలిపారు. ఈ రెవిన్యూ గ్యాప్ ను ప్రభుత్వమే సబ్సిడీ ద్వారా భర్తీ చేయాలని ప్రతిపాదించినట్టు చెప్పారు. రాష్ట్రంలో అత్యధిక డిమాండ్ 17,162 మెగావాట్ల కు చేరుకున్నట్టు తెలిపారు.

దేశంలోని ఇతర విద్యుత్ సంస్థలతో పవర్ స్వాప్ అగ్రిమెంట్ లు ప్రభుత్వం చేసుకుందన్నారు. పవర్ స్వాప్ అగ్రిమెంట్లతో ఎస్పీడీసీఎల్‌కు రూ.1,614 కోట్ల రూపాయలు ఆదా అవుతుందన్నారు. రూ. 578.88 కోట్లతో నెట్వర్క్ బలోపేతం చేస్తున్నట్టు తెలిపారు. పంపిణీ నష్టాలు11. 8.38 శాతానికి తగ్గాయన్నారు. పవర్ పర్చేస్ కాస్ట్ కూడా రూ 5.76 పైసలకు తగ్గించినట్టు చెప్పారు. పీటీఆర్ ఫెయిల్యూర్స్ రేట్‌ను 1.55 శాతానికీ, డీటీఆర్ ఫెయిల్యూర్స్ రేట్‌ను 5.70 శాతానికి తగ్గించినట్టు వివరించారు. ఈ విచారణలో వేణుగోపాల్ రావు, రైల్వే, హెచ్ఎంఆర్ఎల్, పలువురు విద్యుత్ రంగ నిపుణులు పాల్గొన్నారు.

గాజాపై అమానవీయం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గాజాపై ఇజ్రాయిల్ దాడులు అమానవీయమని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ అన్నారు. గాజాపై ఇజ్రాయిల్ జరిపిన క్రూరమైన దాడులకు వ్యతిరేకంగా పాలస్తీనా సాలిడారిటీ ఆర్గనైజేషన్ శుక్రవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన జరిగింది. పాలస్తీనా ప్రజల పోరాటానికి మద్దతు ఇవ్వాలని పాలస్తీనా సాలిడారిటీ ఆర్గనైజేషన్ పిలుపునిచ్చింది. ఈ ప్రదర్శనలో పాల్గొన్న వారు పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ చేసిన దురాగతాలకు వ్యతిరేకంగా తమ స్వరాన్ని వినిపించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ మాట్లాడుతూ కొనసాగుతున్న దురాక్రమణపై మోడీ ప్రభుత్వం మౌనం వహించడాన్నిప్రశ్నించారు. ఇజ్రాయిల్ కాల్పుల విరమణ ఉల్లంఘనను, గాజాలో అమాయక పౌరులపై నిరంతర హత్యాకాండను ఖండించారు. అమెరికా మద్దతు ఉన్న సామ్రాజ్యవాద దోపిడీని విమర్శించారు. అమాయక పిల్లలు, పౌరులను చంపడం మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరమని స్పష్టం చేశారు. సీపీఐ ఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ ఇజ్రాయిల్ దురాక్రమణను ఖండిస్తూ ప్రపంచ సమాజం పాలస్తీనాకు సంఘీభావంగా నిలబడాలని పిలుపు ఇచ్చారు. భారతదేశ ప్రజలు ఎల్లప్పుడూ అణచివేతను, అన్యాయాన్ని వ్యతిరేకిస్తున్నారని అన్నారు. నేటికీ పాలస్తీనాకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ మాట్లాడుతూ కాల్పుల విరమణను ఉల్లఘించి, అమెరికా అండతో ఇజ్రాయిల్ మరోసారి మారణహోమానికి పాల్పడిందని విమర్శించారు. రంజాన్ పవిత్ర మాసాన్ని జరుపుకుంటున్న ముస్లిం ప్రజలపై బాంబుల వర్షం కురిపించిందని పేర్కొన్నారు. ఈ దాడిలో 450 మందికి పైగా చనిపోయారని, వందలాది మంది శతగాత్రులు అయ్యారని అన్నారు. ఐక్య రాజ్య సమితి, అంతర్జాతీయ న్యాయస్థానాల తీర్పును గౌరవించాలని అన్నారు. వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇజ్రాయిల్ దాడులను తీవ్రంగా ఖండించారు. పాలస్తీనా పోరాటానికి తమ సంఘీభావం తెలిపారు. ఇండియా ప్రభుత్వం ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా ధృఢమైన వైఖరిని తీసుకోవాలని, పాలస్తీనా ప్రజలకు తమ మద్దతును స్పష్టంగా పునరుద్ఘాటించాలని వక్తలు డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరాలను నిలిపివేయాలని, భారతీయ కార్మికులను ఇజ్రాయిల్‌కు పంపడం ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇండియా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శాంతిని ప్రేమించే ప్రజలందరూ ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా తమ స్వరాలను వినిపించాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సీపీఐ నాయకుడు అజీజ్ పాషా, ప్రముఖ విద్యావేత్త అచిన్ వినాయక్, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఆర్. అరుణ్ కుమార్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, ఐద్వా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీమతి టీచర్, మరియం ధావలే, ఏఐకేఎస్ నేత హన్నన్ మొల్లా, సీఐటీయూ నేత ఎం. సాయి బాబు, జేఎన్‌యూఎస్‌యూ అధ్యక్షురాలు ఐషీ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.

అంకెల గారడీతో మోసం

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా జాన్‌వెస్లీ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ మాట్లాడారు. కార్పొరేట్ ప్రయోజనాలు కాపాడే లక్ష్యంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రతిపాదనలున్నాయని చెప్పారు. సామాన్య ప్రజలు అంటే ఈ ప్రభుత్వాలకి లెక్కలేదని విమర్శించారు. ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసే విధంగా వాటిని సవరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన వాటా, విభజన హామీల అమలు, అందుకు తగిన విధంగా కేటాయింపులు లేవని చెప్పారు. బుధవారం శాసన సభలో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌ను రూ.3,04,865 ప్రతిపాదించారనీ, గతేడాది రూ. 2,91,059 కోట్లు ప్రతిపాదించి, రూ.2,65, 934 కోట్లకు తగ్గించారని గుర్తు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్‌లో ప్రజల అవసరాలు నెరవేరే అవకాశం లేదన్నారు. మహాలక్ష్మి పథకానికి అర్హులైన వారు రాష్ట్రంలో సుమారు 1.10కోట్ల మంది ఉంటే..50శాతం కుటుంబాల మహిళలకు రూ. 20వేల చొప్పున ఇచ్చినా..ఏడాదికి రూ. 10,008 కోట్లు కావాల్సిన అవసరముందన్నారు. కానీ..ఈ బడ్జెట్‌లో కేవలం రూ.4,206 కోట్లు మాత్రమే కేటాయించటం విడ్డూరంగా ఉందన్నారు. ఇండ్లు లేని వారు సుమారు 30లక్షల మంది ఉన్నారనీ, వీరందరికీ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని కేటాయించిన నిధులతో ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని సంపూర్ణంగా అమలు చేస్తామంటూ వ్యవసాయ కూలీలను నమ్మబలికి బడ్జెట్ ప్రతిపాదనల్లో మాత్రం మొండి చేయి చూపారని విమర్శించారు. గృహజ్యోతి, చేయూత, రైతు భరోసా తదితర పథకాలు, వాగ్దానాల అమలుకు అరకొర నిధులు కేటాయించి, ఇది ప్రజారంజక బడ్జెట్ అని ఊదరగొడుతున్నారని విమర్శించారు. ఇది పూర్తిగా సంపన్నుల లాభాలను పెంచి పేదలకు బికారులుగా చేసే బడ్జెట్ అని చెప్పారు. అంతకు ముందు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కూడా కార్పొరేట్ల లాభాలకు పూర్తి భరోసానిచ్చిందనీ, కార్మికుల, రైతుల, వ్యవసాయ కూలీలను, వారికి కావాల్సిన విద్యా, వైద్యాన్ని అందని ద్రాక్షగా చేసిందని చెప్పారు. సామాన్య ప్రజలకు నేరుగా లబ్ధి కల్పించేందుకు ఎలాంటి చర్యలు లేవని చెప్పారు. వేతన జీవులను పెద్దఎత్తున సంతృప్తి పరుస్తామంటూ గొప్పలు చెప్పి అందుకు తగిన విధంగా ఇచ్చిందేమీ లేదన్నారు. కానీ దేశ ప్రజల బడ్జెట్ అంటూ ప్రధాని మోడీ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది ఎంపీలున్నా రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టలేక పోయారని విమర్శించారు. రాష్ట్ర విభజన హామీలను గాలికొదిలేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐఐఎం, హైస్పీడ్ రైల్వే ట్రాక్‌లకు నిధుల ఊసే లేదని విమర్శించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కొన్ని రాష్ట్రాలకు మాత్రమే నిధులు కేటాయించారని తెలిపారు. ఎరువుల సబ్సిడీ నిధుల్లో కోత విధించారన్నారు. రూ.50,65,345 కోట్లతో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రూ.12,76,338 కోట్లు, అంటే 25.2 శాతం వడ్డీల చెల్లింపునకే కేటాయించారని వివరించారు. వ్యవసాయ రంగానికి గతం కన్నా రూ.10 వేల కోట్లు తగ్గించారని తెలిపారు. ఎరువుల సబ్సిడీకి రూ.11 వేల కోట్లు కోత విధించారని పేర్కొన్నారు. ప్రధాని మోడీ దేశంలో రూ.25 కోట్ల మందిని దారిద్ర్య రేఖకు ఎగువకు తెచ్చామని చెప్తూనే 2029 వరకు 80 కోట్ల మందికి ఐదు కిలోల చొప్పున రేషన్ షాపుల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ చేస్తామన్నారని గుర్తు చేశారు. ఉపాధి హామీ చట్టానికి 2023-24లో రూ.89,154 కోట్లు ఖర్చు చేయగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. దళిత, గిరిజనులకు బడ్జెట్, సబ్‌ప్లాన్ కింద చేసిన కేటాయింపులు ఆ వర్గాల అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడడం లేదని పేర్కొన్నారు. ఈ వర్గాలకు కేటాయించిన నిధులను నోడల్ ఆఫీసర్ ద్వారా ఆవాసాలు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలు కల్పిస్తే వారిలో కొంతమేరకైనా అభివృద్ధి జరుగుతుందని వివరించారు. దళితులకు 16 శాతం కేటాయించాల్సి ఉండగా, ఐదు శాతం నిధులు మాత్రమే కేటాయించారని విమర్శించారు. గిరిజనులకు ఏడు శాతం నిధుల కేటాయింపునకు బదులు రెండు శాతం కేటాయించారని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు చాలా స్వల్పంగా మూడు శాతంలోపే కేటాయింపులున్నాయని పేర్కొన్నారు. పారిశ్రామిక రంగం ఉత్పత్తికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

కార్మిక వర్గం పట్ల నిర్లక్ష్యం
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సత్యం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మికవర్గం పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం చెప్పారు. పెట్టుబడిదారుల, కార్పొరేట్ శక్తుల లాభాలే వారికి ముఖ్యమని తెలిపారు. బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్ర కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించటం ప్రమాదకరమన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల్లో లబ్ధిపొందే లక్ష్యంతో కేటాయింపులుంటున్నాయని వివరించారు. రైతాంగానికి మద్దతు ధర విషయంలో ఆందోళనలు జరుగుతున్నా.. ఆ ప్రభుత్వానికి ఏ మాత్రం చెవికెక్కటం లేదని విమర్శించారు. మరో పక్క ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నదని చెప్పారు. ఎరువుల సబ్సిడీ, మార్కెట్ సౌకర్యం కల్పించాలన్న సోయి ప్రభుత్వాలకు లేదని విమర్శించారు. రాష్ట్రంలో కూడా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ లేదని చెప్పారు.

అంకెల గారడీ :ఎస్ వెంకటేశ్వరరావు సీపీఐ(ఎంఎల్ ఎన్‌డీ)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్లు అంకెల గారడీతో కూడుకుని ఉన్నాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వెంకటేశ్వరరావు చెప్పారు. జనాభా దామాషా, వాగ్దానాల అమలుకు అనుగుణంగా నిధులు కేటాయించకుండా మాయ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలకు రకరకాల సౌకర్యాలు కల్పించేందుకు ఉన్న శ్రద్ధ కార్మిక, కర్షకులకు కనీస వేతనాలు పెంచేందుకు ఎందుకు లేదని ప్రశ్నించారు. ఉన్న వాళ్లకు ఉపయోగపడే విధంగా వాటి రూపకల్పన ఉందని చెప్పారు. ఈ విధానం వల్ల రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూనే.. కార్పొరేట్ శక్తుల లాభాలే లక్ష్యంగా పాలకుల విధానాలున్నాయని విమర్శించారు.

అట్టడుగు వర్గాల ప్రయోజనాలు శూన్యం :ఎం హన్మేశ్


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన 2025-26 బడ్జెట్‌లలో అట్టడుగు వర్గాల ప్రయోజనాలను విస్మరించారని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం హన్మేశ్ విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికుల జీవన విధానాన్ని మెరుగు పర్చే విధంగా కేటాయింపులు లేవని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్ బీఆర్ఎస్‌కు భిన్నంగా లేదని చెప్పారు. ప్రజలను భ్రమలకు గురిచేసే వీటికి వ్యతిరేకంగా పోరాటమే మార్గమని చెప్పారు.

అధికారం కోసం అబద్ధాలు చెప్పి..

అధికారంకోసం అబద్ధాలు చెప్పి..ఇప్పుడు బడ్జెట్ కేటాయింపుల్లో ప్రజలను మోసం చేయడమేంటని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి జి రవి, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి మురారి, ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానికి రాములు, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు ప్రసాద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆయా తరగతులను భ్రమల్లో ముంచి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఓడ మల్లన్నలా వ్యవహరించటం తగదని చెప్పారు. రాబోయే కాలంలో ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటాలు నిర్వహించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డీజీ నర్సింహారావు, జె బాబురావు, ప్రొఫెసర్ అరబండి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బి ప్రసాద్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ అరుణజ్యోతి, వృత్తి సంఘాల సమన్వయ కమిటి నాయకులు పి ఆశయ్య, హైద్రాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం వెంకటేశ్, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర నాయకులు గంగాదర్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులు అమర్చిన.. ప్రెషర్ బాంబు పేలి యువకుడికి గాయాలు



నవతెలంగాణ-వెంకటాపురం

పోలీసుల కూంబింగులే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబ్‌పై ప్రమాదవశాత్తు కాలు వేయడంతో అది పేలి యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని వీరభద్రవరం అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పగూడెం గ్రామానికి చెందిన కృష్ణమూర్తితో పాటు మరో నలుగురు యువకులు వీరభద్రం సమీపంలోని అటవీ ప్రాంతంలోకి కట్టెలు కొట్టేందుకు వెళ్లారు. ఆ సమయంలో మావోయిస్టులు అమర్చిన మందు గుండుపై కృష్ణమూర్తి కాలు పెట్టడంతో భారీ శబ్దంతో పేలింది. పేలుడు ధాటికి కృష్ణమూర్తి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి స్నేహితులు 108 వాహనం ద్వారా వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పొలంలోనే గుండెపోటుతో రైతు మృతి



నవతెలంగాణ-పెనపహాడ్

వరి పొలంలోనే గుండెపోటుతో రైతు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపాడు గ్రామంలో జరిగింది. రైతులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దోసపాడు గ్రామానికి చెందిన రైతు కొండేటి వెంకట్‌రెడి(58) తన వ్యవసాయ పొలంలో పురుగుల మందు కొట్టడానికి ఉదయం 10 గంటల సమయంలో వెళ్లాడు. వరి చేనుకు మందు కొడుతుండగా అకస్మాతుగా గుండెపోటు రావడంతో కుప్పకూలి మృతిచెందాడు. గమనించిన పక్కపొలం రైతులు వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బిజినెస్

భెల్‌కు రూ.7,500 కోట్ల ఆర్డర్



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని విద్యుత్ తయారీ ఉత్పత్తుల కంపెనీ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్)కు భారీ ఆర్డర్ దక్కింది. గుజరాత్‌లోని ఉకై సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి గాను రూ.7,500 కోట్ల విలువైన ఆర్డర్‌ను పొందినట్టు ఆ కంపెనీ తెలిపింది. ఈ యూనిట్‌ను 54 నెలల్లో అందుబాటులోకి తేనున్నట్టు వెల్లడించింది.

మార్కెట్లకు ఐదో రోజూ లాభాలు

ముంబయి : కొనుగోళ్ల మద్దతుతో వరుసగా ఐదో రోజూ భారత మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. శుక్రవారం బీఎస్ఈ సెన్సెక్స్ ఉదయం నష్టాల్లో ప్రారంభమైనప్పటికీ.. తుదకు 557 పాయింట్లు పెరిగి 76,906కు చేరింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 159 పాయింట్ల లాభంతో 23,350.40 వద్ద ముగిసింది. ఈ వారంలో సెన్సెక్స్ 3,077 పాయింట్లు లేదా 4.17 శాతం లాభపడింది. వారాంతం సెషన్‌లో సెన్సెక్స్-30లో బజాజ్ ఫిన్‌సర్వ్, టైటన్, ఇన్ఫోసిస్, టాటా స్టీల్, ఎంఅండ్ఎం షేర్లు మాత్రమే నష్టపోయాయి. చాలా కాలం తర్వాత స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ సూచీలకు మద్దతు లభించింది.

పని చేయని మొబైల్ నెంబర్లకు యూపీఐ సేవలు బంద్

న్యూఢిల్లీ : పని చేయని (ఇన్‌యాక్టివ్) లేదా వేరే వారికి కేటాయించిన మొబైల్ నంబర్లకు ఏప్రిల్ 1 నుంచి యూపీఐ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ విషయమై బ్యాంకులు, పేమెంట్ సేవలందించే ప్రొవైడర్లకు తాజాగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఆదేశాలు జారీ చేసింది. అనధికారిక వాడకాన్ని, మోసాలను అరికట్టేందుకు ఆ నంబర్లను డీయాక్టివేట్ చేయాలని స్పష్టం చేసింది. ఎన్‌పీసీఐ ఆదేశాల మేరకు గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యాప్స్‌తో పాటు బ్యాంకులు ఇన్‌యాక్టివ్ నంబర్లను తొలగించనున్నాయి.

హిందాల్కో రూ.45,000 కోట్ల పెట్టుబడులు

HINDALCO
ENGINEERING BETTER FUTURES

ముంబయి : ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన ప్రధానమైన లోహ వ్యాపార సంస్థ అయిన హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ తదుపరి తరం ఇంజనీరింగ్ ఉత్పత్తుల తయారీ కోసం రూ.45,000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. అల్యూమినియం, రాగి, స్పెషాలిటీ అల్యూమినా వ్యాపారాలపై వ్యయాలు చేయనున్నట్టు పేర్కొంది. సంస్థ తదుపరి మార్పు కోసం కొత్త బ్రాండ్‌ను ఆవిష్కరించినట్టు ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మెన్ కుమార్ మంగళం బిర్లా తెలిపారు. తమ సంస్థ ప్రస్తుతం 10 దేశాల్లో 52 ప్లాంట్లను కలిగి ఉందన్నారు. హిందాల్కో కొత్త లోగో మార్పుకు ఉత్ప్రేరకంగా, సమస్య పరిష్కారిగా, పరిశ్రమలలో పురోగతికి శక్తినిచ్చే కొత్త పరిష్కారాల సృష్టికర్తగా ప్రతిబింబించనుందని హిందాల్కో ఇండస్ట్రీస్ ఎండీ సతీష్ పాయ్ తెలిపారు.

జీఈఐకి గ్రేట్ ప్లేస్ టు వర్క్ గుర్తింపు

హైదరాబాద్ : తమ సంస్థకు గ్రేట్ ప్లేస్ టు వర్క్ సర్టిఫికేషన్ గుర్తింపు లభించిందని జీయూఎస్ ఎడ్యుకేషన్ ఇండియా (జీఈఐ) తెలిపింది. ఇది అధిక విశ్వాసం, అధిక పనితీరు సంస్కృతిని పెంపొందించడంలో తమ నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుందని ఆ సంస్థ ఎండీ శశి జలిగమ తెలిపారు. విశ్వసనీయత, గౌరవం, న్యాయబద్ధత, స్నేహపూర్వకత ఆధారంగా తమకు ఈ గుర్తింపు లభించిందన్నారు.

దక్షిణాది నుంచే సగం అమ్మకాలు

జేఎస్‌డబ్ల్యూ ఎంజి మోటార్ వెల్లడి

న్యూఢిల్లీ : తమ మొత్తం అమ్మకాల్లో దక్షిణాది రాష్ట్రాలే సగం వాటాను కలిగి ఉన్నాయని జేఎస్‌డబ్ల్యూ ఎంజి మోటార్ తెలిపింది. గతేడాది 2024లో దేశంలో 22,646 విద్యుత్ కార్లను విక్రయించగా.. అందులో 10,698 యూనిట్లు లేదా 47.2 శాతం దక్షిణాదిలోనే అమ్ముడుపోయాయని పేర్కొంది. తమ ఇవి కొనుగోళ్లలో కర్నాటక టాప్‌లో ఉండగా.. తెలంగాణ, కేరళ రాష్ట్రాలు తదుపరి స్థానాల్లో ఉన్నాయని వెల్లడించింది.

సీపీఐ(ఎం) జాతీయ మహాసభలకు ముస్తాబు

అరుణోదయంలా మదురై




మదురై : ఏప్రిల్ 2 నుంచి 6వరకు జరగబోయే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ మహాసభలకు ప్రాచీన నగరం మదురై వేదిక కాబోతోంది. ఇప్పటికే నగరమంతా అరుణ పతాకాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. దేశవ్యాప్తంగా రానున్న 819 మంది ప్రతినిధులకు, పరిశీలకులకు స్వాగతమివ్వడానికి సిద్ధమైంది. ఏప్రిల్ 2వ తేదీ ఉదయం తముక్కమ్ ఓపెన్ గ్రౌండ్స్‌లో మహాసభలు అట్టహాసంగా ప్రారంభం కానున్నాయి. వేలాదిమంది రెడ్ వలంటీర్లు కవాతు నిర్వహిస్తారు. మహాసభల ప్రారంభానికి ముందుగా విప్లవ భావాలను రగిల్చేలా పాటలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి.

తమిళనాడు వ్యాప్తంగా పర్యటించిన అమరవీరుల జాతాలు మహాసభల ప్రారంభానికి ముందు ఏప్రిల్ 1వ తేదీ సాయంత్రానికి సభా స్థలి వద్దకు చేరుకోగానే వేలాదిగాప్రజలు వాటికి స్వాగతం పలుకుతారు. ఆ తర్వాత పార్టీ పతాకావిష్కరణ జరుగుతుంది. ఏప్రిల్ 2వ తేదీ ఉదయం ఫాసిజం వ్యతిరేక దృశ్యమాలిక, భారతదేశ వైవిధ్యత, భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలను తెలిపే ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుంది. అదే రోజు సాయంత్రం ప్రముఖ నటులు, దర్శకులు సముద్రఖని, శశికుమార్‌ల నేతృత్వంలో ఆహుతులను ఆకర్షించేలా విప్లవ భావజాలాన్ని మిళితం చేసిన కళా రూపాలు ప్రదర్శితమవుతాయి. ఇక మహాసభల రెండో రోజైన 3వ తేదీన ప్రతినిధుల సమావేశాలు ఆరంభమవుతాయి. సైద్ధాంతిక వైఖరులు, రాజకీయ వ్యూహాలపై చర్చలు జరుగుతాయి. తముక్కమ్ ఓపెన్ గ్రౌండ్స్‌లో రాష్ట్రాల హక్కులపై ప్రత్యేక సెమినార్ జరుగుతుంది. ప్రతిపక్షాల ఐక్యతను ప్రదర్శించేలా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కర్నాటక మంత్రి బైరె గౌడలు ఈ సెమినార్‌కు హాజరు కానున్నారు. కొడియెరి బాలకృష్ణన్ పేరిట ఏర్పాటు చేసిన ప్రతినిధుల ప్రాంగణంలో సమకాలీన రాజకీయ సవాళ్ళపై కీలకమైన చర్చలు కొనసాగుతాయి. ఏప్రిల్ 4వ తేదీన పార్టీ సైద్ధాంతిక, నిర్మాణపరమైన అంశాలపై లోతైన చర్చలు కొనసాగుతాయి. ఆ సాయంత్రం ప్రముఖ దర్శకులు వెట్రిమారన్, ప్రముఖ నటులు విజయ్ సేతుపతిల సాంస్కృతిక ప్రదర్శనలు వుంటాయి. ఏప్రిల్ 5వ తేదీన తీర్మానాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై దృష్టి కేంద్రీకరిస్తారు. ఫాసిస్ట్ శక్తులను ఎదుర్కొనేందుకు, ప్రజల హక్కులను పరిరక్షించేందుకు ఉద్దేశించిన కార్యాచరణను పార్టీ రూపొందిస్తుంది. ఆ సాయంత్రం కె.పి.జానకి అమ్మాళ్ సాంస్కృతిక వేదికపై ప్రగతిశీల భావాలు కలిగిన ప్రకాష్ రాజ్, మారి సెల్వరాజ్, జ్ఞానవేల్, రోహిణిల బృందం ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయి. ఇక చివరి రోజైన ఏప్రిల్ 6వ తేదీన తీర్మానాలు ఆమోదించడం, కామ్రేడ్ సీతారాం ఏచూరి పేరిట ఏర్పాటు చేసిన వేదికపై మహాసభల ముగింపు వుంటుంది. ఆ తర్వాత అందరూ ఎంతగానో ఎదురుచూసే రెడ్ వలంటీర్ల బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహించబడుతుంది. 25వేల మంది రెడ్ వలంటీర్లు మదురై నగర వీధుల్లో చేసే కనువిందైన ప్రదర్శనతో నగరమంతా ఎర్ర సముద్రంగా మారిపోతుంది.

అనంతరం కామ్రేడ్ ఎన్.శంకరయ్య పేరిట వందియార్ రింగ్ రోడ్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా స్థలి వద్దకు చేరుకోవడంతో ప్రదర్శన ముగుస్తుంది. బహిరంగ సభలో దాదాపు 2లక్షల మంది పాల్గొంటారని భావిస్తున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం అధ్యక్షతన జరిగే బహిరంగ సభలో ఆహ్వానసంఘం కార్యదర్శి, ఎంపీ.వెంకటేశన్ స్వాగతోపన్యాసం చేస్తారు. అనంతరం మహాసభల సందేశాన్ని ప్రజలకు తెలియచేస్తూ, వారిలో విప్లవ స్ఫూర్తిని రగిల్చేలా పార్టీ నేతలు ప్రకాష్ కరత్, పినరయి విజయన్, బృందా కరత్, జి.రామకృష్ణన్, ఆహ్వాన సంఘం చైర్మన్ కె.బాలకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు వాసుకి, సంపత్‌లు ప్రసంగిస్తారు. ప్రజల హక్కుల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మళ్లీ పోరాటాన్ని ప్రారంభించాలన్న పిలుపుతో ఈ మహాసభలు ముగుస్తాయి. విభజన శక్తులు సమాజ పొందికకు ముప్పుగా పరిణమిస్తున్న తరుణంలో 24వ పార్టీ మహాసభ ఆశకు, ఐక్యతకు ఒక ఆశాకిరణంలా నిలుస్తుంది.

వాస్తవిక బడ్జెట్

- కాళేశ్వరానికి నిధులు ఖర్చు చేయొద్దు : మండలిలో కోదండరామ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ వాస్తవికంగా ఉందని టీజేఎస్ సభ్యులు ఎం కోదండరామ్ అన్నారు. శుక్రవారం శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్ అంచనాలు, వాస్తవానికి తారతమ్యం తక్కువగా ఉండాలన్నారు. గతంలో 20 శాతం ఉంటే ఇప్పుడు ప్రవేశపెట్టిన బడ్జెట్ తారతమ్యం తక్కువగా ఉందని చెప్పారు. లేకుంటే అంచనాలను తీర్చేందుకు అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. 2024-25 బడ్జెట్ సవరణ అంచనాలు ఎనిమిది శాతం ఉందని వివరించారు. అంచనాలు, ఖర్చు తేడా ఎక్కువుంటే బడ్జెట్‌కు విలువుండబోదని అన్నారు. విద్యారంగానికి అన్ని రాష్ట్రాలు సగటున 14.7 శాతం ఖర్చు చేస్తున్నాయని వివరించారు.

వైద్య రంగానికి అన్ని రాష్ట్రాలూ సగటున 6.2 శాతం ఖర్చు చేస్తున్నాయని చెప్పారు. కానీ తెలంగాణలో విద్యకు ఈ బడ్జెట్‌లో 7.57 శాతం, వైద్య రంగానికి 4.06 శాతం కేటాయించిందని వివరించారు. విద్యావైద్య రంగాలకు అధిక నిధులను కేటాయించాలని కోరారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో 30 శాతం నిధులను ఎలా పెంచుతారో చెప్పాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయాలని సూచించారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును నిర్మించాలని అన్నారు. అప్పుడే గోదావరి నీటిని వినియోగించడానికి వీలవుతుందన్నారు. కాళేశ్వరంపై నిపుణుల కమిటీ అభిప్రాయం తీసుకోకుండా నిధులను ఖర్చు చేయొద్దని కోరారు. సమగ్ర పంటల విధానాన్ని రూపొందించాలని సూచించారు. సంక్షేమానికి కేటాయించే నిధుల్లో కోత విధించొద్దని చెప్పారు. 2019-20లో దళిత సంక్షేమానికి కేటాయించిన బడ్జెట్‌లో 30 శాతం కోత విధించినట్టు కాగ్ గుర్తించిందని వివరించారు.

కాంగ్రెస్‌కు విజన్ లేదు : కవిత

ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌లో ప్రాధాన్యతా రంగం లేదని బీఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ ప్రభుత్వానికి విజన్ లేదన్నారు. అబద్ధాలు చెప్పడంలో సీఎం రేవంత్‌రెడ్డికి గిన్నీస్‌బుక్‌లో చోటుదక్కుతుందని చెప్పారు. కాంగ్రెస్ డీఎన్‌ఏలోనే అవినీతి భాగమని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో పదేండ్లలో రూ.4.42 లక్షల కోట్లు అప్పు చేసిందన్నారు.

కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల కాలంలోనే రూ.1.58 లక్షల కోట్లు అప్పు చేసిందని వివరించారు. ఈ బడ్జెట్‌లో బీసీ సబ్‌ప్లాన్ ఊసే లేదన్నారు. మహిళలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. మహిళలకు రూ.2,500 ఊసే లేదనీ, తులం బంగారం గురించి ప్రస్తావన లేదని అన్నారు. కాళేశ్వరంలో చిన్న ఇబ్బంది అయితే ఎన్‌డీఎస్‌ఏ బృందం వెంటనే వచ్చి ఫొటోలను బయటకు విడుదల చేసిందన్నారు.కానీ ఎస్‌ఎల్‌బీసీ కూలిపోతే ఇప్పటి వరకు ఎన్‌డీఎస్‌ఏ బృందం ఎందుకు రాలేదని ప్రశ్నించారు. అంటే కాంగ్రెస్, బీజేపీకి మధ్య బంధం ఉందని అర్థమవుతున్నదని వివరించారు. స్కూటీలు, విద్యార్థులకు విద్యాభరోసా కార్డు ఇస్తామన్నారనీ, ఈ బడ్జెట్‌లో వాటి గురించి చెప్పలేదన్నారు. ఆరు గ్యారంటీలు గంగలో కలిసిపోయాయని అన్నారు. కాంగ్రెస్ అంటేనే కరెప్షన్, కన్నింగ్‌నెస్ అని విమర్శించారు. ఆదాయం రావడం లేదంటూ సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ మీడియాతో మాట్లాడి తెలంగాణ పరువు తీస్తున్నారని ఆరోపించారు.

కేసీఆర్ వల్లే తెలంగాణ రాలేదు : మహేష్‌కుమార్‌గౌడ్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఒక్కరి వల్లే తెలంగాణ రాలేదని కాంగ్రెస్ సభ్యులు బి మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఉద్యమ నాయకుడిగా కేసీఆర్‌ను గౌరవిస్తామనీ, ముఖ్యమంత్రి అయ్యాక మొండిగా వ్యవహరించారని చెప్పారు. అయితే తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ ముందున్నారనీ, ఆయన కృషి కూడా ఉన్నదనీ, అనేక ఇబ్బందులు వస్తాయని తెలిసినా కాంగ్రెస్ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన దిశగా ఉందన్నారు.

రైతు పక్షపాతిగా కేటాయింపులున్నాయని వివరించారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును కట్టాల్సిన అవసరముందన్నారు. ఇంజినీర్ల సలహాలను పట్టించుకోకుండా కేసీఆరే ఇంజినీర్‌గా వ్యవహరించి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని చెప్పారు. మల్లన్నసాగర్ నీరు రావాలంటే ఎత్తిపోయాలన్నారు. దానికి విద్యుత్ బిల్లులు ఎంతవుతుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విజయవంతం కాదన్నారు. ఇప్పుడు మళ్లీ ఖర్చుపెట్టి నిధులను వృథా చేయొద్దని కోరారు. కాంట్రాక్టర్లకు వెసులుబాటు కల్పించి నాణ్యతాలో పంతో కట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాం లో విద్యావైద్యాన్ని పట్టించుకోలేదన్నారు.

ప్రశ్నాపత్రాల లీకేజీతో తీవ్ర ఇబ్బందులు వచ్చాయన్నారు. కొందరు విద్యార్థులు చనిపోయారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులు నిర్వీర్యమయ్యాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లు వాస్తవానికి దూరంగా ఉండేవని చెప్పారు. బీజేపీతో పదేండ్లు దోస్తానా చేసినా కేంద్రం నుంచి నిధులను తేవడంలో విఫలమైందన్నారు. కాళేశ్వరానికి జాతీయ హోదా ఇవ్వాలనీ, విభజన హామీలను అమలు చేయాలని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. తమిళనాడు తరహాలో రాజకీయాలు రాష్ట్రంలో ఉంటాయనీ, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులను రాబట్టడంలో అధికార, విపక్షాలు ఒక్కటవుతాయని గుర్తు చేశారు. అదే తరహాలో రాష్ట్రాభివృద్ధి కోసం పార్టీలకతీతంగా ముందుకు రావాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి కలిసి రావాలని సూచించారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థుల డైట్ చార్జీలను పెరిగిన ధరలకనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వానికి విద్యారంగం అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. ఆరు గ్యారంటీల ఆశచూపి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. నిసరనతో ఈ బడ్జెట్‌కు మద్దతు ఇస్తున్నానని అన్నారు. ఎంఐఎం సభ్యులు ఎఫెండీ, బీఆర్ఎస్ సభ్యులు సత్యవతి రాథోడ్, వాణీదేవి, గోరటి వెంకన్న, షేరి సుభాష్‌రెడ్డి, మహమూద్ అలీ, యాదవరెడ్డి, తాతా మధు, ఎల్ రమణ, నవీన్‌కుమార్‌రెడ్డి, భానుప్రసాదరావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి తదితరులు మాట్లాడారు.

కాంగ్రెస్ అంటే త్యాగాలకు మారుపేరు : సీతక్క

కాంగ్రెస్ అంటే త్యాగాలకు మారుపేరని మంత్రి సీతక్క అన్నారు. బీఆర్ఎస్‌లోనే అవినీతి డీఎన్ఏ ఉందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు ఉద్యోగాలివ్వకుండా ఎవరు అడ్డుకున్నా రని ప్రశ్నించారు. కారుణ్య నియామకాలను పట్టించుకోలేదన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని చెప్పారు. రాష్ట్రం పరువు బీఆర్ఎస్ తీసిందన్నారు.



భ్రమల బడ్జెట్ కాదు

- ప్రజలను మోసం చేయొద్దనే వాస్తవాలతో కేటాయింపులు
- గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉన్నాం : మండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ ద్వారా ప్రజలను మోసం చేయొద్దనే ఉద్దేశంతో వాస్తవాలతో కేటాయింపులు చేశామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రజలను భ్రమల్లో ఉంచదల్చుకోలేదనీ, మోసం చేయదల్చుకోలేదని చెప్పారు. శుక్రవారం శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ 2024-25లో కూడా వాస్తవిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని వివరించారు. ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆదాయ వనరులకు అనుగుణంగా కేటాయింపులు చేశామని చెప్పారు. ప్రాధాన్యతల వారీగా ముందుకెళ్తున్నామని అన్నారు. యువతకు 57 వేలకుపైగా ఉద్యోగాలిచ్చామని వివరించారు. ఉద్యోగాలతోపాటు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడం కోసమే రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందించామన్నారు. రాష్ట్రంలో 58 ఇంటిగ్రేటెడ్ గురుకులాలను రూ.11,600 కోట్లతో నిర్మిస్తామని చెప్పారు. చేనేత కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో బిల్లులున్న మాట వాస్తవమని చెప్పారు. వాటిని ఒక్కొక్కటిగా చెల్లిస్తున్నామని అన్నారు. మిగిలినవి త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఈనెల 26న ఉదయం పది గంటలకు సభను వాయిదా వేస్తున్నట్టు చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.

రెండు బిల్లులకు మండలి ఆమోదం

శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టిన తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ నిధి (సవరణ) బిల్లు, తెలంగాణ న్యాయవాదుల గుమస్తాల సంక్షేమ నిధి (సవరణ) బిల్లులు ఆమోదం పొందినట్టు శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు.

ఇజ్రాయిల్ అంతర్గత నిఘా విభాగం అధిపతి రొనెన్‌బార్ పై వేటు




ఇజ్రాయెల్ : ఇజ్రాయిల్ అంతర్గత నిఘా విభాగం షిన్‌బెట్ అధిపతి రొనెన్ బార్ పై శుక్రవారం ప్రధాని నెతన్యాహు వేటు వేశారు. ఆయనపై తమకు విశ్వాసం సన్నగిల్లిందని పేర్కొన్నారు. నెతన్యాహు నిర్ణయాన్ని ప్రభుత్వం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆయన వారసుడిని నియమించిన తర్వాత కాని, ఏప్రిల్ 10న గానీ అతను పదవి నుంచి వైదొలగుతారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

షిన్‌బెట్ అధిపతిపై నమ్మకం లేదు : నెతన్యాహు

తనకు షిన్‌బెట్ అధిపతిపై నమ్మకం లేదని ఆదివారమే ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. బార్ పదవీకాలం వాస్తవానికి వచ్చే సంవత్సరం ముగియనుంది. ఆయన 2021లో ఈ బాధ్యతలు చేపట్టారు. వీరిద్దరి మధ్య మొదటినుంచి సత్సంబంధాలు లేవు. ఇక ఇజ్రాయిల్ పై హమాస్ దాడి అనంతరం అవి తీవ్రంగా దెబ్బతిన్నాయి. మార్చి 4వ తేదీన హమాస్ దాడిపై షిన్‌బెట్ అంతర్గత నివేదిక విడుదలయ్యాక అవి పూర్తిగా పతనం అయ్యాయి. ఆ నివేదికలో ఏజెన్సీ వైఫల్యం స్పష్టంగా కనిపించిందని వెల్లడైంది. అదే సమయంలో ప్రభుత్వ విధానాలు కూడా హమాస్ సైనికపరంగా బలోపేతం కావడానికి ఉపయోగపడ్డాయని పేర్కొంది.

ప్రతిపక్షాల ఆందోళనలు...

బార్‌పై వేటు వేయడాన్ని ప్రతిపక్షాలు తప్పుపట్టాయి. నెతన్యాహు ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారారని ఆరోపించాయి. జెరూసలెంలో ప్రధాని నివాసం, పార్లమెంట్ వద్ద భారీ స్థాయిలో ప్రతిపక్షాలు ఆందోళనలు నిర్వహించాయి. అదే సమయంలో మంత్రుల సమావేశం జరుగుతుండటం విశేషం.

వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఈ చర్యలు : బార్

ప్రభుత్వ నిర్ణయంపై బార్ స్పందిస్తూ "నెతన్యాహు తనపై చర్యల వెనక ఉద్దేశాలను దాచిపెడుతూ.. ఆధారాలు లేని సాధారణ ఆరోపణలు చేశారు" అని పేర్కొన్నారు. అక్టోబర్ 7 దాడికి దారితీసిన పరిణామాలపై దర్యాప్తును అడ్డుకొని.. వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఆయన తనపై చర్యలు తీసుకొన్నట్లు అభివర్ణించారు. అక్టోబర్ 7వ తేదీన హమాస్ జరిపిన పాశవిక దాడుల్లో నిఘా వైఫల్యానికి పూర్తి బాధ్యత తమదేనని ఇజ్రాయెల్ 2023లోనే షిన్‌బెట్ అంగీకరించింది. ఈ దాడుల్లో 1,300 మంది ఇజ్రాయెల్ వాసులు సహా విదేశీయులు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన తర్వాతే గాజాపై ఇజ్రాయెల్ భారీస్థాయిలో యుద్ధం ప్రకటించింది. హమాస్ మెరుపు దాడిపై ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంలో తాము విఫలమయ్యామని పేర్కొన్నారు.



స్వర్ణయుగం దిశగా బీఆర్ఎస్ పాలన

కాంగ్రెస్ హయాంలో అప్పులు, ఆత్మహత్యలు : శాసనమండలి బీఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణను స్వర్ణయుగం దిశగా నడిపించే ప్రయత్నం చేస్తే, కాంగ్రెస్ పాలనలో అప్పులు, ఆత్మహత్యలతో విరాజిల్లుతున్నదని శాసనమండలిలో బీఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి విమర్శించారు. శుక్రవారం శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ విధ్వంసం జరిగితే, కేసీఆర్ వీరోచిత పోరాటంతో తెలంగాణ సాధించారని తెలిపారు. కొత్త రాష్ట్రంలో అస్పష్టత, అస్తవ్యస్తంగా ఉండి తెలంగాణ వస్తే నీళ్ల, నిధులు, నియామకాలు ఎలా? తెలంగాణ వారికి పాలించడం వచ్చా? విద్యుత్ ఎక్కట్నుంచి వస్తుంది? వంటి ప్రశ్నలు, అనుమానాల మధ్య పాలన మొదలెట్టి కేసీఆర్ అద్భుతాలు చేశారని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా తెలంగాణను తీర్చిదిద్ది దేశానికే తలమానికంగా మార్చారనీ, కేసీఆర్ గురించి మాట్లాడేందుకు సభా సమయం పూర్తిగా ఇచ్చినా సరిపోదని కొనియాడారు.

జీఎస్డీపీని రూ.4 లక్షల కోట్ల నుంచి రూ.15 లక్షల కోట్లకు, బడ్జెట్ ను రూ.62 వేల కోట్ల నుంచి రూ.2.30 లక్షల కోట్లకు, విద్యుత్ సామర్థ్యాన్ని 778 మెగావాట్ల నుంచి 18 వేల మెగావాట్లకు, సాగు విస్తీర్ణాన్ని లక్షలాది ఎకరాలకు పెంచి కేసీఆర్ తెలంగాణను విశ్వజనీనం చేశారని తెలిపారు. అలాంటి దశాబ్ద పాలనను కాంగ్రెస్ బడ్జెట్ ప్రసంగంలో దశాబ్దా కాలం విధ్వంసం అని ఎలా పేర్కొంటుందంటూ ప్రశ్నించారు. ఆ మాటలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ పాలనలో 6.47 లక్షల రేషన్ కార్డుల జారీతో అదనంగా 20,69,033 మంది లబ్ది పొందారని చెప్పారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బంధు పీఎం కిసాన్ సమ్మాన్ కు స్ఫూర్తినిచ్చిందని గుర్తుచేశారు. మత్స్య సంపద రూ.30 వేల కోట్లకు పెరిగిందన్నారు. కులవృత్తులకు ఊతం లభించిందని తెలిపారు. కేసీఆర్ బడ్జెట్ రూపకల్పన సమయంలో లోతుగా చర్చించేవారని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను ఆయా మతాల పవిత్ర గ్రంథాలతో సమానమని చెప్పిందని గుర్తుచేశారు. ఆ మ్యానిఫెస్టోను అమలు చేయకుండా మాట తప్పటం ఆ పవిత్ర గ్రంథాలకు గౌరవమా? అని ప్రశ్నించారు. ప్రతి మహిళకు రూ.2,500, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సాయం, గతేడాది 4,50,000 ఇళ్ల నిర్మాణం, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ...ఇలా అనేక హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ఫీజు రీఎంబర్ మెంట్ ఏదని ప్రశ్నించారు. కాళేశ్వరం ఒక అద్భుతమనీ, అందులో మేడిగడ్డ చిన్న భాగమని తెలిపారు. బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. ప్రతి జిల్లాలో ప్రొఫెసర్ జయశంకర్ ఐక్యతా భవనం, అంబేడ్కర్ అభయ హస్తం, మైనార్టీలకు షాదీ ముబారక్‌కు రూ.1.60 లక్షలు, వైద్యానికి బడ్జెట్ రెట్టింపు తదితర అనేక హామీలతో కాంగ్రెస్ కార్యకర్తల నుంచి అగ్ర నాయకుల వరకు ప్రజలను పరవశులను (ట్రాన్స్ లోకి) తీసుకెళ్లారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక అన్ని తెలుసు.. సుదీర్ఘ పాలనానుభవం ఉందంటూనే సమస్యలను పరిష్కరించకుండా ఎగనామం పెట్టారని విమర్శించారు.

'సంతోషం'లో 119వ స్థానం 80 ఏళ్ల పాలనకో దండం

ప్రపంచవ్యాప్తంగా సంతోషకర దేశాల (హ్యాప్పియెస్ట్ కంట్రీస్) జాబితాలో భారతదేశం చాలా వెనుకబడి ఉందని మధుసూదనాచారి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఫిన్‌లాండ్ దేశం మొదటి స్థానంలో ఉంటే పాకిస్తాన్ 109వ స్థానంలో ఉంటే, భారతదేశం 119వ స్థానంలో ఉందని తెలిపారు. 80 ఏళ్లు దేశాన్ని పాలించిన పాలకులకో దండమంటూ విమర్శించారు.

మంత్రి జూపల్లి జోక్యం

తెలంగాణ కోసం అనేక మంది చనిపోయారంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు గుర్తుచేశారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని కాంగ్రెస్ సర్కార్ పని చేస్తున్నదని చెప్పారు. దీనిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, మంత్రి బడ్జెట్ పై కాకుండా ఏం మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. అందుకు జూపల్లి, వినడానికి భయమెందుకు? వాస్తవాలు బయటికి వస్తాయని భయపడుతున్నారా? అని ప్రశ్నించారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు శంభీపూర్ రాజు, కాంగ్రెస్ మోసం వల్లే చనిపోయారని కామెంట్ చేశారు. కొద్ది సేపు బీఆర్ఎస్ సభ్యులు రన్నింగ్ కామెంట్లు చేస్తుండటంతో చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారిని మందలించారు. మరోసారి మంత్రికి అవకాశమివ్వడంతో, హైదరాబాద్ నుంచి రూ.లక్షల కోట్ల రాబడి ఉన్నా బీఆర్ఎస్ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిందని విమర్శించారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రపంచ అటవీ దినోత్సవ సందర్భంగా కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయంలో భూగోళ శాస్త్ర విభాగం ఆధ్వర్యం లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ పాల్గొని మొక్కలను నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకు అటవీ విస్తీర్ణం తగ్గిపోవడం ఆందోళనల కరిగించే విషయమన్నారు. ఈ విషయాన్ని అందరూ దృష్టిలో పెట్టుకొని విరివిగా చెట్లు నాటాలని, ప్రకృతిని కాపాడాలని విద్యార్థులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. విశ్వవిద్యాల యం ఆవరణలో ఉన్న పక్షులకు నీరు, విత్తన గింజలు పక్షులకు అందుబాటులో ఉంచామన్నారు. పక్షులను, జంతువులను ప్రేమగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లోక భవాని, వివిధ విభాగాల అధి పతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

● సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. రాంనగర్, ముషీరాబాద్ డివిజన్‌లలో శుక్రవారం నూతన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్‌లు రవి చారి, సుప్రియ నవీన్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు గుంతల మయంగా మారాయని వాటి స్థానంలో నూతన సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జై సింహ, డివిజన్ ల అధ్యక్షులు కొండా శ్రీధర్ రెడ్డి, శంకర్ ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జి మచ్చకృతి ప్రభాకర్, ఆకుల అరుణ్, దీన్ దయాల్‌రెడ్డి, శివ, తదితర నాయకులు పాల్గొన్నారు.



క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి

● క్రీడలు స్నేహాభావాన్ని పెంపొందిస్తాయి.. ● డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్





నవతెలంగాణ-ముషీరాబాద్

క్రీడారంగానికి ప్రభుత్వాలు ప్రాధాన్యతను ఇచ్చి క్రీడాకారులను ప్రోత్సహించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ అన్నారు. భగత్ సింగ్ స్మారక యువ జనోత్సవాల సందర్భంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యం లో ముషీరాబాద్ జోన్ భరత్ నగర్‌లో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యు వత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడాపో టీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఒక వైపు విద్యార్థి యువజనుల హక్కులకై ఉద్య మాలు, పోరాటాలు చేస్తూనే మరోవైపు యువతలో దాగి ఉన్న సృజ నాత్మకతను, నైపుణ్యాన్ని వెలి కితీసేందుకు, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ఈ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. సేవా కార్యక్రమాలు చేయడంలో కూడా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ముందుం టుందన్నారు. వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారు లను ప్రభుత్వాలు ప్రోత్సహించాలన్నారు. క్రీడలతోనే మానసిక ఉల్లాసం పెంపొందించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమం లో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు హష్మి బాబు, జావీద్, నాయకులు రాజ య్య, దేవేందర్, ఆహ్వాన సంఘం ఉపాధ్యక్షులు మహేందర్, ఆర్.వెంకటేష్, విజయ్, శ్రీ రాములు, ఆంజనేయులు, జగన్ తదితరులున్నారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీ పేరును కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర టింబర్ ఫెడరేషన్ అధ్యక్షులు చకిలం రమణయ్య డిమాండ్ చేశారు. భాషా సంయుక్త రాష్ట్రాల ఏర్పాటు కొరకు తన జీవితాన్ని త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు పేరును రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం దారుణమన్నారు. శుక్రవారం తన కార్యాల యంలో చకిలం రమణమయ్య విలేకరులతో మాట్లాడుతూ 58 రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్ష చేసిన స్వాతంత్ర సమరయోధుడు, గాంధేయవాది పొట్టి శ్రీరాములు పేరును తెలుగు యూనివర్శిటీకి 1985వ సంవత్సరంలో అప్పటి సీఎం ఎన్టీఆర్ నామకరణం చేస్తే కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి తొలగించడం దారుణమన్నారు. తిరిగి తెలుగు విశ్వవిద్యాలయానికి ఆయన పేరును పెట్టాలని చకిలం రమణయ్య డిమాండ్ చేశారు. ఆర్యవైశ్యులంతా పార్టీలకు అతీతంగా ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచాలని ఆయన పిలుపునిచ్చారు.

బడ్జెట్‌పై విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

● డాక్టర్ రోహిన్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

బడ్జెట్‌పై విపక్షాల దుష్ప్రచారాలను తిప్పి కొట్టడానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ రోహిన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు లేబర్ బోర్డ్ మాజీ వైస్ చైర్మెన్ నాగభూషణం, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తోలుపులూరి కృష్ణ గౌడ్ మర్యాదపూర్వకంగా డాక్టర్ రోహిన్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రోహిన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాలను సమతుల్యం చేసుకుంటూ ప్రవేశపెట్టారన్నారు. బడ్జెట్‌ను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి విపక్షల దుష్ప్రచారాలను తిప్పుకొట్టాలని పిలుపునిచ్చారు.

రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి



● మాజీ రాజ్యసభ సభ్యులు వీహెచ్ హనుమంతరావు

నవతెలంగాణ-అంబర్‌పేట

రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివని మాజీ రాజ్యసభ సభ్యు లు వీహెచ్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం దగ్గర రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణలో పాల్గొని వారు మాట్లా డుతూ దేశం కోసం ప్రాణాలను అర్పించిన ఏకైక కుటుంబం గాంధీ కుటుంబం అని వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, అప్సర యూసుఫ్ జాహి, సీనియర్ నాయకులు రామ్మోహన్, జమీర్ పంజాల వెంకట్ గౌడ్, కోటం అనిల్ కుమార్, రావుల సుధాకర్ మహేందర్ గౌడ్ షకీల్ మన్మోహన్ నాగ మనీష శివ తదితర నాయకులు పాల్గొన్నారు.

అగ్రవర్ణ పేదలకు 'రాజీవ్ యువ వికాస్' వర్తింపజేయాలి

● అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులి గారి గోవర్ధన్ రెడ్డి

నవతెలంగాణ-ముషీరాబాద్

అగ్రవర్ణ పేదలకు కూడా రాజీవ్ యువ వికాస్ పథకం వర్తింప చేయాలని అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులి గారి గోవర్ధన్ రెడ్డి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత నిరాశ, నిస్పృ హకు గురై పెడత్రోవ పడుతుందని, ఇటువంటి పరిస్థితుల లో ఉద్యోగ అవకాశాలు లభించని నిరుద్యోగ యువతకు ఈ పథకం ఒక శాశ్వత ఉపాధికి పునాది లాంటిదన్నారు. రాష్ట్రంలో ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన యువతీ, యువకులకు రాజీవ్ యువ వికాస పథకం అమలు చేయాలని నిర్ణయించి దరఖాస్తులు తీసుకుంటు న్నారని, రాష్ట్రంలో అగ్రవర్ణాలుగా పిలువబడుతున్న, రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, వెలను, బ్రాహ్మణ, క్షత్రియ, కావు, బలిజ, ఒంటరి, ముస్లిం తదితర కులాలకు సంబంధించిన నిరు పేద యువతీ, యువకులకు రాజీవ్ యువ వికాస పథకం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఓసీల్లోని నిరు ద్యోగ యువత అనేక ఇబ్బందులకు గురవుతుందన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు న్యాయం చేయాలి




నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తెలంగాణ పోలీస్ గృహ నిర్మాణ సంస్థలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు న్యాయం చేయాలని రాష్ట్ర పోలీస్ గృహ సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఫౌండర్ అజ్మీరా రాందాస్ కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్‌కు వినతి పత్రం అందజేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రలో రిటైర్డ్ అయిన 70 ఏండ్ల ఆర్.సీ కుమార్ గవర్నమెంట్ అప్రూవల్ లేకుండా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో రూ. 2.50 లక్షల జీతం తీసుకుంటూ గవర్నమెంట్ జీవోకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని ఆరో పించారు. ప్రభుత్వం వెంటనే ఆర్.సీ కుమార్‌పై సమగ్ర విచారణ జరిపించి విధుల్లోంచి తొల గించాలన్నారు. అలాగే పోలీస్ గృహ సంస్థలో 30 ఏండ్లు పని చేస్తున్న రెగ్యులర్ ఎంప్లాయ్‌ను ఆర్.సీ కుమార్ పోస్టులో జనరల్ మేనేజర్ ప్రమోషన్ కల్పించాలన్నారు. లేని పక్షంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. గవర్నమెంట్ జీవో ప్రకారం గౌరవ వేతనం రూ.50 వేలు, రూ.35 వేలు ఇవ్వాలని, కానీ తన జీతం రూ.2.50 లక్షల కు పెంచు కున్నారని ఆరోపించారు.రెండు ఏండ్లు తెలంగా ణ పోలీస్ గృహ సంస్థలో పని చేసే విధంగా తన ఆర్డర్ తనే తీసుకున్నారని ఆరోపించారు.

మంచు పర్వతాలను కాపాడుకుంటేనే

రేపటి తరానికి స్వచ్ఛమైన నీరు..

● ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జీ.రామేశ్వర్ రావు
● 22 మార్చి, 2025 ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా..





నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచంలో అత్యంత స్వచ్ఛమైన నీరు కేవలం హిమాలయ పర్వత ప్రాంతాల్లోని మంచు పర్వతాల్లో మాత్రమే (గ్లేసియర్స్)దాగి వున్నాయి. కాబట్టి ఆ మంచు పర్వతాలను పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని ప్రపంచ నీటి దినోత్సవం 2025 థీమ్ 'గ్లేసియర్ ప్రిజర్వేషన్' ద్వారా ప్రపంచానికి యునైటెడ్ నేషన్స్ ఒక హెచ్చరికను జారీ చేసింది. అంటే, శతాబ్దాలుగా మంచుతో కప్పబడిన ఈ మహా పర్వతాలను, మంచు ఖండాలను కాపాడుకోవాలని, స్వచ్ఛమై న నీటి వనరులుగా ఉన్న ఈ హిమానీ నదులను కాపాడుకుంటేనే రేపటి తరానికి భవిష్యత్తు ఉం టుందని ప్రపంచ ప్రజలకు తెలియచేసింది. గ్లేసి యర్స్ అనేవి ప్రకృతి సహజ సిద్ధంగా మంచుతో కప్పబడిఉన్న మహా పర్వత నిర్మాణాలు. గురు త్వాకర్షణ ప్రభావంతో ఇవి కదులుతుంటాయి. శతాబ్దాలుగా పడుతున్న మంచుతో ఇవి పర్వతాలుగా ఏర్పడ్డాయి. ప్రపంచంలోని అతి పెద్ద గ్లేసియర్ గా గ్రీన్ ల్యాండ్, అంటార్కిటికా ఉన్నప్పటికీ అంతే స్థాయిలో భారత సరిహద్దుల్లో వున్న సియాచిన్, గంగోత్రి మంచు పర్వతాలు వున్నాయి. మరికొన్ని నార్త్ అమెరికా తదితర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ వీటన్నింటిని కూడా సంరక్షించుకోవడంతో పా టుగా హిమానీ పర్వత ప్రాంతాల్లోని మంచు పర్వతాలను రక్షించుకుంటే గానీ రేపటి తరానికి నీళ్లు ఉండవని ప్రపంచ ప్రజలు తెలుసుకో వాల్సిన అవసరం ఏర్పడింది. గ్లేసి యర్స్‌ను పరిరక్షించుకోవడం అంటే ఏమిటి..? పెరుగు తున్న భూతాపాన్ని తగ్గించుకుంటే అవి కరగకుండా ఉంటాయి. భూతాపం పెరిగితే వాటి కదలికలో మార్పులు వస్తే సముద్ర మట్టాలు పెరిగి ప్రళయం సంభవిస్తుంది. 2100 నాటికి ప్రపంచంలోని రెండు మూడొం తులు హిమ నదులు కరుగిపోయే అవకాశ ముంది. అందుకే హిమానీ నదులను కాపాడు కోవాల్సిన అవసరం ఉంది. నిత్యం నదులు పారాలంటే, చెరువులు నిండాలంటే, వ్యవసాయ పనులు సాగాలంటే, మనిషి నీరు తాగాలంటే, పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే, పెను ప్రమాదాలు రాకుం డా ఉండాలంటే ఈ మంచు పర్వతాలను రక్షించుకోవాలని, పెరుగు తున్న కాలుష్యాన్ని తగ్గించుకుంటే ఈ గ్లేసియర్స్ బాగుంటాయి. వేడిమి ఎక్కువయితే ఈ పర్వతా లు క్రమంగా కరిగిపోతుంటాయి. ఐక్యరాజ్య సమితి ఒక్కొక్క అంశం తో ప్రతి ఏటా మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవం జరుపుకోవాలని ప్రపంచ దేశాలకు గుర్తు చేస్తుంటుంది. 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనలో ఎస్‌డీజీ గోల్-6 నీటి ప్రాధాన్యతను గుర్తు చేస్తుంటుంది. మనిషి శరీ రానికి నీరు అవసరం. రోజువారీ జీవనం కోసం మన శరీరానికి నీరు అత్యవసరం. ఆహారం లేకుండా, మనిషి కొన్ని రోజులపాటు బతికివుం టాడేమో గానీ నీరు లేక వుండలేడు. మన శరీరంలో కూడా 70శాతం వరకు నీరు ఉంటుంది. శరీరం పని చేయడానికి ఈ నీరు సహాయ పడుతుంది. మనిషి బతకడానికి, వంట పనులు చేయడానికి, ప్రతి రోజూ చేతులు కడుక్కోవడం, స్నానం చేయడం, శుభ్రం చేయడం, పారిశుద్ధ్యం పనుల కోసం నీరు అవసరం. ఇంకా వ్యవ సాయం, రవాణా, పరిశ్రమలు, జలవిద్యుత్ ఉత్పత్తి తోపాటుగా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం కోసం నీరు అవసరం. 1992లో రియోడి జనెరియోలో జరిగిన యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్మెంట్ అండ్ డెవల ప్‌మెంట్‌లో నీటి ఆవశ్యకతపై చర్చ జరిగింది. అప్పటికే పలు దేశాలు నీటి కొరతను ఎదుర్కొం టున్నాయి. తమ దేశ ప్రజలకు నీటి ఆవశ్యకతపై గుర్తు చేయడానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవం జరుపుకోవడం మొదలయ్యింది.

ప్రపంచంలోని పలు దేశాలు నేడు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. సౌత్ ఆఫ్రికా లోని కేప్ టౌన్ లో కొన్నేండ్ల పాటు నీటిని రేషన్ పద్ధతిలో ఇచ్చారు. రోజుకు అయిదు లీటర్ల చొప్పున నీటిని ఆ కుటుంబం మొత్తం వాడుకోవాలి. అలాంటి పరిస్థితి మనకు చెన్నయ్ నగరంలో రెండేళ్ల కింద ఏర్పడింది. బెంగళూరు లో గత ఏడాది ఇదే పరిస్థితి ఉండేది. మహారాష్ట్ర లోని లాతూర్ నగరానికి దూర ప్రాంతాలనుండి రైలు వ్యాగన్ల ద్వారా నీళ్లు వచ్చేవి. ఇప్పటికీ రాజస్థాన్, గుజరాత్, బీహార్ రాష్ట్రాల్లో నీటి కొరత తీవ్రంగా వుంది. ఇవన్నీ కూడా ప్రజలు ఎవరికీ వారు ఆ లోచించాలి. పెరుగుతున్న జనాభా, వాతావరణ కాలుష్యం, నీటిని కాపాడుకోవాలనే కనీస అవ గాహన లేకపోవడంతో ఈ సమస్యలు ఉత్పన్న మవుతున్నాయి. హైదరాబాద్ మహానగరానికి దగ్గరలో కృష్ణా, గోదావరి నదులు ఉండటం, నగరానికి నీటి సరఫరా చేసే జంట జలాశ యాలు గండిపేట, హిమాయత్ సాగర్ ఉండ టం, మల్లన్న సాగర్, కొండా పోచమ్మ తదితర నూతన ప్రాజెక్టుల ద్వారా నీటిని సరఫరా చేయా లనే ప్రయత్నాలు జరగడం బాగున్నప్పటికీ, నగరంలో నీటి వృధా ఎక్కువగా వుంది. ఒకరోజు వరంగల్ లేదా కరీంనగర్ లాంటి పట్టణాలకు సరిపోయేంత తాగునీరు హైదరాబాద్ నగరంలో మనుషుల నిర్లక్ష్యం వలన వధా అవుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా నీటి వృధాను తగ్గించుకోవాలని ఎన్నో సార్లు ప్రజలకు చెప్పినప్పటికి, ఇష్టమున్నట్లు వాహనాలు కడగటం, వాకిళ్ల కడగటం డ్రమ్ముల కొద్దీ నీళ్లు పారబోయడం తదితరవాటిని తగ్గిం చుకోవాల్సిన అవసరం వుంది. నీటిని సృష్టించ లేము. నీరు అనేది బ్యాంక్ బ్యాలెన్స్ లాంటిది. బ్యాంకులోని డబ్బులు పొదుపుగా వాడుకున్న ట్లే, నీటిని కూడా పొదుపుగా వాడాలి. ఈరోజు నీటి వృధాను తగ్గిస్తే, రేపటి తరానికి కన్నీరు రాకుండా ఉంటుంది.

జాతి అభివృద్ధిలో యువత భాగస్వామ్యం వికసిత్ భారత్ లక్ష్యం..

విద్యాశాఖ కళాశాల సంచాలకులు ప్రొఫెసర్.రాజేందర్ సింగ్



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రపంచంలో అత్యధిక శాతం యువత భారతదేశంలోనే ఉన్నారని, దేశాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ వేడుకలు నిర్వహిస్తుందని కళాశాల విద్యాశాఖ సంచాలకులు ప్రొ.రాజేందర్ సింగ్ అన్నారు. వికసిత భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ 2025లో భాగంగా జిల్లా స్థాయి పోటీలు సిటీ కాలేజీలో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారై మాట్లాడుతూ.. జాతిని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలంటే ఆ జాతి భవిష్యత్తైన యువత పూనుకుంటేనే అది సాధ్యమని అందుకు వారి ఆలోచనలను గౌరవించి, వారి అభిప్రాయాలను వినాలని ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. హైదరాబాద్ నోడల్ జిల్లా కేంద్రంగా ప్రభుత్వ సిటీ కళాశాల ఎంపికై ఈ వేడుకలు నిర్వహిస్తున్నందుకు ప్రిన్సిపాల్, సమన్వయ కర్త డాక్టర్. నాగరాజును అభినందించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయికి ఎంపికైన అభ్యర్థులు 'ఒక దేశం ఒకే సారి ఎన్నికలు' అనే అంశంపై తమ అభిప్రాయాలను వెల్లడించాలని, ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలలో యువతకు కూడా చోటు కల్పించటం మంచి పరిణామమని, పోటీదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రస్థాయికి ఎంపికై పార్లమెంటులో అడుగు పెట్టాలని సూచించారు. సీనియర్ అధ్యాపకులు డాక్టర్. యాదయ్య మాట్లాడుతూ.. 2047 నాటికి భారతదేశం స్వాతంత్ర్యం సాధించి శత వసంతాలు పూర్తిచేసుకుంటుందని, ఆ నాటికి ప్రపంచంలోనే మన దేశాన్ని అత్యంత శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ వేడుకలు హైదరాబాద్ నోడల్ జిల్లాలో సిటీ కాలేజీలో నిర్వహించటం గర్వకారణమన్నారు. జ్యూరీ సభ్యురా లుగా విచ్చేసిన శ్రావ్యా రెడ్డి, మరో జ్యూరీ సభ్యులు అడ్వకేటు శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికల వ్యయాన్ని తగ్గించాలని అది దేశప్రగతి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పోటీలో పాల్గొనే అభ్యర్థులు తమ అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడి చేయాల్సింటుందన్నారు. జ్యూరీలో సభ్యులైన రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్.కె.భాస్కర్ మాట్లాడుతూ.. దేశ గతిని మార్చే విధాన నిర్ణయాల రూపకల్పనలో యువత ఆలోచనలకు కూడా చోటు కల్పించాలన్న సత్సంకల్పంతో భారత యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకంగా ఈ వేడుకలను నిర్వ హిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఖుషబ్బు గుప్తా, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్. డి.నాగ రాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు డా.సుదక్షిణ, డాక్టర్.కృష్ణ చంద్ర, డాక్టర్.కె.భాస్కర్, డాక్టర్.వి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

శిశువు దహనం కేసులో పురోగతి

● నిందితుడు మైనర్ బాలుడు అరెస్ట్

నవతెలంగాణ-ముషీరాబాద్

ఎన్టీఆర్ స్టేడియంలో శిశువును దహనం చేసిన కేసులో పోలీసులు పురోగతి సాధించారు. నిందితుడు నల్గొండ జిల్లాకు చెందిన మైనర్ బాలుడుగా గుర్తించారు. ఎన్టీఆర్ స్టేడియం చుట్టుపక్కల ప్రాంతానికి చెందిన మైనర్ బాలికను ఫోన్ ద్వారా పరిచయం పెంచుకొని లోబరుచుకున్నాడు. తరచూ బాలికను బాలుడు కలవడంతో గర్భం దాల్చిన బాలిక శిశువుకు జన్మని వ్వడంతో శిశువు చనిపోవడం గమనించి స్థానిక ఎన్టీఆర్ స్టేడి యంలో శిశువు మృతదేహాన్ని దహనం చేశారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి మైనర్ బాలునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



పోలీస్ డ్యూటీ మీట్‌లో భాగంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ క్రైమ్ రిపోర్టర్స్ మీడియా వర్సెస్ రాచకొండ పోలీస్‌కు మధ్య జరిగిన క్రికెట్ పోటీలో గెలుపొందిన మీడియా టీమ్‌కు రాచకొండ సీపీ సుధీర్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌ల నేపథ్యంలో బందోబస్త్ ఏర్పాట్లకు సంబంధించిన వివరాలు వెల్లడించిన అనంతరం మీడియా ప్రతినిధులకు పతకాలు అందజేశారు.

-నవతెలంగాణ-సిటీబ్యూరో

ఘనంగా పి.కృష్ణ ప్రదీప్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ముషీరాబాద్

ఘనంగా కేపీఎస్ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మెన్ పి. కృష్ణ ప్రదీప్ జన్మదిన వేడుకలను అశోక్ నగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని అకాడమీ క్యాంపస్‌లో నిర్వహించారు. ఈ సందర్భం గా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జయసింహ హాజరై కృష్ణ ప్రదీప్ సుదీర్ఘ ఆయురారోగ్యాలతో సఫలమైన జీవితం గడపాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. అకాడమీ డైరెక్టర్లు భవాని శంకర్, వరుణ్, వేణు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో హరికృష్ణ గౌడ్, ఇతర బోధనా సిబ్బంది, అకాడమీ సభ్యులు కూడా పాల్గొని, సివిల్ సర్వీసెస్ విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి ఆయన చేస్తున్న అసాధారణమైన కృషికి కృతజ్ఞతలు తెలియజేశారు.

'మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు తెలిపిన ఓబీసీ సెల్ నేతలు'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

గత అసెంబ్లీ ఎన్నికల హామీ మేరకు బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టం రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషించిన రాష్ట్ర బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు ఓబీసీ సెల్ నేతలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గొంటి విక్రమ్ యాదవ్, ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మెన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర కో-ఆర్డినేటర్ దేశబోయిన రవికుమార్ లు మంత్రిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ సీఎం ఎ.రేవంత్ రెడ్డి బీసీల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. బీసీల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షపాతిగా నిరూపించుకుందన్నారు. గొంటి విక్రమ్ యాదవ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీసీలంతా కాంగ్రెస్ వెంటే నడుస్తారని ఆయన స్పష్టం చేశారు.

ఆలయాలను అభివృద్ధి చేస్తాం

● కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

గాంధీనగర్ డివిజన్‌లో ఆల యాలను అత్యంత వైభవంగా అభి వృద్ధి చేస్తామని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలి పారు. శుక్రవారం డివిజన్‌లోని ఎస్ఆర్‌టీ శ్రీ నల్ల పోచమ్మ దేవాల యంలో నూతన అమ్మవారి కమాన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కార్పొరేటర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌లో ఆల యాలను ధూప దీప నైవేద్యాలతో అత్యంత వైభవంగా కళకళలా డేలా చేస్తామన్నారు. ప్రజలు దర్శించుకునేందుకు అన్ని సదుపా యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రా బాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, సురేష్, హన్మంత్, ఆనంద్‌రావు, చక్ర యాదగిరి, సాయి సంతోష్, సత్యేంధర్, ఎస్ఆర్‌టీ కాలనీ వాసులు లడ్డు, శివ, వున్న సత్యనారాయణ, గుర్రం గణేష్, గౌస్, తదితరులు పాల్గొన్నారు

దోమలగూడ హనుమాన్ దేవాలయం హుండీ లెక్కింపు



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజ కవర్గం కవాడిగూడ డివిజన్ దోమలగూడ హనుమాన్ దేవాలయం హుండీ లెక్కింపు నిర్వహించారు. 5 మాసా లకు సంబంధించిన ఈ హుండి లెక్కింపును దేవాదాయ శాఖ ఆలయ ఈవో మాచర్ల దేవ నాథం, దేవాదాయ శాఖ ఇన్ స్పెక్టర్ బి.సురేఖల పర్యవేక్షణ లో జరిగింది. ఆలయ హుండీ లక్కింపు చేయగా ఒక లక్షా 42 వేల 606 రూపాయల ఆదాయం వచ్చిందని ఈవో దేవనాధం తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో కెఆర్‌కె.ప్రసాద్, గొల్లగడ్డ రాజ శేఖర్ గౌడ్, సలంద్రి శ్రీనివాస్ యాదవ్, వేణు, విడి.కృష్ణ, కె.ప్రభు, అర్చకులు మహేందర్, భక్తులు శేషాచార్యులు, హరికృష్ణ, వెంకటేశ్వర స్వామి, బి.వెంకటేష్, నిఖిల్ కుమార్, సిహెచ్.ప్రశాంత్, శశివర్ధన్, వికాస్, సీతారామ్, వినయ్, వినయ్ కుమార్, రామారావు, కిరణ్‌కుమార్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శనివారం | మార్చి 22, 2025 | www.navatelangana.com

మహిళ అదృశ్యం



నవతెలంగాణ-బోడుప్పల్
ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ మహిళ తిరిగి ఇంటికి రాలేదు. ఈ సంఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. మేడిపల్లి సీఐ ఆర్.గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా, తిరుమల గిరికి చెందిన పానుమటి పరుశురాం భార్య సౌజన్య (23)తో కలిసి బోడుప్పల్ కార్పొరేషన్ సిద్ధి వినాయక చిత్తారి నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 19న పరుశురాం పని నిమిత్తం బయటకు వెళ్ళి ఇంటికి వచ్చే సమయానికి ఇంట్లో తన భార్య లేకపోవడంతో ఫోన్ చేశాడు. తాను యాదగిరి గుట్టకు వెళ్ళి వస్తానని సమాధానం ఇచ్చింది. తర్వాత ఎంతకూ తిరిగి రాలేదు. మళ్లీ ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో పరుశురాం మేడిపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

వర్చువల్ ఎవిడెన్స్ ఫెసిలిటీ సేవలు ప్రారంభం



నవతెలంగాణ- మేడ్చల్
మేడ్చల్ పట్టణంలోని భరోసా కేంద్రంలో వర్చువల్ ఎవిడెన్స్ ఫెసిలిటీ సేవలను మేడ్చల్ జోన్ డీసీపీ నంద్యాల కోటిరెడ్డి శుక్రవారం సైబరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజనతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాధితులు తమ వాంగ్మూలాన్ని స్వేచ్ఛగా చెప్పుకునేందుకు ఈ సేవలను ప్రారంభించినట్లుగా తెలిపారు. ఫోక్సో బాధితులకు లీగల్‌గా సహాయం అందిస్తూ కోర్టుకు నేరుగా వెళ్లకుండా వర్చువల్‌గా బాధితులు తమ వాంగ్మూలాన్ని నమోదు చేసేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సేవలు ప్రారంభించినట్లుగా తెలియజేశారు.ఈ కేంద్రం భరోసా బాధితులకు అండగా నిలుస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఏసీపీలు శ్రీనివాస్ రెడ్డి,రాములు నాయక్,భరోసా సెంటర్ కోఆర్డినేటర్ పి.కళ్యాణి,లీగల్ సపోర్టర్ రోజా,భరోసా కేంద్రం సిబ్బంది,డీఐ సుధీర్ కృష్ణ,ఎస్సైలు అనిత, మన్మధరావు, అశోక్ పాల్గొన్నారు.

వికలాంగుల పట్ల ప్రేమగా ఉండాలి



నవతెలంగాణ-బోడుప్పల్
వికలాంగుల పట్ల ప్రేమగా ఉండాలని అరోరా కళాశాల డైరెక్టర్ శ్రీకాంత్ జట్ల అన్నారు. శుక్రవారం అరోరా పీజీ కళాశాల ఉప్పల్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ డిసెబుల్ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ విభాగం నాచారంలోని సాధన ఇన్స్టిట్యూట్ ఫర్ మెంటలీ చాలెంజ్‌డ్‌ను సందర్శించారు. వికలాంగులను ప్రోత్సహించడానికి పుస్తకాలు, స్టేషనరీ, టేబుల్స్ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవ లోపం ఉన్నవారు వికలాంగులు కాదనీ, సాటివారికి సాయపడని వారే నిజమైన వికలాంగులు అని చెప్పారు. వారిలోని ప్రతిభకు బద్ధులై భవిష్యత్తులో ఇంకా ఎంతో సాధించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు. కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జీ.మహేష్, కుమార్ సాగర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ



- ఎంపీడీఓ మమతాభాయి

నవతెలంగాణ -శామీర్‌పేట
పర్యావరణ పరిరక్షణకు చెట్లు దోహద పడతాయని శామీర్‌పేట ఎంపీడీఓ మమతా భాయి అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ గ్రామపంచాయతీ పరిధిలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ, ఇన్వెస్కో కంపెనీ వారు సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా ఎంపీడీఓ మమతా భాయి హాజరై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకోసం, కాలుష్య రహిత సమాజం నిర్మించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వినూత్న, పంచాయతీ కార్యదర్శి తోట వేణు గోపాల్, బిల్ కలెక్టర్లు అనిల్ రెడ్డి, కల్పన, నరోత్తం రెడ్డి, సుధాకర్ గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో గోడ కూలి వ్యక్తికి గాయాలు

- సకాలంలో స్పందించిన కీసర 108 అంబులెన్స్ సిబ్బంది



నవతెలంగాణ-కీసర
దమ్మాయిగూడ మున్సిపాలిటీ బండ్లగూడలోని పటేల్ ఫామ్ హౌస్‌లో గోడ కూలి పని చేస్తున్న ముగ్గురు కూలీల మీద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనలో చెన్నపురం గ్రామానికి చెందిన, బస్వప్ప (54), శరణప్ప (30), లక్ష్మణ్ (32) అనే ముగ్గురు కూలీలు తీవ్ర గాయపడ్డారు. తోటి కూలీలు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో కీసర 108 సిబ్బంది చిత్రం రవి, పైలట్ రాంబాబులు వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి క్షతగాత్రులను అంబులెన్స్‌లోకి ఎక్కించి అత్యవసర వైద్య పరీక్షలు నిర్వహించారు. బస్వప్పకు నాడీవేగం, శ్వాస సరిగా లేకపోవడంతో ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ ఫిజిషియన్ డాక్టర్ మనీష్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఇచ్చే సూచనలను పాటిస్తూ అంబులెన్స్‌లోనే అత్యవసర చికిత్స చేస్తూ గోల్డెన్ అవర్‌లో నగరంలోనీ గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. దీంతో వారికి బస్వప్ప కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గాంధీ హాస్పిటల్ వైద్యులు కీసర 108 సిబ్బందిని అభినందించారు.

'ఆశా'లకు రూ.26 వేల వేతనమివ్వాలి



- మూడో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాయకురాలు జయప్రద, రాధా

నవతెలంగాణ-కీసర
కేంద్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు రూ.26 వేల కనీస వేతనం ఇచ్చి, మూడో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాయకురాలు జయప్రద, రాధా డిమాండ్ చేశారు. శుక్రవారం ఆశా వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.26వేలు ఇచ్చి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు యాదమ్మ, పుణ్యవతి, మంగ, భాగ్య, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలి



నవతెలంగాణ-అల్వాల్
కేంద్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి, మూడో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా నాయకురాలు కె. కోమల ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం జిల్లాలోని అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట నిరసన చేశారు. ఈ సందర్భంగా కె. కోమల మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు రూ.26 వేల ఫిక్స్ వేతనం నిర్ణయించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మంచుల. రాజకుమారి, ఎంజి. సుగుణ, ఇతర ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కులాన్ని బట్టి ఇండ్లు అద్దెకిచ్చే వారిపై చర్యలు తీసుకోవాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ. స్కైలాబ్ బాబు
- ఏప్రిల్‌లో కులవివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలు



నవతెలంగాణ-కాప్రా
హైదరాబాద్ నగర పరిధిలో ఇండ్లు అద్దెకివ్వడానికి కులం పేరుతో వివక్ష పాటిస్తున్నారని, ఇంటి అద్దె సమయంలో కులం ప్రస్తావన తెచ్చిన ప్రతి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ. స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు.శుక్రవారం ఈసీఐఎల్‌లోని కమలానగర్‌లో నిర్వహించిన కేవీపీఎస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమావేశానికి ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడుతూ..కుల వివక్షత, అంటరానితనం పట్టణ ప్రాంతాల్లో చాప కింద నీరులాగా కొనసాగు తుందన్నారు. ఇండ్లు అద్దెకిచ్చే క్రమంలో కొంతమంది ఇంటి ఓనర్లు శాఖాహారులకు మాత్రమేనని ఇండ్లు అద్దెకిస్తామని ఇంటి గేట్లకు బోర్డులు పెడుతున్నారని చెప్పారు. మరి కొంతమంది ఎస్సీ, ఎస్టీలకు కిరాయికి ఇవ్వబోమంటూ బోర్డులు పెడుతున్నారని తెలిపారు. ఇలా బోర్డులు పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇల్లు అద్దెకు ఇచ్చే సమయంలో కులాన్ని అడుగుతూ తక్కువ కులం అయితే నిరాకరిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వాలు కులం ప్రస్తావన లేకుండా చూడాలన్నారు. ఏప్రిల్‌లో మహనీయుల మాసంగా ప్రకటించుకుని పూలే, అంబేద్కర్ జన జాతర సభలతో పాటు కుల వివక్ష అంటరానితనంపై ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలు నిర్మించనున్నట్టు ఆయన చెప్పారు. 77 ఏండ్ల స్వాతంత్రం తర్వాత కూడా కులవివక్ష కొనసాగటం అంటే దేశాన్ని ఏలుతున్న పాలకుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలు నిరసనలను నిషేధిస్తూ వీసీ విడుదల చేసిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకొని యూని వర్సిటీలలో ప్రజాస్వామ్య వాతావరణం నెలకొల్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఏర్పాటుకు, అనేక సామాజిక ఉద్యమాలకు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిలోకం బలమైన ఉద్యమాలు నిర్మించిందన్నారు. విద్యార్థులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి కేవీపీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎన్. బాలపీరు, జిల్లా నాయకులు కె.నరసింహ, చింతకింది అశోక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలి

- పరీక్షలు పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- పదో తరగతి పరీక్షల పరిశీలన





నవతెలంగాణ-సిటీబ్యూరో
పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. దుండిగల్ మండలంలోని మల్లంపేటలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల నిర్వహణను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షలు జరుగుతున్న తరగతి గదుల్లో తిరిగి విద్యార్థులు పరీక్షలు రాయడాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మంచినీరు, లైట్లు, ఫ్యాన్ సౌకర్యాలు ఉన్నాయా..? అని ఎంఈఓను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు పూర్తయ్యే వరకూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలన్నారు. స్కూల్‌లో ఎంత మంది విద్యార్థులున్నారనీ, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్‌లు ఉన్నాయా..? అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. దుండిగల్ మండలంలో మొత్తం ఎన్ని ఉన్నత పాఠశాలలు ఉన్నాయని అడిగారు. కంప్యూటర్ ల్యాబ్‌ను రోటరీ క్లబ్ వారు ఏర్పాటు చేశారని ఎంఈఓ తెలుపగా, ఎన్ని కంప్యూటర్లు ఉన్నాయని, ఇన్ స్ట్రక్టర్ ఉన్నారా..? అని అడిగారు. విద్యార్థులకు కంప్యూటర్ క్లాసులు ఏ విధంగా నిర్వహిస్తున్నారని కలెక్టరు ప్రశ్నించగా, వారానికి రెండు క్లాసుల చొప్పున ప్రతి సెక్షన్ వారికి కంప్యూటర్ క్లాసులు నిర్వహిస్తున్నామని ఎంఈఓ బదులిచ్చారు. అనంతరం శామీర్‌పేట మండలంలోని తూంకుంటలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తరగతి గదుల్లో తిరిగి స్కూల్ యాజమాన్యాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట దుండిగల్ తహశీల్దార్ మతీన్, శామీర్‌పేట తహశీల్దార్ యాదగిరిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

బస్తీ దవాఖాన తనిఖీ



నవతెలంగాణ-కాప్రా
హెచ్‌బీ కాలనీలోని రాజీవ్‌నగర్ కాలనీలోరి బస్తీ దవాఖానను నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎల్బీనగర్ జోన్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ గీత నూహం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్తీ దవాఖానాలో అందిస్తున్న సేవల గురించి వైద్యాధికారి శ్రావణ కౌముదిని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు సకాలంలో అందుబాటులో ఉండాలని, సమయ పాలన పాటించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. అన్ని మందులు అందుబాటులో ఉంచాలని ఎప్పటికప్పుడు మందుల స్టాక్ తనిఖీ చేసుకొని మందులు కొరత లేకుండా చూసుకోవాలని అన్నారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ ద్వారా అన్ని రక్త పరీక్షలు అర్హులైన వారికి చేయాలని, వ్యాధి నిర్ధారణ చేసిచర్యలు తీసుకోవాలని సూచించారు.

మేడ్చల్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

- పసుపు, కారం, మసాలాల తయారీ కేంద్రాలు నిల్వ, విక్రయ కేంద్రాలపై మెరుపు దాడులు



నవతెలంగాణ-మేడ్చల్
మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ లో ఉన్న సూర్య మసాలా, స్పైసెస్ కంపెనీపై రాష్ట్ర ఫుడ్ సెక్యూరిటీ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్స్ పి రోహిత్,ఎస్ శ్రీశిక, పి.స్వాతి,ఎస్ జగన్నాథ్‌లతో కూడిన బృందం తనిఖీలు చేపట్టారు. కిష్టాపూర్‌లోని సర్వే నెంబర్ 819లోని హైదరాబాద్ ఫుడ్ ప్రొడక్ట్స్



ప్రయివేట్ లిమిటెడ్ (సూర్య మసాలా, స్పైసెస్)లో ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో పలు ఆహార పరిరక్షణ ఉల్లంఘనలు, అవకతవకలు, వ్యత్యాసాలు గుర్తించినట్లుగా తెలిపారు. వీటిలో శుభ్రత, పారిశుధ్య లోపం, మసాలాలు, మసాలా పొడుల ఉత్పత్తి, నిల్వ విభాగాలలో తగిన విధంగా పరిశుభ్రత పాటించడం లేదని అన్నారు. లేబుల్ లోపాలు, మసాలా ఉత్పత్తిలో ఉపయోగిస్తున్న ముడి పదార్థాలపై తగిన లేబుల్ సమాచారం లేకపోవడం గమనించామని తెలిపారు. ఈ తనిఖీల్లో 46.75 క్వింటాళ్ల తయారైన సెమీ ఆహార పదార్థాలు (పికిల్స్, అల్లం-వెల్లుల్లి పేస్ట్) మసాలా పొడులు కలిగి ఉన్న రూ.3లక్షల 3వేల విలువైన నిల్వను సీజ్ చేసి, లోపభూయిష్టమైన నమూనాలను ల్యాబ్‌కి పంపి మురికిగా ఉన్న కంటైనర్లు, ఫంగస్ పెరిగిన పదార్థాలు, వాడుక తేదీలు లేకపోవడం, అధిక దుర్వాసన కారణంగా కొన్ని ఉత్పత్తులను ధ్వంసం (డిస్కార్డ్) చేశామని తెలిపారు. సంబంధిత సంస్థకు తగిన నోటీసులు జారీ చేశామన్నారు.
అనుమానిత ఆహార పదార్థాలను పరీక్షల నిమిత్తం శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు తరలిస్తామని చెప్పారు. నివేదికలో కల్తీ అని నిర్ధారణ తేలితే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని టాస్క్ ఫోర్స్ ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు.

కీసర మండలంలో 'పది' పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం



నవతెలంగాణ-కీసర
కీసర మండలంలో 10వ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో మొత్తం 2822 మంది విద్యార్థులకు గాను 2815 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారు. 7 గురు విద్యార్థులు పరీక్షలు రాయలేక పోయారని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు.

'ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం హామీలను నెరవేరుస్తాం'



నవతెలంగాణ-ఘట్కేసర్
రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపచేయడం పట్ల యావత్ ప్రజానీకం కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉన్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని శివారెడ్డిగూడ నుండి బస్సు టర్మినల్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం శివారెడ్డి గూడలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ చట్టబద్ధత కల్పించడంతో పాటు ఎస్సీ వర్గీకరణ మూడు గ్రూప్‌లుగా విభజించి వెనుకబడిన కులాలకు మొదటి 1 శాతం, మాదిగలు వారి ఉపకులాలకు 9 శాతం రిజర్వేషన్లు, మాలలు వారి ఉపకులాలకు 5శాతం రిజ్వేషన్లు కల్పిస్తూ తెచ్చిన బిల్లుకు చట్టబద్ధత కల్పించడం చరిత్రలోనే మర్చిపోలేని విషయమన్నారు. ఎన్నికల హామీలను దశల వారీగా సీఎం అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, సహకార సంఘం చైర్మెన్ సింగిరెడ్డి రాంరెడ్డి, ఘట్ కేసర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు మామిండ్ల ముత్యాలు యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క సంజీవరెడ్డి గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిలుగూరి మచ్చేందర్ రెడ్డి,లనాయకులు కొండం అంజిరెడ్డి, సందీప్ రెడ్డి శంకర్ గౌడ్ బర్ల రాధకృష్ణ, ఖయ్యూం, పాల్గొన్నారు.



చర్లపల్లి డివిజన్‌లోని ఈసీ నగర్‌కు చెందిన పబ్బ మధుసూదన్ అనారోగ్యంతో శ్రీకర హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ బాధితుడిని శుక్రవారం పరామర్శించారు. నవతెలంగాణ-కాప్రా

ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి శివ కుమార్ మాదిగ
- మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం



నవతెలంగాణ - జవహర్ నగర్
ఎమ్మార్పీఎస్ నాయకుల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి శివ కుమార్ మాదిగ అన్నారు. శుక్రవారం జవహర్ నగర్‌లో ఎమ్మార్పీఎస్ కన్వీనర్ కొమ్ము ఆనంద్ మాదిగ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అసెంబ్లీ లో ఆమోదం తెలిపినందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపే కార్యక్ర మానికి వడ్డేపల్లి శివ కుమార్ మాదిగ, హాజరై మాట్లా డుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మందకృష్ణ మాదిగ 30 ఏండ్లు అలుపెరుగని పోరాటం చేసి వర్గీకర ణ సాధించారని అన్నారు. ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన మాదిగ అమరులకు జోహార్లు తెలిపారు. ఉద్యమానికి సహకరించిన అన్నివర్గాల ప్రజలకు వ్యాపారవేత్తలకు, రాజకీయ నాయకులకు, మానవతా వాదులకు, మీడియా పెద్దలకు, సామాజిక వాధులకు మాదిగ దండోరా పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లేపల్లి సదానంద్, జిల్లా కార్యదర్శి నాగునూరి ప్రభాకర్, కాప్రా మండల అధ్యక్షులు కొత్త నరేష్, మాజీ అధ్యక్షులు కొయ్యడ వెంకటేష్, బూడిద వెంకటేష్, మాట్ల శ్రీను, కొంగర విక్రమ్, నగునూరి యాదయ్య, కొంపెల్లి వెంకటనర్సు మాదిగ, ఎంజెఎఫ్ నాయకులు మహంకాళి భిక్షపతి, తదితరులున్నారు.



తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రచురించిన 'మేము సైతం' వ్యాస సంకలనం పుస్తకాన్ని గొోడుగు యాదగిరిరావు, జి.శివరామకృష్ణలు కలిసి కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌కు అందజేశారు. -నవతెలంగాణ,కాప్రా

పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యతనివ్వాలి



- మేడ్చల్ జిల్లా ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు భగత్

నవతెలంగాణ-నిజాంపేట్

బాచుపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో పి.జి. చేసిన విద్యార్థులకు పి.హెచ్.డి ప్రవేశాల్లో మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు భగత్ తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెల్లూరు నాయుడు నిత్యారావుకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. యూనివర్సిటీ లో ఎక్కువగా సామాన్య పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. వారికి తమ సొంత విశ్వవిద్యాలయంలోని ఉన్నత చదువులు కొనసాగించేందుకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర విశ్వ విద్యాలయ విద్యార్థుల కంటే మొదటగా ఇక్కడి విద్యార్థులను పి.హెచ్.డి సీట్ల కేటాయింపులో ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. అలాగే తెలుగు యూనివర్సి టీలో ఉన్న సమస్యలను కూడా వారు రిజిస్ట్రార్‌కు వివరించారు. ప్రత్యేకించి తరగతి గదుల కొరత, మౌలిక సదుపాయాల లేమి, గ్రంథాలయం, ప్రయోగ శాలలు, హాస్టల్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఎస్ఎఫ్ఐ నాయకులు లీలా, సాయి తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ నిర్మాణం పూర్తి చేయండి




- రోడ్డు మధ్యలో వదిలిన గ్యాప్ వల్ల ప్రమాదాలు
- అధికారులు, డివైడర్‌లు పనులు పూర్తి చేయాలి

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి పాపారాయుడునగర్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు మధ్యలో, డివైడర్ నిర్మాణం కోసం వదిలిన గ్యాప్ వల్ల, ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహన దారులు పేర్కొన్నారు. రోడ్డు మధ్యలో డివైడర్ కట్టడం కోసం గ్యాప్ వదిలేయడంతో, రోడ్డు క్రాస్ చేస్తుండగా వాహనాలు స్కిడ్ అవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే డివైడర్ లేకపోవడం వల్ల వాహన దారులు అస్తవ్యస్తంగా నడపడం ద్వారా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది.

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని, కూకట్‌పల్లి పాపారాయుడు నగర్ హైటెన్షన్ రోడ్డు మీదుగా.. ప్రతి నిత్యం ఆల్విన్ కాలని, జగద్గిరి గుట్ట ప్రాంతాలకు వేల సంఖ్యలో వాహనదారులు ప్రయాణిస్తుంటారు. పాపారాయుడు నగర్ దేవిస్తాన నుంచి వడ్డేపల్లి ఎంక్లేవ్ వరకు వైట్ టాప్ రోడ్డు నిర్మించి, ఆరు నెలల పైన కావస్తుంది. రోడ్డు మధ్యలో డివైడర్ కోసం గ్యాప్ వదిలేయడంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. కాబట్టి సంబంధిత అధికారులు, డివైడర్‌లు ఏర్పాటు చేయాలని, లేదా రోడ్డును పూర్తిగా నిర్మించి, వాహనదారుల సమస్యలు పరిష్కరించాలని వాహన దారులు కోరారు.

కూకట్‌పల్లి నల్ల చెరువు నాడు, నేడు





నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి నల్ల చెరువు ఆరు నెలల క్రితం జల కళతో ఉండి నేడు నీరు లేకుండా వెల వెలబోతూ దర్శనమిస్తుంది. కూకట్‌పల్లిలోని నల్ల చెరువు గత అక్టోబర్ నెలలో చెరువు నిండా నీటితో కళ కళ లాడుతూ.. చెరువు నీటిపై నీరు సైతం కనపడకుండా గుర్రపు డెక్క పేరుకు పోయి, ఆకు పచ్చ రంగులో కను విందు చేసేది. కానీ గుర్రపు డెక్క మాటున పెరిగే దోమలు మాత్రం పరిసర ప్రాంత ప్రజల, కంటి మీద కునుకు లేకుండా చేసి, విల విల లాడేలా చేశాయి. అయితే ప్రస్తుతం హైడ్రా ఆధ్వర్యంలో చెరువుల సుందరీకరణలో భాగంగా నల్ల చెరువులో ఉన్న నీటిని మొటార్లతో పూర్తిగా తోడెసారు. వేసవి కాలం కావడంతో చెరువులో నీరు లేకుండా వెల వెలబోయి ఓ మైదానంలా కనపడుతుంది. అయితే వచ్చే వర్షాకాలం నాటికి చెరువు పూడిక తీసి, జల కళ సంతరించుకుని సుందరంగా ఉండేలా తీర్చి దిద్దాలని ప్రకృతి ప్రేమికుల ఆకాంక్షిస్తున్నారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ లక్ష్యం



- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ లక్ష్యం అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అన్నారు. కేపీహెబీ డివిజన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభోత్సవానికి ఆయనతో పాటు కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళలను కోటీశ్వరాలను చేసే దిశగా ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. బండి రమేష్ మాట్లాడుతూ ఈ క్యాంటీన్ నిర్వహిస్తున్న యమునా వారి టీంకి అభినందనలు తెలిపారు. ఇలాంటివి రాబోయే కాలంలో మరెన్నో ప్రారంభించాలని మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఐఎన్‌డీసీ సెంట్రల్ కమిటీ సెక్రటరీ కరుణాకర్ నాయుడు, పుష్ప రెడ్డి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే సంజీవరావు, మేకల మైకల్ డివిజన్ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్ కుమార్, రేష్మ, సంధ్య, పొన్నం రజిత, జోజమ్మ, బండి సుధా తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలో క్రీడా దినోత్సవం



నవతెలంగాణ-పేట్ బషీరాబాద్

దూలపల్లిలోని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాలలో వార్షిక క్రీడా దినోత్సవం, కళాశాల చైర్మెన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి పుట్టినరోజు వేడుక గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రొఫెసర్, గ్రూప్ డైరెక్టర్ డా.పి.సంతోష్ కుమార్ పాత్ర మాట్లా డుతూ క్రీడలతో మానసిక ప్రశాంత, శరీర దారుఢ్యాన్ని పెంపొందించుకోవచన్నారు. కళాశాల చైర్మెన్ 81వ జన్మదిన సందర్భంగా మంచి ఆరోగ్యం, సరళమైన జీవనశైలికి స్వరూపం అని 81 సంవత్సరాల వయస్సులో నేటి తరానికి క్రీడలలో ఆయన సాధించిన విజయాల గురించి విద్యార్థులకు యువతకి వివరించారు. దేశవ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటాడని. చైర్మెన్ క్రీడల్లో మరిన్ని అవార్డులు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ.. వివిధ క్రీడా కార్యక్రమాల్లో పాల్గొన్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల విజే తల బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, అనితా ముక్తాశౌర్య ఫౌండర్, సీఈఓ లీడ్‌స్పెక్ట్రా గౌరవ అతిథి, హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ వ్యవస్థాపకుడు రవీంద్రన్ హాజరయ్యారు. క్రీడా విజేతలందరినీ వారు అభినందించారు. మర్రి లక్ష్మణ్ రెడ్డి, వెటరన్ అథ్లెట్ లెజెండరీ స్పోర్ట్స్ పర్సనాలిటీ విజేతలను అభినందించారు. క్రీడల ద్వారా ప్రతి ఒక్కరూ శారీరక దృఢత్వంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జి.చంద్రశేఖర్ యాదమ్మ మాట్లాడుతు క్రీడా పోటీల్లో ఆసక్తి కనబరిచిన క్రీడాకారులు విజేతలను అభినందించారు. పోటీలలో పాల్గొని ప్రతిభ కనపరిచిన విజేతలకు మేనేజ్‌మెంట్ టీమ్ గ్రూప్ డైరెక్టర్‌లు ట్రోఫీలు సర్టిఫికేట్‌లను అందజేశారు.

మైనార్టీల పక్షపాతి కాంగ్రెస్



- రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మెన్ హాజ్మతుల్లా హుస్సేని

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల పక్షపాతి అని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మెన్ అజ్మతుల్లా హుసేని అన్నారు. శుక్రవారం సాయంత్రం చింతల్ డివిజన్ పరిధిలోని నియోజకవర్గ మైనార్టీ చైర్మెన్ మహమ్మద్ అమీర్ సుల్తాన్ మీర్జా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయనతోపాటు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి హాజరై ముస్లిం సోదరులతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఉపవాస దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన దేశ ఔన్నత్యాన్ని, సంస్కృతిని సాంప్రదాయాన్ని పెంపొందించే పండగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముజీబ్ ఖాన్, టీపీసీసీ కార్య నిర్వాహక కార్యదర్శి కార్యదర్శి ఉస్మాన్ అహ్మద్ ఖాన్, సయ్యద్ జాంగిర్ హుస్సేన్, రషీద్ బేగ్, సయ్యద్ రషీద్, రెహమాన్, కూన రఘు గౌడ్, పండరీ పాల్గొన్నారు.

బూత్ లెవల్

ఏజెన్సీలను నియమించండి

- జనాభాతోపాటు పెరుగుతున్న ఓటర్లు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్
- అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో జనాభాతోపాటు ఓటర్లు పెరుగుతున్నారనీ, అందుకనుగుణంగా బూత్ లెవెల్ ఏజెన్సీలను నియమించాలని ఆయా పార్టీల ప్రతినిధులకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆల్ పార్టీ మీటింగ్‌కు అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలెక్టర్ హాజరై మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీల సూచనలు, సలహాలను ఎన్నికల సమయంలోనే కాకుండా క్రమం తప్పకుండా సమావేశమై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు, సూచనలను పరిగణలోనికి తీసుకుని భారత ఎన్నికల కమిషన్‌కు పంపుతామన్నారు. సరళీకత ఓటరు జాబితాలను అవసరమైన మేరకు ఎప్పటికపప్పుడు మార్పులు, చేర్పులు చేస్తూ ఆ మార్పుల వివరాలను బీఎల్ఏలు ఓటర్లకు తెలియజేయాలని సూచించారు. సాధారణ అభ్యర్థనలు ఏమైనా ఉంటే కమిషన్ దష్టికి తీసుకెళ్తామన్నారు. బూత్‌లను షిఫ్ట్ చేయడం కష్టమనీ, అవసరమైన మేరకు కొత్త పోలింగ్ బూత్‌లను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు బూత్‌లలో ఓటరు నమోదై ఉంటే వారు ఫామ్-8లో బూత్ మార్పుకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పార్టీ ప్రతినిధుల సూచనల మేరకు తండాల్లో పరిశీలించి అవసరమైన చోట కొత్త బూత్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఏవైనా సందేహాలు ఉంటే తప్పనిసరిగా క్లియర్ చేసుకోవాలనీ, ఏవైనా సమస్యలున్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్ఓ హరిప్రియ, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి



- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని భాగ్య నగర్ ఫేజ్ 3 కాలనీలో నిత్యం కరెంట్ ట్రిప్ అవుతుందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. దీంతో స్పందించిన కార్పొరేటర్, ఎలక్ట్రికల్ ఏఈని పిలిచి కాలనీ వారితో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని ఏఈని ఆదేశించారు. కాలనీ వారు విద్యుత్తు సరఫరాలో హెచ్చు తగ్గులు వలన ప్రతి రోజు విద్యుత్తు అంతరాయం కలుగుతుందన్నారు. దీంతో ఇంట్లోని ఎలక్ట్రికల్ సామానులు కాలిపోతున్నాయని కాలనీ వాసులు తన దృష్టికి తీసుకవచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, భాగ్య నగర్ ఎలక్ట్రికల్ సెక్షన్ ఏ ఈ దయానంద్, లైన్ మెన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు పారితోషికాల స్థానంలో
రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలి

- ఆశాలను మూడో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రేవతి కల్యాణి



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఆశాలకు పారితోషికాల స్థానంలో రూ.26 వేలను కనీస వేతనంగా నిర్ణయించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి డిమాండ్ చేశారు. శుక్రవారం యూనియన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో కాప్రా, కీసర, మల్కాజిగిరి, అల్వాల్, చర్లపల్లి, మల్లాపూర్, మూడు చింతలపల్లి, శామిర్‌పేట మండలాలతోపాటు జిల్లాలోని 15 మండలాలు, 12 పీహెచ్‌సీలు, 23 యూపీహెచ్‌సీలు, 80 సబ్ సెంటర్ల వద్ద నిరసన చేపట్టారు. కుషాయిగూడలో జరిగిన కార్యక్రమంలో ఎం.రేవతి కళ్యాణి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనీ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలనీ, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలనీ, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అడిషనల్ డీసీపీగా భాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-బాలానగర్

సైబరాబాద్ కమిషనర్ జోన్ పరిధిలో అడిషనల్ డీసీపీగా హనుమంత్ రావు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో హెచ్ఏఎల్ యూనియన్ నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు, హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు, ఏసీపీగా సేవలను గుర్తించి అడిషనల్ డీసీపీగా ప్రమోషన్ పొందటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. శాంతి భద్రతలు కాపాడటంలో తన వంతు కృషి చేశారని కోనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏడబ్ల్యు వైస్ ప్రెసిడెంట్ కూతాడి కృష్ణ, జాయింట్ సెక్రెటరీ వెంకటపతి, నాగార్జున, వెంకటేష్, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వై. భాస్కర్‌రావు, ఎ.మనోహర్, తదితరులు పాల్గొన్నారు.


కల్లుగీత సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా
వి.కృష్ణాగౌడ్, పి.శ్రీనివాసులుగౌడ్..



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, చివరి బస్ స్టాప్‌లోని జగద్గిరిగుట్ట కల్లుగీత సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా ఓరుగంటి కృష్ణాగౌడ్, పాండాల శ్రీనివాస్ గౌడ్, కమిటీ డైరెక్టర్లుగా నీలం నారాయణ గౌడ్, బండి కృష్ణాగౌడ్, జి.సత్తయ్య గౌడ్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కల్లుగీత సహకార ఎలక్షన్ అథారిటీ అదనపు రిజిస్ట్రార్ వీరిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులను జగద్గిరిగుట్ట సంఘ భవనంలో తోటి గౌడ సభ్యులు గురువారం శాలువాతో, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నియమితులైన సభ్యులు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలకు తాము చేస్తున్న సేవలను గుర్తించి మరోసారి అవకాశం కల్పించినందుకు సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఎటువంటి వర్గ విభేదాలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరిని కలుపుకు పోతూ కల్లుగీత సహకార సంఘ పటిష్టతకు నిరంతరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సభ్యులు ఎం.రాములు గౌడ్, బత్తిని కృష్ణాగౌడ్, వి.పాండు గౌడ్, గందమల్ల అరుణ్ గౌడ్, రక్తపాల శ్రీనివాస్ గౌడ్, పాండాల రజనీకాంత్ గౌడ్, బి.కుమార్ గౌడ్, సి హెచ్.సాయిగౌడ్, జి.అశోక్ గౌడ్, ఎస్.రాముగౌడ్, జీ.రవి గౌడ్, చంద్రం వంతులు సన్మానించిన వారిలో తదితరులు ఉన్నారు.

విజయ భాస్కర్ రెడ్డిని కలిసిన అశోక్ చారి



నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట్ సర్కిల్ ఫతేనగర్ డివిజన్ దీనదయాళ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయ భాస్కర్ రెడ్డి భారీ మెజారిటీ గెలిచారు. కూకట్‌పల్లి గ్రేటర్ హైదరాబాద్ మాజీ జాయింట్ సెక్రటరీ ఎర్రవల్లి అశోక్ చారి ఆయన స్వగృహంలో కలసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనదయాళ్ నగర్ బస్తీ అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించి.. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. బస్తీలో ప్రజల సౌకర్యార్థం కోసం తన సొంత డబ్బు ను వెచ్చించి.. పాత ఆలయాన్ని పునర్నిర్మించేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు.

హెచ్ఎంటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల హెచ్ఎంటీ కంపెనీ జీఎం రాజ బాబు, జేజీఎం షాహిన్, హెచ్ఆర్ కార్తీక్‌లతో జరిగిన యూనియన్ ఇంట్రడక్షన్ సమావేశంలో యూనియన్ లీడర్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ యూనియన్ లీడర్స్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం యూనియన్ లీడర్స్ కార్మికులతో కలిసి హెచ్ఎంటీ కంపెనీని పర్యవేక్షించి.. కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. యూనియన్ లీడర్స్ కార్మికులు కూన శ్రీశైలం గౌడ్‌ని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను హెచ్ఎంటీ కంపెనీ మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్మికుల సమస్యల పట్ల హెచ్ఎంటి కంపెనీ మేనేజ్‌మెంట్ సభ్యులు సానుకూలంగా స్పందించి, కార్మికుల సమస్యలు సత్వరగా పరిష్కారించడానికి హామీ ఇచ్చారని అన్నారు .రిటైర్‌మెంట్ కార్మికుల బకాయిలపై కూడా చర్చించారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ లీడర్ జనరల్ సెక్రెటరీ జి.శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీశైలం, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కేశవ్, రతన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ నాయక్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఏ.లక్ష్మణ్, జి.జెయింట్ సెక్రెటరీ నరసింహ చారి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంబాబు, ట్రెజరర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి పరికరాలు అందజేత..



- కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

మహిళలకు ఉపాధి పరికరాలు డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ అందజేశారు. ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని, జయశంకర్ కాలనీలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ వారి ఆధ్వర్యంలో.. జెటిఎక్స్ సంస్థ వారి సహకారంతో, డివిజన్‌లోని మహిళలకు శిక్షణ ఇచ్చి వారి నైపుణ్యాలకి అనుగుణంగా వారికి కుట్టు మిషన్లు, ఇస్త్రీ పెట్టెలు, నిత్యావసర సరుకులు అందిచారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ వారు, తమ డివిజన్‌లో ఎన్నో సహాయ కార్యక్రమాలు చేసారని తెలిపారు. కరోన టైంలో కూడా ఎంతో మందికి సహాయం చేసి ఆదుకున్నారని గుర్తుచేశారు. డివిజన్‌లో ఉన్న పేద మహిళలకు వారికి ఆసక్తి ఉన్న రంగాలలో శిక్షణ ఇస్తూ.. చిన్న పిల్లలకు చదువులు చెప్పున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడ్ల శ్రీనివాస్, మల్లేష్, పోశెట్టిగౌడ్, యాదగిరి, కుమార్, షేక్ బీబీ, యునైటెడ్ వే ఆ హైదరాబాద్ సభ్యులు కె.రాములు, ప్రశాంత్, తదితరులు మఖ్య నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శనివారం | మార్చి 22, 2025 | www.navatelangana.com

అభివృద్ధి విషయంలో వెనకడుగు వేయం



- కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్

నవతెలంగాణ-ఓయూ

అభివృద్ధి విషయంలో వెనకడుగేయమని బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని నాగయ్యా హోటల్ వద్ద నూతనంగా నిర్మించిన వాటర్ లైన్ పనులకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి పనులు సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, హెచ్ఎండబ్ల్యూఎస్ ఏఈ ప్రియాంక, పాకసాయి, మల్లేష్, మానస, అనిల్ పాల్గొన్నారు.

గౌతమ్ నగర్‌లో నేలకొరిగిన భారీ వృక్షం



నవతెలంగాణ-బంజారాహిల్స్

జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్ నగర్‌లోని గౌతమ్ నగర్ కమిటీ హాల్ దగ్గర శుక్రవారం భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే విషయం తెలుసుకున్న జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, స్థానిక పోలీసులకు జీహెచ్ఎంసీ అధికారులకూ సమాచారం ఇవ్వడంతో రంగంలోకి దిగిన డీఆర్ఎఫ్ సిబ్బంది, విద్యుత్ అధికారుల సహకారంతో చెట్లు తొలగించి ట్రాఫిక్‌ను సజావుగా సాగేలా చేశారు.

భవిష్యత్‌లో విద్యుత్ రిమోట్ ద్వారానే ఆపరేటింగ్



- ఐఏఎస్ కె.వరుణ్ రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

రానున్న రోజుల్లో దేశంలో అనేక పరిశోధన ద్వారా విద్యుత్ వాడకాన్ని రిమోట్ ద్వారానే ఆపరేటింగ్ చేసే అవకాశం ఉంటుందని వరంగల్ టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, ఐఏఎస్ కె.వరుణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఓయూ ఈఈఈ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన టెక్నోవెన్స్ 2025, సోంపోజియం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రానున్న కాలంలో దేశంలో ఆటో మెషిన్ ద్వారా, పవర్ ఎప్పుడు వస్తుంది, ఎంత సేపు పోతుంది, ఏ కారణంగా పోతుంది, తెలిసిపోతుందన్నారు. ఇక సింపోజియంలో స్మాట్ ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ నమూనా అలరించాయి. కార్యక్రమంలో ఓయూ రిజిస్టర్ ప్రొ.నరేష్ రెడ్డి, యూఎస్ఏకి చెందిన కేఈసీ వ్యవస్థాపకుడు గోపాల్ టీకే కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.మంగు, హెడ్ ప్రొ. ఈ. విద్యా సాగర్, డా.బీ.శిరీష, డా.సుశీల, విద్యార్థులు జశ్వంత్, దక్షిణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు



- ప్రశాంత్ జే పాటిల్

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం విభాగం సెమినార్ హాల్లో ఘనంగా నిర్మాణ్ 2025 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇరిగేషన్, విభాగం స్పెషల్ సెక్రెటరీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రశాంత్ జే పాటిల్, ఓయూ వీసీ ప్రొ.ఎం కుమార్, ఐ అండ్ క్యాడ్ డిపార్ట్‌మెంట్ శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు నూతన ఆలోచన విధానాలతో ముందుకు సాగాలని నిత్యం నూతన పరిశోధన చేయాలని వారు సూచించారు. ఎంతో భవిష్యత్తు ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విభాగం ఆవరణలో ఏర్పాటుచేసిన సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నమూనా పలువురుని ఎంతగానో ఆకట్టుకుందని ప్రశాంత్ జే పాటిల్ అన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ హెడ్ మార్కెటింగ్ రాజు రాజు బిస్తా, సివిల్ ఇంజనీరింగ్ హెడ్ ప్రొఫెసర్ కేఎల్ రాధిక, ప్రొ, రాజశేఖర్ రెడ్డి, ప్రో.శశికాంత్, ప్రో.రాజా శేఖర్, విద్యార్థులు విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలంగాణాలో చేపట్టిన వర్గీకరణ చెల్లదు..

- మాజీ ఎంపీ హర్ష కుమార్



నవతెలంగాణ-బంజారాహిల్స్

అసలు వర్గీకరణ చెల్లదని దీనికి రాజ్యాంగ చట్టబద్ధత లేదని, పార్లమెంట్‌లో ఆమోదం లేకుండా ఎస్సీలను వర్గీకరించే శక్తి సుప్రీంకోర్టుకి లేదని అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో జరిగినటువంటి వర్గీకరణ కూడా చెల్లదని మాజీ ఎంపీ జీవి హర్ష కుమార్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆర్డర్ చెల్లదని పోరాటం జరుగుతున్నటువంటి సమయంలో సుప్రీంకోర్టు ఆర్డర్‌ని యధావిధిగా అమలు పరచకుండా వాళ్ల ఇష్టారాజ్యంగా అమలు చేయడం ఏంటినీ ప్రశ్నించారు. తను న్యాయ నిపుణులతో తను మాట్లాడుతున్ననీ ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణలో ప్రవేశపెట్టిన వర్గీకరణ బిల్లు కొట్టి వేయబడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వర్గీకరణ బిల్లును వ్యతిరేకించడం ఎందుకు అనే అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయడం మంచిదనీ చెప్పారు. తిరుపతి ఆదివారం నిర్వహించబోయే మలాల సింహగర్జనకూ అనుమతులు ఇచ్చి రద్దు చేయడమే సీఎం చంద్రబాబు నాయుడు భయపడతున్నట్టె అన్నారు. గత వారం రోజులుగా హైదరాబాదులోనే ఉంటూ దగ్గర నుంచి వర్గీకరణ బిల్లును పర్యవేక్షిస్తున్న అని హర్ష కుమార్ తెలిపారు.

ప్రతి ఒక్కరు ఎర్త్ హవర్‌ను పాటించాలి



- మక్తాల జలంధర్ గౌడ్

నవతెలంగాణ-బేగంపేట్

ప్రతి ఒక్కరు ఎర్త్ హవర్‌ను పాటించి గ్లోబల్ వార్మింగ్ నుంచి బయటపడాలని మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపకులు మక్తాల జలంధర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మక్తాల ఫౌండేషన్ గ్రీనరీ క్లబ్ ఆధ్వర్యంలో నేడు (శనివారం) రాత్రి 8.30 నిమిషాల నుంచి 9.30 నిమిషాల వరకు గంట సేపు ప్రపంచ వ్యాప్తంగా విద్యుత్ దీపాలు ఆర్పివేసి జరుపుకోనున్న ఎర్త్ హవర్‌పై సికింద్రాబాద్ సోమ సుందరం వీధి, కళాసిగూడ మహంకాళి స్ట్రీట్ తదితర ప్రాంతాలలో ప్రజకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జలంధర్ గౌడ్ మాట్లాడుతూ.. భూమాతకు తన, పర అనే బేధ భావాలు ఉండవని, అలాంటి భూమాతను చల్లగా ఉండేలా మనం చూసుకోవాలని అన్నారు. షాపులు కానీ ఇండ్లు కానీ ప్రతి నిర్మాణం వద్ద మొక్కలను పెంచేలా చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని, ప్రతి ఇంటికి ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి చెయ్యాలనారు. నేటి రాత్రి 8.30 నిమిషాల నుంచి 9.30 నిమిషాల వరకు విశ్వకర్మ సంఘం నుంచి జనరల్ బజార్ అంజలి థియేటర్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు, భూమాత కోసం ఆలోచించే వారందరూ ఈ ర్యాలీలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఒక వేళ ర్యాలీలో పాల్గొనలేక పోతే తమ ఇండ్ల వద్ద కూడా ఈ కార్యక్రమాన్ని పాటించవచ్చని, ఈ ఎర్త్ హవర్‌ను పాటించడం వల్ల భూతాపన్ని తగ్గించిన వారిలో భాగస్వాములము అవుతమన్నారు. కార్యక్రమంలో నరసింహ చారీ, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కే కదా అని పికేస్తే.. పీల్చే గాలికై ఎదురు చూడాలి

- పర్యావరణ పరిరక్షణ, జీవజాలం మనుగడకు అడవులే ఆధారం
- అడవులను ప్రజలు తమ స్వలాభం కోసం నాశనం చేస్తూన్నారు.
- మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ-బంజారాహిల్స్

అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా తాను చెట్ల సంరక్షణలో భాగస్వామ్యం అవడం చాలా సంతోషంగా ఉందని, మన సంస్కృతి, సాంప్రదాయలలోనే వృక్ష సంరక్షణ చాలా ముఖ్యమని, మొక్కే కదా అని పికేస్తే పీల్చే గాలి కోసం ఎదురు చూసే పరిస్థితి నెలకొంటుందనే నగ్న సత్యాన్ని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా కేబీఆర్ పార్కులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. అడవుల పరిరక్షణ ఆవశ్యకత కోసం అవగాహన పెంచాడానికి ప్రపంచ అటవీ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఈ సందర్భంగా ఏటా ప్రపంచ అటవీ దినోత్సవం నిర్వహిస్తున్నమన్నారు. పర్యావరణ పరిరక్షణ, జీవజాలం మనుగడకు అడవులే ఆధారం. జీవజాలానికి, వనాలకు విడదీయరాని సంబంధం ఉందని మంత్రి అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అడవులను ప్రజలు తమ స్వలాభం కోసం నాశనం చేస్తూ.. తమ ఉనికిని తామే ప్రశ్నార్థకం చేసుకొంటున్నారని తెలిపారు. ప్రకృతి మాత్రమే శాశ్వతమైనదనే సత్యాన్ని గుర్తిస్తే, మానవ మనుగడకు ఆధారంగా నిలుస్తున్న అడవులను జాగ్రత్తగా కాపాడుకునేలా ఉద్యమించాలన్నారు. పట్టణీకరణ, పరిశ్రమల స్థాపన, ప్రాజెక్టుల నిర్మాణం, పోడు వ్యవసాయం, గృహాల నిర్మాణం వంటి కారణాలతో అడవులు నానాటికీ అంతరించి పోతున్నాయని, మనమంతా ఆవేదన వ్యక్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. భూ విస్తీర్ణానికి అనుగుణంగా అడవుల విస్తరణ లేకపోవడంతో గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో కఠిన సమస్యలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే పర్యావణంలో సమతుల్యత లోపించి విపత్తుల బారిన పడుకుండా ఉండాలంటే వన్య ప్రాణులకు ఆవాసాలైన అడవులను కాపాడుకుంటేనే జీవవైవిధ్యం వర్ధిల్లుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టే చర్యలకు ప్రజలు కూడా తమవంతు సహకారం అందిస్తేనే అడవుల విస్తీర్ణంలో వృద్ధి నమోదవుతుందనీ ఇందు కోసం ప్రజలు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం కూడా వన మహోత్సవం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతుందనీ అందు కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నట్టు మంత్రి వివరించారు.

ఈ కార్యక్రమంలో భాగస్వాములైన మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పెస్కోవా, అటవీ శాఖ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సంఘాల వారందరికీ మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.

థీసిస్ సబ్మిషన్ గడువు పొడిగించాలి

- ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో 2018 పీహెచ్డీ పరిశోధక విద్యార్థులు థీసిస్ సబ్మిషన్ గడువు పొడిగించాలని, 2017 పీహెచ్డీ స్కాలర్స్ థీసిస్ సబ్మిషన్‌కి వన్ టైమ్ ఛాన్స్ ఇవ్వాలని, నూతన పీహెచ్డీ నోటిఫికేషన్‌లో సీట్ల సంఖ్య పెంచాలని, యూనివర్సిటీలోని విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, ఓయూలో ఉద్యమాలను నిషేధిస్తూ ఇచ్చిన సర్క్యులర్‌ను బేషరతుగా వాపస్ తీసుకోవాలి డిమాండ్ చేస్తూ ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని విన్నవిస్తుంటే యూనివర్సిటీ యంత్రాంగం ఏమి పట్టనట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సమస్యలు పరిష్కరించాలని అడిగిన దివ్యంగా విద్యార్థులపై కేసులు నమోదు చేయించాని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాల్సిన ప్రభుత్వం, యూనివర్సిటీ యంత్రాంగం దానికి విరుద్ధంగా నియంతృత్వ విధానాలు అమలకు కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. దానిలో భాగంగానే రాజ్యాంగ విరుద్ధంగా, విద్యార్థుల హక్కులు కాలరాసే విధంగా సర్క్యులర్ విడుదల చేసారని పేర్కొన్నారు. ఎన్ని నిర్బంధాలు ఉస్మానియా విద్యార్థి లోకం మడమ తిప్పదని, బరిగిసి పోరాడుతుందని అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఉస్మానియా యూనివర్సిటీకి రూ. వెయ్యి కోట్లు కావాలని విద్యార్థులు, ఆచార్యులు ప్రభుత్వాన్ని కోరుతుంటే ఓయూ వీసీ మాత్రం పదవి కాపాడుకోవడానికి తక్కువ కేటాయింపులకు కూడా భజన చేయాలని చూస్తున్నారని ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ నేతలు ఎస్ నాగేశ్వర రావు, ఎన్.సుమంత్, కొమ్ము శేఖర్, జంగిలి దర్శన్, వలిగొండ నరసింహ, వేదాంత మౌర్య, చేరాల వంశీ, ఎస్.అంజి పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో పేద ప్రజలను ఆదుకోవాలి



- హర్యానా గవర్నర్ దత్తాత్రేయ

నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్‌లోని వాసవి క్లబ్ ఇంటర్‌నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆవిష్కరణ కార్యక్రమానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరై విశ్వ వాసు నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరించారు. వాసవి క్లబ్ వారు రక్షణ కవచం పేరుతో ఏర్పాటు చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని కూడా దత్తాత్రేయ ప్రారంభించారు. వాసవి క్లబ్ ఇంటర్‌నేషనల్ ఆధ్వర్యంలో గత కొన్నేండ్లుగా సాగుతున్న సేవా కార్యక్రమాలను దత్తాత్రేయ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మానవతా దృక్పథంతో పేద ప్రజలను ఆదుకోవాలని లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ సంస్థ చేస్తున్న కార్యక్రమాలు ఆదర్శంగా ఉన్నాయన్నారు. ప్రధానంగా విద్య వైద్యం లాంటి ఖర్చుతో కూడుకున్న విషయాలపై స్పష్టమైన వైఖరితో సేవ చేస్తున్న తీరు గొప్పదని కొనియాడారు. వికసిత్ భారత్ లక్ష్యంతో నరేంద్ర మోడీ అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తీసుకొని దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. సేవ చేసే దృక్పథం మహిళల్లో ఎక్కువగా ఉంటుందని మహిళలకు గౌరవం దక్కితే సమాజం సరైన పద్ధతిలో ముందుకు సాగుతుందని అన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్ కూడా పాల్గొని గవర్నర్ దత్తాత్రేయను సన్మానించారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు



- మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

నవతెలంగాణ-కంటోన్మెంట్

సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వము ఏర్పాటైన నాటి నుంచి అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వము చర్యలు తీసుకుంటున్నదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ లకు 29 శాతం నుంచి 42 శాతం రిజర్వేషన్లు పెంచడంతో శుక్రవారం న్యూ బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్ వద్ద సీఎం రేవంత్రెడ్డి చిత్రపటానికి రెజ్లింగ్ కోచ్ సాయిబాబా యాదవ్ ఆధ్వర్యంలో బీసీఏ నాయకులూ పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం తెలిపారని, స్థానిక సంస్థల విద్య, ఉపాధిరంగాల్లో బీసీలకు 42 శాతం రేజర్వేషన్లు వరకు పెంచి అసెంబ్లీలో ఆమోదం తెలిపి బీసీలకు న్యాయం చేసారని ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా బీసీల్లో నిరుద్యోగ యువతకు నాలుగు లక్షల రూపాయల ఋణం అందజేసేందుకు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని అన్నారు. యువత ఋణం కోసం దరఖాస్తు చేయడానికి అయ్యే ఖర్చును తాను అందచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కరణ్ సింగ్, రాజు, యాదగిరి, విట్టల్ రావు, ప్రసాద్, శశి, శ్రీకాంత్, అమీర్, బండి శ్రీనివాస్, జంపన రవి, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర చేసినా.. ఎటువంటి ప్రయోజనం లేదు

- డా. కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

పాదయాత్ర చేసినా.. ఎటువంటి ప్రయోజనం లేదని, ప్రజాభిమానం కోల్పోయి, అధికారానికి దూరమైన బీఆర్ఎస్ మనుగడ కోసం అడుగులు వేస్తోందని ఏఐసీసీ కమిటీ సభ్యురాలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా. కోట నీలిమ విమర్శించారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ గురువారం సూర్యాపేటలో మాట్లాడిన తీరు సరికాదన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ అధికార కాలంలో ప్రజల సొమ్ముకు జవాబు దారీ తనం లేకుండా వ్యవహరించారనీ, అందుకే ఇటీవల జరిగిన ప్రతి ఎన్నికల్లో ఆ పార్టీకి పరాభవం ఎదురైందన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాతైనా బీఆర్ఎస్ తన స్థాయిని గుర్తిస్తుందని ఆశించామని, కేటీఆర్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి డబ్బు సంచులు మోస్తున్నారని, ఆయనను బీజేపీ కాపాడుతోందని పేర్కొనడం అందుకు నిదర్శనం అన్నారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణా లేదనడం కేటీఆర్ కరడు కట్టిన అహంకారానికి నిదర్శనమని నీలిమ వాపోయారు. ఒక పథకం ప్రకారం బీఆర్ఎస్, బీజేపీకి దగ్గరవుతున్న విషయాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకుండా ప్రత్యక్షంగా బీజేపీకి మద్దతుగా నిలిచిన విషయం ప్రజలు మరచి పోరాన్నారు. మూడు లక్షల కోట్లకు పైగా వార్షిక బడ్జెట్ ప్రవేశపెడితే.. అందులోనూ తప్పులు వెతికిన ప్రతిపక్షాలకు విమర్శలు తప్ప ప్రజా సంక్షేమం పట్టటం లేదని పేర్నొన్నారు. 15 నెలలుగా ప్రజలకు కనపడని కేసీఆర్ ప్రజా పాలన గురించి మాట్లాడటం విడ్డూరమని ఘాటుగా వాఖ్యానించారు.

సమగ్ర, విలువాధారిత విద్యనందిచేందుకు కృషి



- ప్రకాష్ భాయ్ పటేల్

నవతెలంగాణ-బంజారాహిల్స్

విద్యార్థుల కెరీర్ కన్సల్టింగ్, విద్యా సంబంధిత సహకార, ప్లేస్‌మెంట్ సహాయం కోసం దక్షిణ రాష్ట్రాల విద్యార్థులకు రీజనల్ కార్యాలయం ఒక వేదికని, సమగ్ర, విలువాధారిత విద్యనందించేదుకు కృషి చేస్తుందని సంకల్ చంద్ పటేల్ యూనివర్శిటీ అధ్యక్షుడు ప్రకాష్ భాయ్ పటేల్ అన్నారు. చారిటబుల్ ఆర్గనైజేషన్ ద్వారా నడుస్తున్న గుజరాత్‌కు చెందిన సంకల్పచంద్ పటేల్ యూనివర్శిటీ (ఎస్పీయూ) దక్షిణ భారతీయ ప్రాంతీయ కార్యాలయాన్ని హైదరాబాద్ నగరంలోని జ్యూబ్లీహిల్స్ రోడ్ నం.36 లో శుక్రవారం ప్రకాష్ పటేల్‌తో పాటు ఎస్పీయూ ప్రొవోస్ట్ ప్రఫుల్ కుమార్ ఉదానీ, రిజిస్ట్రార్ డా. పరిమల్ త్రివేదీ, ఎస్పీసీఈ ప్రిన్సిపల్ డా. పి.జె. పటేల్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్ పటేల్ మీడియాతో మాట్లాడుతూ.. సమాజానికి ఉపయోగం కలిగించే ముఖ్యమైన వనరుగా పని చేస్తుందన్నారు. గుజరాత్‌లో విద్య ఆరోగ్య సంరక్షణ కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తున్న తాము, తమ యూనివర్శిటీ విద్యార్థులకు స్కూలింగ్ నుంచి పీహెచ్‌డీ వరకు విద్యార్థులకు ఫిలాంత్రోఫిక్, విలువాధారిత, సమగ్ర విద్యను అందిస్తోందన్నారు.

విద్యార్థులకు ఏసీపీ శుభాకాంక్షలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

పది పరీక్షలు రాసే విద్యార్థులకు నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజ్ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ప్రారంభమైన పది పరీక్షలు ప్రశాంతంగా మొదలయ్యాయి విద్యార్థులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్య రాకుండా ఉండాలని నార్త్ జోన్‌లో చర్యలు చేపట్టారు. ప్రతి సెంటర్ వద్ద ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసి విద్యార్థులకు అంతరాయం లేకుండా చూశారు. నార్త్ జోన్ కంటోన్మెంట్ ప్రాంతంలో 32 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఏసీపీ జీ. శంకర్ రాజు, ఎస్పై శ్రీకాంత్, తిరుమలగిరి పీఎస్ హోలీ ఫ్యామిలీ పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ అని శుభాకాంక్షలు చెప్పి, 10 నిమిషాలు ముందుగా ఎగ్జామ్స్ సెంటర్‌కు చేరుకోవాలని, ఎలాంటి ఒత్తిడికి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, ఎండాకాలము తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచనలు ఇచ్చారు. తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ముందుకెళ్లాలని ఆయన విద్యార్థులకు తెలిపారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



- మోస్ట్ చిప్ టెక్నాలజీస్ ఎండీ అండ్ సీఈవో శ్రీనివాస కాకునూను



నవతెలంగాణ-ఓయూ

విద్యార్థులు జీవితములో ప్రత్యేక లక్ష్యంతో ముందుకు సాగాలని దానికి హార్డ్ వర్క్ ఎంతో అవసరమని మోస్ట్ చిప్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఎండీ అండ్ సీఈవో శ్రీనివాస్ కాకునూను సూచించారు. శుక్రవారం ఓయూ ఇంజనీరింగ్ కళాశాల డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆకృతి-2025 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు జీవితములో ప్రతిరోజు కనీసం ఒక్క శాతమైన తమలో ఇంప్రూమెంట్ చేసుకుంటే కెరియర్‌లో ఎన్నో అద్భు తాలు చేస్తారని చెప్పారు. ప్రతి విద్యార్థి హార్డ్ వర్క్‌పై ప్రధాన దృష్టి సారిం చాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇస్రో వారి శాటిలైట్ లాం చింగ్ వెహికల్‌ను రూపొందించి తమలో ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యా కమంలో హెడ్ఎస్ఆర్ఎస్‌సీ హైదరాబాద్ డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ప్రిన్సి పాల్ ప్రొ. చంద్రశేఖర్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ డి. రామకృష్ణ, ఫ్యాకల్టీ అడ్వైజర్ డా. ఎం. శ్యాం సుందర్ విద్యార్థులు ఉద్యోగులు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

వేసవికాలం తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- కార్పొరేటర్ బాబా పసివుద్దీన్
- బోరబండలో వాటర్‌వర్క్స్ అధికారుల పర్యటన



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్,ఎస్‌బీ) రిజర్వాయర్ ఎస్ఆర్ఆర్ పురం సైట్-2, బోరబండను హెచ్ఎండబ్ల్యూఎస్,ఎస్‌బీ సీజీఎం, జీఎంలతో కలిసి బోరబండ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ బాబా పసివుద్దీన్ శుక్రవారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా ఎండీ బాబా ఫసియుద్దిన్ మాట్లడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ వాటర్ బోర్డుకి అధిక మొత్తంలో బడ్జెట్ కేటాయించడంతో ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డికి కృతతలు తెలిపారు. వేసవి, రంజాన్ మాసం సందర్భంగ బోరబండ సెక్షన్‌కు త్రాగునీటి సరఫరాలో ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు, వాటర్ బోర్డ్ ఎండీకి ఫోన్ ద్వారా సమచారం అందించడంతో, వెంటనే సంబంధిత అదికారులను పంపించి నీటి సమస్యను, పరిష్కరించినందున వాటర్ బోర్డ్ ఎండీ. అశోక్ రెడ్డికి కృతతలు చెప్పారు. రిజర్వాయర్‌ని సంబందిత వాటర్ వర్క్స్ మేనేజర్‌లతో కలిసి ఇన్-ఫ్లో, అవుట్-ఫ్లో రికార్డ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఎస్పీఆర్ హిల్స్ సెక్షను మేనెజర్ రాజేంద్ర ప్రసాద్, హెచ్ఎండబ్ల్యూఎస్-ఎస్‌బీ బోరబండ మేనెజర్ జయ ప్రకాష్, స్తానిక బస్తీ నాయకులు, స్తానికులు పాల్గొన్నారు.

వికలాంగుడికి వీల్‌చైర్ అందజేత..



నవతెలంగాణ-సిటీబ్యూరో

పేదలు, వృద్ధులకు సెవెన్ రేస్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ సారా సహాయ సహకాలు అందిస్తూ వస్తున్నారు. శుక్రవారం లాల్‌బజాంకు చెందిన ఓ వ్యక్తికి రెండు కాళ్లు లేవు. విషయం తెలుసుకున్న సారా వీల్‌చైర్‌ను అందజేసి దాతృత్వం చాటుకున్నారు. పేద విద్యార్థులు, మహిళలు, వికలాంగులకు అండగా ఉంటూనే ఉంటానని డాక్టర్ సారా ఈ సందర్భంగా తెలిపారు.

మొదటి రోజు 'పది' పరీక్షలు ప్రశాంతం



నవతెలంగాణ-సిటీబ్యూరో

పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 230 సెంటర్లలో 47,469 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షకు హాజరు కావాల్సిండగా, 161 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. మొత్తంగా 47,195 మంది రెగ్యు లర్, 113 ప్రయివేటు విద్యార్థులు తొలి రోజు పరీక్షకు హాజరైనట్టు డీఈఓ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 14 మండలాల్లో 230 సెంటర్లు ఏర్పాటు చేయగా.. 41 సెంటర్లు కుత్బుల్లాపూర్ మండలంలో ఉన్న ఆయా పాఠశాలల్లో నిర్వహించారు. ఈ మండలంలో 8,599 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 51 మంది పరీక్ష రాయలేదు. జిల్లా వ్యాప్తంగా చూస్తూ కుత్బుల్లాపూర్ మండలంలోనే అత్యధికంగా గైర్హాజరయ్యారు.

తొలిరోజు 'పది' ప్రశాంతం..

- జిల్లాలో 73,990 మంది విద్యార్థుల హాజరు
- మొత్తం 544 మంది గైర్హాజరు
- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, విద్యాశాఖ అధికారులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో పదోతరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 358 కేంద్రాల్లో పదో తరగతి విద్యార్థులు సజావుగా పరీక్ష రాశారు. ఉదయం 8.30 గంటల నుంచి పరీక్షా కేంద్రం లోపలికి అనుమతించారు. విద్యార్థులకు తొలి పరీక్ష కావడంతో ఉరుకులు పరుగులతో కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యాశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తొలిరోజు ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని సంబంధిత అధికారులు తెలిపారు. ఇదిలావుంటే హైదరాబాద్ జిల్లాలో తొలిరోజు ఫస్ట్‌లాంగ్వేజ్ పేపర్-1 పరీక్షకు మొత్తం 74,535 మంది హాజరుకావాల్సి ఉండగా.. 73,990 మంది హాజరయ్యారు. 544 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 99.5శాతం హాజరు నమోదైంది. కాగా టెన్త్ పరీక్షల నిర్వహణకు 14 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించిన సంగతి తెలిసిందే. దీంతో తొలిరోజు 88 పరీక్షా కేంద్రాలను అధికారులు తనిఖీలు చేశారు. ఇందులో హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణీ నాలుగు కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు. కేంద్రాల్లో సౌకర్యాలు, వసతుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని వారికి సూచించారు. తొలి పరీక్షలో ఎక్కడా కూడా మాల్ ప్రాక్టీస్ జరుగలేదని తెలిపారు. ఒక సెంటర్‌ను కలెక్టర్, ఇతర అధికారులు తనిఖీ చేశారు. ఇక అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు చర్యలు చేపట్టారు. కవాడిగూడ ప్రభుత్వ బాలుర



పాఠశాలలో అపశ్రుతి చోటుచేసుకుంది. కేంద్రంలోకి వెళ్తూ ఓ విద్యార్థిని ప్రమాదవశాత్తు గాయపడి ఆస్పత్రిలో చేరి తొలిరోజు పరీక్షకు దూరమైంది.



పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

పదవ తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయనగర్ కాలనీలోని సెయింట్ అన్నాస్ బాలికల ఉన్నత పాఠశాలలో గల పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ సరళిని పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా తాగునీరు అందుబాటులో ఉంచాలనీ, పరీక్షా కేంద్రం ముందు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెయిన్ గేట్ వద్ద విద్యార్థులను బాలురను, బాలికలను వేరువేరుగా తనిఖీ చేసి సెంటర్‌లోకి పంపాలని పోలీసులకు సూచించారు. పరీక్షా కేంద్రంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని చీఫ్ సూపర్‌టెండెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎగ్జామ్ సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ పెరుమల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా 'త్రివేణి సంగమ జలం'



నవతెలంగాణ-సిటీబ్యూరో

భారతదేశంలోని ప్రముఖ ప్రఖ్యాతి చెందిన ట్రావెల్ సంస్థ అయిన సదరన్ ట్రావెల్స్, 2025 మహా కుంభ్మేళాలో భక్తుల అఖండ భక్తికి ప్రతిస్పందనగా ఒక ప్రత్యేక కార్యక్ర మాన్ని చేపట్టింది. సదరన్ ట్రావెల్స్ భక్తులందరికీ ప్రయాణికులందరికీ ఉచితంగా "త్రివేణి సంగమ జలం" అంది స్తున్నారు. గంగా, యమునా, సరస్వతి నదుల పవిత్ర సంగమం వద్ద జరిగిన మహా కుంభ్మేళాకి యాత్రికులు అపూర్వంగా హాజరైన విషయం తెలిసిందే. ఈ భక్తుల ఆధ్యాత్మిక అనుభవాలను మెరుగుపరచడానికి, సదరన్ ట్రావెల్స్ ప్రతి ఇంటికి పవిత్ర త్రివేణి సంగమం యొక్క ఆశీర్వాదాలను తీసుకు రావడానికి "త్రివేణి సంగమ జలం" కార్యక్రమాన్ని ప్రారంభించింది. "త్రివేణి సంగమ జలం" ఉచితంగా అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఇందుకు గాను సదరన్ ట్రావెల్స్ వెబ్సైట్ (www.southerntravels.com) ద్వారా బుక్ చేరుకోవచ్చుని, లేదా దేశవ్యాప్తంగా ఉన్న అన్నీ సదరన్ ట్రావెల్స్ బ్రాంచి కార్యాలయాలను సందర్శించగలరని కోరారు.

24లోగా ఉపకార వేతనాల దరఖాస్తులను సమర్పించాలి

- జిల్లా వెనుబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జి.ఆశన్న



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్, యూనివర్సిటీ, ఇంజనీరింగ్, నర్సింగ్, ఇతర కాలేజీలకు సంబంధించిన యజమాన్యాలు ఈనెల 24లోగా తమ కాలేజీ విద్యార్థులకు సంబంధించిన (ఫ్రెష్, రెన్యూవల్ స్కాలర్‌షిప్ దర ఖాస్తులను (హార్డ్ కాపీస్) 2017-18 నుంచి 2024-25 వరకు ఉన్నటువంటి పెండింగ్ అప్లికేషన్లు(హార్డ్ కాపీస్) సమర్పించాలని శుక్రవారం జిల్లా వెనుక బడిన తరగతుల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు. ట్యూషన్ ఫీజుకు సంబం ధించి చాలా దరఖాస్తులు 'నో ఫీజ్' అని -పాస్ వెబ్‌సైట్‌లో చూపిస్తుందనీ, కాలేజీ యజమాన్యం సదరు సంబంధిత డిపార్టుమెంట్ సోషల్ వెల్ఫేర్ గాని, పీఎంయూ సెంటర్ గాని సంప్రదించి ఫీజు స్ట్రక్చర్‌ను ఈ-పాస్‌లో అప్‌డేట్ చేయించుకోవాల్సిందిగా ఆశన్న విజ్ఞప్తి చేశారు. ఇలా చేసుకోవడం ద్వారా కాలేజీలకు స్కాలర్‌షిప్, ట్యూషన్ ఫీజు రాకపోయినచో దానికి పూర్తి భాద్యత సంబంధిత కాలేజీ ప్రిన్సిపల్స్, యజమాన్యం వహించాల్సి ఉంటుందనీ, వారిపై శాఖా పరమైన చర్యలకు సంబంధిత పై అధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

డబీర్‌పురాలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు..

- రెండు క్వింటాళ్ల కుళ్లిపోయిన మటన్ స్వాధీనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

పాతబస్తీలోని డబీర్ పురాలో ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, వెటర్నరీ అధికారులు ప్రత్యేక తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నిల్వవుంచిన మటన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కుళ్లిపోయిన మటన్ దుర్వాసన వస్తున్నా మార్కెట్‌లో సరఫరా చేస్తున్న నిందితున్ని అరెస్టు చేశారు. మటన్‌కు మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉండంతో పెద్ద ఎత్తున మటన్‌ను నిర్వచేశారిని అధికారులు గుర్తించారు. స్థానికంగా నివాస ముండే మొహమ్మద్ మిస్బా హుద్దీన్ అనే వ్యాపారిని అరెస్టు చేసిన పోలీసులు రెండు క్వింటాళ్ల కుళ్లిపోయిన మటన్‌ను స్వాధీరం చేసుకున్నారు. వాటి విలువ రూ.1,50,000లుంటుందని టాస్క్‌ఫోర్సు అదనపు డీసీపీ ఏ.శ్రీనివాసరావు తెలిపారు.

వయోవృద్ధుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

- ఆస్టర్ డీఎం మార్కెటింగ్ విభాగాధిపతి రవికుమార్
- వద్ధులకు రూ.2.5 లక్షల గల మందుల పంపిణీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

మన దేశంలో వద్దుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని, వారి ఆరోగ్యంపై దృష్టి సారించి, వారి అవసరాలను తీర్చడం చాలా ముఖ్యమని ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ సంస్థ మార్కెటింగ్ విభాగాధిపతి రవికుమార్ అన్నారు. ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి, ఆస్టర్ డీఎం ఫౌండేషన్ల ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని ఆర్కే ఫౌండేషన్ ఓల్డేజ్ హెూంలోని వృద్ధులకు రూ.2.5 లక్షల విలువైన మందులు, సర్జికల్ పరికరాలను గురువారం అందజేశారు. సపోర్ట్ ఫర్ జేరియాట్రిక్ కేర్ కార్యక్రమంలో భాగంగా ఈ వితరణ చేశారు. శ్రీనివాస సమాజసేవ ఛారిట బుల్ ట్రస్టు భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు చెంగల్‌రెడ్డి తెలిపారు. అండదండలు అంతగాలేని నిరుపేద వద్దులకు ఇలాంటి సాయం ఎంతైనా అవసరమనీ, వారికి రోజువారీ ఆహారం అందించడంతో పాటు వారి ఆరోగ్య విషయాలను కూడా పట్టించుకోవాలనీ, ఇందుకు ఇలాంటి దాతత్వ కార్యక్రమాలు ఎంతగానో సహాపడతాయని ఆర్కే ఫౌండేషన్ ప్రతినిధులు కృతజ్ఞత వ్యక్తం చేశారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE: MEDCHAL MALKAJGIRI DISTRICT AT: KUKATPALLY
O.S.NO: 15 OF 2025

Between :
1.BatchuPanduRanganath,S/o Late B.B.LN Swamy, Occ: Retd Employee , Aged about:75 years, Flat No:103/Plot 1454 and 1455/Sree Sai Nilayam, Apuroopa Colony,Pragathinagar, Nizampet,MedchalMalkajgiri, Telangana-500090
2.BatchuPavan Kumar, S/o BatchuPanduRanganath, Occ:Pvt Employee , Aged abt 44 years, Flat No:103/Plot 1454 and 1455/Sree Sai Nilayam, Apuroopa ColonyPragathinagar,Nizampet, MedchalMalkajgiri, Telangana-500090
3.Batchu Praveen Kumar S/o BatchuPanduRanganath, Occu: Pvt Employee , Aged abt 43 years, Flat No:103/Plot 1454 and 1455/Sree Sai Nilayam, Apuroopa Colony, Pragathinagar NizampetMedchalMalkajgiri, Telangana-500090
...Plaintiffs

AND

1. The Tahsildar Kukatpally Mandal, Medchal -Malkajgiri District, Telangana State.
2.The Tahsildar Srikurmam Srikakalum district AndhraPradesh
3.All Concerned
...Defendants

NOTICE TO THE CONCERNED PERSONS

Please take the notice that above named plaintiffs filed above suit for declaration to declare them as legal heirs of deceased Smt. N.V.S. RevathiThayaru,Who died intestate on. 11.03.2023. The suit stands posted on 01.04.2025 . If any person or person is/are having any objections he/she/they may appear before the Hon'ble court on.01.04.2025 At 10.30 a. m. Either in person or through an Advocate. Failing which the matter will be decided as per law in your absence.

SCHEDULE OF PROPERTY

Suit Schedule Property A:- HIG Flat No. 85, Block 6(First Floor) with built up area is 899.32 Sq Feet with an undivided share of land 45.53 Sq Yards KPHB COLONY PHASE V (HIG) (15-31) , Kukatpally (M) Medchal Malkajgiri district Telangana bounded as below : North : HIG Flat No B 6/F 86, South : open to sky, East : HIG Flat no B 6/F 88, West : open to sky

Suit Schedule Property B :

All that the Residential house - Penkutilluie Tiled House no 2-178 2-179 with a total area of 509.7 Sq Yards with built up area 602 SqFt in survey no 715/4 situated at srikurmam , Srikakulam District Andhra Pradesh SRO Srikakulam vide doc no.3129& bounded as below:
South:Srikurmagundamcheruvu guttu, North : main road, East :SuklaKanna Rao Rcc Building West :VuppadaChinnavadu And SCH House joint wall

(BY THE ORDER OF THE COURT)
N.VIDYALAXMI
K.SIVAPRIYA, ADVOCATES
MOB: 9492329255

In the Court of the Hon'ble Principal District & Sessions Judge, Medchal Malkajgiri District, At Kushaiguda
Tr. O.P. No. 52 of 2024

Between:
M/s.I.T.M. Business School (a unit of I.T.M. Trust)
...Petitioner

And

Mrs. Settipalli Jyothi & 8 Others
....Respondents

Notice is hereby issued pursuant to the order of the Hon'ble Prl. District & Sessions Judge, Medchal Malkajgiri District, at Kushaiguda in Transfer O.P.No.52 of 2024 filed by M/s. I.T.M.Business School, the Petitioner as against Mrs. Settipalli Jyothi & 8 Others and the Hon'ble court vide. its order dated directed to issue notice to Respondents No. 2 & 3 by was of substituted service. Whereas, M/s.I.T.M. Business School, the petitioner has instituted a transfer petition and the Petitioner arrayed the following parties as Respondents No. 2 & 3 viz. Mrs.B.Anuradha W/o B.Naga Bhushan, aged about 41 years, Occ: House wife, and Mr. Chinta Satyanarayana Reddy S/o Ch. Deva Reddy, aged about: 68 years, Occ: Business, who are hereby issued called upon / wanted to appear either in person or through a duly instructed counsel / pleader, and who is able to answer all material questions relating to the transfer petition, or who shall be accompanied by some person able to answer all such questions, on the 23 rd day of March, 2025 at 10-30 AM in the forenoon to Show Cause against the said Application, failing which the said Application will be heard and determined exparte.

-S/d-
Mrs. BHARATHI AINDLEY
NIKHIL KHADKIKAR
Advocates
5-1-941 to 947, St. No. 16, Jambagh, Hyderabad - 500012.
Contact No. 9666985926
(Counsels for Petitioner)

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM XXV ADDI CHIEF JUDGECOURT ,CITY CIVIL CORT, AT: HYDERABAD
MVOP. NO.2011 OF 2023

Between:
Vadde Rukkamma and Others.
...Petitioner

And

Vikas Kumar Singh a nd Others..
....Respondents

To,
1. Vikas Kingh Singh,S/o,Gotamu Kashiram,,Occ:Business,R/o.H.No. 14-75/5,Sri Ram Nagar Colony, Patancheru,Sangareddy, Dist (Owner Of Yamaha Bick Crime Vehicle Bearing No,TS 15 FA 0607
...R1

Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on 3-4-2025.at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
M.Vishwanath,
Advocate
Punjagutta, Hyderabad.

PUBLIC NOTICE

General Public hereby informed that my client **Arra Venkateshwar Reddy**, son of **A. Narasimha Reddy,** aged about 42 years, Occupation: Employee, Residing at H.No.3-12-28/5, Plot No.5, Srinivasa Nagar, Vishalandra Colony, Mansoorabad, L.B.Nagar, Hayathnagar, Ranga Reddy District, 500068, Telangana State, is the absolute owner through a Registered Sale Deed Vide Document No.10296 of 2008, Dated: 03/10/2008, registered in the office of Joint Sub-Registrar, R.O., L.B.Nagar, Ranga Reddy (East) District and read with Rectification Deed Vide Document No.5428 of 2024, Dated: 25/06/2024, registered in the office of Sub-Registrar, L.B.Nagar, Ranga Reddy District, in respect of the Piece and Parcel of the Open Land Bearing Plot No.9, Admeasuring 400 Square Yards, or its Equivalent to 334.44 Square Meters, in Survey No.60/D, (Old Sy. No.60 Part), in Ward No.8, Block No.3, Situated at **Hanuman Nagar of Karmanghat Village, Saroornagar Revenue Mandal, Ranga Reddy District, Under G.H.M.C., L.B. Nagar Circle And Bounded By North : Plot No.8, South : Plot No.10, East: 30'-0" Wide Road, West : Neighbours Plots.**
It is represented by my client, that the following original link document i.e., Registered Agreement of Sale Cum GPA, Vide Document No.6924 of 2005, Book-I, dated: 28/06/2005, Registered in the office of the Sub-Registrar, Champapet, Ranga Reddy District, while travelling form L.B.Nagar to Vishalandra Colony, the said document was misplaced on 05/03/2025, 12:00 PM, the said document (6924 of 2005) was lost and it was not traceable in spite of best efforts and it is lost beyond recovery.
In case any Person(s) or claimant has come into possession of the said original document, the same be restored to us within 15 days from the date of publication of this notice, failing it will be presumed that the above said property is free from encumbrances and any claim in respect thereof against my client will proceed further and complete the transaction. No further objections will be entertained and it shall be Null and Void and ineffective and shall be deemed to have been waived.

KOTLA SUDHAKAR
Advocate & Legal Advisor
H.No.7-3-23, Mallikarjuna Nagar, Bairamalguda Village, Saroornagar, Hydeabad-500079. Mobile No.0-9390626508
Dated 22/03/2025

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE AT: WANAPARTHY
A.S.No. 28 OF 2024

BETWEEN:-
వాకిటి కృష్ణయ్య
.......Appellant

మరియు

వాకిటి ఉత్తరన్న మరియు తదితరులు
...Respondents

To

R.6 మసున శంకర్ S/o M. అచ్చయ్య, వయస్సు: 58 సం॥లు, వృత్తి: వ్యవసాయం Employee, R/o H.No.7-1-383/75, వినాయకనగర్, సైదాబాద్, హైదరాబాద్-500059, R.7 మసున మాధవి W/o శంకర్, వయస్సు: మేజర్, వృత్తి: Employee, R/o H.No.7-1-383/75,వినాయకనగర్, సైదాబాద్, హైదరాబాద్-500059.

ఇందుమూలముగా పైన కనబరచిన వ్యక్తులకు తెలియపరచడం ఏమనగా పైన పేర్కొన్న గౌరవ కోర్టు వారి ఎదుట వాకిటి కృష్ణయ్య అను వాది మీ పై దావా వేసి ఉన్నారు. అది దావా As.No.28 of 2024 గా ఉన్నది. అయితే ఇట్టి కేసుకై పైన కనబరచిన మీ ఇరువురి హాజరుకై కోర్టు వారు పలుమార్లు సమన్లుయ నోటీసులు పంపినారు. కానీ మీరు ఇరువురు ఉద్దేశపూర్వకంగా తిరస్కరి స్తున్నందున గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు గాను పత్రికా ముఖంగా మీకు హాజరు నిమిత్తమై నోటీసులు ఇవ్వడం జరుగుతున్నది. అందుకు గాను పై కనబరచిన కేసు మీ హాజరుకై తేది: 09-04-2025 నాడు వాయిదా కలదు. కావున ఆ రోజున మీరు వ్యక్తిగతంగా గానీ మరియు మీ తరపున ప్లీడరు గాని హాజరయి జవాబు దాఖలు చేయవలసి ఉంటుంది. లేని పక్షంలో పై దావా న్యాయ సూత్రాల ప్రకారం మీకు వ్యతిరేకంగా నిర్ణయించబడుతుంది.

// గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

D. Kiran Kumar
MD. Khaleel Pasha
Advocates,
Wanaparthy,
Cell: 9440493926, 6305462781

IN THE COURT OF THE HONBLE I ADDL JUNIOR CIVIL JUDGE –CUM- VIII ADDL JUDICAL MEGISTRATE OF FIRST CLASS MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: ATHVELLI
O.S.NO.327 OF 2024

BETWEEN: -
Sri Vallapu Satyanarayana
...Plaintiff

AND

1.Sri M.Agamaiah S/o.Late sathaiah, Aged about 55 years, Occ: business,
2.Gopi S/o. Not Known, Aged about 60 years, Occ: business,
3.Kumar S/o. Not Known, Aged about 50 years, Occ: business,
4.Vedkumar (alias nara bhai) S/o. Not Known, Aged about 58 years, Occ: business,
5.D.laxmana swamy S/o.Not Known, Aged about 55 years, Occ: business,
6.P.Ramesh kumar @ Ramesh Kumar Paul Aged about 54 years, Occ: business,
7.P.Anil kumar @ Anil Kumar Paul Aged about 50 years, Occ: business, All are R/o.H.No. 30-647/6/36, Shiva Gowri enclave, opp: Jain Mandir, Neredmet, Malkajgiri, Telangana
...Defendants

NOTICE

Please take notice that the Plaintiff have filed a suit for Perpectual Injunction against defendants for not to interfere with in respect of suit schedule properties and plaintiff is the absolute owner and possessor of Agriculture land in Sy.No. 80/1, Admeasuring Acs. 1.25 Gts situated at Shamirpet Village, Shamirpet Mandal, Medchal Malkajgiri District and Telangana State and, You hereby informed through this notice to appear before above said Court, either personally or through Advocate on 24.03.2025 at 10:30 A.M, failing which the Hon'ble Court shall proceed further as per law.

(BY ORDER OF THE COURT)
K. VENKATAIAH
Advocate
#4-70/E, Flat No. 203, Prutvi complex, Street No. 8, Habsiguda, Hyderabad-07. Cell: 81062 84837

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE: NAGARKURNOOL DIST AT : KALWAKURTHY
O.S.NO.16 OF 2022

BETWEEN:
A. Buchamma and 06 others
...Plaintiffs

AND

G.KRISHNAIAH and 31 others
...Defendants

To,
22. GANDHAM.LAKSHMI, W/o. LATE G.Chandra Kumar Aged about 50 years, Occ: Housewife
23.GANDHAM.GOUTHAM, S/o.LATE G. Chandra Kumar Aged about 32 years, Occ: Pvt Job
24.GANDHAM.SAI, S/o.LATE G.Chandra Kumar Aged about 28 years, Occ: Pvt Job
25.GANDHAM.MANIKANTA, S/o.LATE G. Chandra Kumar Aged about 25 years, Occ: Student (All the defendants' no.22 to 25 is R/o. H.No.2-95, Hanumasai Nagar, Vijayapuri Colony, Uppal, Malkajgiri Dist)
31.UPPALA.KUSUMAMMA, W/o U.Prabhakar, D/o Late G.Rajaiah Aged about 60 Years, Occ: Housewife R/o. H.No.15-96 & 97, Amrutha Colony, Uppal Malkajgiri Dist
32. UPPALA.ANURADHA, W/o U.Sridhar, D/o Late G.Rajaiah Aged about 50 years, Occ: Housewife R/o. Plot No.320, Street No.2, phase No.I, Vishakanagar Colony Almasguda Post Near Balapur, R.R.Dist
... Defendants No.22to25&31, 32

Take notice that the above named Plaintiff has instituted the above said suit No.16/2022 against the above said Defendants No.22 to 25 & 31, 32 of you are the Defendants No.22 to 25 & 31, 32 are hereby summoned to appear before this Hon'ble Court in person on DT: **11-04-2025** at 10.30 am. In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

// **By Order of the Court** //
--Sd/--
M RANGASWAMY
Counsel for Plaintiff
O/o 8-53/6, Dwarakanagar Uppal, Medchal-Malkajgiri Dist-39

IN THE COURT OF THE HON'BLE JUDICIAL FIRST CLASS OF FIRST CLASS (EXCISE) ,RANGA REDDY-CUM-V ADDL. JUNIOR CIVIL JUDGE R.R.DISTRICT AT: L.B.NAGAR
O.S.No.434 OF 2020

Between:
Syndicate Bank Adibatla Branch Rep it's branch Manager
...Plaintiff

And

Santhosh Das And Others
...Defendants

To
1.Santhosh Das S/o.A.Bhadri Das R/o.H.No.8-7 -18/1, Santhoshmatha colony, Hasthinapuram, Ranga Reddy District- 500079
&
M/s Ridhi Sidhi Kirana & General Store, Sy.no.47 ,H.No. 8-12, Ramidi Malla Reddy Nagar, Almasguda, Saroornagar. R.R.District 500058
2.AMBOJI VENKATESH CHARY S/o. Amboji Muralidhar Chary H.No. 13-6-304/2, Kumrajiguda, Near Tulja Bhavani Temple Asifnagar, 500006-Telangana .

NOTICE

Please take notice that the above plaintiff filed above case for recovery of amount of Rs. Rs. 5,43,932-36/- regarding your loan amount against you both and the said case is posted to 25-03-2025 for your appearance and filing counter before the Hon'ble Judicial First Class Of First Class (Excise) ,Ranga Reddy-Cum-V Addl. Junior Civil Judge R.R.District At L.B.Nagar at 10-30 A.M. either in person or through an advocate , in case if you fail to appear before the above Hon'ble Court on the said date and time ,the matter will be heard exparty

//BY ORDER OF THE COURT//
By
G.Ramashankar
Advocate
12-1/5,Teegala Ram Reddy Colony Badangpet (v),Saroornagar(m) R.R.District-058-7032251997

IN THE HONOURABLE COURT OF THE JUDGE; ADDITIONAL FAMILY COURT AT : VISAKHAPTNAM
F.C.O.P. 1397/2023

Between:
Smt Banki (Yeluri) Asha Latha
...Petitioner

And

1 Yeluri Shankar Rao
2 Yeluri Lalitha
3 Chidurala (Yeluri) Deepika
...Respondents

NOTICE

To,
Respondent No-3
Chidurala (Yeluri) Deepika,
W/o Chidurala Vishnu, D/o Yeluri Shankar Rao,D.No 18-1/10, Plot No 21/A,Adarsh Nagar, Road No-2, Peerzadiguda, Uppal, Hyderabad-500 098

Please take notice that the above OP, which is filed against you and other respondents for return of dowry, etc., stands posted to 16-04-2025 for your appearance. If you have any objections you may attend either personally or through an advocate before the above said Court at 10.30 A.M. on **16-04-2025** failing which the matter will be decided exparte in your absence.

(By order of the Commission)
KANDREGULA LEELA HARI PRASAD
Advocate
Gajuwaka
Visakhapatnam-26
Cell: 81432 72790

IN THE COURT OF THE HON'BLE VIII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT HYDERABAD
O.S. NO 871 OF 2025

Between:
Smt. Polagoni Lalitha and others
...Plaintiffs

AND

The Tahsildar Bandlaguda Mandal & All Concerned
...Defendants

To
All concerned

(a) Please take notice that the Plaintiffs named above have filed the above suit to declare them as legal heirs of Late. P. Vijay Kumar, Late P. Lingamaiah @ Lingaiah & Smt. P. Rukamma and the said matter is posted for appearance on **03-04-2025** at 10.30 AM.

If any person/individual has got any sorts of objection or claim, they may appear before the Hon'ble court either in person or through pleader and submit their objections or claims, before the Hon'ble court, if any, on the above mentioned date and time. Otherwise, the matter will be heard and decided in your absence.

"BY ORDER OF THE COURT"
M/S TEKULA MAHESHWAR RAO
G. SARITHA RANI
ADVOCATES
Flat No 102, Alekhya Residency #10-4-35/3, Humayun Nagar, Hyderabad
COUNSEL FOR PLAINTIFFS

(MATTER FOR PUBLICATION)
IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT : HYDERABADO.
S NO. 853 OF 2025

Between:
Deepa Narain Lalwani & others
...Plaintiffs

And

The Tahsildar & others
...Defendants

To,
All Concerned
Sir's/Madam,

Please take notice that the above suit in O.S No.853 of 2025 for declaration of legal heirs is filed before this Hon'ble Court by the plaintiffs against defendants and the same is coming up for appearance and the same stands posted on 29.03.2025. Please make it convenient to present either in person or through your Counsel before the above Hon'ble court at 10.30 A.M on **29.03.2025**, if you fail to appear on the above date the matter will be heard and decided as exparte.

(By order of the Court)
Sd/-
JAKKULA SRIDHAR
Advocate
Plot No.2, Road No.6, Trimurthy Colony, Mahindra Hills, East Marredpally, Secunderabad – 26.

IN THE COURT OF THE 1st SENIOR CIVIL JUDGE AT : BHONGIR
E.P. No. 54 OF 2024
IN
O.SNO. 191 OF 2016

Between:
M/S. PADMODAYA CHIT FUND PVT. LTD., BHONGIR.
...Petitioner/Drecree Holder

AND

JDR NO. 3. Sri. Devunoory Devaiah, S/o. Anandam, age: 54 years, Occ: School Assistant, Z.P.H.S. Reddypally Village, Veenavanka Mandal, Karimnagar Dist. H.No. 3-7-625/A, Vavilalapally Karim Nagar Dist. Cell No. 9490258523.
JDR NO.5. Sri. Danya Yadagiri,S/o. Dhanaiah, age: 54 years, Occ: Tech - 1,/SSE/Electrician, Foremen, South Central Railway, Railway Station. Hyderaabad. H.No. 12-12-130/D, Ravinder Nagar, Seethafalmandi, Secunderabad. Cell No. 9160076889.
...... Judgement Debtors

Whereas the Decree Holder i.e, M/S. Padmodaya Chit Fund Pvt., Ltd., filed the E.P.No.54 of 2024 for recovery of E.P. amount Rs.2,14,500/- against Judgement Debtors 2 to 5 for nonpayment of E.P amount U/S. 32 of Chit Fund Act, 1982 You are hereby required to appear before the Hon'ble 1st Senior Civil Judge at Bhongir in person or by Advocate duly on 23-04-2025 at 10:30 A.M, at Hon'ble 1 Senior Civil Judge at Bhongir as to show cause why this application should not be compiled with that we may cause for to be done. And also take notice that in default of your appearance is made on the above mentioned date and time and no counter is filed the case will be disposed off on its merits as exparte.

// By order of the Hon'ble Principal Senior Civil Judge, at Bhongir //

IN THE COURT OF HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT: AT: HAYATHNAGAR
OS. NO. 198 OF 2024

Between:
Nookala Anitha, W/o. Nookala Aravinda Reddy Rep. by her GPA Holder Gantla Madhusudhan Reddy, S/o. Gantla Rami Reddy
......Plaintiff

AND

Vadde Nageshwar Rao, S/o. Vadde Venkatarama Rao & 4 Others
....Defendants

Defendant No. 3
To,
Yindapalli Madhavi Latha, W/o. Yindapalli Lakshman Rao Age. 50, Occ. House Hold, R/o. H. No. 15-44, Vidhya Nagar, Sathupalli Khammam District-507 303, Telangana
..... Defendant No. 3

Please take notice that, the above said Plaintiff in the above Perpetual Injunction suit has filed suit against you and others, Granting Perpetual Injunction in favour of the Plaintiff restraining the Defendant No. 1 to 5 and their men, henchmen, servants, pending registered document holders etc., or anybody claiming through them from causing any sort of interference into the peaceful possession and enjoyment of the Plaintiff, over the suit scheduled properties. The above suit is posted to 09.04.2025. You are hereby summoned to appear before this Hon'ble Court on **09.04.2025,** at about 10.30 A.M., either in person (or) through an Advocate, failing which the matter will be decided as per law. Hence this notice.

SCHEDULED PROPERTY

All that the Plot bearing No. 171, admeasuring 500 Sy. Yards (or) 418.06 Sy. Meters, in Sy. No. 265, situated at Amberpet Kalan, Peddamberpet Village & Gram Panchayat, Hayathnagar Mandal, presently Abdullapurmet Mandal, Ranga Reddy District, Telangana, is bounded by;**North** :
Plot No. 156,**South :** 40' Feet Wide Road **East:** Plot No. 170
West: Plot No. 172

(BY ORDER OF THE COURT)
M/s. CHAKRAVARTHY TALLURI
Advocates && Associates
Hayathangar-Ranga Reddy
Mobile No.99890 66858, 94910 55858
Counsel for the Plaintiff



మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కుర్మల్‌గూడ ఇందిరానగర్ కాలానికి చెందిన కుళ్ళ జంపయ్య ఆరోగ్య సమస్యతో బాధపడుతూ మల్లాపూర్‌లోని రికవరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి ఆస్పత్రికి చేరుకొని అతన్ని పరామర్శించారు. తర్వాత అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

100 శాతం పన్నుల వసూళ్లే లక్ష్యం :కమిషనర్ సరస్వతి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

100 శాతం ఇంటి పన్నులు వసూళ్ళు చేయడమే తమ లక్ష్యమని కమిషనర్ సరస్వతి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న శ్రీహిల్స్ కాలనీ ఫేస్-2లో ఇంటి పన్నుల వసూళ్ల కోసం డైరెక్ట్‌గా కమిషనర్ సరస్వతి రంగంలోకి దిగారు. ఈ మేరకు శుక్రవారం కమిషనర్ సరస్వతి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్లలో ప్రజల నుండి ఇంటి పన్నులు వసూలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలు ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించి.. మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మమతా, బిల్ కలెక్టర్ కమలాకర్ రెడ్డి, శ్రీహిల్స్ జాయింట్ సెక్రటరీ జెల్ల రమేష్ గౌడ్, వెంకటయ్య రవీందర్ నాయక్, యాదగిరి రావు, రవీందర్, ఉగ్రీ గిరి తదితరులు పాల్గొన్నారు.

మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్



నవతెలంగాణ-చంపాపేట్

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మతతత్వ విధానాలను దిక్కరిస్తూ ప్రతి ఘటనకు పూనుకోవాలని కార్మిక వర్గానికి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ సౌత్ జిల్లా సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండో రోజు రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. 44కార్మిక చట్టాలను రద్దు చేసి, అన్నింటినీ అనుసంధానం చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకు వచ్చి కార్మికుల హక్కులపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దుచేసి 12 గంటలకు తీసుకురావడం కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. శ్రామిక మహిళలకు పని ప్రదేశాలలో భద్రత కరువైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం పెంచాలన్న సోయి ప్రభుత్వాలకు లేకుండా పోయిందన్నారు. ఈఎస్ఐ పేరుతో కట్ అవుతున్న డబ్బులు కార్మికులకు పూర్తిస్థాయిలో ట్రీట్మెంట్ రూపంలో అమలవ్వడం లేదని, జాప్యం జరుగుతుందని ఆరోపించారు. పండగ, ప్రసూతి, క్యాజువల్స్ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు మున్సిపల్ కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల వరం చేస్తున్నది ఆరోపించారు. వ్యూహాత్మక అమ్మకాల పేరుతో ప్రభుత్వ రంగ సంస్థల్లో 100% వాటాలు తెగ నమ్ముతున్నదని, సింగరేణిలోని నాలుగు బొగ్గు గనులను వేలం వెయ్యటానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నది ఆరోపించారు. అంతేకాదు కార్మికులు, మధ్యతరగతి ప్రజల్లో అత్యధికులు పాలసీదారులుగా ఉన్న ఎల్ఐసీ వాటాలను అమ్మేందుకు తెగబడిందని, కనీస వేతనాలు నిర్ణయించే విధానానికి స్వస్తి పలికిందని, సమ్మె హక్కును కాలరాస్తున్న వెల్ఫేర్ బోర్డులను నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని, అందులో పొందుపరిచిన లౌకికవాదాన్ని తారుమారు చేస్తూ హిందూ రాజ్య స్థాపన లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ తన ఏజెండాను ముందుకు తీసుకువెళ్తుందని మండిపడ్డారు. నిరుద్యోగం పేదరికం ఆకలి మొదలైన కీలక అంశాలను ప్రజల దృష్టి నుండి మరల్చడానికి ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని మతతత్వ శక్తులు ఇప్పుడు ప్రయత్నాలు చేస్తున్నారని, కావున వీటిని తిప్పికొట్టే విధంగా కార్మికుల కనీస వేతనాలు పెంచుకోవడానికి పెద్ద ఎత్తున భవిష్యత్‌లో ఉద్యమాలు, పోరాటాలు, ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సౌత్ జిల్లా అధ్యక్షురాలు మీనా, కిషన్, రామ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో యువత రాణించాలి

- ప్రముఖ సినీనటి హనీరోజ్



నవతెలంగాణ-హస్తినాపురం

ఉద్యోగాల కోసం నిరీక్షించకుండా యువతీ యువకులు స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని రాణించాలని ప్రముఖ సినీనటి కుమారి హనీ రోజ్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం హస్తినాపురం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ యాక్సిస్ బ్యాంక్ దగ్గర బీఎన్‌రెడ్డి నగర్ సాగర్ రోడ్ ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ స్వర్ణ గిరి కాంచీపురం సిల్క్‌ను బంజారా వెల్ఫేర్ మీర్‌పేట్ అసోసియేషన్ అధ్యక్షులు నేనావత్ రామ్ లాల్ నాయక్, గోపాల్ నాయక్ కూతుర్లు మేనేజింగ్ డైరెక్టర్ సునీత, కావ్య శ్రీ, 1104 యూనియన్ కోశాధికారి కల్వకుర్తి నేనావత్ బాలు నాయక్, బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రామావత్ బన్సీలాల్, ప్రొఫెసర్ శంకర్ నాయక్, సునీత, వనిత, ఎస్. స్మార్ట్ సూపర్ మార్కెట్ శ్రీను, చారకొండ మండలం కాంగ్రెస్ పార్టీ యువజన జనరల్ సెక్రెటరీ వి. గోపీ నాయక్, దేవరకొండ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామావత్ హనుమంతు నాయక్ నాయకులు, నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నాణ్యమైన అన్ని రకాల పట్టు శారీస్, డిజైనర్ శారీస్, హ్యాండ్లూమ్ శారీస్, చుడీదార్స్, గాగ్రాస్, వెస్టన్ వేర్, ఇండో వెస్టన్ వేర్, మెన్స్, కిడ్స్, ఎథిక్స్ వేర్‌లలో ప్రత్యేకత ఉండాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన వెరైటీలను అందించి.. ప్రజల మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు. మారుతున్న కాలానుగుణంగా కష్టపడి పురోగతి చెంది, వినియోగదారులకు మంచి సేవలు అందించినప్పుడే వినియగదారులు ఎల్లప్పుడూ మీ సేవ సౌకర్యాలు అందుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సాయి రమేష్, రవి, రాయుడు, సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా శ్రీరామ్ కోటయ్య



నవతెలంగాణ - చంపాపేట్

హైదరాబాద్ యాకుత్‌పురా నియోజకవర్గం గౌలిపురా డివిజన్ పరిధిలోని లాల్ దర్వాజా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా శ్రీరామ్ కోటయ్య ఎన్నికయ్యారు. శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో శ్రీరామ్ కోటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు శ్రీరామ్ కోటయ్య మాట్లాడుతూ.. అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించడంతో పాటు అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'పేదలకు భరోసా సీఎం సహాయ నిధి'



నవతెలంగాణ-ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని చైతన్యపురి డివిజన్ గణేష్‌పురి కాలనీకి చెందిన గౌరవ్ గౌడ్.. గత కొన్ని రోజులుగా వెన్నుముక సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులు ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సంప్రదించారు. స్పందించిన సుధీర్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి వారి కుటుంబ సభ్యులకు ఎల్.ఓ.సీ(లెటర్ ఆఫ్ క్రెడిట్) కింద రెండు లక్షల రూపాయలు మంజూరు చేయించారు. ఈ మేరకు ఎమ్మెల్యే శుక్రవారం బాధితుడి తల్లి సంధ్యకి మంజూరైన చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.

నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేద, మధ్య తరగతి ప్రజలకు కష్టకాలంలో ఎంతో భరోసా ఇస్తుందని ప్రజా సేవకులు, యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఎ. అంజలికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఆమెకు ఉపేందర్ రెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన అంజలి గత కొంత కాలంగా అనారోగ్యంతో ప్రైవేటు హాస్పి టల్లో చికిత్స పొందారని వివరించారు. ఆర్థిక స్థోమత లేని ఆమె పరిస్థితిని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యులు సీనియర్ కాంగ్రెస్ నేత దేప భాస్కర్ రెడ్డిల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. వెంటనే స్పందించిన వారు అం జలికి ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు అయ్యే విధంగా కృషి చేశారని తెలిపారు. ప్రైవేటు హాస్పిటల్లో వైద్యం అంటే లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుందని, సీఎం సహాయ నిధి ఇటువంటి వారికి



ఎంతో మేలు చేస్తుం దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖిల్లా మైసమ్మ దేవాలయం డైరెక్టర్ పగడాల శ్రీశైలం, పెద్దపూర సైదులు, రేణుక, లింగుస్వామి గౌడ్, జయశ్రీ, పగడాల ఎల్లయ్య, పగిళ్ల అంజి, సంతోష్, శ్వేత, ప్రశాంత్, నగేష్ పాల్గొన్నారు.

బండ్లగూడలో బొడ్రాయి లింగ స్వామి పూజలు

నవతెలంగాణ -నాగోల్

మూడు రోజులపాటు నాగోలు డివిజన్‌లోని బండ్లగూడలో బొడ్రాయి లింగస్వామి పూజలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు బొడ్రాయి ఉత్సవ కమిటీ అడ్వైజర్ తూర్పాటి చిరంజీవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు బొడ్రాయి లింగస్వామికి జలాభిషేకం, పంచామృతములతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆదివారం సాయంత్రం వరకు అంగరంగ వైభవంగా బండ్లగూడ గ్రామంలోని బొడ్రాయి లింగస్వామికి, పోచమ్మ తల్లికి, మహంకాళి అమ్మవారికి, పార్కు మైసమ్మకు, కట్టమైసమ్మలకు సాంప్రదాయ పద్ధతిగా భోనం, నైవేద్యం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని ప్రజలంతా అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.





కబ్జాదారులకు కనక వర్షం

- బోడుప్పల్‌లో రోజు రోజుకూ పుట్టుకొస్తున్న ఇంటి పట్టాలు
- తూతూ మంత్రంగా చర్యలు
- పటిష్టమైన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములు కాపాడాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జా దారుల పాలిట కనక వర్షం కురిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములలో రాత్రి రాత్రే నిర్మాణాలు చేపడుతూ యథేచ్ఛగా ప్రభుత్వ భూములను కొల్లగొడుతున్నారు. అంతే కాకుండా ఎప్పుడో సర్కారు పంపిణీ చేసిన ఇండ్ల పట్టాలను ఇప్పుడు పాత తేదీలలో సృష్టించే విషయంలో బహిరంగ మార్కెట్‌లో అందరికి తెలిసిన విషయమే. సర్కారు భూములు కబ్జాకు గురువుతున్న విషయం అందరికి తెలిసినా కనీసం వాటిని పరిరక్షించడానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే.. కబ్జాలో "తల పాపం తిలా పిడికెడు" ఉందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



సర్కారు భూములే కబ్జా దారులకు ఆదాయ వనరు..

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధి బోడుప్పల్ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 63/26 నుండి 63/39లో సుమారు 100 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చూపిస్తున్నాయి. కానీ వాస్తవంగా మాత్రం కేవలం ఇరవై, ముప్పై రెండు ఎకరాలు మాత్రమే ఉంటుందనేది అంచనా. మిగిలిన భూమి పూర్తి స్థాయిలో కబ్జాలకు గురైంది. రాత్రికి రాత్రే ఇంటి పట్టాలు తయారు చేయడం, ఇండ్ల నిర్మాణం చేయడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఇలా చేపట్టిన ఇండ్లల్లో ఉండేది మాత్రం పేదలే అయిన దాని నిర్మాణం వెనుక ఖద్దరు నేతల హస్తం పెద్ద ఎత్తున ఉందనేది బహిరంగ రహస్యం. ఇక్కడ ప్రస్తుతం భూమి ధర గజం ముప్పై వేల వరకు ఉంటుంది. ఇక్కడ 60,120 గజాల చొప్పున ప్లాట్లు చేయడం, ఆ ప్లాట్లకు నోటరి లేదా పాత పట్టాలు సృష్టించి క్రయవిక్రయాలు చేయడం జరుగుతుంది. ఈ స్థలాలలో ఎక్కువగా రాత్రి పూట లేదా ప్రభుత్వ సెలవు దినాల్లో ఎక్కువ భాగం నిర్మాణాలు చేస్తుంటారు. పేరు పేదలది కాగా ఆదాయం మాత్రం పెద్దల జేబుల్లోకి వెళ్తుంది.

రెవెన్యూ అధికారులపై వత్తిడిలు

ప్రభుత్వ భూములను పూర్తి స్థాయిలో సంరక్షించి, ప్రజా అవసరాలకు వినియోగించాలనేది రెవెన్యూ అధికారుల ఆలోచన.. కానీ ఇక్కడ కబ్జాలను అరికట్టడంలో రెవెన్యూ అధికారులు ఒక అడుగు ముందుకు రెండడుగుల వెనక్కి అనే చందంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ భూముల సంరక్షణ పూర్తి స్థాయి బాధ్యత రెవెన్యూ అధికారులదే అయిన కూడా చర్యలు తీసుకోవడంలో ఎందుకి నిర్లక్ష్యం అని ప్రశ్నిస్తే.. వారి నుండి ఎలాంటి సమాధానం రాదు. ఎప్పుడైనా రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకోవడానికి వెళ్ళిన వారికి పలువురు రాజకీయ పార్టీల నేతల నుండి తీవ్రమైన వత్తిడిలు వస్తూనే ఉంటాయి. మరీ రాజకీయ నాయకుల వత్తిడిలకు తలొగ్గి సర్కారు భూములను కబ్జా చేస్తున్న వారికి సహకరిస్తారా లేక తమ వృత్తి ధర్మాన్ని ఉపయోగించి సర్కారు భూములను కాపాడుతారా అనేది వేచి చూడాలి మరి.



చర్యలు తీసుకుంటున్నాం..
- హసీనా, మేడిపల్లి మండల తహసీల్దారు

బోడుప్పల్ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యక్రాంతం కాకుండా ఎప్పటికప్పుడు కఠినమైన చర్యలు తీసుకుంటున్నాము.ఇప్పటికే అక్కడ భూముల వివరాలను ఉన్నత స్థాయి అధికారులకు నివేదిక అందించడం జరిగింది. రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై కేసులు నమోదు చేశాం. భవిష్యత్తులో కూడా కబ్జాకు పాల్పడిన వారెవరైనా వారిపై కఠిన చర్యలు ఉంటాయి.



ప్రజా అవసరాలకు వినియోగించాలి
- ఎస్.సృజన, సీపీఐ(ఎం) పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి

బోడుప్పల్ కార్పొరేషన్ ప్రస్తుతం రాష్ట్ర రాజధాని హైదరాబాదు మహా నగరానికి కూత వేటు దూరంలో ఉన్న నగరం. ఇప్పుడిప్పుడే ఇక్కడ అభివృద్ధి పరుగులు పెడుతుంది. జనాభా కూడా బాగా విస్తరించింది. ఇక్కడ ప్రజల అవసరాలకు అనుగుణంగా కార్పొరేషన్ కార్యాలయం, క్రీడా ప్రాంగణం, కళ భవనం, పోలీసు స్టేషను లాంటి ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు ఈ స్థలం తప్ప మరెక్కడా కూడా ప్రభుత్వ స్థలాలు లేవు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండి మిగిలిన స్థలాన్ని కాపాడి ప్రజా అవసరాలకు ఉపయోగించేలా చొరవ తీసుకోవాలి. లేకపోతే భవిష్యత్తులో బోడుప్పల్ లాంటి అభివృద్ధి చెందుతున్న నగరంలో విశాలమైన సర్కారు భవనాలు నిర్మాణం చేయాలంటే ప్రభుత్వ స్థలాలు లేకుండా పోతాయి.







నీటి సమస్యను పరిష్కరించాలి

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

నవతెలంగాణ-హయత్‌నగర్

వేసవికాలం దృష్ట్యా నీటి సమస్యను పరిష్కరిం చాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి వాటర్ వర్క్స్ అధికారులను కోరారు. కాలనీ పర్యటనలో భాగంగా శుక్రవారం కార్పొరేటర్ ప్రెస్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రెస్ కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, కాలనీలోని పవర్ బోర్‌ను వెంటనే రిపేర్ చేయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. డివిజన్లో లో- ప్రెషర్ తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని, ముందస్తు ప్రణాళికలు చేపట్టి వేసవికాలం దృష్ట్యా ప్రత్యేక చర్యలు తీసుకొని నీటి సమస్యను పరిష్కరించాలని వాటర్ వర్క్స్ అధికారులను కోరారు. డివిజన్‌లోని స్లమ్స్ లల్లో పాడైపోయిన పవర్ బోర్లను వెంటనే రిపేర్ చేయించి.. ప్రజలకు వాడుకలోకి తీసుకురావాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ వెంట నరసింహ, రాజు, రమేష్, భవాని, నాయకులు పాతూరి శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



నవతెలంగాణ-చంపాపేట్

ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ(ఎం) సౌత్ జిల్లా కార్యదర్శి ఎండి అబ్బాస్, ఎంబిటి రాష్ట్ర అధ్యక్షులు మాజీదుల్లాఖాన్(ఫర్హాత్), కాంగ్రెస్ నాయకులు సోకత్ అలీ అన్నారు. యాకుత్‌పురా నియోజకవర్గం సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని ఐఎస్‌సదన్ డివిజన్ చౌరస్తా వద్ద అలం ఖుంద్ మిరి భవన్‌లో సీపీఐ(ఎం)పార్టీ హైదరాబాద్ సౌత్ డీసీ మెంబర్స్ అబ్దుల్ లతీఫ్ అబ్దుల్ సత్తార్, మూడవత్ బాలు నాయక్ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఇఫ్తార్ విందును శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఉండే ముస్లీం సోదరుల కోసం ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు డిజి నరసింహారావు, విటల్, మీనా శ్రావణ్ కుమార్, జోసెఫ్ కృష్ణనాయక్, శోభన్ నాయక్, గిరిజన రాష్ట్ర అధ్యక్షులు ధర్మానాయక్, రామ్ కుమార్, నాగేశ్వరరావు, జె.కె శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి


నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

అబ్దుల్లాపూర్ గ్రామ రెవెన్యూ సర్వేనెం.283లో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని రక్షించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తహసీల్దార్ సుదర్శన్ రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండలం కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ కొందరు స్థిరాస్తి వ్యాపారులు కోర్టు ఆర్డర్ పేరుతో కోట్ల విలువైనా భూమిని కబ్జా చేసి, నిర్మాణాలు చెపడుతున్నారని ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయానికి ఇరువైపులా ఉన్న సర్వేనెం.283లోని కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఈ భూమిని ప్రభుత్వం పీఓటీ చట్టం కింద స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.. కాలక్రమేణా కొంతమంది బ్రోకర్లు ఈ భూమిపై కన్నేసి ప్లాట్స్‌గా చేసి విక్రయించి, కొంతమంది పేరుమీద కోర్టు ఆర్డర్ తెచ్చుకుని తిరిగి ఇండ్లు నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో చేపడుతున్న అక్రమ కట్టడాలను తొలగించి, ప్రభుత్వ ఆస్తులు కాపాడాలన్నారు. అలాగే అక్రమ దారులు తెచ్చిన కోర్టు ఆర్డర్‌ను చట్టప్రకారం రద్దు చేయించి, ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకొని ప్రభుత్వం భూమిని కాపాడాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ(ఎం) మండల నాయకులు, గుండె శివకుమార్, వర్కాల ముత్యాలు, రామారావు, ఆటం, శ్రీనివాస్, చిర్ర శివ, మండల కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.



ఫోనే అతని ప్రపంచమైతే..!

ఒకప్పుడు ఫోన్ ఒకరిద్దరి దగ్గర ఉంటే ఎంతో గొప్పగా భావించేవారు. కానీ ఇప్పుడు అది ఓ నిత్యవసర వస్తువుగా మారిపోయింది. ఫోన్ లేకపోతే బతకలేని పరిస్థితి వచ్చేసింది. స్మార్ట్‌ఫోన్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. చాలా మంది గంటల తరబడి దాంతోనే గడిపేస్తున్నారు. అయితే దీని వల్ల ఎన్ని ఉపయోగాలున్నాయో అన్ని నష్టాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి. ఫోన్ చూస్తూ మన చుట్టుపక్కల ఏం జరుగుతుందో కూడా మర్చిపోతు న్నాం. దాంతో మన వాళ్లకు దూరమైపో తున్నాము. అలాంటి ఓ సంఘటనే ఈ వారం ఐద్వా అదాలత్‌లో...



28 ఏండ్ల పల్లవి వచ్చీరాగానే 'స్మార్ట్ ఫోన్ నా జీవితంలో శత్రువులా మారిపోయింది. స్మార్ట్‌ఫోన్‌పై ఫిర్యాదు చేయడానికి వచ్చాను' అంటూ ఆవేదనతో కూడిన ఆవేశంతో మాట్లాడుతోంది. ఆమెను కాస్త శాంత పరిచి విషయం ఏంటని అడిగితే...

'మాది పెద్దలు కుదిర్చిన సంబంధం. రాజీవ్ నా కంటే రెండేండ్లు పెద్ద. మా పెండ్లికి ఏంగేజ్‌మెంట్‌కు ఆరు నెలల తేడా వుంది. కానీ ఆయన ఆ ఆరు నెలల్లో నాతో నేరుగా ఒక్కసారి కూడా మాట్లాడలేదు. కనీసం ఫోన్ కూడా చేయలేదు. ఏది మాట్లాడాలన్నా, ఏం చెప్పాలన్నా మెసేజ్ చేయాలి. వాటికి మాత్రమే ఆయన నుండి నాకు సమాధానం వస్తుంది. నేను ఎప్పుడైనా ఫోన్ చేసినా ఆయన ఎత్తడు. కట్ చేసి ఏంటీ అని మెసేజ్ పెడతాడు. పోనీలే అతనికి అమ్మాయిలతో మాట్లాడడం ఇబ్బంది అనుకొని ఊరుకున్నాను. పెండ్లికి బట్టలు కొనడానికి షాపింగ్‌కి వెళ్లాము. అక్కడ అందరూ పల్లవికి ఈ చీర బాగుంటుందా, ఈ డ్రెస్ బాగుంటుందా, తీసుకుందామా అని రాజీవ్‌ని అడిగితే అక్కడ కూడా 'ఈ కలర్ తీసుకో నీకు బాగుంటుంది' అని మెసేజ్లే పెడుతున్నాడు. అక్కడే ఉన్నాడు కదా డైరెక్టుగా చెప్పొచ్చు కదా. నేను ఆ మెసేజ్ చూసే లోపు ఆ చీర వేరే వాళ్లు తీసుకుంటారు. మళ్ళీ నేను పెట్టిన చీర తీసుకోలేదా' అని మెసేజ్ చేస్తాడు.

కాస్త ఖాళీ సమయం దొరికితే గేమ్స్ ఆడుతూ ఉంటాడు. రాత్రి రెండు మూడు గంటల వరకు పక్కన నేను ఉన్నాను అనే విషయం కూడా మర్చిపోయి ఫోన్ చూస్తుంటాడు. సోషల్ మీడియాలో బాగా యాక్టివ్‌గా ఉంటాడు. నేను పక్కనే ఉన్నా నాతో మాట్లాడకుండా మెసేజ్లు పెడుతుంటాడు.

పెండ్లి తర్వాత అయినా మారతాడు అనుకున్నాను. కానీ అలాంటిది ఏమీ లేదు. కాస్త ఖాళీ సమయం దొరికితే గేమ్స్ ఆడుతూ ఉంటాడు. రాత్రి రెండు మూడు గంటల వరకు పక్కన నేను ఉన్నాను అనే విషయం కూడా మర్చిపోయి ఫోన్ చూస్తుంటాడు. సోషల్ మీడియాలో బాగా యాక్టివ్‌గా ఉంటాడు. నేను పక్కనే ఉన్నా నాతో మాట్లాడకుండా మెసేజ్లు పెడుతుంటాడు. ఇంట్లో వాళ్లు ఏదైనా అడిగితేనే సమాధానం చెబుతాడు. బంధువుల ఇంటికి వెళ్ళినప్పుడు నాకేదైనా చెప్పాలంటే మెజేస్ పెడతాడు. ఇంట్లో అందరూ 'ఫోన్ పక్కన పెట్టి పల్లవితో మాట్లాడూ' అన్నా పట్టించుకోడు. ఆయన నాతో కంటే ఫోన్‌తోనే కాపురం చేస్తున్నాడనిపిస్తుంది.

మా పెండ్లి జరిగి ఇప్పటికి రెండేండ్లు అవుతుంది. ఇప్పటికి కూడా ఆయన నాతో సరిగ్గా మాట్లాడిందే లేదు. ఎప్పుడూ ఫోన్ చూస్తూనే ఉంటాడు. నేను ఏమైనా అంటే 'ఎవరైనా అత్యవసరంతో మనకు ఫోన్ చేసినా, మెసేజ్ చేసినా ఎలా తెలుస్తుంది. అందుకే ఫోన్ చూస్తున్నా, ఫోన్ ఎప్పుడూ నాతోనే పెట్టుకుంటున్నా' అని అంటాడు. ఈయన చేసే జాబ్ కూడా ఆన్‌లైన్‌లోనే. ఉదయం నుండి సాయంత్రం వరకు లాప్‌టాప్‌లో వర్క్ చేసి సాయంత్రం ఫోన్‌తో జీవితం గడిపేస్తున్నాడు. ఇది ఆయన ఆరోగ్యానికి కూడా మంచిది కాదు. ఈయన వల్ల నా ఆరోగ్యం కూడా పాడైపోతుంది. ఈ విషయం ఎంత చెప్పినా ఆయనకు అర్థం కావడం లేదు. ఎప్పుడైనా గట్టిగా మాట్లాడితే 'ఈరోజు నుండి ఫోన్ చూడడం మానేస్తాను, నీతోనే మాట్లాడతాను' అంటాడు. కానీ చెప్పిన పదినిమిషాలు మాత్రమే ఓపిగ్గా ఉంటాడు. మళ్ళీ ఫోన్ తీసుకొని కూర్చుంటాడు. సిగరేట్, మందు తాగేవాళ్లు ఎలాగైతే అవి లేకపోతే వుండలేరో ఈయన కూడా అలాగే ఫోన్ లేకపోతే అస్సలు ఉండలేక పోతున్నాడు. అందుకే మీ దగ్గరకు వచ్చాను. ఫోన్‌పై కేసు వేయడానికి' అంది.

పల్లవి చెప్పింది మొత్తం విన్న తర్వాత ఆమె ఆవేదన, బాధ మాకు అర్థం అయ్యింది. వెంటనే రాజీవ్‌కు ఫోన్ చేసి పిలిపిస్తాం' అంటే 'లేదు ఆయన ఫోన్ చేస్తే తియ్యడు, మెజేస్ పెట్టండి' అంది. సరే అని అతనికి మెసేజ్ చేస్తే వెంటనే వచ్చాడు.

అతను వచ్చిన వెంటనే 'ఓ అరగంట సేపు మీరు మీ ఫోన్ స్విచ్ఛ్ ఆఫ్ చేయండి, మీతో మాట్లాడాలి' అన్నాము. దానికి అతను ఒప్పుకుని ఆఫ్ చేశాడు. 'మీరు సోషల్ మీడియాలో బాగా యాక్టివ్‌గా ఉంటారంట, ఫోన్‌తోనే ఎక్కువ సమయం గడుపుతున్నారంట. మీ భార్య మా దగ్గర చెప్పుకొని చాలా బాధపడుతుంది' అంటే దానికి అతను...

'ఫోన్ చూడడం బాగా అలవాటు అయిపోయింది మేడమ్. ఇంట్లో నేనూ అమ్మ ఇద్దరమే ఉండేవాళ్లం. అమ్మ సాయంత్రం కాగానే టీవీ సీరియల్స్ చూస్తూ కూర్చునేది. నేనేమో ఫోన్లో గేమ్స్ ఆడుకుంటూ గడిపేవాడిని. నాకు పెద్దగా ఫ్రెండ్స్ ఎవ్వరూ లేరు. మా అక్క కూడా ఎప్పుడో ఒకసారి ఇంటికి వస్తుంది. వాళ్లు వచ్చినప్పుడు మాత్రం అస్సలు ఫోన్ చూడను' అన్నాడు.

'మరి ఇప్పుడు పల్లవి మీ జీవితంలోకి వచ్చింది. ఫోన్ పక్కన పెట్టి ఆమెతో మాట్లాడవచ్చు కదా' అంటే నాకు అమ్మాయిలతో ఎలా మాట్లాడాలో తెలియదు. నేను ఏదైనా తప్పుగా మాట్లాడితే పల్లవి బాధ పడుతుందని, ఆమెను ఇబ్బంది పెట్టడం ఎందుకని పెద్దగా మాట్లాడను. అందుకే మెసేజ్లు పెడుతుంటాను. పల్లవి అంటే నాకు చాలా ఇష్టం. ఆమెకు చిన్న ఇబ్బంది కూడా కలిగించకూడదనే ఆమెతో ఎక్కువగా మాట్లాడను. కలిసి ఎక్కువ సేపు గడిపితే గొడవలు కూడా వస్తాయి. ఇవన్నీ ఎందుకనీ కాస్త దూరంగా ఉంటున్నా. ఆ టైం మొత్తం ఫోన్ చూస్తూ కూర్చుంటాను' అంటూ చెప్పుకొచ్చాడు.

'పల్లవి మీ జీవితంలోకి వచ్చింది. ఫోన్ పక్కన పెట్టి ఆమెతో మాట్లాడవచ్చు కదా' అంటే నాకు అమ్మాయిలతో ఎలా మాట్లాడాలో తెలియదు. నేను ఏదైనా తప్పుగా మాట్లాడితే పల్లవి బాధ పడుతుందని, ఆమెను ఇబ్బంది పెట్టడం ఎందుకని పెద్దగా మాట్లాడను. అందుకే మెసేజ్లు పెడుతుంటాను.

అతని సమాధానం విని మాకు ఆశ్చర్యం వేసింది. కాస్త తేరుకొని 'మీరు ఎప్పుడూ ఫోన్‌లో ఉంటే మీ మధ్య రిలేషన్ బాగుంటుంది అనుకుంటున్నారా? మీరు అనుకున్నది నిజమే అయితే పల్లవి బాధపడుతూ మా దగ్గరకు ఎందుకు వచ్చిందనుకుంటున్నారు? భార్యాభర్తలు కలిసి మెలిసి ఉన్నప్పుడు ప్రేమతో పాటు కోపాలు, అలకలూ అన్నీ ఉంటాయి. అవన్నీ ఉంటేనే జీవితం. మీ ఇద్దరి మధ్య బంధం మరింత బలపడుతుంది. కానీ మీరేమో గొడవలు వస్తాయని దూరం పెడుతున్నా అంటున్నారు. ఇదంతా మీ సంసారానికి మంచిది కాదు. పైగా ఎప్పుడూ ఫోన్ చూస్తూ కూర్చుంటే ఆరోగ్యం కూడా పాడైపోతుంది. మీరు తనతో మాట్లాడకుండా ఫోన్ తోనే ఎక్కువ గడపుతున్నారని పల్లవి బాధపడుతుంది. ఆమె బాధ మీకు అర్థం కావడం లేదు' అని చెప్పాము.

'పల్లవి నా వల్ల బాధ పడుతుందని నేను అర్థం చేసుకోలేకపోయాను. మరి ఇప్పుడు నన్నేం చేయమంటారు' అని అడిగాడు. ఈ రోజు నుండి మీరు రాత్రి పది గంటల తర్వాత ఫోన్ చూడడం మానేసేయండి. ఆ ఫోన్ మీతో కాకుండా హాల్లో పెట్టేసేయండి. ఎవరైనా అవసరం అయితే మీకే ఫోన్ చేస్తారు. మీరు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఫోన్ జోలికి వెళ్ల కూడదు. పల్లవికి ఏమైనా చెప్పాలంటే డైరెక్ట్‌గా ఆమెతోనే మాట్లాడాలి, మెసేజ్లు చేయకూడదు. ఆమె మీ భార్య. మిమ్మల్ని అపార్థం ఎందుకు చేసుకుం టుంది. మీరే ఆమెను అర్థం చేసుకోవడం లేదు.

మీరు ఫోన్‌కు బానిసలైపోయారు. అది లేకుండా ఉండలేకపోతున్నారు. పల్లవి అంటే ఇష్టం అంటున్నారు. కాబట్టి ఇప్పటి నుండి మేము చెప్పినట్టు చేయండి. అలా కాకుండా మీరు ఇలాగే ప్రవర్తిస్తే మీరు ఇష్టపడే మీ భార్య మీకు దూరమైపోతుంది' అని చెప్పాము.

దానికి అతను 'లేదు మేడమ్, ఇప్పటి వరకు పల్లవి నాతో చెప్పినా పెద్దగా పట్టించుకోలేదు. తను మీ దగ్గరకు వచ్చి చెప్పుకుం దంటే ఎంత బాధపడుతుందో అర్థం చేసుకున్నాను. ఇకపై మీరు చెప్పినట్టే చేస్తాను. ఫోన్ పక్కన పెట్టేస్తాను. పల్లవితో సమయం గడుపుతాను' అని చెప్పి ఆమెను తీసుకొని వెళ్లిపోయాడు.

\- వై వరలక్ష్మి, 9948794051

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

వేడి తీవ్రత నుండి..

ఏప్రిల్ రాకముందే ఎండ దంచికొడుతోంది. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో వేడి గాలుల తీవ్రత పెరిగిపోయింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు చర్మ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. అలాగే ఈ సీజన్‌లో స్కిన్ ఇన్‌ఫెక్షన్ ముప్పు కూడా పెరుగుతుంది. చర్మంపై ఎర్రటి దద్దుర్లు, దురద, మంట, చర్మం నల్లబడటం వంటి సమస్యలు చాలా మంది ఎదుర్కొంటారు. ఈ సమస్యల



నుండి రక్షణ పొందాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించాలి. వేసవిలో చర్మ సంరక్షణపై నిపుణులు ఏమంటున్నారో చూద్దాం...

వేసవిలో చర్మ కాంతి తగ్గిపోతుంది. సూర్యరశ్మి, దుమ్ము, అలర్జీ వల్ల చర్మ వ్యాధులు రావచ్చు. కొందరికి శరీరంపై ఎర్రటి దద్దుర్లు సమస్య కూడా పెరుగుతుంది. ఇది ఎక్కువగా వీపు వెనుక, ముఖం, చేతులపై కూడా కనిపిస్తాయి. ఈ రకమైన సమస్య వస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

ఎండలో ఎక్కువసేపు ఉండటం వల్ల చర్మం దెబ్బతిని ఇలాంటి సమస్యలు వస్తాయి. అందువల్ల ఈ సీజన్‌లో సూర్యకాంతి నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోవడం చాలా ముఖ్యం. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు ముఖాన్ని, శరీరాన్ని కప్పి ఉంచడానికి ప్రయత్నించాలి. బయటికి వెళ్లడానికి 15 నిమిషాల ముందు సన్‌స్క్రీన్‌ని అప్లై చేసుకోవాలి. వీలైతే మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయటకు వెళ్లడం మానుకోవాలి. బయటకు వెళ్లడం తప్పనిసరి అయితే పదే పదే నీరు తాగుతూ ఉండాలి. అలాగే సీజనల్ పండ్లను తినాలి. వాటర్ కంటెంట్ ఉన్న పండ్లను ఎక్కువగా తీసుకోవాలి. ■

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో నోట్లకట్టలు

న్యూఢిల్లీ : ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో లెక్క చూపని సొమ్ము పెద్ద మొత్తంలో లభించడంతో ఈ ఉదంతంపై సుప్రీంకోర్టు శుక్రవారం అంతరంగిక విచారణ చేపట్టింది. యశ్వంత్ వర్మ నివాసంలో దొరికిన సొమ్ముకు సంబంధించి నివేదిక అందజేయాల్సిందిగా ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయను ఆదేశించింది. యశ్వంత్ వర్మ నివాసంలో అగ్ని ప్రమాదం జరగడంతో మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. అయితే అక్కడ వారికి భారీగా నగదు లభించింది. కాగా తాజా పరిణామం నేపథ్యంలో జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు తిప్పి పంపాలని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించింది. సుప్రీంకోర్టుకు చెందిన న్యాయమూర్తులందరూ శుక్రవారం ఉదయం సమావేశమ య్యారు. దీనినే న్యాయ పరిభాషలో ఫుల్ కోర్ట్ అంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది ఎక్కువ మంది న్యాయమూ ర్తులతో ఏర్పడిన ధర్మాసనం. యశ్వంత్ వర్మను కేవలం బదిలీ చేస్తే సరిపోదని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవా లని ఫుల్ కోర్ట్ సూచించింది. ముందుగా యశ్వంత్‌ను బదిలీ చేసి, ఆ తర్వాత అంతరంగిక విచారణ జరపాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. జస్టిస్ వర్మ నివాసంలో నగదును స్వాధీనం చేసుకుంటున్న దృశ్యాల వీడియోను అధికారులు ప్రధాన న్యాయమూర్తికి అందజేశారు. ఆయన దానిని చూసి, కొలీజియంలోని ఇతర సభ్యులకు వివరాలు తెలియజేశారు. అయితే అసలు జడ్జి నివాసంలో ఎంత డబ్బు ఉన్నదీ తెలియరాలేదు. ఈ నెల 14వ తేదీ రాత్రి 11.30 గంటలకు వర్మ నివాసంలో అగ్ని ప్రమాదం జరిగి ంది. ఆ సమయంలో ఆయన ఇంటిలో లేరు. 82 సంవత్స రాల తల్లి, కుమార్తె మాత్రమే ఉన్నారు. వారిచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు ఓ గదిలో పెద్ద మొత్తంలో నగదు కన్పించింది. అందులో కొంత నగదు ప్రమాదంలో కాలిపోయింది. సంఘటనకు సంబంధించిన సమాచారాన్ని వారు ఉన్నతాధికారులకు చేరవేశారు. ప్రభుత్వాధికారులు ఈ ఉదంతాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన కొలీజియంను సమావేశపరిచి పరిస్థితిపై చర్చించారు. కొలీజియంలో ప్రధాన న్యాయమూర్తితో పాటు సీనియర్ న్యాయమూర్తులైన బీఆర్ గవాయ్, సూర్యకాంత్, అభయ్ ఎస్ ఓకా, విక్రమ్ నాథ్ సభ్యులుగా ఉన్నారు. జస్టిస్ వర్మ శుక్రవారం కేసుల విచారణ చేపట్టలేదని, సెలవు పెట్టారని ఆయన కోర్టు సిబ్బంది తెలియజేశారు.

జస్టిస్ వర్మ 1969 జనవరి 6న అలహాబాద్‌లో (ఇప్పటి ప్రయాగరాజ్) జన్మించారు. హన్స్‌రాజ్ కాలేజీలో బీకాం ఆనర్స్ చదివారు. మధ్యప్రదేశ్‌లోని రేవా యూనివర్సిటీ నుండి ఎల్‌ఎల్‌బీ డిగ్రీ పొందారు. 1992 ఆగస్ట్ 8న న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. రాజ్యాంగపరమైన, కార్మిక, పారిశ్రామిక, కార్పొరేట్ చట్టాలకు సంబంధించిన కేసులను వాదించారు. 2006 నుండి పదోన్నతి పొందే వరకూ అలహాబాద్ హైకోర్టుకు ప్రత్యేక కౌన్సిల్‌గా పనిచేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర చీఫ్ స్టాండింగ్ కౌన్సిల్‌గా కూడా పనిచేశారు. 2013లో సీనియర్ న్యాయవాదిగా గుర్తింపు పొందారు. అనంతరం ఢిల్లీ హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2021 అక్టోబర్ 11న అక్కడ బాధ్యతలు స్వీకరించారు.

ఆయన మాకొద్దు :
అలహాబాద్ హైకోర్టు బార్ కౌన్సిల్

జస్టిస్ యశ్వంత్ వర్మను తమ హైకోర్టుకు బదిలీ చేయాలన్న ప్రాతిపాదనను అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ (హెచ్‌సీబీఏ) వ్యతిరేకించింది. ఈ ప్రతిపాదనను చూస్తుంటే 'అలహాబాద్ హైకోర్టు ఏమైనా చెత్తబుట్టా అనే ప్రశ్న తలెత్తుతోంది' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. అవినీతి ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. న్యాయమూర్తుల నియామకం విషయంలో బార్ అసోసియేషన్‌ను ఎన్నడూ సంప్రదించలేదని తెలిపింది. కాగా జడ్జి బదిలీ ప్రారంభం మాత్రమేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా తోటి న్యాయమూర్తులతో అన్నారు. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుండి నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ వ్యవహారంలో అవసరమైతే మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అది ఎవరి సొమ్ము : కాంగ్రెస్

నగదు పట్టుబడిన ఉదంతంలో ఢిల్లీ హైకోర్టు జడ్జిని బదిలీ చేసినంత మాత్రాన సరిపోదని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి నుండి పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకోవడం తీవ్రమైన విషయమని కాంగ్రెస్ మీడియా-ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా అన్నారు. 'జస్టిస్ వర్మ ఉన్నావ్ లైంగికదాడి కేసును, అనేక తీవ్రమైన కేసులను విచారిస్తున్నారు. న్యాయ వ్యవస్థపై విశ్వాసం కలిగించాలంటే అది ఎవరి డబ్బు, దానిని జడ్జికి ఎందుకు ఇచ్చారు అనేది తెలియాల్సి ఉంది' అని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంపై ఆయన మండిపడుతూ ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థల కంటే అగ్నిమాపక దళమే మంచి పని చేసిందని ఎత్తిపొడిచారు.

యూఎస్ విద్యా శాఖ రద్దు ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు

వాషింగ్టన్ : విద్యా శాఖను రద్దు చేస్తున్న ఉత్తర్వులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం సంతకాలు చేశారు. తద్వారా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఫెడరల్ విద్యా శాఖను మూసివేసి, రాష్ట్రాలకు, స్థానిక కమ్యూనిటీలకు తిరిగి అధికారాలను అప్పగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని విద్యా శాఖ మంత్రి లిండా మెక్‌మహన్ ఈ సందర్భంగా చెప్పారు. చట్టం అనుమతించిన మేరా అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మొత్తంగా ఒక శాఖను రద్దు చేయడమంటే ఆషామాషీ వ్యవహారం కాదని, దీనికి కాంగ్రెస్ అనుమతి కావాల్సి వుంటుందని ఆమె పేర్కొన్నారు. జనవరిలో ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తొలినాళ్ళలోనే విద్యా శాఖ సిబ్బందిని సగానికి సగం తగ్గించేశారు. విద్యా శాఖ కార్యకలాపాలను కూడా ప్రక్షాళన చేశారు. డజన్ల సంఖ్యలో కాంట్రాక్టులను ట్రంప్ సలహాదారు మస్క్ రద్దు చేశారు. అవన్నీ వృథా ఖర్చులని వ్యాఖ్యానించారు. 1979లో ఏర్పడిన ఈ విద్యా శాఖ ప్రధానంగా తక్కువ ఆదాయ వర్గాలకు చెందిన విద్యార్థులకు సాయపడేందుకు, విద్యార్థులకు రుణాలు అందించే కార్యక్రమాలను చూస్తుంది. కాలేజీలు, పాఠశాలలకు ఫెడరల్ ప్రభుత్వం నుండి అందే నిధులే ఇక్కడ కీలక పాత్ర పోషిస్తున్నాయి. క్లిష్టమైన జాతి సిద్ధాంతాలు, లింగ మార్పిడి, ఇతర అనుచితమైన వర్ణ, లైంగిక, రాజకీయ వైఖరులను ప్రోత్సహించే ఈ కాలేజీలు, స్కూళ్ళకు ఇక నిధులు అందించరాదని ట్రంప్ ప్రతిన చేశారు. కాగా మన పిల్లలను దోచుకుంటన్నారని హక్కుల కార్యకర్తలు, డెమోక్రాట్ సభ్యులు తీవ్రంగా విమర్శించారు. ట్రంప్ ఈ చర్యను పూర్తిగా అమలుపరచలేరని, వంద సీట్లు గల సెనెట్‌లో కనీసం 60మంది మద్దతు అవసరమవుతుందని విమర్శకులు పేర్కొంటున్నారు.

రెండేండ్లు.. 38 విదేశీ పర్యటనలు.. రూ.258 కోట్లు ఖర్చు

న్యూఢిల్లీ : గతంలో ఏ ప్రధానీ వెళ్లని విధంగా..ప్రస్తుత ప్రధాని మోడీ విదేశీటూర్లు చుట్టేస్తున్నారు. చిన్న చిన్న దేశాల నుంచి అగ్రదేశాలకు వెళ్లటానికి రెడీ అయిపోతున్నారు. అయితే కీలకమైన పార్లమెంట్ సమావేశాలు, దేశంలో జరిగే ఇతర ముఖ్య ఉద్యమాలు , మత హింసలు జరిగిన మణిపూర్ లాంటి ప్రాంతాలకు వెళ్లటానికి ముఖం చాటేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. దేశంలో జరుగుతున్న పరిణామాలు తెలుసో..లేక మరోకటో కానీ మన ప్రధానికి ఆ దేశ అత్యున్నత పురస్కారాలతో సత్కరించటం గమనార్హమని పీడిత పౌర సమాజం అంటోంది.

రెండేండ్లలోనే..

ప్రధాని పర్యటనలకు అయిన ఖర్చు వివరాలను కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. 2022 నుంచి 2024 డిసెంబర్ వరకూ ప్రధాని 38 విదేశీ పర్యటనలకు వెళ్లినట్టు తెలిపింది. ఈ పర్యటనలకు గానూ రూ.258 కోట్లు ఖర్చైనట్టు ప్రకటించింది. అయితే గత మూడేండ్లలో విదేశీ పర్యటనలకు మోడీ వెళ్లినప్పుడు వివిధ ఏర్పాట్ల కోసం అక్కడి దౌత్య కార్యాలయాలు ఎంత ఖర్చు చేశాయో వెల్లడించాలని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఖర్గే ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిటా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2022-24 మధ్య ప్రధాని మోడీ అమెరికా, జపాన్, జర్మనీ, కువైట్, డెన్మార్క్, ఫ్రాన్స్, యూఏఈ, నేపాల్, ఇండోనేషియా, ఆస్ట్రేలియా, ఈజిప్ట్, దక్షిణాఫ్రికా, గ్రీస్, పోలాండ్, ఉక్రెయిన్, రష్యా, ఇటలీ, బ్రెజిల్, గయానాలో పర్యటించారు. 2022 మేలో ప్రధాని తన విదేశీ పర్యటనను జర్మనీతో ప్రారంభించారు. 2024 డిసెంబర్‌లో కువైట్‌తో తన పర్యటనలు ముగిశాయి. అత్యధికంగా 2023 జూన్‌లో జరిగిన అమెరికా పర్యటనకు రూ.22కోట్లు ఖర్చు అయినట్టు విదేశాంగ శాఖ తెలిపింది. గతేడాది సెప్టెంబరులో మోడీ అమెరికా వెళ్లినప్పుడు రూ.15.33 కోట్లు ఖర్చు అయినట్టు పేర్కొంది. ఇక మే 2022లో ప్రధాని నేపాల్ పర్యటనకు రూ.80 లక్షలు, మే 2023లో జపాన్ పర్యటనకు రూ.17.19 కోట్లు ఖర్చైనట్లు వివరించింది. ఇక 2014కి ముందు అప్పటి ప్రధానులు చేసిన విదేశీ పర్యటనలకు సంబంధించిన ఖర్చుల వివరాలను కూడా మంత్రి వెల్లడించారు. 2011లో అప్పటి ప్రధాని అమెరికా పర్యటనకు రూ.10.74 కోట్లు ఖర్చైనట్లు తెలిపారు. అదే ఏడాది ఫ్రాన్స్ సందర్శనకు రూ.8.33 కోట్లు, 2013లో రష్యా సందర్శనకు రూ.9.95 కోట్లు, 2013లో జర్మనీ పర్యటనకు రూ.6 కోట్లు ఖర్చైనట్టు వెల్లడించారు.

ఆ రోడ్లకు టోల్ విధించం

ఆ మూడు నియోజకవర్గాలకు తప్ప మిగతా ప్రాంతాల్లో రోడ్లు వేశారా? : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రోడ్లు లేక పిల్లనిస్తలేరు : స్పీకర్ ప్రసాద్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాష్ట్రంలో త్వరలో ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో గ్రామీణ ప్రాంతాల్లో, మండలం నుంచి మండలానికి వేసే రోడ్లకు టోల్ చార్జీలు విధించబోమని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో సింగరేణి సీఎస్‌ఆర్ ఫండ్ ద్వారా సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో రోడ్లను అద్భుతంగా వేయించుకున్నారనీ, ఆ మూడు నియోజకవర్గాల మధ్య ఉండే దుబ్బాక నియోజకవర్గంలో మాత్రం రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని గుర్తుచేశారు. ఆ మూడింటిలో తప్ప మిగతా అన్ని నియోజకవర్గాల్లోనే రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని తెలిపారు. కావాలంటే రాష్ట్రంలో తిరిగి రోడ్లను పరిశీలిద్దామని హరీశ్‌రావుకు సవాల్ విసిరారు. దీన్ని హరీశ్‌రావు స్వీకరించారు. రాష్ట్రంలోని రోడ్లపై సభలో చర్చకు పెట్టాలని స్పీకర్‌ను కోరారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలో పలు గ్రామాలకు రోడ్లు సరిగా లేకపోవడంతో పిల్లనిచ్చేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదని ప్రస్తావించారు.

మంచిర్యాలలో రెండు గంటలు ఆలస్యంగా పరీక్ష

ఇద్దరు అధికారుల సస్పెండ్

పుట్టెడు దు:ఖంలోనూ పరీక్షకు హాజరైన విద్యార్థులు

నవతెలంగాణ-మంచిర్యాల/విలేకరులు



పదో తరగతి పరీక్షలు మొదటి రోజు మంచిర్యాలలోని ఓ సెంటర్‌లో ఒక ప్రశ్న పత్రానికి బదులు మరొక ప్రశ్నాపత్రం రావడంతో రెండు గంటల ఆలస్యంగా ప్రారంభమైంది. కలెక్టర్ జోక్యంతో ఆలస్యంగా పరీక్ష నిర్వహించారు. మరికొన్ని చోట్ల ఇంట్లో విషాద ఘటనలు జరిగినా.. భవిష్యత్ కోసం పుట్టెడు దు:ఖంలోనూ విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో తెలుగు పరీక్ష ప్రశ్నపత్రాలు ఉన్న బాక్స్‌ను సిబ్బంది ఓపెన్ చేశారు. కానీ, తెలుగు పేపర్ ఇవ్వాల్సి ఉండగా బాక్స్‌లో హిందీకి సంబంధించిన పత్రాలు ఉండటంతో సిబ్బంది కంగారు పడ్డారు. వెంటనే జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.యాదయ్యకు సమాచారం ఇచ్చారు. అనంతరం విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన బోర్డు అధికారులతో మాట్లాడారు. కలెక్టర్ జోక్యంతో ఓపెన్ చేసిన పత్రాలను అందులోనే పెట్టి పోలీసుల సాయంతో తెలుగు ప్రశ్నపత్రాలకు సంబంధించిన బాక్స్‌ను పరీక్షా కేంద్రానికి తీసుకొచ్చారు. అనంతరం విద్యార్థులు పరీక్ష రాసేలా ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలోని విద్యార్థులు 2గంటలు ఆలస్యంగా పరీక్ష రాశారు. ప్రశ్నపత్రాల తారుమారుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నపత్రాల తరలింపులో నిర్లక్ష్యం వహించిన చీఫ్ సూపరింటెండెంట్ సప్థర్ అలీ, డిపార్ట్‌మెంటల్ అధికారి ఆర్.పద్మజను సస్పెండ్ చేస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

పుట్టెడు దు:ఖంలో పరీక్షలకు..

తండ్రిని కోల్పోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న విద్యార్థిని మంచర్ల శ్రీలత పరీక్షకు హాజరైంది. కన్నెపల్లి మండలం ముత్తాపూర్‌కు చెందిన శ్రీలత మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుతోంది. తండ్రి మంచర్ల మల్లయ్య(62) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందాడు. శుక్రవారం నుంచి ఆమెకు పదో తరగతి పరీక్షలు ఉండటంతో గుండెల్లో బాధ ఉన్నా పరీక్షకు హాజరైంది. పరీక్షకు వచ్చే ముందు తండ్రి మృతదేహం వద్ద శ్రీలత రోధించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

తండ్రి మరణంలోనూ కుమార్తెలకు పరీక్ష

తండ్రి మరణించడంతో పుట్టెడు దు:ఖంలోనూ ఆ విద్యార్థినులు పది పరీక్షకు హాజరయ్యారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం తిలక్‌నగర్ గ్రామపంచాయతీ కల్తీ రామయ్యగుంపులో జరిగింది. గ్రామానికి చెందిన కరపాటి వీరస్వామి శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆ దు:ఖాన్ని గుండెల్లోనే పెట్టుకుని వీరస్వామి కుమార్తెలు హర్షిత, హర్షిప్రియ పది పరీక్షకు హాజరయ్యారు.

సెల్‌ఫోన్‌లో పరీక్ష పేపర్ జీరాక్స్ కాపీలు..

నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలో తెలుగు పేపర్ లీక్ అయిందని సెల్‌ఫోన్‌లో పేపర్‌కు సంబంధించిన జిరాక్స్ కాపీలు చక్కర్లు కొటాయి. ఆర్డీవో అశోక్‌రెడ్డి ఆదేశాలతో వెంటనే తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీవో జ్యోతిలక్ష్మి మండల కేంద్రంలోని గీతాంజలి హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. పేపరు లీకేజీ లేదని నిర్ధారించుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్ఐ డి.సైదులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆలస్యమవడంతో..

పదో తరగతి పరీక్ష కేంద్రానికి దాదాపు 20 నిమిషాలు ఆలస్యంగా రావడంతో విద్యార్థి పరీక్ష రాయలేకపోయాడు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని పెద్ద పీర్లగడ్డ ప్రాంతానికి చెందిన మాసూం ఖాజాబీ కుమారుడు ఉమేర్ పరీక్ష సెంటర్‌కు ఆలస్యంగా వెళ్లాడు. దాంతో అధికారులు లోపలికి పంపించలేదు.

మహాదేవ శాస్త్రి గొప్పతనం తెలిసేలా..




మోహన్‌బాబు

మోహన్ బాబు బర్త్ డే సందర్భంగా 'కన్నప్ప' చిత్రం నుంచి 'మహాదేవ శాస్త్రి' పరిచయ గీతానికి సంబంధించిన గ్లింప్స్ విడుదల చేశారు. అలాగే ఇందులో మహాదేవి శాస్త్రిగా నటిస్తున్న మోహన్‌బాబు లుక్ పోస్టర్‌ని కూడా రిలీజ్ చేశారు.
అలాగే మహాదేవ శాస్త్రి పాత్ర కోసం మోహన్ బాబు ఎలా మేకోవర్ అయ్యారు?, షూటింగ్ ఎలా జరిగింది?. ఆ పాత్ర కోసం ఆయన పడిన కష్టం ఏంటి అని తెలియజేసేలా గ్లింప్స్ ఉండటం విశేషం. దీంతోపాటు ఈ గ్లింప్స్‌లో సుద్దాల అశోక్ తేజ సాహిత్యం, శంకర్ మహదేవన్ గాత్రం, స్టీఫెన్ దేవస్సీ బాణీ అద్భుతంగా ఉంది.
మహాదేవ శాస్త్రి ఔనత్యాన్ని తెలియజేసేలా ఈ పాట ఉండబోతోందని అర్థం అవుతోంది. మోహన్ బాబు బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన ఈ గ్లింప్స్ అందరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది. విష్ణు మంచు నటిస్తూ, నిర్మిస్తున్న ఈ సినిమాను ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయబోతున్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన టీజర్లు, పాటలకు మంచి స్పందన వచ్చింది. అలాగే అక్షయ్ కుమార్, మోహన్ లాల్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ పోషించిన పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లకు మంచి స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. అతి త్వరలోనే కన్నప్ప ట్రైలర్‌ను రిలీజ్ చేసి, మరింతగా అంచనాలు పెంచేందుకు చిత్రయూనిట్ రెడీగా ఉంది. 'భక్తకన్నప్ప కథ ఈతరం వారికే కాదు రాబోయే తరాలకూ ఎంతో స్ఫూర్తినిస్తుంది. ఇలాంటి కథ అందరికీ తెలియడం అవసరం. ఇలాంటి మంచి ప్రాజెక్ట్‌లో మహాదేవ శాస్త్రిగా నటించే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది' అని మోహన్‌బాబు అన్నారు.

సరికొత్తగా 'దీక్ష'



ఆర్ కె ఫిలిమ్స్ , సిగ్ధ క్రియేషన్స్ బ్యానర్స్‌పై ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దీక్ష'.
కిరణ్, ఆలేఖ్యరెడ్డి హీరో, హీరోయిన్స్‌గా ఆక్స ఖాన్, తులసి, అనూష ప్రధాన పాత్రలలో నటించారు. లవ్, యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది.
ఈ సందర్భంగా దర్శక, నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ,'ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు అనే పాయింట్‌ను ఇతివృత్తంగా తీసుకుని లవ్, యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. చాలా అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరణ పూర్తి చేశాం. పాటలు అద్భుతంగా వచ్చాయి. మా బ్యానర్‌కు మంచి పేరు తెచ్చే చిత్రం అవుతుంది. లవ్, యాక్షన్‌తో పాటు మైథలాజికల్ కాన్సెప్ట్‌ను కూడా జోడించి నిర్మించిన ఈ చిత్రంలో భీముడు పాత్రలో హీరో కిరణ్ అద్భుతమైన నటన కనపరచాడు. మా చిత్రం ద్వారా హీరో కిరణ్‌కి మంచి పేరు, గుర్తింపు వస్తాయి. స్పెషల్ సాంగ్‌లో ఆక్స ఖాన్ తనదైన శైలిలో డాన్స్ ఆదరగొట్టింది. సంగీత దర్శకుడు రాజ్ కిరణ్ అద్భుతమైన 5 పాటలు అందించారు. మధుప్రియ తదితర ముఖ్య గాయనీ గాయకులు తమ స్వరాన్ని అందించారు. ఆర్ఆర్ ఈ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది. ఈ చిత్రంలో 5ఫైట్స్ ఉన్నాయి. త్వరలోనే ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో రిలీజ్ చెయ్యడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. 'ఈ సినిమా నా కెరీర్‌ను మలుపు తిప్పే చిత్రం అవుతుంది. అంత బాగా వచ్చింది. నా తోటి నటీనటులందరూ బాగా నటించారు. ఆర్కే ఫిలిమ్స్ బ్యానర్‌లో నటించడం అదృష్టంగా భావిస్తున్నాను' అని హీరో కిరణ్ చెప్పారు.
నటి తులసి మాట్లాడుతూ, ' ఈ సినిమాలో మంచి క్యారెక్టర్ చేశాను. అవకాశం ఇచ్చిన దర్శకులు ఆర్కే గౌడ్‌కి కృతజ్ఞతలు' అని తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాతలు : ప్రతాని రామకృష్ణ గౌడ్, పి.అశోక్ కుమార్, దర్శకత్వం: ఆర్.కె.గౌడ్.



బాలకృష్ణ

'ఆదిత్య 369' రీ-రిలీజ్‌కి రంగం సిద్ధం

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన సినిమా 'ఆదిత్య 369'. సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించగా, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమర్పణలో శ్రీదేవి మూవీస్ సంస్థ నిర్మించిన చిత్రమిది. విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకుల మన్ననలు అందుకున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 11న గ్రాండ్ రీ-రిలీజ్ చేస్తున్నారు.
ఈ సందర్భంగా శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని 4కెలో డిజిటలైజ్ చేశాం. సౌండ్ కూడా 5.1 క్వాలిటీలోకి కన్వర్ట్ చేశాం. ప్రసాద్స్ డిజిటల్ టీమ్ ఆరు నెలల పాటు శ్రమించి చక్కటి అవుట్ పుట్ ఇచ్చారు. 34 ఏళ్ళ క్రితం జూలై 18, 1991న విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకుల్లో ఇప్పటికీ ఎంతో క్రేజ్ ఉంది. రీ రిలీజ్ చేస్తామని అనౌన్స్ చేయగానే ఎంతో మంది విడుదల తేదీ కోసం ఆసక్తిని కనబరిచారు. అప్పట్లో ఇది చాలా అడ్వాన్స్డ్ సినిమా. ఇప్పటి ట్రెండ్‌కి కూడా కనెక్ట్ అయ్యే సినిమా. ఈ చిత్రాన్ని నేను నిర్మించడానికి నాకెంతో సహకరించిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకి జీవితాంతం రుణపడి ఉంటాను. ఇంత గొప్ప ప్రాజెక్టు నాకు ఇచ్చి నిర్మాతగా నన్ను ఎన్నో మెట్లు ఎక్కించిన బాలకృష్ణ, సింగీతం శ్రీనివాసరావుకి ఇలా రీ- రిలీజ్ చేస్తున్నామని చెబితే చాలా ఎగ్జైట్ అయ్యారు. అప్పట్లో నేను కొత్త నిర్మాత అయినా సరే, నన్ను నమ్మి ఈ సినిమా చేసే అవకాశం ఇచ్చిన బాలయ్యకి సదా కృతజ్ఞుడిని. శ్రీకృష్ణదేవరాయలుగా, కృష్ణ కుమార్‌గా... రెండు పాత్రల్లోనూ ఆయన అద్భుతమైన నటన కనబరిచారు. కథకుడిగా, దర్శకుడిగా సింగీతం శ్రీనివాసరావు అద్భుతమైన ప్రతిభ కనబరిచిన చిత్రమిది. ఇళయరాజా సంగీతం, జంధ్యాల మాటలు, పీసీ శ్రీరామ్ - వీఎస్ఆర్ స్వామి - కబీర్ లాల్ ఛాయాగ్రహణం ఈ సినిమాని ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేశాయి' అని తెలిపారు.

నవచిత్రం

భిన్న ప్రేమకథ..



షాలినీ వడ్నికట్టి, నవీన్ చంద్ర

'పొలిమేర' చిత్ర విజయంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు డా. అనిల్ విశ్వనాథ్. ఆయన దర్శకత్వం వహించిన మరో సినిమా '28⁰C'.
ఈ నెల 28న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఎమోషనల్‌గా సాగే అద్భుతమైన ప్రేమ కథతో తెరకెక్కిన ఈ చిత్రంలో నవీన్ చంద్ర హీరోగా నటించగా, షాలినీ వడ్నికట్టి హీరోయిన్‌గా కనిపించ నుంది. ఈ చిత్రాన్ని వీరాంజనేయ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ సాయి అభిషేక్ నిర్మించారు.
శనివారం ఈ సినిమా నుంచి 'చెలియా చెలియా..' సాంగ్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సాంగ్‌ను మ్యూజిక్ డైరెక్టర్ శ్రావణ్ భరద్వాజ్ బ్యూటీఫుల్‌గా కంపోజ్ చేయగా, కిట్టు విస్సాప్రగడ మంచి లిరిక్స్ అందించారు. సింగర్ రేవంత్ ఆకట్టుకునేలా పాడారు. 'నీ నగుమోము కనులారా, చూస్తుంటే క్షణమైనా, కనురెప్ప వాలేనా, నా కనుసైగ నీ వెనకా, వెంటాడే మౌనంగా, వేచిందే నువు రాక, ఊహలలో ఊరిస్తూ, దాగినది చాలుగా, ఊరటగా నా ఎదురు నా జతగా రా, చెలియా చెలియా నిన్ను చూడంగ, చెలియా చెలియా కనులు చాలవుగా..' అంటూ మంచి లవ్ ఫీల్‌తో సాగుతుందీ పాట. మనసును తాకే భావోద్వేగాలతో ఆద్యంతం సాగే అద్భుతమైన ప్రేమ కథా చిత్రమని దర్శకుడు డా. అనిల్ విశ్వనాథ్ తెలిపారు.
ఈ చిత్రంతో హీరో నవీన్ చంద్ర మరోసారి ఎమోషనల్ ప్రేమకథలో తన నటనతో ఆకట్టుకోబోతున్నారు. టెంపరేచర్ ఈ కథలో ఎంత కీ రోల్ ప్లే చేస్తుంది అనేది, ఒక డిఫరెంట్ స్టోరీ స్క్రీన్ ప్లేతో ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందుతుందని మేకర్స్ నమ్మకంతో ఉన్నారు.
వి.జయప్రకాష్, ప్రియదర్శి పులికొండ, హర్ష చెముడు, రాజా రవీంద్ర, అభయ్ బేతిగంటి, దేవియాని శర్మ, సంతోషి శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటర్ - గ్యారీ బీహెచ్, డీవోపీ - వంశీ పచ్చిపులుసు, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ - శ్రీచరణ్ పాకాల, మ్యూజిక్ - శ్రావణ్ భరద్వాజ్, కో ప్రొడ్యూసర్స్ - సంజయ్ జూపూడి, విక్రమ్ జూపూడి, ప్రొడ్యూసర్ - సాయి అభిషేక్.

'ఆడ పిశాచం..'



డైరెక్టర్ త్రినాథరావు నక్కిన క్రైమ్-కామెడీ డ్రామా 'చౌర్య పాఠం' చిత్రంతో ప్రొడక్షన్‌లోకి అడుగుపెడుతున్నారు.
ఈ చిత్రం ద్వారా ఇంద్రా రామ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నారు. 'కార్తికేయ -2' తదితర చిత్రాలకు చందూ మొండేటి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన నిఖిల్ గొల్లమారి ఈ మూవీతో దర్శకునిగా పరిచయం అవుతున్నారు.
నక్కిన నెరేటివ్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మూవీకి వి.చూడమణి సహ నిర్మాత. ఈ చిత్ర టీజర్ థ్రిల్లింగ్ క్రైమ్, డార్క్ హ్యూమర్ బ్లెండ్‌తో ఇప్పటికే బజ్ క్రియేట్ చేసింది. నాగ చైతన్య లాంచ్ చేసిన ప్రమోషనల్ సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ టెర్రిఫైయింగ్ నెంబర్ 'ఆడ పిశాచం..' సాంగ్‌ని రిలీజ్ చేశారు.
దావ్‌జాండ్ ఈ సాంగ్‌ని ఎనర్జిటిక్ వైబ్ అండ్ బీట్స్‌తో క్యాచీగా కంపోజ్ చేశారు. సాంగ్‌ని ఆంథోనీ దాసన్ పాడిన విధానం మరింత ఆకట్టుకుంది. భాస్కరభట్ల రవికుమార్ రాసిన లిరిక్స్ ఫన్ ఫుల్‌గా ఉన్నాయి. ఈ సాంగ్‌లో లీడ్ కాస్ట్ ప్రజెన్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. ఈ సాంగ్ ఇన్‌స్టంట్ హిట్‌గా నిలిచింది. చిత్రంలో పాయల్ రాధాకృష్ణ కథానాయికగా నటిస్తుండగా, రాజీవ్ కనకాల, మస్త్ అలీ ముఖ్యమైన కీలక పాత్రలను పోషిస్తున్నారు.
ఈ చిత్రంలో మరో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ ఈ కథను సినిమాటోగ్రాఫర్ కార్తీక్ ఘట్టమనేని రాశారు. ఆయన కెమెరా వర్క్ కూడా నిర్వహిస్తున్నారు. సమ్మర్ కానుకగా ఈ సినిమా ఏప్రిల్ 18న థియేటర్లలోకి రాబోతోంది.

అంతా మీరే చేశారు

(మొదటిపేజీ తరువాయి)

వంటి హామీలు అటకెక్కాయని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా ఆదాయం రాకున్నా పెంచి చూపాలనుకుంటే ఈసారి 4,18,170 కోట్లు పెట్టాల్సి ఉండేదన్నారు. కానీ, తాము అలా చేయలేదని చెప్పారు. ఆశచూపెట్టి ప్రజలను మోసం చేయొద్దనే భావనతోనే గ్యాప్‌ను పూడ్చేందుకు తమ ప్రభుత్వం శక్తిమేరకు కృషి చేస్తున్నదనీ, అందుకే గత బడ్జెట్‌లో కేవలం 0.3 శాతం, ఈసారి కేవలం 4.7 శాతం మాత్రమే పెంచామన్నారు. ప్రజల్ని భ్రమల్లో ముంచెత్తకుండా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నూటికి నూరు శాతం అమలు చేసితీరుతామని బల్లగుద్ది చెప్పారు. బడ్జెట్ కేటాయింపులు..ఖర్చులు ఖచ్చితంగా ఉన్న రాష్ట్రాల్లో రాజస్థాన్(116 శాతం), కర్నాటకలో (113 శాతం), కేరళ(100 శాతం), మహారాష్ట్ర(99 శాతం) ఉన్నాయని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 2,69,111 కోట్లను శాసనసభ ఆమోదం లేకుండా ఖర్చుపెట్టిందని కాగ్ నివేదిక ఎత్తిచూపిన అంశాన్ని లేవనెత్తారు. పిజికల్ క్రమశిక్షణ బీఆర్ఎస్‌కు లేదని విమర్శించారు. జీఎస్టీ గ్రోత్‌రేట్ తగ్గిందని హరీశ్‌రావు చెప్పడం అబద్ధమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చివరి సంవత్సరంలో 8.4 శాతం ఉంటే అది ఈసారి 12.3 శాతం ఉందనీ, 3.9 శాతం పెరిగిందనీ, దేశం వృద్ధి రేటు కంటే మనది ఒక శాతం అదనమని వివరించారు. రాష్ట్రంలో ఈ పరిస్థితి తమ బుద్ధిమాంద్యం వల్ల వచ్చిందని హరీశ్‌రావు అనటాన్ని తప్పుబట్టారు. అజ్ఞానంతో బడ్జెట్ పెట్టారని సభానాయకున్ని ఎలా అంటారని నిలదీశారు. హరీశ్‌రావు తన భాషను మార్చుకోవాలని సూచించారు. తానెవ్వరికీ తిట్టదల్చుకోలేదనీ, వాస్తవాలను గణాంకాల ద్వారా వివరిస్తున్నానన్నారు. పదేండ్లు పరిపాలించింది మీరు..మేం వచ్చింది 15 నెలలే..ఏంచేశారు..ఏంచేశారు.. అనడమేంటి? పదేండ్లలో మీరేం చేశారు? అని ప్రశ్నించారు. రూ.40,154 కోట్ల పెండింగ్ బిల్లులు పెట్టిపోయారని విమర్శించారు. సింగరేణి, డిస్కమ్‌లకు రూ.1.47 లక్షల కోట్లు బాకీ పడ్డారని వివరించారు. 'పదేండ్లలో రాష్ట్ర ప్రజల కోసం పదేండ్లలో రూ.16,70,711 ఖర్చుపెట్టి ఏం సాధించి పెట్టారా? నాగార్జున సాగర్ కట్టారా? కడెం కట్టారా? ఎస్ఆర్ఎస్‌పీ కట్టారా? ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కట్టారా? ఈసీఎల్ పెట్టారా? బీడీఎల్ పెట్టారా? కాళేశ్వరం కాళేశ్వరం అన్నరు ఏమైంది? పదేండ్లు ప్రభుత్వ వ్యవస్థలన్నింటినీ విధ్వంసం చేశారు. దీన్ని చూసి నవ్వాలా? ఏడ్వాలా?' అని ప్రశ్నల వర్షం కురిపించారు.
తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు 2,80,603 కోట్ల ఆదాయం వచ్చిందనీ, అందులో జీతాలుకు 77,342 కోట్లు, మీరు చేసిన అప్పుల రీపేమెంట్, వడ్డీలకు 88,009 కోట్లు కట్టామనీ, సింగరేణికి కొంతమేర సెటిల్ చేశామని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే ఒక్క ఇల్లు కట్టారా? అని హరీశ్‌రావు అడగడమేంటి అని ప్రశ్నించారు. పదేండ్లలో నోటిఫికేషన్లు సక్రమంగా ఇచ్చి..పేపర్లు లీకు కాకుండా చూసి, పదేపదే పరీక్షలు పెట్టకుండా ఉంటే మాకు ఇప్పుడు 57,946 ఉద్యోగాలు భర్తీ చేసే అవకాశం వచ్చేదా? మా మీద ఏడ్వడం కాదు మీరెందుకు అప్పుడు చేయలేదు? అని నిలదీశారు. ప్రభుత్వ ఉద్యోగాల ద్వారా అందర్నీ సంతృప్తిపర్చలేమనే భావనతో నిరుద్యోగులను కొంతమేర స్వయం ఉపాధి కల్పించేందుకు రూ.6 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చామన్నారు. అందులో ఈడబ్ల్యూఎస్ కోటాకు రూ.600 కోట్లు అలా చేస్తామన్నారు. బ్రాహ్మణపరిషత్‌కు రూ.50 కోట్లు అదనంగా కేటాయించామనీ, వైశ్య కార్పొరేషన్‌కు రూ.25 కోట్లు ఇచ్చామని తెలిపారు. తామేదీ దాచట్లేదనీ, గత ప్రభుత్వం మాదిరిగా డోర్లు మూసేసి పాలన చేయడం లేదని దెప్పిపొడిచారు.

ఇసుక మాఫియా ద్వారానే రూ.6 వేల కోట్ల సర్కారు సంపద దోపిడీ

రాష్ట్రంలో పదేండ్ల కాలంలో ఇసుక మాఫియాతో రాష్ట్ర ఖజానాకు పెద్ద ఎత్తున గండి పడిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ప్రతి రోజూ 30 వేల టన్నుల ఇసుక అమ్మకాన్నే లెక్కల్లో చూపారనీ, మిగతాదంతా పక్కదారి పట్టేదని తెలిపారు. దీనిపై సర్కారు దృష్టి పెడితే ఇప్పుడు అది రోజుకు 70 వేల టన్నులకు పెరిగిందనీ, గతంలో కోటిన్నర ఆదాయం వస్తే ఇప్పుడు రోజుకు మూడున్నర కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నదని వివరించారు. ఈ లెక్కన ఏడాదికి రూ.600 కోట్ల ఆదాయం చొప్పున పదేండ్ల కాలంలో రూ.6 వేల కోట్లను సర్కారు నష్టపోయిందనీ, ఇదంతా ఎవరి జేబుల్లోకి పోయిందో ప్రజలకు తెలుసునని అన్నారు. తమ ప్రభుత్వం ఇసుక మాఫియాను పూర్తిగా కట్టడి చేశామన్నారు. సహజవనరుల నుంచి వచ్చే ప్రతిపైసా ప్రభుత్వానికి జమా అయ్యేలా ప్రణాళికలు రూపొందించి ముందుకెళ్తున్నామని చెప్పారు.





రైతులకు 20,167 కోట్ల రుణమాఫీ చేశాం

పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విడతలవారీగా 28,053 కోట్ల రుణమాఫీ చేసిందనీ, దీంతో వడ్డీలకే రూ.13 వేల కోట్లు పోయిందని రైతుల అప్పులు పూర్తిస్థాయిలో తీరలేదని వివరించారు. తమ ప్రభుత్వం అలా చేయకుండా రూ.2 లక్షల లోపు రుణమున్న రైతులకు నాలుగు నెలల్లో ఒకే దశలో రూ.20,167 కోట్ల రుణమాఫీ చేసి చూపెట్టామని నొక్కి చెప్పారు. రైతుల గురించి బీఆర్ఎస్ వాళ్లకు మాట్లాడే అర్హత లేదన్నారు. మహిళా సంఘాలకు క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు అడగటం విడ్డూరంగా ఉందన్నారు. పదేండ్లుగా మహిళా సంఘాలపై బీఆర్ఎస్ ప్రభుత్వం సరిగా దృష్టి పెట్టలేదన్నారు. మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా, పదిమందికి ఉపాధి కల్పించేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలివ్వాలని టార్గెట్ పెట్టుకుని రూ.21 వేల కోట్లు ఇచ్చిన ఘనత తమదన్నారు. వారికి సోలార్‌ప్లాంట్లు పెట్టుకునే అవకాశం కల్పించామనీ, కొద్దిరోజుల్లో జరిగే భూమి పూజలకు ప్రతిపక్ష సభ్యులకు కూడా ఆహ్వానాలు పంపుతామని చెప్పారు. సీడీపీ ఎక్కడ పెండింగ్‌లో ఉందో చెప్పాలని ప్రశ్నించారు. ధాన్యం మిల్లింగ్ విషయంలో అవకతవకలను అరికట్టేందుకు త్వరలో మహిళాసంఘాల చేత మండల కేంద్రాల్లో గోదాములు, రైస్‌మిల్లులు కట్టిస్తామని హామీనిచ్చారు.

స్వేచ్ఛ గురించి హరీశ్‌రావు మాట్లాడటం విడ్డూరం

స్వేచ్ఛ గురించి హరీశ్‌రావు మాట్లాడితే విడ్డూరంగా ఉందని భట్టి విమర్శించారు. పదేండ్లు ప్రతిపక్షం వైపు కూర్చున్నానని ఏ ఒక్కరోజైనా ప్రజాస్వామ్య పద్ధతిలో సభను నిర్వహించారా? ప్రతిపక్ష నేత హోదాను లాక్కున్నారుగదా? ఎన్ని ఇబ్బందులు పెట్టినా మర్చిపోయి ధైర్యంగా నిలబడ్డామని చెప్పారు. సభలో ఏనాడూ అడ్డగోలుగా మాట్లాడలేదనీ, సభాపతి, సభానాయకులపై నోరు జారలేదని గుర్తుచేశారు. సభ బయట నిరసన తెలపాలంటే ఇంటికొచ్చి పోలీసులు అరెస్టు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. సీఎల్పీ బృందం పర్యటనకు వెళ్తే భద్రాచలం అడవుల్లో అర్ధరాత్రి వదిలిపెట్టిపోయిన ఘటనను గుర్తుచేశారు. ధర్నాలు, ఆందోళనలు ఉన్నాయంటే తెల్లారేసరికి పోలీసులు ఇంటి ముందుకొచ్చి హౌజ్ అరెస్టులు చేసేవారన్నారు. తాము అలా చేయడం లేదన్నారు. ధర్నాలు, నిరసనలు తెలిపే స్వేచ్ఛను కల్పించామన్నారు.

గోవిందా..గోవిందా అంటారా..

రాష్ట్రానికి రావాల్సిన నీళ్లను వదిలేసి ఇప్పుడు గోవిందా..గోవిందా..సభలో నినాదాలు చేయడమేంటని బీఆర్ఎస్ సభ్యులను ప్రశ్నించారు. కృష్ణాజలాల గురించి సంగమేశ్వరం వద్ద రాయలసీమ లిఫ్టు ఇరిగేషన్ కడుతున్నారనీ, అది ఓపెన్ చేస్తే ఇప్పుడు పోయేదాని కంటే 11 రెట్ల నీళ్లు ఎక్కువపోతాయని సభలో ఆనాడు మొత్తుకున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శిం చారు. రాయలసీమ లిఫ్టు ఇరిగేషన్ దగ్గరకు వెళ్తుంటే పోలీసులతో అరెస్టు చేయించి ఏపీ ప్రభుత్వానికి సహకరించింది మీరు కాదా అని నిలదీశారు. దాని ఫలితంగా శ్రీశైలం నిండకపోతే ఖమ్మం, నల్లగొండ జిల్లాల రైతులకు సరిగా నీళ్లు రావనీ, పాలమూరు ఎత్తిపోతల పథకానికి నీళ్లు సరిగా అందని చెప్పారు. కాళేశ్వరం పేరుతో ప్రిస్టేజ్‌కు పోయి గోదావరి నీళ్లు సరిగా వాడుకోలేని పరిస్థితిని కల్పించింది మీరు కాదా అని ప్రశ్నించారు. ఇటు కృష్ణా, అటు గోదావరి జలాలను సరిగా వాడుకోకుండా చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాల్లో కట్టిన ప్రాజెక్టుల ద్వారానే రైతుల పొలాలకు నీళ్లు అందుతున్నాయన్నారు.

గిరిజన, దళిత కుటుంబాల్లో మార్పు తీసుకురాబోతున్నాం

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌లకు కేటాయించే నిధులు సక్రమంగా ఖర్చుపెట్టి గిరిజనులు, దళితుల కుటుంబాల్లో మార్పు తీసుకురాబోతున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు. పోడు భూముల విషయంలో ఆదివాసీ, గిరిజనుల ఆడబిడ్డలను చెట్లకు కట్టేయించి కొట్టించిన బీఆర్ఎస్ పాలనను గుర్తు చేశారు. పోడు భూముల్లో పామాయిల్, గుబురుగా పెరిగే పండ్ల తోటలను పెంచిపిస్తామనీ, వాటి ఫలాలను పోడుసాగు హక్కుదారులైన వారికే దక్కేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. వారికి సోలార్ పంపు సెట్లు, డ్రిప్ సౌకర్యాలను కూడా కల్పిస్తామన్నారు. గత ప్రభుత్వం 2014 నుంచి 24 వరకు ఎస్సీ, ఎస్టీ సంక్షేమం కోసం రూ.1,81,877 కోట్లు చూపెట్టారనీ, అందులో రూ.70,475 కోట్లు (38.75 శాతం) ఖర్చుపెట్టలేదని సభాదృష్టికి తీసుకొచ్చారు. తమ ప్రభుత్వం ఎస్సీ సంక్షేమం కోసం రూ.40 వేల కోట్లు, ఎస్టీ సంక్షేమం కోసం రూ.17 వేల కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. దళితున్ని సీఎం చేస్తానని డిప్యూటీ సీఎం చేశారనీ, ఆయన్నీ రాత్రికిరాత్రే బర్తరఫ్ చేసి అవమానించారని ప్రస్తావించారు. మూడెకరాల భూ పంపిణీ అటకెక్కిందన్నారు. ఒక నియోజకవర్గ ఉప ఎన్నిక కోసం దళిత బంధు తీసుకొచ్చి ఆశలు కల్పించారనీ, దాన్ని అమలు చేయలేదని విమర్శిం చారు. ప్రతిసారీ దళితులకు ఏదో ఒకటి చెప్పి ఆశలపల్లకిలో ముంచారన్నారు. తమ ప్రభుత్వం సబ్‌ప్లాన్ నిధులు తూచా తప్పకుండా ఖర్చు చేస్తా మని ప్రకటించారు.

భూముల్ని అమ్మం

ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు ఆపింది మీ సర్కారే కదా అని ప్రశ్నించారు. బాధితులు మొరపెట్టుకుంటే పారదర్శకతతో 25 శాతం రాయితీ ఇచ్చి పట్టాలు చేస్తున్నామన్నారు. భూముల్ని అమ్మకాన్ని పెట్టామా? గుడ్డకాల్చి మీద వేయడమేంటి? అని ప్రశ్నించారు. భూములు ఎక్కడకు పోవనీ, అమ్మబోమని చెప్పారు.
బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలకు చెందిన కోళ్ల ఫారాలు, డిమాండ్ లేని కళ్యాణమండపాలు, పనికిరాని బిల్డింగులలో గురుకులాలు నడిచేవని గుర్తుచేశారు. వాటిని గమనించే పాఠశాలలకు పక్కా బిల్డింగ్‌లు ఉండాలనే లక్ష్యంతో 58 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు అనుమతి ఇచ్చామన్నారు. ఏనాడైనా మీరు డైట్‌చార్జీలు పెంచారా? భోజనం గురించి ఆలోచించారా? అని అడిగారు. తమ ప్రభుత్వం 40 శాతం డైట్‌చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. హరీశ్‌రావు వస్తే ఆయనతోనే తన నియోజకవర్గంలోని పాఠశాల రిబ్బన్ కట్ చేయిస్తానని ఆఫర్ ఇచ్చారు.

మాజీ వర్సెస్ తాజా

(మొదటిపేజీ తరువాయి)

దిగారు. మధ్యలో బీఆర్ఎస్ సభ్యుడు తలసాని శ్రీనివాస యాదవ్ సైతం జోక్యం చేసుకున్నారు. ఈ క్రమంలో 'అధ్యక్షా.. మీరే మాకు పెద్ద దిక్కు, ప్రభుతాన్ని నేను ఉద్దేశపూర్వకంగా విమర్శించటం లేదు, బడ్జెట్‌లోని లోపాలను ఎత్తి చూపితే, వాటిని ప్రభుత్వం సవరించుకుంటే పేదలకు న్యాయం జరుగుతుందనేదే మా ఆశ...' అంటూ హరీశ్ వ్యాఖ్యానించటంతో పరిస్థితి సద్దుమణిగింది.
రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ఏడో రోజైన శుక్రవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సభ ఆరంభమైంది. ప్రశ్నోత్తరాలను రద్దు చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ నిధి సవరణ బిల్లు-2025ను, తెలంగాణ న్యాయవాదుల క్లర్కుల సంక్షేమ నిధి సవరణ బిల్లు-2025ను సభలో ఉంచినట్టు స్పీకర్ తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వార్షిక నివేదికను, రాష్ట్ర తోళ్ల పరిశ్రమ సంస్థ వార్షిక నివేదికను ప్రభుత్వం సభ ముందు ఉంచినట్టు తెలిపారు. అనంతరం 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రతిపాదించిన వార్షిక బడ్జెట్‌పై సాధారణ చర్చను స్పీకర్ ప్రారంభించారు. తొలుత ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నుంచి తన్నీరు హరీశ్‌రావును మాట్లడాల్సిందిగా ఆయన సూచించారు. ఈ క్రమంలో హరీశ్‌రావుకు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు, హరీశ్‌రావుకు, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు మధ్య కొద్ది సేపు సంవాదం నడిచింది. ప్రతిపక్ష సభ్యుడిగా బడ్జెట్‌ను సమగ్రంగా విశ్లేషించటం ద్వారా అందులోని లోపాలను ఎత్తి చూపటం తన బాధ్యతని హరీశ్‌రావు తెలిపారు. తద్వారా రాష్ట్రంలోని పేదలు, బడుగు, బలహీనవర్గాలకు న్యాయం చేయాలన్నదే తన తపన తప్ప ప్రభుత్వాన్ని ఉద్దేశపూర్వకంగా విమర్శించటం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతిగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... బడ్జెట్‌పై ప్రతిపక్ష సభ్యులు ఎంతసేపు మాట్లాడినా తనకు అభ్యంతరం లేదనీ, కానీ ఆ పరిధిని దాటి, అవాస్తవాలు, సత్యదూరమైన మాటలు మాట్లాడటం సరికాదన్నారు. బడ్జెట్‌పైన ప్రసంగించాలని సూచిస్తే రాజకీయ ప్రసంగాలు చేయటమేంటని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలుగజేసుకుని... హరీశ్‌రావు తన ప్రసంగంలో ముఖ్యమంత్రి రేవంత్‌ను, తనను, ఇతర మంత్రులను ఉద్దేశించి చులకన భావంతో మాట్లాడటం సమంజసం కాదని అన్నారు. బుద్ధిహీనులు, అజ్ఞానులు అనే పదాలను ఉపసంహరించుకోవాలని హరీశ్‌రావుకు సూచించారు. సభాపతితో వాదనకు దిగటం సరికాదని హితవు పలికారు. బడ్జెట్‌పై చర్చలో హరీశ్‌రావుతోపాటు అధికార పక్షం నుంచి బాలూ నాయక్, బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు తదితరులు ప్రసంగించారు.
బడ్జెట్‌పై హరీశ్‌రావు మాట్లాడుతూ... ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను, వివిధ రంగాలకు కేటాయింపులను, బీఆర్ఎస్ హయాంలోని పద్దులను సరిపోల్చుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు. గతంలో అమలైన వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలు, ఇప్పుడు వాటి పరిస్థితులను ఏకరువు పెట్టారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిపాదించిన బడ్జెట్ మీద రాష్ట్రంలోని నిరుద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఆ వాగ్దానాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఇప్పుడు కూడా ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లిందని వాపోయారు. ఆ పార్టీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి తదితర హామీల సంగతేంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో లక్షా 62 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పారు. తామిచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకే నియామక ప్రతాలను అందజేసిన ముఖ్యమంత్రి, మంత్రులు ఆ ఘనత తమదేనంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.
బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదంటూ అధికార పక్షం ఆరోపిస్తోందనీ, కానీ తమ ప్రభుత్వ హయాంలో 6,47,479 రేషన్ కార్డులను జారీ చేశామని హరీశ్‌రావు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తద్వారా మొత్తం 20,69,033 మందికి లబ్ది జరిగిందని తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టుల కోసం రూ.4 వేల కోట్లు కేటాయించి, ఖర్చు చేశామని వివరించారు. తాము అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కింద మూడు బ్యారేజీలు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌజులు, 16 రిజర్వాయర్లు. 203 కి.మీ. టన్నెళ్లు, 231 కి.మీ.గ్రావిటీ కాలువలు భాగంగా ఉన్నాయని విశదీకరించారు. అందులోఒక్క మేడిగడ్డలోని 7 బ్లాకుల్లోని 1 బ్లాకులో, 1 పిల్లర్ మాత్రమే కుంగిందని గుర్తు చేశారు. ఇలాంటి వాస్తవాలను మరుగుపరిచి, కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందంటూ దుష్ప్రచారం చేయటం సరికాదన్నారు.

డిప్యూటీ సీఎం, ముఖ్య కార్యదర్శికి శుభాకాంక్షలు...

వరసగా మూడుసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఈ సందర్భంగా హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. వరసగా బడ్జెట్ కూర్పులో వరసగా 14 సార్లు కీలక భూమిక పోషించిన ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కూడా ఆయన అభినందించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

వివేకా హత్య కేసులో సీబీఐకి నోటీసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టు విచారణ జాప్యం అవుతోందంటూ వివేకా కూతురు సునీతరెడ్డి వేసిన పిటిషన్‌లో హైకోర్టు సీబీఐకి నోటీసులు జారీ చేసింది. సీబీఐ కోర్టు విచారణ ఆరు నెలల్లో పూర్తి చేసేలా ఆదేశాలివ్వాలనే కేసులో సీబీఐ, ఆ కేసులో నిందితులు ఎంపీ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి ఇతరులకు నోటీసులిచ్చింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

బీపీ ఆచార్యకు భారీ ఊరట

జగన్ ఆస్తుల కేసుల్లోని లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు భూమి కేటాయింపు, నిధుల అక్రమ మళ్లింపు జరిగాయనే కేసులో నిందితుడిగా ఉన్న ఐఎస్ఎస్ అధికారి బీపీ ఆచార్యకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఏపీఐఐసీ వైస్ చైర్మెన్, ఎండీగా ఉండగా నిబంధనలను ఉల్లంఘించారని ఈడీ పెట్టిన కేసును డిస్మిస్ చేస్తూ తీర్పు చెప్పింది. సీఆర్పీసీ సెక్షన్ 197(1) కింద రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకున్నాకే ఆఫీసర్లను ప్రాసిక్యూట్ చేయాలనీ, రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వలేదన్న పిటిషనర్ వాదనను ఆమోదించింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈడీ కేసు విచారణ చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సిందేనని చెప్పింది.

యాంకర్ శ్యామలకు ఊరట

బెట్టింగ్ యాప్‌లకు అనుకూలంగా వ్యవహరించారనే కేసులో యాంకర్ శ్యామలకు శుక్రవారం హైకోర్టులో ఊరట లభించింది. సీఆర్పీసీ సెక్షన్ 41ఎ (కొత్త బిఎస్ఎస్ఎస్ యాక్ట్‌లోని సెక్షన్ 35) ప్రకారం నోటీసులిచ్చాకే విచారణ చేయాలని పేర్కొంది. ఈ మేరకు పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసింది. తనపై పంజాగుట్ట పోలీసులు పెట్టిన కేసును కొట్టి వేయాలంటూ యాంకర్ శ్యామలారెడ్డి వేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎన్.తుకారాంజీ శుక్రవారం విచారించారు. శ్యామలపై తప్పుడు కేసు పెట్టారనీ, ఆ యాప్స్‌తో శ్యామలకు సంబంధం లేదని ఆమె లాయర్ వాదించారు. నోటీసులిచ్చాకే విచారణ చేయాలని పోలీసులను న్యాయమూర్తి ఆదేశించారు. పోలీసుల దర్యాప్తునకు పిటిషనర్ సహకరించాలని



ఆదేశించారు. పిటిషన్‌పై విచారణను ముగించారు.

హరీశ్‌రావుపై కేసు కొట్టేసిన హైకోర్టు

ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు ఆధారంగా బీఆర్ఎస్‌కు చెందిన సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావులపై నమోదైన కేసును కొనసాగిస్తే న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేసినట్టవుతుందని గురువారం హైకోర్టు తేల్చి చెప్పింది. ఆరోపణలకు అనుగుణంగా సరైన కారణాలు లేకుండా హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులపై పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ హైకోర్టు 36 పేజీల తీర్పు వెలువరించింది. హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులపై కేసు నమోదుకు సరిపడా కారణాలు లేవంటూ, ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు ఆధారంగా పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు, రెండో నిందితుడైన మాజీ డీసీపీ రాధాకిషన్‌రావులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన జస్టిస్ కె.లక్ష్మణ్ తీర్పు చెప్పారు. చక్రధర్‌గౌడ్ సెప్టెంబరు 1న పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో దోపిడీకి పాల్పడినట్టు గానీ, విశ్వాస ఘాతుకానికి పాల్పడినట్టు, నేరపూరిత బెదిరింపులకు సంబంధించి ఎలాంటి ఆరోపణలు చేయలేదని తీర్పులో పేర్కొన్నారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 66 నమోదు చేసినప్పటికీ దానికి తగ్గ కారణాలను వెల్లడించలేదన్నారు. 2024 జూన్ 19న డీజీపీకి ఇచ్చిన వినతి పత్రంలోగానీ, ఇదే హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లోగానీ, డిసెంబరు 1న పంజాగుట్ట పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులోగానీ దోపిడీ, బెదిరింపులు, నమ్మకద్రోహం, నేరపూరిత బెదిరింపులపై ఎలాంటి ఆరోపణలు లేవని పేర్కొన్నారు. ఆరోపణలన్నీ కేవలం ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి తప్ప మిగిలిన ఆరోపణల ప్రస్తావన లేదన్నారు. బెదిరించి ఆస్తి, డబ్బును వసూలు చేసినట్టు హరీశ్‌రావుపై ఎలాంటి ఆరోపణ లేదనీ, అలాంటప్పుడు ఐపీసీ సెక్షన్ 386 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి అనుమతించలేమనీ, దాన్ని కొట్టివేస్తున్నట్టు పేర్కొన్నారు. అదేవిధంగా ఐపీసీ 409 కింద ప్రజా ప్రతినిధి హెూదాలో ప్రభుత్వానికి చెందిన ఆస్తిని దుర్వినియోగం చేసినట్టు హరీశ్‌రావుపై ఆరోపణ చేయలేదన్నారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో అరెస్టయిన రాధాకిషన్‌రావు 2023 ఆగస్టు నుంచి ఈ ఏడాది జనవరి 30 దాకా జ్యూడీషియల్ కస్టడీలో ఉన్నారనీ, దర్యాప్తు పూర్తయి అభియోగ పత్రం కూడా దాఖలైందనీ, ఇదే కేసులో 60వ సాక్షిగా చక్రధర్‌గౌడ్ వాంగ్మూలాన్ని నమోదు చేశారన్నారు. వాంగ్మూలంలోని అంశాలతోనే పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. చక్రధర్‌గౌడ్‌ను పలు కేసుల్లో అరెస్ట్ చేసి వేధించినట్లు చెబుతున్నారని, అయితే అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ముందు రాధాకిషన్‌రావుపై ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్న విషయం గమనించాలన్నారు. ఈ నేపథ్యంలో ఐపీసీ 386, 409, 506లతోపాటు ఐటీ చట్టం సెక్షన్ 66 కింద కేసును కొనసాగించడానికి ఎలాంటి ఆరోపణలు లేవన్నారు. ఇలాంటి సమయంలో సెక్షన్ 482 కింద కేసును కొట్టివేసే అధికారం హైకోర్టుకు ఉందంటూ భజన్‌లాల్ కేసులో సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిందన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు టెండర్‌పై స్టేటస్‌కో

రావిర్యాల ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఆమన్‌గల్ రీజినల్ రింగ్ రోడ్డు దాకా మొదటి ఫేజ్‌లో ఏర్పాటు చేయదలచిన గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి చెందిన టెండరు నోటీసుపై స్టేటస్ కో కొనసాగించాలంటూ ఇటీవల హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకుండానే గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణం నిమిత్తం ఈ ఏడాది ఫిబ్రవరి 24న జారీ చేసిన టెండరు నోటీసును సవాలు చేస్తూ ఎన్.రవీందర్ మరో 9 మంది దాఖలు చేసిన పిటిషన్‌పై ఇటీవల జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. హెచ్ఎండీఏ, హైదరాబాద్ గ్రోత్‌కారిడార్ లిమిటెడ్, రంగారెడ్డి కలెక్టర్‌కు నోటీసులు జారీ చేశారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. తొలుత పిటిషనర్ లాయర్ వాదిస్తూ, రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు భూసేకరణ ప్రక్రియ పూర్తికాకుండానే గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి హెచ్ఎండీఏ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్‌లు ఈనెల 24న టెండరు నోటిఫికేషన్ జారీ చేశాయన్నారు. రోడ్డు నిర్మాణం కోసం గత ఏడాది అక్టోబరు 28న భూసేకరణ చట్టం కింద ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. భూసేకరణ ప్రక్రియలో కనీసం అభ్యంతరాల స్వీకరణ దాకా కూడా రాలేదన్నారు. సెక్షన్ 15 కింద భూయజమానుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందన్నారు. దీనికి సంబంధించి సెక్షన్ 15 కింద ఎలాంటి నోటిఫికేషన్ జారీ కాలేదని చెప్పారు. ఇది అయిన తరువాత సెక్షన్ 19 కింద డిక్లరేషన్ జారీ చేయాల్సి ఉందన్నారు. ఇవేవీ లేకుండానే, భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకుండా టెండరు నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఒకసారి టెండరు ఖరారు అయితే తమతోపాటు ఇతర రైతులు వ్యక్తం చేసే అభ్యంతరాలకు విలువ ఉండదని వాదించారు. మొక్కుబడిగా అభ్యంతరాలను స్వీకరించి వాటిని తిరస్కరిస్తారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి భూసేకరణ ప్రక్రియ ప్రాథమిక దశలోనే ఉన్నందున గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి చెందిన టెండరుపై యథాతథస్థితిని కొనసాగించాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేశారు.

నిరసనల నిషేధంపై వివరణ ఇవ్వండి
ఓయూకు హైకోర్టు ఆదేశం

ఉస్మానియా యూనివర్సిటీలో నిరసనల నిషేధంపై ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు, ఉన్నత విద్యాశాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నిరసనలను నిషేధిస్తూ ఈనెల 13న జారీ చేసిన సర్క్యులర్ పై పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను ఏప్రిల్ 9వ తేదీకి వాయిదా వేసింది. ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణలో నినాదాలు, నిరసనలు వ్యక్తం చేయరాదంటూ ఈనెల 13న జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ న్యాయ విద్యార్థి పి.రఫి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అక్రమ చొరబాటు, ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేయడం, నినాదాలు చేయడం, పరిపాలనా వ్యవహారాలను అడ్డుకోవడం, అధికారులు, సిబ్బందికి వ్యతిరేకంగా దూషణలు, అసభ్య పదజాలం వాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ సర్క్యులర్ జారీ అయిందన్నారు. ఈ సర్క్యులర్ భావ ప్రకటనా స్వేచ్ఛకు విరుద్ధమన్నారు. నిరసన ప్రాథమిక హక్కు అంటూ సుప్రీంకోర్టు తెలియజేసిందన్నారు. అస్పష్టం గా ఉన్న సర్క్యులర్‌ను కొట్టివేయాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి ఉస్మానియా యూని వర్సిటీకి, ఉన్నత విద్యాశాఖకు నోటీసులు జారీ చేశారు.

బండి సంజయ్‌పై కేసును
కొట్టేసిన హైకోర్టు

బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా 2020లో నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టేలా ప్రసంగించారంటూ సికింద్రాబాద్ మార్కెట్ పోలీసు స్టేషన్‌లో బండి సంజయ్‌పై కేసు నమోదైంది. దీనిపై దర్యాప్తు జరిపిన పోలీసులు అభియోగ పత్రం దాఖలు చేయగా ప్రస్తుతం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఆ కేసు పెండింగ్‌లో ఉంది. దీన్ని కొట్టివేయాలంటూ బండి సంజయ్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ తాజాగా విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పోలీసులు అసత్యాలతో కేసు నమోదు చేశారా?, పోలీసుల దర్యాప్తు మొక్కుబడిగా ఉందనీ, సాక్షుల వాంగ్మూలల్లో ఒకదానికొకటి పొంతన లేదన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి పిటిషనర్‌పై మోపిన అభియోగాలకు సరైన కారణాలు లేవంటూ బండి సంజయ్‌పై ఉన్న కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మొహంతి కేడర్ బదిలీపై కేంద్రానికి నోటీసు

ఏపీ క్యాడర్‌లో బాధ్యతలు స్వీకరించడానికి అభిషేక్ మొహంతికి ఈనెల 24వరకు గడువు పొడిగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈలోగా కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) ఆదేశాలతో అభిషేక్ మొహంతిని తెలంగాణ క్యాడర్‌లోకి తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 171ను పరిగణనలోకి తీసుకుని ఉత్తర్వులు జారీ చేశారో లేదో చెప్పాలంటూ కేంద్రాన్ని ఆదేశించింది. తెలంగాణాలో కొనసాగించాలన్న అభ్యర్థనను తిరస్కరిస్తూ ఏపీ క్యాడర్ బాధ్యతలు స్వీకరించాలంటూ కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ అభిషేక్ మొహంతి ఇటీవల క్యాట్‌ను ఆశ్రయించగా స్టే ఇవ్వడానికి నిరాకరించడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ ఇ.తిరుమలాదేవిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు పిటిషనర్ సమర్పించిన వినతి పత్రాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, ఖండేల్కర్ కమిటీ సిఫారసు మేరకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వాదనలను విన్న ధర్మాసనం పిటిషన్‌పై తేలేదాకా ఇప్పటికిప్పుడు ఏపీకి వెళ్లాల్సిన అవసరం ఉందా ?, అప్పటిదాకా తెలంగాణలో కొనసాగిస్తుందా లేదా అన్న విషయాలపై వివరణ ఇవ్వాలంటూ విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది.



పుస్తక పఠనంతోనే విషయ పరిజ్ఞానం

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి, డీఎస్పీ రాజశేఖర్ రాజు

నవతెలంగాణ-మిర్యాలగూడ

పుస్తక పఠనంతోనే విషయ పరిజ్ఞానం అందుతుందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. 'నవతెలంగాణ' పబ్లికేషన్ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపులో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుస్తకం చదవడం అలవాటు చేసుకోవడం వల్ల విషయ పరిజ్ఞానంతోపాటు విజ్ఞానం అందుతుందని చెప్పారు. గతంలో మేధావులు ఎల్లప్పుడూ పుస్తకాలు చదివేవారని, వాటి ద్వారా నేర్చుకున్న విషయాన్ని ప్రజలకు వివరించి చైతన్యపరిచే వాళ్లని చెప్పారు. ఇప్పుడు సోషల్ మీడియా వచ్చాక పుస్తక పఠనం మర్చిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. గూగుల్ యాప్ ద్వారా అన్ని విషయాలనూ క్లుప్తంగా తెలుసుకుంటున్నారని, కానీ, దాని ద్వారా పూర్తి సమాచారం తెలుసుకోలేకపోతున్నారని అన్నారు. పుస్తకాల్లోనే పూర్తి సమాచారం ఉంటుందని తెలిపారు. చిన్నారుల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు ఉపయోగపడే పుస్తకాలు 'నవతెలంగాణ'లో దొరుకుతాయన్నారు. యువకులకు, నిరుద్యోగులకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, డా.మల్లు గౌతమ్‌రెడ్డి, భవాండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, పరుశురాములు, ఎండి అంజాద్, లక్ష్మీనారాయణ, డా.జె.రాజు, కిరణ్మయి, మాధవరెడ్డి, నవతెలంగాణ డివిజన్ రిపోర్టర్ ఎండి ఆయూబ్, ఎడివిటి డివిజన్ ఇన్‌చార్జి చాడ శ్రీనివాస్‌రెడ్డి, రిపోర్టర్ వాడపల్లి రమేష్, శ్యామ్ సుందర్‌రెడ్డి, బుక్‌హౌస్ ఇన్‌చార్జి రఘువరుణ్ పాల్గొన్నారు.

ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను వ్యవసాయానికి అనుసంధానిస్తాం

- సాగును లాభసాటిగా మార్చేందుకు కృషి : రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను వ్యవసాయానికి అనుసంధానించి సాగును మరింత లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో జర్మనీ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఫెడరల్ మినిస్ట్రీ ఏషియా హెడ్ రెబెకా రిడ్డర్ ఆధ్వర్యంలో ఆ దేశ ప్రతినిధులు మంత్రిని కలిశారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్‌తో అన్ని రంగాల పరిశ్రమలను అనుసంధానించేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా వారికి వివరించారు.

ఉద్యోగులతో చర్చించకుండా సంస్కరణలా?

- ఆధార్ ఆధారిత అటెండెన్స్ సిస్టంను అంగీకరించం : టీయుఎంహెచ్ఇయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులతో చర్చించకుండా ఆధార్ ఆధారిత అటెండెన్స్ సిస్టంను అమలు చేయాలని పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ గారు రాష్ట్రంలోని 33 జిల్లాల డిఎంహెచ్ఓలకు ఆదేశాలు జారీ చేయడాన్ని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) తీవ్రంగా అపేక్షిపించింది. ఈ మేరకు శుక్రవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఫసియుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని వైద్యారోగ్యశాఖలోని అన్ని యూనియన్లు, అసోసియేషన్లతో చర్చించి ముందుకెళ్లాలని వారు డిమాండ్ చేశారు. అన్ని క్యాడర్ల సిబ్బంది నిబద్ధతతో పని చేస్తున్నారనీ, ఇప్పటికే కొన్ని చోట్ల బయోమెట్రిక్ హాజరు ఉన్నప్పటికీ ఉదయం,సాయంత్రం ఆధార్ ఆధారిత అటెండెన్స్ వ్యవస్థను తీసుకురావడం వెనకాల ఉన్న ఉద్దేశం ఏమిటని ప్రశ్నిచారు. ఉద్యోగులు విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత కూడా ఏదో ఒకరకంగా పగలు, రాత్రి తేడా లేకుండా డ్యూటీలు చేస్తున్నారనీ, పారామెడికల్ ఉద్యోగులు రెండు, మూడు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న విషయం అధికారులకు తెలిసి ఇలాంటి సంస్కరణలు తేవడం సరికాదని చెప్పారు. ఇలాంటి సంస్కరణలతో ప్రభుత్వ వైద్యంపై ఆధారపడిన ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పదేండ్లలో రూ.7వేల కోట్ల ఇసుక స్కాం

కేసీఆర్ కుటుంబం అప్పనంగా దోచుకుంది
హైదరాబాద్‌లో మూడు ఇసుక బజార్ల ఏర్పాటు
త్వరలో రాష్ట్రమంతటా విస్తరిస్తాం : టీజీఎండీసీ చైర్మెన్ ఈరవత్రి అనిల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో దాదాపు రూ.7,000 కోట్ల ఇసుక కుంభకోణం జరిగిందని తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ ఈరవత్రి అనిల్ ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని టీజీఎండీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేండ్ల పాటు ఆ శాఖకు కేసీఆర్ కుటుంబ సభ్యులే మంత్రులుగా ఉండి ఇష్టా రాజ్యంగా దోచుకున్నారని విమర్శించారు. గతంలో ఇసుక డీలర్లపై ఆజమాయిషి లేక పోవడంతో ఒక్కో రోజు ఒక్కో ధర పలికేదని అన్నారు. ఫలితంగా ప్రజలు ఇసుకను బ్లాక్ మార్కెట్లో కొనుగోలు చేసే పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. 2018లో రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.8,65,688 కాగా 2024లో రూ15లక్షలకు చేరుకుందని తెలిపారు. అలాగే 2018-19లో రియల్ ఎస్టేట్ జీఎస్‌డీపీ రూ.1.6,16,358 నుంచి 2023-24 కల్లా 33,71,454 పెరిగిందని అన్నారు. రియల్ ఎస్టేట్ మార్కెట్ పెరుగుదలకు అనుగుణంగా ఇసుక అమ్మకాలు ఎందుకు పెరగలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ వచ్చిన తర్వాత ఇసుకను ప్రజలకు అందుబాటులో తెచ్చేందుకు కఠిన చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీసులు, మైనింగ్ అధికారులు అన్ని ఇసుక రీచ్లను 3 షిఫ్టుల్లో పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఇసుక రీచ్‌ల ఎంట్రీ పాయింట్ల నుంచి ఎగ్జిట్ పాయింట్ల వరకు సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు వాహనాలను జీపీఎస్‌తో అనుసంధానం చేసినట్టు వివరించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వీటిని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఇసుక ప్రజలకు మరింత చేరువ కావడంలో పాటు చౌకగా అందించేందుకు 3 ఇసుక బజార్లను మొదటి దశలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. త్వరలో వీటిని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభిస్తామని అనిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఎండీసీ ఎండీ సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

2014 నుంచి 2023 వరకు 56 ఇసుక రీచ్‌ల ద్వారా వచ్చిన ఆదాయం

సంవత్సరం	ఆదాయం (కోట్లల్లో)
2014-15	రూ.19.2
2015-16	రూ.374.99
2016-17	రూ.456.46
2017-18	రూ.678.33
2018-19	రూ.886.43
2019-20	రూ.792.8
2020-21	రూ.783.75
2021-22	రూ.802.11
2022-23	రూ.757.32

01-04-23 నుంచి 30-11-23 వరకు 414.80 కోట్లు
అలాగే 14 నెలల కాంగ్రెస్ సర్కార్ హయాంలో 26 ఇసుక రీచ్‌ల ద్వారా రూ.968 కోట్ల ఆదాయం సమకూరింది.

న్యాయవాదుల సంక్షేమ నిధి

టికెట్ రేటు రూ. 250కి పెంపు
బార్‌కౌన్సిల్ ప్రతిపాదనకు అసెంబ్లీ గ్రీన్‌సిగ్నల్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని న్యాయవాదులు, వారి క్లర్కులకు సంబంధించిన సంక్షేమ నిధి టికెట్ రేటును పెంచుతూ అసెంబ్లీలో బిల్లు పాస్ చేశారు. ఈమేరకు శుక్రవారం శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు న్యాయవాదులు, వారి క్లర్కుల సంక్షేమ నిధికి సంబంధించి టికెట్ రేటు రూ. 100 నుంచి రూ. 250కు పెంచుతూ శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బార్‌కౌన్సిల్ పంపిన ప్రతిపాదనకు అసెంబ్లీ ఆమోదం తెలియజేయాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ నిధి టికెట్ ధరను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదుల కోసం ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని కోరారు. మంథని నియోజకవర్గంలో జరిగిన న్యాయవాదుల హత్య ఉదంతాన్ని ఈ సందర్భంగా సభలో ప్రస్తావించారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం న్యాయవాద దంపతుల హత్యను పట్టించుకోలేదన్నారు. దీంతో న్యాయవాదుల్లో భయాందోళనలు వ్యక్తమయ్యాయని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ బిల్లుకు తాము సంపూర్ణ మద్దతును ఇస్తున్నామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమం కోసం రూ. 100 కోట్లు కేటాయించిందనీ, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మరో రూ. 100 కోట్లు ఇవ్వాలని సూచించారు. కాగా మంథనిలో న్యాయవాదుల హత్య విషయంలో బీఆర్ఎస్ సర్కారు పట్టించుకోలేదని చెప్పడాన్ని ఖండించారు. తాము చట్టపరంగా చర్యలు తీసుకున్నామన్నారు. మీ ప్రభుత్వం పూరిస్థాయిలో విచారణ చేసి శిక్షలు పడేలా చూడాలని అభిప్రాయపడ్డారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్టు చెప్పారు. జూనియర్ న్యాయవాదులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదులకు ఇండ్లస్థలాలు, హెల్త్‌కార్డులు, పెన్షన్లు, పీఎఫ్, పిల్లల చదువులకు సంక్షేమ నిధిలో అవకాశం ఉండాలని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చర్చలో జోక్యం చేసుకుంటూ సుప్రీంకోర్టులో తెలుగు లాయర్ల కొరత ఉన్నదన్నారు. మంచి న్యాయ కళాశాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆ సమస్యను పరిష్కరించాలని సూచించారు. సుప్రీంకోర్టు న్యాయవాదులు ఒక్క రోజుకు రూ. 50 లక్షల నుంచి రూ. 70 లక్షల వరకు ఫీజు కింద తీసుకుంటున్నారని చెప్పారు. దీనిని అరికట్టాలంటే ఎక్కువ మంది న్యాయవాదులను తయారుచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు గతంలో తన విజన్ ప్రకారం న్యాయవాదులను తయారు చేశారన్నారు. అలా చేసిన న్యాయవాది సుప్రీంకోర్టు దాకా వెళ్లారని గుర్తు చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ బార్‌కౌన్సిల్ ప్రతిపాదన మేరకే సంక్షేమ నిధి టికెట్ రేటును పెంచడానికి అసెంబ్లీ ఆమోదానికి పెట్టినట్టు చెప్పారు. జాతీయ స్థాయి న్యాయ కళాశాలను ఏర్పాటు చేసేందుకు హైకోర్టు ప్రధానన్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులతోనూ సంప్రదింపులు చేస్తామన్నారు. గతంలో వైఎస్సార్ హయాంలో నల్సార్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. న్యాయవాదుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రక్షణ చట్టం ప్రస్తుతం హోంశాఖ, ఆర్థిక శాఖల్లో ప్రక్రియను పూర్తిచేసుకుంటున్నదని చెప్పారు. త్వరలోనే అది పూర్తవుతుందన్నారు. బిల్లును ఆమోదించాలని స్పీకర్ బి. ప్రసాద్‌కుమార్‌ను కోరగా, సభ్యుల అంగీకారంతో ఆయన బిల్లుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

ఐపీఎల్ మ్యాచ్‌లకు పటిష్ట భద్రత

స్టేడియంలో ప్రతి ఒక్కరి కదలికలపై నిఘా : రాచకొండ సీపీ జి.సుధీర్‌బాబు

నవతెలంగాణ- సిటీబ్యూరో

హైదరాబాద్ ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగే టాటా ఐపీఎల్-18షెడ్యూల్‌లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఉప్పల్ స్టేడియం వేదికగా 9 మ్యాచ్‌లు (ఈ నెల 23 నుంచి వచ్చే నెల 21 వరకు) జరగనున్నాయి. ఈ నేపథ్యంలో భద్రతాపరంగా అనేక చర్యలు చేపట్టినట్టు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో విలేకరుల సమావేశంలో డీసీపీ పద్మజ, హెచ్‌సీఏ అధ్యక్షులు జగన్మోహన్‌రావుతో కలిసి సీపీ వివరాలు వెల్లడించారు. ఆదివారం ఉదయం మ్యాచ్ మొదలవుతుందని, మిగిలిన మ్యాచ్‌లు రాత్రి సమయంలో జరుగుతాయని చెప్పారు. మ్యాచ్ ప్రారంభానికి మూడు గంటల ముందు నుంచే ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతిస్తామని తెలిపారు. 2,700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం 300 మంది పోలీసులతోపాటు, లా అండ్ ఆర్డర్‌లో 1,218 మంది పోలీసులు బందోబస్తులో ఉంటారన్నారు. ఐపీఎల్ బందోబస్తు కోసం 12 బెటాలియన్లు, 2 ఆక్టోపస్ బృందాలు, 10 మౌంటెడ్ పోలీస్ బృందాలు, 450 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. స్టేడియంలోనే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు



చేశామని, కంట్రోల్ రూమ్‌ను ఏసీపీ స్థాయి అధికారి పర్యవేక్షించనున్నట్టు వివరించారు. స్టేడియం ఎంట్రెన్స్ వద్ద స్నిఫర్ డాగ్స్‌తో పాటు బాంబ్ స్క్వాడ్స్ తనిఖీలు చేస్తాయన్నారు. మహిళల భద్రత కోసం మఫ్టీలో షీ టీమ్స్ పని చేస్తాయని తెలిపారు. ఐదు చోట్ల స్టేడియం పరిసరాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పించామన్నారు. మెడికల్ టీమ్స్‌తోపాటు అంబులెన్స్, అగ్నిమాపక సిబ్బందిని అందుబాటులో ఉంచామని తెలిపారు. పాసులు కలిగిన వారు పోలీసుల సూచనల మేరకు పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను పార్క్ చేయాలన్నారు. పార్కింగ్ రుసుం వసూళ్లు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐపీఎల్ టికెట్లు ఆన్‌లైన్‌లోనే విక్రయించారని, ఎవరూ బయట వ్యక్తుల నుంచి కొనుగోలు చేయొద్దని సూచించారు. బ్లాక్‌లో టికెట్ విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. టికెట్లు కలర్ జిరాక్స్ తీసుకొస్తే చర్యలు తప్పవన్నారు. కార్లు, వాహనాలపై వచ్చే వారికి ఫ్రీపార్కింగ్ అందుబాటులో ఉంటుందన్నారు. ఎవరైనా బ్లాక్‌లో టికెట్లు, పార్కింగ్ ఫీజ్ వసూలు చేసినట్టు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా రాచకొండ వాట్సాప్‌లో సమాచారం ఇవ్వాలని సీపీ చెప్పారు. ఈ సమావేశంలో డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు. మొబైల్ ఫోన్లు, బ్లూటూత్‌కు మినహా ఎలక్ట్రానిక్ వస్తువులను స్టేడియం లోపలకు అనుమతించబోమని సీపీ చెప్పారు. మహిళలకు పెద్ద సైజు గల పర్సులకు అనుమతి లేదన్నారు.




తాగునీటి సమస్యలు రానివ్వం

తప్పుడు ప్రచారం మానుకోవాలి : బీఆర్ఎస్‌కు మంత్రి సీతక్క హితవు
అధికారులతో వీడియోకాన్ఫరెన్స్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో ప్రస్తుతం తాగునీటికి ఎక్కడా సమస్య లేదనీ, కొందరు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారం పోగానే తాగునీరు రావడం లేదనే దుష్ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణలో ఉష్ణోగ్రత్తలు పెరుగుతున్న నేపథ్యంలో రిజర్వాయర్లల్లో తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం హైదరాబాద్‌లోని మిషన్ భగీరథ శాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మిషన్ భగీరథలో అప్పటి అధికారులు, సిబ్బందే పని చేస్తున్నారని గుర్తు చేశారు. రిజర్వాయర్లల్లో తాగునీటికి తగినంత నీటి నిలువలు ఉన్నాయని చెప్పారు. గతంలో తాగునీరు అందని గ్రామాలకు కూడా ఈసారీ సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఆదిలాబాద్ వంటి జిల్లాలతోపాటు ఏజెన్సీ గ్రామాల్లో బోర్లు వేసి తాగునీటిని అందిస్తున్నట్టు చెప్పారు. తాగునీటి సమస్యలు, నీటి కటకట అంటూ ఈమధ్య వార్తా పత్రికల్లో వచ్చిన కథనాల పట్ల మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యకం చేశారు.

అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. మిషన్ భగీరథ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏదైనా సాంకేతిక కారణాలతో అవాంతరాలు ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రకటించారు. తాగునీటి అవసరాలకు ప్రతి జిల్లా కలెక్టర్ వద్ద రూ. 2 కోట్లు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. మిషన్ భగీరథ రాష్ట్ర కార్యాలయంలో 24 గంటలపాటు పనిచేసే కాల్‌సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. వేసవి ముగిసే వరకు నిరంతరాయంగా సమీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్ కృపాకర్‌రెడ్డి, సీఈ చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సర్కారు బడులను బలోపేతం చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి
హైదరాబాద్‌లో అప్పారి వెంకటస్వామి వర్ధంతిసభ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రజలందరికీ విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలంటే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి పిలుపునిచ్చారు. యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి (ఏవీఎస్) 24వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అభ్యుదయ ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించడానికి 16 ఏండ్ల సర్వీసును త్యాగం చేసిన మహనీయుడు వెంకటస్వామి అని అన్నారు. పాతికేండ్లపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసి సంఘాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దారని వివరించారు. ఆయన నమ్మిన ఆదర్శాలను జీవితంలో ఆచరించిన గొప్ప దార్శనికుడు ఏవీఎస్ అని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయడమే ఏవీఎస్‌కు అర్పించే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ సమావేశంలో ఎస్టీఎఫ్ఐ ఉపాధ్యక్షులు ఎం సంయుక్త, రాష్ట్ర కార్యదర్శులు సింహాచలం, వెంకటప్ప, పి మాణిక్ రెడ్డి, కొండలరావు, సీనియర్ నాయకులు కష్ణమూర్తి, నరహరి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.